

An Accomplished Author With World-Wide Releases Of Two Of His English Novels **"The Enemy of the Mankind" and "The Dictator of the Dark"**

# సూర్యదేవర రామ్ మోహన రావు

Ananth & Ananth Series



# హారిణీ ఐ లవ్ యూ

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి
125 వ నవలకు చేరువవుతున్న మీ అభిమాన రచయిత
The Number One Best Selling Author


## సూర్యదేవర
## రామ్మోహనరావు


# హరిణీ ఐ లవ్ యూ


మధుప్రియ పబ్లికేషన్స్
మాచవరం • విజయవాడ - 520 004

**HARINI I LOVE YOU**

(Direct Novel)

By

**SURYADEVARA RAM MOHANA RAO**

Sri Venkata Anantha Sai Nilayam

Flat No.63, Road No.71

Navanirman Colony, Jubilee Hills

Hyderabad - 500 096

E-mail : suryadevaranovelist@gmail.com

www.suryadevararammohanrao.com

www.suryadevaranovelist.com.

Published by:

**MADHU PRIYA PUBLICATIONS**

Machavaram, Vijayawada - 520 004

Phone : 0866 - 2431969

Edition :

**2015**

Price :

**Rs. 150-00**

Cover Design :

**DURGA RAO**

Printers :

**SRI CHAITANYA OFFSET PRINTERS**

Vijayawada-2

# హారిణీ ఐ లవ్ యూ

**"కరుణ్‌గారట ఎవరు? ఫోన్ వచ్చింది!" హోటల్ "డిలైట్"లో డిన్నర్ తీసుకుంటున్న కరుణ్‌కి హెడ్ వెయిటర్ మాటలు విన్పించి, వాష్ బేసిన్‌లో చెయ్యి కడుక్కుని, నాప్‌కిన్‌తో తుడుచుకుని వెళ్ళి ఫోన్ అందుకున్నాడు.**

**"హలో క్రిమినల్ లాయర్ కరుణ్‌గారా?" ఓ స్త్రీ కంఠస్వరం అటునుండి వినిపించింది. ఆమె మాటల్లో ఆందోళన మిళితమైవుంది.**

"అవును!" బదులిచ్చాడతను.

"నేనో పాకెట్ మీకు పంపించాను అందిందా?"

"పాకెట్టా?... అందలేదు."

"అయితే మరికొద్ది సేపటిలో అందుతుంది. దానిలో ఉన్న అడ్రస్‌కి వెళ్ళి మీరు కనుక్కు..." మధ్యలోనే ఫోన్ క్రెడిల్ చేసినట్లు మాటలాగిపోయాయి.

అతనికి అయోమయంగా అన్పించింది.

"తనకో పాకెట్ అందటమేమిటి? అందులో వున్న అడ్రస్‌కి వెళ్ళి కనుక్కుంటే ఏమవుతుంది? ఇంతకీ తనకు ఫోన్‌చేసిన స్త్రీ ఎవరు? ఎక్కడ నుండి ఫోన్ చేసింది? ఆమె పేరేమిటి?" ఫోన్ క్రెడిల్‌చేసి ఆలోచనలో పడ్డాడతను.

"సార్! ఈ పాకెట్ మీకిమ్మని ఎవరో ఇచ్చారట..." హెడ్ వెయిటర్ మళ్ళీ వచ్చి ఓ పాకెట్ అతనికిచ్చి వెళ్ళిపోయాడు.

గబగబా ఆ పాకెట్ విప్పి చూసాడతను. అందులో 93, జనవరి, ఇరవైవ తేదీ నాటి సిటీ ఎడిషన్ పేపర్ కటింగ్, ఫెళఫెళలాడుతున్న ఏభై రూపాయల సరికొత్త నోట్ల కట్టలు పది వున్నాయి. అంటే ఏభైవేలు అన్నమాట. వాటితో పాటు చిన్న స్లిప్ మీద ఓ అడ్రస్ గజిబిజిగా రాసి వుంది.

"వై. పీటర్, ఫ్లాట్ నెం 18. లాసన్స్‌బే కాలనీ!" అతి కష్టం మీద ఆ అడ్రస్ చదవగలిగాడతను.

"ఈ అడ్రస్ కెళితే తనకేం తెలుస్తుంది? తనకే ఎందుకు కాంటాక్ట్ చేసిందామె? ఈ సమయంలో తానిక్కడ వుంటానని ఆమెకెలా తెలిసింది?" అనుకున్నాడతను.

రవిశంకర్ సితార్ వాయిద్యం స్పీకర్లలోంచి మంద్రంగా వినిపిస్తోంది.

చటుక్కున అతనికో విషయం గుర్తుకొచ్చింది.

"ఫోన్‌లో ఆమె తనతో మాట్లాడుతున్నపుడు బ్యాగ్రౌండ్‌లోంచి చర్చిగంటలు, మసీద్‌లోంచి నమాజ్ ఏకకాలంలో విన్పించాయి. తనకి తెలిసింతవరకూ చర్చ్, మసీదూ ఒక్క దగ్గరే పెదవాల్తేరులోనే వున్నాయి ముందుగా అక్కడికి వెళ్ళి "చూస్తే ఏమైనా తెలియవచ్చు." అనుకుని బిల్ పే చేసి బయటికి నడిచాడు. తన మారుతీ జెన్‌లో బయలుదేరాడు.

రాంనగర్‌లోని హోటల్ డిలైట్ నుంచి కారులో పెదవాల్తేర్ చేరుకోవటానికి సరిగ్గా పది నిముషాలు పట్టింది. అక్కడ చర్చ్, మసీదూ ఎదురెదురుగా వున్నాయి. అతను కారుని మసీదుకి కొంచెం దూరంలో ఆపి చుట్టూ చూశాడు. ఓ కార్నర్‌లో ఎస్.టి.డి. ఫోన్ బూత్ ఒకటీ, ఎటెండెంట్ లేని "పే ఫోన్" బూత్ ఒకటీ వున్నాయి.

"తనకి సీక్రెట్‌గా ఫోన్ చేసిన స్త్రీ పే ఫోన్ బూత్‌లోంచే చేసి వుంటుంది" అనుకుని అందులోకి నడిచాడతను.

లోపలికి వెళ్ళగానే అక్కడో కాగితం కనిపించింది అతనికి. దాని మీద 555221 అన్న నంబర్ రాసుంది.

"ఇది హోటల్ డిలైట్ ఫోన్ నంబర్. అంటే తన ఊహ నిజమే! ఆమె ఇక్కడి నుంచే తనకి ఫోన్ చేసింది" అనుకున్నాడు.

ఆ కాగితాన్ని వెనక్కి తిప్పి చూశాడు. అక్కడ "0" 928272 అన్న మరో నంబర్ కూడా రాసి వుంది. "ఇది ఫోన్ నెంబర్ కాదు! మరేమిటి?" ఎందుకైనా మంచిదని ఆ కాగితాన్ని తన జేబులో పెట్టుకున్నాడు.

పక్కనే ఉన్న ఐస్‌క్రీం పార్లర్‌లోకి నడిచి, క్వాలిటీ ఐస్‌క్రీం కప్ ఒకటి తీసుకుని తినసాగాడు. రాత్రి తొమ్మిదిన్నర అవటంతో పార్లర్‌లో ఎవరూలేరు.

"షాప్ ఎన్నింటి వరకూ వుంటుంది?" మెల్లగా షాపులో వున్న యువకుడిని మాటల్లో పెట్టాడు.

"ఇక కట్టేసే టైమైపోయింది సార్..." అన్నాడతను.

"ఐస్‌క్రీం చాలా బావుంది."

"క్వాలిటీ ఐస్‌క్రీమ్ బాగుంటుంది సార్. మిగతావి బాగున్నా దీని టేస్ట్ దీనిదే."

"అన్నట్టు షాపులో నువ్వే వుంటావా? ఇంకెవరైనా వుంటారా?"

"నేనే సార్! ఎందుకు?"

"ఏం లేదు, సరిగ్గా తొమ్మిదింటికి ఆ పేఫోన్ బూత్‌లోకి ఎవరైనా స్త్రీ వెళ్ళి ఫోన్ చేయటం చూశావా?"

"తొమ్మిదింటికా సార్?"

"అవును."

"చూశాను సార్! ఆవిడ మా షాపు ముందు నుంచే వెళ్ళింది."

"ఎలా వుంది?"

"బ్యూటీఫుల్‌గా వుంది. ఎత్తు, ఎత్తుకు తగ్గ ఒళ్ళు, తెల్లగా చూపు తిప్పుకోలేనంత అందంగా వుంది."

"ఇంకా..."

"ఆమె ఎర్రటి పెదవులు కింద కందిగింజంత నల్లటి బ్యూటీస్పాట్. కానీ ఆమె గాబరా పడుతున్నట్టు మొహం మాత్రం ఆందోళనగా వుంది."

"హైట్ షుమారు ఎంతుండవచ్చు?"

"ఫైవ్ ఫైవ్ వుంటుందండి. ఇంకో సంగతి... ఆమె జడ నవలల్లో వర్ణించినట్లు పిరుదుల దాకా వుంది సార్..." అని-

"అయినా ఇవన్నీ అడుగుతున్నారు... మీరు పోలీసు మనిషా?" కాస్త భయంగా అడిగాడతను.

"కాదులే... భయపడకు! ఆమెని ఇదివరకు ఎప్పుడైనా చూశావా?"

"చెప్పలేను సార్! ఇప్పుడు ఖాళీగా వున్నాను కాబట్టి..."

"ఆమె అందంగా వుంది కాబట్టి, మీ షాపు ముందు నుంచే నడుచుకుంటూ వెళ్ళబట్టి, యంగ్‌మాన్‌వి కాబట్టి చూశావ్."

అతను బిడియంగా తల వంచుకున్నాడు.

"ఎనీహౌ! చాలా థ్యాంక్స్ బ్రదర్" అంటూ డబ్బులిచ్చి పార్లర్‌లోంచి బయటకు నడిచాడు.

కారు స్టార్ట్ చేసి లాసన్స్‌బే కాలనీ వైపు పోనిచ్చాడు. ఫ్లాట్ నెంబర్ 18 సులువుగానే దొరికింది. కారు దిగి ఫ్లాట్‌వైపు నడిచాడు. "వై. పీటర్" అన్న అక్షరాలున్న బోర్డు ఫ్లాట్ కుడివైపు, ఫ్లాట్ నెంబర్ గేటుకున్న బోర్డుకు వ్రేలాడుతున్నాయి. కాలింగ్ బెల్ ప్రెస్ చేశాడు కరుణ్.

కొద్ది సేపటికి తలుపులు తెరుచుకున్నాయి.

ఓ నలభై ఏళ్ళ వ్యక్తి కరుణ్‌ని చూసి–

"ఎవరు కావాలి?" అనడిగాడు.

"పీటర్ గారున్నారా?"

"నేనే పీటర్‌ని..."

"మీతో కొంచెం మాట్లాడాలి..." చెప్పాడు కరుణ్.

"ప్లీజ్ కమిన్..." అంటూ హాల్లోకి నడిచి సోఫా చూపించాడు అతను.

"నా పేరు కరుణ్! క్రిమినల్ లాయర్‌ని" తనని తాను పరిచయం చేసుకున్నాడు అతను.

"ఏం పనిమీద వచ్చారు?" అడిగాడతను.

"ఓ కేస్ నిమిత్తం వచ్చాను. ఈ పేపర్ కటింగ్ చూసి ఏమైనా వివరాలు చెప్పగలరని..." అంటూ ఆ పేపర్ అతనికి అందించాడు కరుణ్.

"నగరంలో బ్రౌన్ షుగర్, హెరాయిన్, నల్లమందు, మార్ఫిన్, కొకైన్, మాన్‌డ్రెక్స్ వంటి మత్తుపదార్థాలు యువతకి అమ్ముతున్నట్లు మురళీకృష్ణ, ఓ ప్రొఫెసర్, మరొక డాక్టర్‌ని పోలీసులు అనుమానించి కోర్టుకి హాజరు పరిచారు. అయితే సాక్ష్యాధారాలు లేక కోర్టు వారిని నిర్దోషులుగా వదిలిపెట్టేసింది"

ఆ పేపర్ కటింగ్‌లోని వార్తని బయటికి చదివి తిరిగి కరుణ్‌కి ఇచ్చేసి–

"మీ కేసుకీ, ఈ పేపర్ కటింగ్‌కీ, మీరు నా దగ్గరికి రావటానికీ ఏమిటి సంబంధం?" కూల్‌గా అడిగాడతను.

"నా క్లయింట్‌ద్వారా నాకు వచ్చిన ఇన్‌ఫర్మేషన్‌తో మీ దగ్గరకు రావలసి వచ్చింది..." చెప్పాడు కరుణ్.

"ఎవరు మీ క్లయింట్?"

"ఇది చిత్రమైన కేసు, నా క్లయింటెవరో నాకే తెలీదు. అంతవరకే ప్రస్తుతం చెప్పగలను."

"బావుంది! మీ క్లయింటెవరో మీకు తెలీదు. మీరేం చేయాలో మీకు తెలియదు. నా అడ్రసుకొచ్చి మీరు నన్ను ప్రశ్నించటం బాగుంది."

అతని మాటల్లో వ్యంగ్యం!

"మీరు చిత్రకారులా?" గోడలకి తగిలించి వున్న వివిధ తైలవర్ణ చిత్రాల్ని చూస్తూ అడిగాడు కరుణ్.

"అవును."

"ఆ పెయింటింగ్ అద్భుతంగా వుంది. దానిని నాకు అమ్ముతారా? నాకు చాలా బాగా నచ్చిందా చిత్రం..." ఆకాశంలో ఎర్రటి సూర్యుడు, కిందంతా ఆవిర్లు చిమ్ముతున్న ఎడారి ఇసుకలో కళ్ళల్లోకి ప్రాణం వచ్చేసినట్లు పడున్న యువకుడికి ఓ అందమైన స్త్రీ తన కడవలో నీళ్ళు తాగిస్తున్న చిత్రాన్ని చూపించి అడిగాడు అతను. ఆ చిత్రానికి కింది భాగంలో "ఎడారి సూర్యుడు" అని రాసి వుంది.

"సారీ! నాకు. నా చిత్రాన్ని అమ్మే అలవాటు లేదు."

"ఓకే! మిమ్మల్ని డిస్టర్బ్ చేసాను. కానీ మరోసారి గుర్తుకు తెచ్చుకుని ఏదయినా మెసేజ్ వుంటే మాత్రం నాకు తెలియజేయండి..." అంటూ తన విజిటింగ్ కార్డిచ్చి లేచాడు.

"చెప్పటానికేమీ లేదు. మీ క్లయింట్ పొరబడి వుంటారు. అయినా మీకోసం, మీ కేసు కోసం ఏదైనా సహాయం కావాలంటే మీరెప్పుడయినా రావచ్చు..."

"థాంక్యూ" అంటూ బయటికి నడిచి, తన కారు స్టార్ట్ చేసుకుని పోనివ్వసాగాడు కరుణ్.

"ఏ కారణం లేకుండా ఆమె ఈ ఆర్టిస్టు ఎడ్రస్ ఎందుకిస్తుంది? ఆ పేపర్ కటింగ్‌కీ, ఈ ఆర్టిస్టుకి ఏదో లింకుండే వుంటుంది. ఈ ఆర్టిస్టుమీద ఓ కన్నేసి వుంచితే మంచిది..."

అనుకుని ఎదురుగా కనిపించిన ఫోన్ బూత్ ముందు కారాపి ఓ నెంబర్ డయల్ చేసాడు.

అటునుంచి రింగవగానే రూపాయి కాయిన్ వేసి...

"హలో! రాయ్ డిటెక్టివ్ ఏజన్సీయేనా?" అడిగాడు.

"యస్..."

"మిస్టర్ రాయ్ ఈజ్ దేర్..."

"స్పీకింగ్..."

"హలో రాయ్! నేను కరుణ్‌ని..."

"కరుణ్ మీరా? ఏమిటీ మధ్య పత్తాలేరు?"

"పత్తా, చెత్తా... ప్రస్తుతం అర్జెంటుగా మీరు నేను చెప్పిన అడ్రస్‌కి మీ ఎజెంట్‌లని పంపి అందులోని వ్యక్తిమీద నిఘా వేయాలీ. నేనో కేసు టేకప్ చేసాను. నా క్లయింట్ ఆ అడ్రస్ చెప్పి, అతన్ని కల్సుకుంటే కేసుకు సంబంధించిన వివరాలు తెలుస్తాయని చెప్పాడు కానీ ఆ వ్యక్తి తనకేమీ తెలియదని అంటున్నాడు" చెప్పాడు కరుణ్.

"అడ్రస్ చెప్పండి. ఇప్పుడే పంపిస్తాను." చెప్పాడు రాయ్.

"ఏమిటీ కేసూ, ఎవరూ క్లయింట్?" అడిగాడు రాయ్.

అతడు బెంగాలీ వ్యక్తి కావటం వలన వ"కి బదులు బ" పలుకుతాడు ప్రతిసారీ.

బెంగాలీలందరూ అంతే. "వందేమాతరం" అవటానికి "బందేమాతరం" అంటారు. రాయ్ "వ"కి బదులు "బ" వాడే ప్రతిసారి నవ్వొస్తుంటుంది.

అయినా బయటపడడు కరుణ్.

"అదంతా తర్వాత తీరిగ్గా చెబుతాను. ముందు మీరు నేను చెప్పిన అడ్రస్‌కి మీ వాళ్ళని పంపించండి సార్..." అన్నాడు అతను.

కాలేజీనుంచి కరుణ్, రాయ్‌లిద్దరూ క్లాస్‌మేట్స్, చదువులు పూర్తయిన తరువాత కరుణ్ లాయర్‌గా సెటిలయితే. రాయ్ డిటెక్టివ్ ఏజెన్సీ మొదలుపెట్టాడు.

చాలా కేసుల్లో రాయ్ అందించిన రహస్య సమాచారం కరుణ్‌కి ఎంతో ఉపయోగపడింది.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"ట్రింగ్... ట్రింగ్..." ఫోన్ మోతకి మెలకువ వచ్చిన కరుణ్ బద్ధకంగా ఆవులించి రిసీవర్ చేతిలోకి తీసుకుని–

"హలో..." అన్నాడు.

అప్పుడే రేడియం డయల్ తెల్లవారి మూడయినట్లు సూచిస్తోంది.

"హలో! నేను రాయ్‌ని..."

"చెప్పండి! ఏమిటింత పొద్దున్నే ఫోన్ చేశారు?"

"మీరు చెప్పినట్టే పీటర్ ఇంటి దగ్గర మా ఏజెంట్లని పెట్టించారు. పదకొండు, పదకొండున్నర ప్రాంతానికి చేరుకున్నారట అక్కడివాళ్ళు. బాళ్ళిద్దరూ చూస్తుండగానే పీటర్ బిల్డింగ్ బ్లాస్టయిపోయింది. సరిగ్గా రెండు గంటల ఇరభై నిమిషాలకి..."

రాయ్ చెప్పింది విని కరుణ్ మత్తు అంతా వదిలిపోయింది.

"వ్వాట్? ఆ బిల్డింగు బ్లాస్టయిపోయిందా?"

"ఎస్ మైడియర్ ఫ్రెండ్! మీరొస్తే ఇద్దరం అక్కడికి బెళదాం. పోలీసులు రాకముందే అక్కడికెళితే మనకేదయినా క్లూ దొరకవచ్చు" అన్నాడు రాయ్.

"ఓకే! టెన్‌మినిట్స్‌లో వస్తాను" అంటూ గబగబా తయారయి కారులో రాయ్ ఆఫీసుకి చేరుకున్నాడు కరుణ్.

రాయ్‌ది ఆఫీసు, ఇల్లు ఒకే బిల్డింగులో వున్నాయి. కరుణ్ కారు రాగానే రాయ్ ఎక్కి కూర్చున్నాడు.

మరుక్షణం కారు లాసన్స్‌బే కాలనీవేపు దూసుకు పోసాగింది.

"ఇప్పటికయినా జరిగిందేమిటో చెప్పండి..." అన్నాడు రాయ్.

హోటల్లో భోజనం చేస్తున్నప్పుడు తనకి ఫోన్‌వచ్చిన దగ్గర్నుంచీ, తాను పీటర్‌ని కలిసి మాట్లాడినదంతా చెప్పి...

"ఆ వెంటనే మీకు ఫోన్‌చేసి పీటర్ ఇంటిని ఓ కాపు కాయమన్నాను" వివరించాడతను.

"మీ క్లయింట్ ఇచ్చిన పేపర్ కటింగ్‌కీ, పీటర్‌కి ఏదో బలమైన లింకు బుండి బుంటుంది. అందుకే మీరు అతన్ని కలిసీ కలబగానే ఇలా జరిగిందని నా నమ్మకం!"

రాయ్ మాటలకు నిజమేనన్నట్టు తలూపాడతను.

వాళ్ళ కారు అరకిలో మీటరు దూరంలో వుండగానే ఎర్రని వెలుగుతో మంటలు స్పష్టంగా కన్పించసాగాయి.

"హారిబుల్!" కారు ఆ మంటల ముందు ఆగగానే అన్నాడు రాయ్.

ఇద్దరూ కారులోంచే చూడసాగారు. ఇంతలో మంటల్ని తిలకిస్తున్న జనంలోంచి రాయ్ ఏజెంట్లు వచ్చి ఏదో చెప్పబోయారు. అదే సమయంలో పోలీస్ సైరన్ ఫైరింజన్ గంటల మోత వినిపించింది.

"ఏజెంట్స్! గెటిన్... కరుణ్‌జీ కారు పోనీయండి. పోలీసులు మమ్మల్ని చూస్తే చికాకు" అన్నాడు రాయ్.

ఏజెంట్లు కారెక్కగానే ముందుకు దూసుకుపోయింది వాళ్ళ కారు.

"ఎస్! ఇప్పుడు చెప్పండి. వాట్సద మాటర్?" అడిగాడు రాయ్.

"మేమిద్దరం పదకొండున్నరకి పీటర్ ఇంటికి చేరుకున్నాం. అప్పటికి ఆ ఇంట్లో ఏ అలికిడీ లేదు. లైట్లన్నీ ఆర్పేసి వున్నాయి. మేం ఆ ఇంటికి ఎదురుగా వున్న గుబురుపొద దగ్గర నక్కి వెయిట్ చేస్తున్నాం. ఇంతలో మా చెవులు చిల్లులుపడేలా, మా కళ్ళు మిరుమిట్లు గొలిపేలా ఆ బిల్డింగ్ బ్లాస్టయిపోయింది. కొద్దిసేపు ఆగి మేమా ఇంట్లోకి వెళ్ళాం. బిల్డింగ్ రెండో అంతస్థులోని వాచ్‌నుంచి రెండు వైర్లు క్రిందికి వ్రేలాడటం కనిపించింది. బాంబు పేలుడుతో చుట్టుపక్కల జనం వస్తున్న అలికిడికి మేం వెనకనుంచి జారుకుని మళ్ళీ బిల్డింగ్ ముందు భాగంలోకి వచ్చాం. తరువాత మీకు ఫోన్ చేశాం. పోలీస్ స్టేషన్‌కీ, ఫైర్ స్టేషన్‌కీ బహుశా ఎవరో ఫోన్ చేసుంటారు. అందుకే వాళ్ళు వచ్చారు." ఓ ఏజెంట్ వివరించాడు.

"అంతేనా? ఇంకేమి ఇన్ఫర్మేషన్ లేదా?" అడిగాడు రాయ్.

"ఇంకేమి లేవు సార్! బిల్డింగంతా సెర్చ్ చేద్దామంటే అప్పటికే బాంబు ప్రేలుడువల్ల నలుదిక్కులా అంటుకున్న మంటలు వీలు కలుగనీయలేదు. వాచ్ రెండు గంటల ఇరవై నిమిషాల దగ్గర ఆగిపోయి వుంది..."

"లోపల పీటర్ ఏమయిపోయినట్లు?" చిన్నగా గొణిగాడు కరుణ్.

"బహుశా లోపలే ఉండి ఉంటాడు. బాంబు ప్రేలుడుతో బిల్డింగ్ చాలావరకు కూలిపోయింది. మంటలు, పొగ వలన వెతకటానికి కష్టమైంది. అప్పటికే చుట్టుపక్కల జనం రావటంతో అతని గురించి వెదకలేకపోయాం."

మాటల్లోనే రాయ్ ఆఫీసు చేరుకుంది కారు వాళ్ళు దిగిపోగానే ఇంటివైపు దూసుకుపోయాడు కరుణ్.

✧ ✧ ✧ ✧ ✧ ✧

ఉదయం ఆరు గంటలైంది సమయం.

కరుణ్ కాఫీ సిప్‌చేస్తూ, పేపర్ తిరగేయసాగాడు.

"లాసన్స్ బే కాలనీలో బాంబు పేలుడు" అన్న శీర్షిక అతన్ని ఆకర్షించింది గబగబా చదవసాగాడు.

"స్పాట్‌న్యూస్ : లాసన్స్ బే కాలనీలోని ఫ్లాట్ నెం : 18 బిల్డింగ్‌ని రాత్రి ఎవరో దుండగులు టైం బాంబ్ పెట్టి పేల్చివేశారు. పోలీసులు ఆ మంటల్లో పూర్తిగా కాలిపోయిన ఓ శవాన్ని కనుక్కున్నారు. పూర్తిగా కాలిపోయి, రూపురేఖలు లేని ఆ శవాన్ని చూసి స్థానికులు "అది పీటర్ దేనని... శవం ఒడ్డూ, పొడవూ బట్టి చెప్పవచ్చు"నని పోలీసులకు తెలిపారు. అతను ఆ బిల్డింగ్‌లో ఒంటరిగా జీవిస్తున్నాడని వాళ్ళు తెలిపారు. పోస్టు మార్టమ్ నిమిత్తం శవాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ ఎస్.ఐ. మురళి కేసుని దర్యాప్తు చేస్తున్నారు..." అంటూ పేర్కొందా పత్రిక.

కరుణ్ పేపర్ పక్కన పెట్టేసి, స్నానం చేసి డ్రస్సయ్యాడు. కారులో రాయ్ ఆఫీసుకు వెళ్ళాడు.

"గుడ్ మాణింగ్ రాయ్ సాబ్" విష్ చేశాడు.

"గుడ్ మాణింగ్ కరుణ్‌జీ! పేపర్లో న్యూస్ బచ్చింది చూశారా?" అడిగాడు రాయ్.

"చూశాను."

"అనుమానం లేదు. పీటర్‌ని మీరు కలిసిన రోజే అతన్నెవరో హత్య చేశారంటే బహుశా అతనికి మీరు చూపించిన పేపర్ కటింగ్‌లోని వ్యక్తుల బిబరాలు తెలిసే బుంటాయి. ఎందుకైనా మంచిది. మనం మళ్ళీ మరోసారి పీటర్ బిల్డింగ్ దగ్గరికి వెళ్ళటం మంచింది. ఏ చిన్న ఆధారమైన దొరక్కబోదు" ఆశావహంగా అన్నాడు రాయ్.

"ఓకే! వెళదాం" అన్నాడు కరుణ్.

ఇద్దరూ కారులో లాసన్స్‌బే కాలనీ చేరుకున్నారు. వాళ్ళు వెళ్ళేటప్పటికి పీటర్ బిల్డింగ్ దగ్గర ఓ పోలీస్ కానిస్టేబుల్ కాపలాగా వున్నాడు. అందమైన ఆ బిల్డింగ్ కుష్టు జబ్బు తగిలిన మనిషిలా బాంబ్ పేలుడికి అసహ్యంగా అయిపోయింది.

"లోపలికెళ్ళటమెలా? కానిస్టేబుల్ కాపలా కాస్తున్నాడే" అన్నాడు రాయ్.

"మనం కారులోనే వెయిట్ చేద్దాం. కానిస్టేబుల్ ఎటయినా వెళ్ళకపోడు. అప్పుడు లోపలికెళ్ళి చూసిరావచ్చు" అన్నాడు కరుణ్.

ఇద్దరూ కారులో కూర్చునే చూడసాగారు. గంటయినా ఆ కానిస్టేబుల్ ఎటూ కదలల్లేదు.

"సాధారణంగా ఇలా ఏదయినా కాపలా డ్యూటీ పడితే పోలీసులు మొక్కుబడిగా కాపలా కాస్తారు. ఇతడేమిటి దిష్టిబొమ్మలా ఎటూ కదలటం లేదు?" విసుగ్గా అన్నాడు రాయ్.

"బహుశా ఇతనిలో సిన్సియారిటీ పాళ్ళు కాస్త అధికంగా వున్నాయేమో" నవ్వుతూ అన్నాడు కరుణ్.

ఇంతలో జరిగిందా సంఘటన–

కాలేజీకి వెళుతున్న ఓ అమ్మాయిని వెకిలిగా కామెంట్ చేస్తూ ఫాలో అవసాగాడో అబ్బాయి. తల వంచుకుని మౌనంగా నడుస్తున్న ఆమెకి, కంటి చివర్ల నుంచి పీటర్ బిల్డింగ్ దగ్గర కాపలా కాస్తున్న కానిస్టేబుల్ కనిపించాడు.

ఆమె గబగబా అటు నడిచి–

"చూడండి సార్! ఈ రాస్కెల్ నన్ను రోజూ ఇలా వెంబడించి పిచ్చి పిచ్చి కూతలు కూస్తున్నాడు. ఇంటినుంచి కాలేజీకి, కాలేజీనుంచి ఇంటికి రావటమే దర్లభంగా వుంది" అంటూ అతనికి చెప్పింది.

ఆ కానిస్టేబుల్ వెంటనే ఆ యువకుడి చొక్కా కాలర్ పట్టుకుని – "ఏరా? అమ్మాయిలని ఏడిపిస్తావా? చువ్వలు లెక్కెట్టాలని ఉందా?" అనడిగాడు కోపంగా.

"ముందు ఫిల్టు వదులు! నేనెవర్నో తెలుసా? ఎమ్.ఎల్.ఎ.గారి కొడుకు ఫ్రెండ్‌ని. ఒక్క మాట నేను చెబితే నువ్వు నక్సలైట్లున్న ఏరియాలోకి పోయి పడతావ్...." నిర్లక్ష్యంగా అన్నాడు ఆ యువకుడు.

తాను పోలీసునైనా జడవకుండా, అదీ ఓ అమ్మాయి ముందు వాడలా అనేసరికి కోపం పట్టలేకపోయిన ఆ కానిస్టేబుల్ అతడి చొక్కా పుచ్చుకుని ఈడ్చుకుంటూ...

"నీలాంటి దున్నపోతులకిలా కాదురా టాస్క్‌ఫోర్స్‌కి అప్పగించేస్తే తాట వలిచేస్తారు. అప్పుడు దిగుతుంది నీమైకం...." అంటూ వెళ్ళసాగాడు. వాళ్ళ వెనకే నడిచిందా అమ్మాయి.

"ఈ ఇన్సిడెంట్ మనకుపయోగపడేలా వుంది. కానిస్టేబుల్ బహుశా ఈ సందు చివరున్న బూత్‌లోంచి టాస్క్‌ఫోర్స్ వాళ్ళకి విషయం చెప్పి, అతన్ని అప్పగించటానికి ఫోన్ కోసం వెళ్ళుంటాడు. మీరిక్కడే వుండి చూస్తూ వుండండి. నేను లోపలికి వెళ్ళి ఏమయినా ఆధారాలు దొరుకుతాయేమో చూసొస్తాను" అంటూ కారు దిగాడు కరుణ్.

కరుణ్ జీ! బీకేర్‌ఫుల్... కానిస్టేబుల్ రాకముందు వచ్చేయాలి. లేకపోతే అనుమానితుల లిస్టులోకి మనమూ ఔళ్ళిపోతాం" హెచ్చరించాడు రాయ్. 'సరే' నన్నట్లు తలూపి బిల్డింగ్‌వైపు దూసుకుపోయాడు కరుణ్.

చాలా శక్తివంతమైన బాంబే పేలి వుంటుంది. బిల్డింగ్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కిటికీలకున్నగ్రిల్‌లైతే ఎవరో చేతిలో వంచేసినట్లు వంగిపోయాయి. హాల్లో గోడలు సొరంగాలు తవ్వినట్లు పెద్దపెద్ద కంతలేర్పడిపోయాయి. ఫర్నిచరంతా కాలి బూడిదైపోయింది. ఒక్కో గదే వెతుకుతూ వెళ్ళసాగాడు అతను. అనుమానించదగిన ఆధారాలేమీ లేవు. చివరిగా మిగిలింది పీటర్ బెడ్‌రూం. అందులోకి నడిచాడు.

బయట కారులో కూర్చున్న రాయ్‌కి క్షణక్షణానికీ ఆందోళన పెరిగిపోసాగింది. 'పది నిముషాలపైనే అయిపోయింది. ఏమిటింకా రాడు. కానిస్టేబుల్ వచ్చేస్తే ఎంత డేంజర్?"

అతను మనసులో అనుకుంటున్నట్లే కానిస్టేబుల్ వస్తూ కనిపించాడు.

"ఇక నీకేమీ భయం లేదమ్మా! వాడిని టాస్క్‌ఫోర్స్‌కి అప్పగించేశానుగా మళ్ళీ నీ జోలికి వాడు వస్తే, నేను త్రీటౌన్‌లో వుంటాను. నా పేరు నాగరాజు, నన్ను కలిస్తే అప్పుడు చూద్దాం వాడి పని" ఆ అమ్మాయికి అభయం ఇచ్చి వెళ్ళిరమ్మన్నాడు ఆమెని.

"అయిపోయింది. అంతా అయిపోయింది. ఇప్పుడా బిల్డింగ్‌లోంచి కరుణ్ రావడం చూస్తే ఈ కానిస్టేబుల్ ఆ విషయం ఎస్.ఐ.కీ చెబుతాడు. వాళ్ళు మళ్ళీ దర్యాప్తు ముందునుంచీ ప్రారంభిస్తే, ఆ రోజు రాత్రి కరుణ్ పీటర్‌ని కలబటం, ఆ తరువాత అతని హత్య జరగటం ఇవన్నీ ఒకదానికి ఒకటి లింకప్ చేసి అతన్నీ అనుమానితుడుగా పరిగణిస్తారు. ఎవరికోసమో తాను బుచ్చులో చిక్కుకుంటాడు కరుణ్."

"ధబ్...." మన్న శబ్దంతో కారు డోర్ మూసేసి, కూర్చుని ముందుకు ఉరికించిన కరుణ్‌ని చూడగానే గొణుక్కోవటం ఆపేశాడు రాయ్. అతని మొహంలో ఆశ్చర్యం కన్పించింది.

"వెల్ మైడియర్ కరుణ్! ఎలా బచ్చారు? మీరొచ్చే సమయానికే కానిస్టేబుల్ బచ్చేశాడుగా" అడిగాడు.

నేను అన్ని గదులూ తిరిగి, చివరగా పీటర్ బెడ్‌రూంలోనికి నడిచాను. అక్కడొక ఐరన్‌సేఫ్ కనిపించింది. అది ఓపెన్ చేసే వుంది. అయితే అందులో ఏ విధమైన వస్తువులుకానీ... కాగితాలు కానీ... లేవు. కానీ బీరువాలోని అరలన్నిట్లో తెల్లని పౌడర్ ఒలికిపోయి వుంది...

ఇక చూడవలసిందేమీ లేదనిపించి బయటకు వచ్చేసరికి కానిస్టేబుల్ యధాస్థానంలో కనిపించాడు. వెంటనే బిల్డింగ్ వెనకనుంచి పక్కవీధిలోకి వెళ్ళి అక్కడినుంచి ఇలా వచ్చాను. ఏ క్లూ దొరకలేదు."

"గుడ్! మీరు లాయర్‌గానే కాదు. డిటెక్టివ్‌గా కూడా రాణిస్తారు. ఇక మేం బిచాణా ఎత్తేయవలసిందే"

ఆ మాటలకు చిన్నగా నవ్వాడు కరుణ్.

అప్పుడు తెలీదతనికి తాను తన కళ్ళముందు కనిపించిన అతి ముఖ్యమయిన ఆధారాన్ని పట్టించుకోలేదని.

⁜ ⁜ ⁜ ⁜ ⁜ ⁜

"ట్రింగ్... ట్రింగ్...." కాలింగ్‌బెల్ మోతకి చదువుతున్న పుస్తకాన్ని పక్కనపెట్టి వెళ్ళి తలుపు తీశాడు కరుణ్.

ఎదురుగా మంజుల నిల్చుని వుంది.

"హాయ్ స్వీటీ... హౌ ఆర్ యూ?" ఆనందంగా అడిగాడు అతను.

"ఫైన్! థాంక్యూ...." అంది చిరుకోపంగా.

"లోపలికి రావా?" బయటే నించున్న ఆమెని అడిగాడు.

"వస్తాను. కానీ... ఏమిటి తమరస్సలు ఇంటిపట్టున వుండటం లేదా" ఎర్లీ మార్నింగ్ ఫోన్ చేసినా, రాత్రిపూట ఫోన్‌చేసినా ఎవరూ ఫోనెత్తటం లేదు."

"చెబుతాను మంజూ... అంతా చెబుతాను. ముందు రిలాక్స్‌గా కూర్చో" అంటూ లోపలికి నడిచాడు. వెనకే వచ్చి సోఫాలో కూర్చుంది మంజుల.

కరుణ్, మంజులల స్నేహానికి రెండేళ్ళ వయస్సు! ముందు స్నేహంగా మొదలై, తర్వాత అది ప్రణయంగా మారింది. ఆమె బియస్సీ హోం సైన్స్ చేసి ప్రస్తుతం ఖాళీగా వుంది.

అప్పుడే తనకి కలుపుకున్న కాఫీని ఫిఫ్టీ-ఫిఫ్టీ చేసి ఓ కప్పులో ఆమెకి, మరో కప్పులో తనకూ తెచ్చుకుని ఆమె ఎదురుగా కూర్చున్నాడు కరుణ్.

మంజుల మెల్లగా కాఫీ సిప్ చేయసాగింది.

"మంజూ! నేనో కేసు డీల్ చేస్తున్నాను...."

"లాయర్‌గా అది నీ డ్యూటీ కరుణ్. అందులో వింతేముంది? దానికోసం రేయింబవళ్ళూ నాక్కనిపించకుండా పోతే నాకెలా వుంటుంది?" అతని మాటలు పూర్తికాకుండానే అందామె.

"ఇది అన్ని కేసుల్లాంటి కేసూ కాదు డియర్...."

"ఓహో! ఎవరో అందమైన అమ్మాయి అప్పగించిన కేసు కాబోలు! అందుకే అంత శ్రద్ధగా వర్కవుట్ చేస్తున్నావు."

"నిజమే! నాకు ఈ కేసునిఅప్పగించింది ఓ స్త్రీయే. కానీ ఆమె ఎవరో తెలీదు నాకు. కనీసం ఆమె పేరుకూడా...."

"ఏమిటేమిటి? కేసునప్పగించింది స్త్రీయే కానీ... ఆమెవరో తెలియదు, ఆమె పేరు తెలీదా? బహుశా ఆమె బురఖా వేసుకుని వచ్చి వుంటుంది. యామే రైట్?"

"యువార్ రాంగ్ యంగ్‌లేడీ! ఆమె నాతో ఫోన్‌లో మాట్లాడి, అజ్ఞాతంగా కేసునప్పగించింది...." అని మొత్తం జరిగిందంతా వివరించాడు కరుణ్.

ఒక్కక్షణం ఆమె మౌనంగా వుండిపోయింది. తరువాత తేరుకుని-

"కరుణ్! నాకెందుకో నువ్వు చెప్పిన వివరాలన్నీ విన్నాక ఇదేదో భయంకరమైన ముఠాకి సంబంధించిన విషయంలా తోస్తోంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నువ్వీ కేసు విత్‌డ్రా అయిపో!" ఆమె కళ్ళల్లో కన్నీరు!

అదిచూసి లేచెళ్ళి ఆమె పక్కనే కూర్చున్నాడతను.

"పిచ్చి మంజూ! ఎందుకలా బెంబేలు పడతావ్? ఇంతకుముందు నేనెన్ని క్రిమినల్ కేసులు టేకప్ చేయలేదు. ఇదీ అంతే...." అన్నాడు.

"అవన్నీ వ్యక్తులకు సంబంధించినవి కరుణ్. కానీ ఇదలాకాదు. మత్తుపదార్థాలతో యువతని నిర్వీర్యం చేసే మాఫియా రాక్షసులది. ఈ కేసులో నీకేదయినా అయి నిన్ను పోగొట్టుకుంటే - నేను...." అక్కణ్నించి మాట్లాడలేనట్లు ఆమెకి దుఃఖంతో మాటలు పెగల్లేదు.

"నాకేమీ కాదు మంజూ! నువ్వు ధైర్యంగా వుండు, ప్రతి పురుషుడి విజయం వెనకా ఓ స్త్రీ వుంటుందంటారు. అలాగే నేనీ కేసులో నేరస్తుల్ని చట్టానికి అప్పగించి, నేనూ ఓ మంచిపని చేశానన్న తృప్తి మిగలాలంటే నువ్వు నాకు నైతిక బలాన్నివ్వాలి. కానీ ఇలా బెంగపడి నా ముందరికాళ్ళకి బంధాలేస్తే, ఎలా?" అనునయంగా ఆమె వెన్ను నిమిరి అన్నాడు అతను.

కాస్సేపటికి ఆమె తేరుకుంది.

"అయితే ప్రతిరోజూ ఏదో ఒక సమయానికి, నువ్వెక్కడున్నా నాతో ఫోన్‌లో మాట్లాడాలి లేకపోతే నా మనసు మనసులో వుండదు"

"అలా అన్నావ్ బాగుంది...."

"ఈ రోజు సండేకదా! హోటల్ గ్రీన్‌పార్క్‌లో గుజరాతీ హాండీ క్రాఫ్ట్ మేళా జరుగుతుంది. వెళదాం!" అంది మంజుల.

"ఓకే! నేను పది నిమిషాల్లో తయారయి వచ్చేస్తాను–" అంటూ బాత్‌రూంలోకి నడిచాడు కరుణ్.

మంజుల ఏదో మేగజైన్ తీసుకుని చదవసాగింది పది నిముషాల తర్వాత–

"మంజూ! వెళదామా?" అంటూ వచ్చాడతను.

ఫుల్‌సూట్‌లో వున్న కరుణ్‌ని ఒకసారి పైనుంచి కిందివరకూ చూసింది మంజుల.

పొడవైన అతని విగ్రహానికి ఆ సూట్ మరింత అందానిచ్చింది. నుదురుమీద తారట్లాడుతున్న అతని జుత్తు, స్థిరత్వాన్ని, అకుంఠిత దీక్షనీ సూచిస్తున్న అతని కళ్ళు, వాయింట్ నోస్, బొద్దింక మీసాలు, అప్పుడే షేవ్ చేసుకున్న పచ్చని అతని గడ్డం – మగాడంటే ఇలా వుండాలన్నట్టు వున్నాయి.

"రోజులు మారిపోయి అబ్బాయిలకి బదులు అమ్మాయితే అన్నిట్లోనూ 'ఏక్టివ్' పార్టు తీసుకుంటున్నారని ఎక్కడో చదివాను. అది నిజమే న్నమాట" చిలిపిగా అన్నాడు కరుణ్.

"ఛీ... ఏమిటా పిచ్చివాగుడు?" అందంగా చిరాకు పడిందామె.

"మరి నన్ను తినేసేలా చూస్తుంటే ఏమనను?"

"ఇక వెళదామా?" అందామె లేస్తూ.

"నేనిందాక అన్నట్టు గుర్తుమరి...."

ఆ మాటతో ఆమె చిన్నగా నవ్వింది. సొట్టలుపడే ఆమె చెక్కిళ్ళు కరుణ్‌ని చూసి కవ్వింపుగా నవ్వినట్లున్నాయి. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని బయటకు నడిచాడు. డోర్ లాక్‌చేసి కారులో కూర్చుని హోటల్ గ్రీన్‌పార్క్‌వైపు పోనివ్వసాగాడు కారుని.

పది నిముషాల్లో హోటల్ చేరుకుని కారుని పార్కింగ్ ప్లేస్‌లో పెట్టి లోపలికి నడిచారు. గుజరాతీ సంస్కృతిని కళ్ళముందు ఆవిష్కరించేలా వాళ్ళ పనితనంతో అందాలు సంతరించుకున్న ఎన్నో అద్భుతమైన వస్తువులు ఠీవిగా తమతమ స్థానాల్లో అమరి వున్నాయి.

అన్నీ చూసేసరికి గంటపైనే పట్టింది వాళ్ళకి. జనం పల్చగా వున్నారు.

"నీకేమయినా కావాలా?" అడిగాడు కరుణ్.

మంజుల చెమ్కీలతోనూ, అద్దాలతోనూ తయారు చేసిన ఓ హాండ్ బ్యాగ్, గులాబీ రంగు తోలు బూట్లూ తీసుకుంది. కౌంటర్లో డబ్బు చెల్లించి వెనుదిరుగుతుండగా–

"గుడ్‌మార్నింగ్ కరుణ్‌జీ!" అన్న మాటలకి తిరిగి చూశారు కరుణ్, మంజులలు.

రాయ్ భార్యా సమేతంగా అక్కడ నిల్చుని వున్నాడు. పరస్పర పరిచయాలయ్యాక–

"ఎంత వరకూ వచ్చింది నీ కేస్?" మెల్లగా అడిగినా మంజులకి వినిపించాయి మాటలు.

"ఏమీ ముందుకు సాగలేదు. ఆ రోజు నాకు పాకెట్ అందించిన హెడ్ వెయిటర్‌ని ఓసారి ఎంక్వయిరీ చేస్తాను. అతనికా పాకెట్ ఎవరిచ్చారో తెలిస్తే... ఈసారి ఆ వైపు నుంచి మొదలు పెట్టుకు రావచ్చు" చెప్పాడు కరుణ్.

"గుడ్! మేం మేళా చూస్తాం" అన్నాడు రాయ్.

"ఓకె!" అంటూ మంజులతో బయటకి నడిచాడు అతను.

"అబ్బ! బుర్ర వేడెక్కిపోయిన సమయంలో నువ్వొచ్చి ఈ మేళాకి తీసుకు వచ్చి చాలా హెల్ప్ చేశావ్ మంజూ. గుజరాతీ కళాకారుల పనితనం ఎంత చక్కగా వుంది!"

"..........."

"నువ్వు మరీ బ్యాగ్, షూసే తీసుకున్నావేమిటి?"

"..........."

"శారీస్ కూడా వున్నాయి. తీసుకోవలసింది...."

"..........."

"ఏమిటి మై స్వీట్ హార్ట్ మాట్లాడవేం?"

"చూడండి క్రిమినల్ లాయరుగారూ! తమరో విషయం గుర్తు పెట్టుకుంటే మంచిది."

"ఏమిటి?" డ్రైవ్ చేస్తూనే అడిగాడు కరుణ్.

"లాయర్ లాయర్‌గానే ఉండాలి. ఇందాక రాయ్‌తో నువ్వంటున్న మాటలు నాకు విన్పించలేదనుకున్నావా?"

"ఏ మాటలు?"

"హోటల్లో హెడ్ వెయటర్ని ఎంక్వయిరీ చెయ్యాలనీ, అటునుంచి మొదలు పెట్టుకు రావాలనీ అన్న మటలు."

"అయితే...."

"నా ఉద్దేశ్యంలో అటువంటి ఎంక్వయిరీలు పోలీసులు, డిటెక్టివ్ చేయాలి" అందామె.

"పూర్ మంజూ! లాయరంటే కోర్టులోనే వాదించటం కాదు. తన కేసుకు సంబంధించిన ప్రతి విషయం కోసమూ అతను ఇన్వెస్టిగేషన్ చేయక తప్పదు. ఎందుకంటే న్యాయవ్యవస్థ మొత్తం సాక్ష్యాధారాలమీదే ఆధారపడి వుంది."

మంజుల మౌనంగా వుండిపోయింది.

"ఎక్కడ దింపాలి నిన్ను?"

"అంటే నన్ను వదిలించుకుంటావా?"

"అది కాదు!"

"ఈ రోజంతా నీతోనే ఉందామనుకున్నాను...." అతనివైపు చూస్తూ అందామె.

"ప్లీజ్ మంజూ! కొద్ది రోజులు ఓపికపట్టు, ఈ రోజే కాదు జీవితాంతం కలిసే వుండొచ్చు. ఈ కేసు విజయవంతంగా నేను సాల్వ్‌చేసి, నా సహాయాన్ని అర్థించిన ఆ స్త్రీకి ఆమె కోరినది జరిగిన వెంటనే మనం దైవసాక్షిగా, పెద్దల సమక్షంలో దంపతులమవుదాం. అంత వరకూ నువ్వు నేను చెప్పినట్టు చేయి. ఇప్పుడింటికెళ్ళు నువ్వు. నేను హోల్ డిలైట్‌కెళ్ళి కొంత సమాచారం సేకరించుకుని వస్తాను" బ్రతిమాలుతున్నట్లున్నాడు కరుణ్.

"సరే!" నిట్టూర్చి అంది మంజుల.

తర్వాత ఎవరూ మాట్లాడుకోలేదు. మంజుల తమ ఇంటికి కాస్త దూరంలోకి కారు చేరగానే-

"ఇక్కడాపెయ్ కరుణ్" అంది.

అతను కారాపాడు.

మంజుల కారుదిగి... సీరియస్‌గా వెళుతూ "బై" అంది.

బై చెప్పి కారుని రివర్స్‌చేసి వెనుదిరిగాడు కరుణ్.

✧ ✧ ✧ ✧ ✧ ✧

మధ్యాహ్నం పన్నెండు గంటలే అవటంతో హోటల్ డిలైట్ పెద్ద రష్‌గా లేదు. కరుణ్ తానెప్పుడూ కూర్చునే టేబిల్ దగ్గరే కూర్చున్నాడు.

"బాబా సెహగల్" లేటెస్ట్ ఆల్బమ్‌లోని హిందీ పాటలు అక్కడి మందకొడి వాతావరణాన్ని ఉత్తేజపరచటానికి సమాయత్తమైనట్టు స్పీకర్లలోంచి మధురంగా విన్పిస్తున్నాయి.

కరుణ్ లంచ్‌కి ఆర్డరిచ్చి చుట్టూ చూశాడు. వెయిటర్లందరూ ఎవరికి కావలసినవి వారికి సర్వ్ చేస్తున్నారు. ఎక్కడా హెడ్‌వెయిటర్ జాడలేదు.

"ఏమిటి హెడ్‌వెయిటర్ కనిపించటంలేదు" అనుకున్నాడు కరుణ్. కొద్దిసేపటికి అతనికి లంచ్ సర్వ్ చేయబడింది.

"హెడ్ వెయిటర్ కనిపించటంలేదేమిటి?" తనకి సర్వ్‌చేసిన వెయిటర్ని అడిగాడు.

"తెలియదు సార్! అతను గత మడు రోజుల నుంచీ రావటం లేదు" అని అక్కడి నుంచి వెళ్ళిపోయాడతను.

కరుణ్ భోజనం చేస్తూ ఆలోచించసాగాడు.

"తనకి ఆరోజు హెడ్‌వెయిటర్ ఆ పాకెట్ ఇచ్చాడు. అతను లోపలే వుంటాడు. కాబట్టి పాకెట్ తెచ్చిన వ్యక్తి నేరుగా లోపలికొచ్చి హెడ్‌వెయిటర్‌కి ఇచ్చయినా వుండాలి. లేదా బయట దర్వాన్‌కిస్తే, అతను హెడ్‌వెయిటర్ కిచ్చి తనకిమ్మని చెప్పయినా వుండాలి. ఇప్పుడు

హెడ్ వెయిటర్ లేడు కాబట్టి దర్వాన్ని అడిగిచూడాలి" గబగబా భోజనం ముగించి, బిల్ పే చేసి బయటకి నడిచాడు కరుణ్. దర్వాన్ తలుపుతీసి రోజూ కరుణ్‌ని చూస్తుంటాడు కాబట్టి పలకరింపుగా చిన్నగా నవ్వాడు కరుణ్ కూడా నవ్వాడు.

"చిన్న ఇన్ఫర్మేషన్ కావాలి...." దర్వాన్‌నే చూస్తూ అన్నాడు.

"చెప్పండి సార్" అన్నాడతను వినయంగా.

"మూడు రోజుల క్రితం రాత్రి తొమ్మిదింటికి నాకో పార్శిల్ వచ్చింది. దాన్ని హెడ్‌వెయిటర్ నాకందించాడు. అది పంపించిన వ్యక్తి ఎవరో తెలుసుకుందామంటే హెడ్‌వెయిటర్ ఈ మధ్య రావటం లేదని తెలిసింది. నీకేమయినా తెలుసేమోనని...."

"ఓ అదా! అది నేనే హెడ్‌వెయిటర్‌కి ఇచ్చాను సార్."

"అంటే ఆ పార్శిల్ తీసుకొచ్చిన వ్యక్తి ముందుగా నీకిచ్చాడా?"

"అవును సార్! ఈ పార్శిల్ లాయర్ కరుణ్‌గారికి ఇవ్వాలి. అని నాకిస్తే, నేను దాన్ని హెడ్‌వెయిటర్‌కి ఇచ్చాను. అతనది మీకు అందించాడు."

"ఆ వ్యక్తి ఎలా వున్నాడు?"

"వ్యక్తి కాదు సార్! చిన్న కుర్రాడు."

"కుర్రాడా?'

"ఎస్ సార్!"

"ఎంతుంటుంది ఆ కుర్రాడి వయసు?"

"ఇంచుమించు పదమూడు, పధ్నాలుగు వుంటుంది.

"పోలికలేమైనా చెప్పగలవా?"

"సన్నగా, నల్లగా వున్నాడు సార్! నాలుగున్నర అడుగుల ఎత్తు వుంటాడు?"

"ఇంకా...."

"రింగుల జుత్తు...."

"అంతేనా? కొట్టిచ్చినట్టు కనిపించే గుర్తులేమైనా ఉన్నాయా? బాగా గుర్తుకు తెచ్చుకుని చెప్పు...."

"యా... ఆ కుర్రాడికి గ్రహణం మొర్రి వుంది సార్. మాట్లాడేటప్పుడు నత్తిగా, పదాలు సరిగా పలకలేకపోతున్నాడు. అంతకంటే ఇంకే ప్రత్యేకమైన గుర్తులూ లేవు" చెప్పాడతను.

"థాంక్యూ" అంటూ తన కారు దగ్గరికి నడిచాడు కరుణ్.

డోర్ ఓపెన్‌చేసి లోపల కూర్చుని స్టార్టుచేసి ముందుకురికించాడు కారుని.

ఏం చేయాలో తోచలేదతనికి.

తిన్నగా రాయ్ ఆఫీసుకీ వెళ్ళాడు.

అతనక్కడికి వెళ్ళేటప్పటికి రాయ్ ఏదో ఫైల్ క్షుణ్ణంగా చదవసాగాడు.

అలికిడికి తలెత్తి కరుణ్‌ని చూసి-

"రండి కరుణ్‌జీ! ఎనీ ప్రోగ్రెస్ ఇన్ యువర్ కేస్?" అడిగాడు రాయ్.

"నథింగ్ రాయ్! హెడ్ వెయిటర్ మూడురోజుల క్రితం నుంచీ... అంటే నాకతను పేకెట్ అందించిన మరునాటి నుంచీ హోటల్‌కి రావటం లేదట"

"ఓహ్! బేడ్‌లక్!"

"కానీ నడి సముద్రంలో మునిగిపోయిన వాడికి ఆ సమయంలో, గడ్డిపోచే పెద్ద ఆధారమయినట్టు, లింకులు తెగిపోతున్న ఈ కేసులో ఓ చిన్న ఆధారం దొరికింది."

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాడు రాయ్.

"నాకారోజు పాకెట్ అందించినది ఓ పధ్నాలుగేళ్ళ కుర్రాడు" చెప్పాడు కరుణ్.

"ఎలా తెలిసింది మీకా సంగతి?"

"హోటల్ డిలైట్ దర్వాన్ ద్వారా అతనికే ముందు ఆ పాకెట్ అందించబడి, హెడ్‌వెయిటర్ ద్వారా నాకు చేరింది."

"ఇదీ బో ఆధారమేనా! ఇంత పెద్ద సిటీలో పధ్నాలుగేళ్ళ కుర్రాళ్ళు ఎంతమందుంటారో, ఎబరినవి గుర్తుపట్టగలం?"

"ఉంది రాయ్! గుర్తుపట్టడానికి చిన్న ఆధారం వుంది... ఆ కుర్రాడికి గ్రహణం మొర్రి"

"ఐ మీన్ మిసెల్స్" (గ్రహణం మొర్రి)

కరుణ్ మౌనంగా తలూపాడు.

"మళ్ళీ పేపర్‌లో పీటర్ బిల్డింగ్ బ్లాస్టయిన విషయంకానీ, దర్యాప్తు ఎంతవరకూ వచ్చిందన్న సంగతికానీ కనిపించలేదు. అదీ మన పోలీసు శాఖ పనితీరు. బహుశా ఆ విషయం మరిచిపోయుంటారు" వ్యంగ్యంగా అన్నాడు రాయ్.

"వాళ్ళవల్ల కాకపోతే ఇదే సక్సలైట్ల పనో అని చేతులు దులిపేసుకుని, కేసు క్లోజ్ చేసేసినా ఆశ్చర్యం పోనక్కరలేదు...." చెప్పాడు కరుణ్.

అవునన్నట్లు తలూపాడు రాయ్.

ఇంతలో బోయ్ కాఫీలు తెచ్చాడు!

"నాకొద్దు రాయ్! నేనిప్పుడే లంచ్ తీసుకొని వస్తున్నాను" కరుణ్ చెప్పాడు.

"అప్పుడే లంచ్ అయిపోయిందా?" ఇంకా బన్నోక్లాక్ కూడా కాలేదు!"

"హెడ్ వెయిటర్‌ని ఎంక్వయిరీ చేద్దామని కాస్త ముందుగా వెళ్ళాను.

"అచ్చా...."

"ఓకే రాయ్‌సాబ్! మీరు బిజీగా వున్నట్టున్నారు. నేను మళ్ళీ కలుస్తాను" అంటూ బయటకొచ్చాడు కరుణ్.

✧ ✧ ✧ ✧ ✧ ✧

సమయం అర్ధరాత్రి పన్నెండు గంటలు!

చీకటి నల్లటి కాటుకలా అంతటా ఆవరించి వుంది.

ఆ నీరవ నిశీధిలో ఓ ఎర్రటి కారువచ్చి కరుణ్ ఇంటి ముందు ఆగింది.

కారు ఆగిన తరువాత... దాని హెడ్‌లైట్లు ఆరిపోయాయి.

అందులోంచి ఇద్దరు వ్యక్తులు దిగారు.

మొహాలు గుర్తుపట్ట కూడదన్నట్టు మాస్కులు ధరించి వున్నారు వాళ్ళు.

నల్లటి దుస్తుల్లో, ఎత్తుగా – బలంగా వున్న వాళ్ళిద్దరూ నిశ్శబ్దంగా గేటు తెరిచి ముందుకెళ్ళి ముఖద్వారం దగ్గరున్న కాలింగ్ బెల్ మ్రోగించారు.

నిద్రలో వున్న కరుణ్‌కి కాలింగ్ బెల్ మోత వినిపించలేనట్లుంది.

చాలాసేపటి వరకూ తలుపు తీయబడలేదు.

అయినా వాళ్ళిద్దరూ ఓర్పుగా నిల్చుని కాలింగ్‌బెల్ మోగిస్తూనే వున్నారు.

కొద్దిసేపటి తరువాత కరుణ్ ఇంట్లో లైట్ వెలిగింది. తరువాత తలుపు తెరుచుకుంది.

అంతే...

ఒక్కసారిగా మాస్క్ వ్యక్తులిద్దరూ లోపలికి జొరబడి తలుపు మూసేశారు.

"ఎవరు మీరు? ఏం కావాలి?" వాళ్ళ ఆకారాలు చూడగానే నిద్రమత్తు వదిలిపోయిన కరుణ్ గట్టిగా అరిచాడు.

"అరవకు యంగ్ లాయర్!" ఇద్దరిలో ఓ వ్యక్తి అన్నాడు.

"నువ్వు మా గురించి చేస్తున్న ఎంక్వయిరీ మర్యాదగా ఆపెయ్! లేకపోతే నీ ప్రాణాలకే ప్రమాదం" రెండో వ్యక్తి హెచ్చరించాడు.

"అయితే యువతకి మత్తు పదార్థాలమ్మి వాళ్ళనీ వాళ్ళ జీవితాల్ని నాశనం చేయడానికి కంకణం కట్టుకున్న రాక్షసులు మీరేనన్నమాట" ఆవేశంగా అన్నాడు కరుణ్.

"యస్! నువ్వు లాయర్‌వి. చోటా, మోటా కేసులు వాదించుకుని బ్రతుకు. మాలాంటివాళ్ళతో పెట్టుకుంటే నీ శవంకూడా మిగలదు."

"బెదిరిస్తున్నారా?"

"హెచ్చరిస్తున్నాం, జీవితంలో ఎన్నో చూడవలసిన వాడిని, మరీ ఇంత చిన్న వయస్సులోనే పైకెళ్ళిపోదామనుకోకు. పూలిష్‌గా ప్రవర్తించి ప్రాణాల మీదికి తెచ్చుకోకు"

"హు! ప్రాణాలంటే భయం మీకురా! అందుకే అర్ధరాత్రి వచ్చి మొహాలు గుర్తుపట్టకుండా మాస్కులు తొడుక్కుని ప్రగల్బాలు పలుకుతున్నారు"

"అవన్నీ అనవసరం. నువ్వు ఇకమీదట ఈ కేసుకు సంబంధించి ఒక్కడుగు కూడా ముందుకు వేయకూడదు. లేదా?"

"ఏం చేస్తారు?"

"మా దారికి అడ్డం వచ్చిన వాళ్ళని ఎలా హతమార్చామో నిన్ను అలాగే చేస్తాం."

"ఎవడడ్డం వచ్చినా, మరిన్ని అవరోధాలు ఎదురయినా నేను అనుకున్న పనిచేసి తీరతాను" పట్టుదలగా అన్నాడు కరుణ్.

మాస్క్ వ్యక్తులిద్దరూ అతన్నో వెర్రివాడిలా చూసి తరువాత ఒకరివంక ఒకరు చూసుకుని ఏదో సైగ చేసుకున్నారు.

అంతే–

ఇద్దరిలో ఒకడు అమాంతం కరుణ్ మీదపడి అతన్ని కదలకుండా బంధించాడు.

రెండోవాడు క్లోరోఫాంలో తడిచిన కర్చీఫ్‌ని అతని ముక్కు దగ్గర వుంచాడు.

ఒకటి... రెండు... మూడు... నాలుగు... అయిదు... ఆరు....

అలా గింజుకుంటూనే ఏభై సెకన్ల వరకూ గాలి పీల్చుకోకుండా వాళ్ళ పట్టునుంచి విడిపించుకోడానికి ప్రయత్నించాడు.

కానీ చివరి గెలుపు వాళ్ళదే అయింది. ఒక్కసారిగా గిజగిజలాడిన కరుణ్ ఇక ఊపిరి తీసుకోవటం అనివార్యమై గాఢంగా శ్వాస పీల్చుకున్నాడు.

మరుక్షణం పవర్‌ఫుల్ క్లోరోఫాం మత్తుకి కుప్పకూలిపోయాడు.

"పూర్‌ఫెలో! చివరి వరకూ ప్రతిఘటించి ఓడిపోయాడు." అన్నాడు వాళ్ళలో ఒకడు.

"వీడిని మర్డర్ నెంబర్ ఫోర్ ప్రకారం పైకి పంపటమే ఇక మిగిలింది" రెండోవాడు అన్నాడు.

"అవును! పద"

ఇద్దరూ కలసి కరుణ్‌ని మోసుకుంటూ కారు వెనక సీట్లో పడుకోబెట్టారు. వాళ్ళు ముందు సీట్లో కూర్చుని, కారుని స్టార్ట్‌చేసి, హెడ్‌లైట్లు వేయ కుండానే ముందుకు పరిగెత్తించారు.

సరిగ్గా ఇరవై నిమిషాలు వాళ్ళు కారు ఆ నిశీదిలో అరవై కిలో మీటర్లో స్పీడులో ప్రయాణించి ఒక దగ్గరాగింది.

ఇద్దరూ కరుణ్‌ని మోసుకుని దగ్గర్లోనే ఉన్న రైల్వేట్రాక్ మీద అతన్ని అడ్డంగా పడుకోబెట్టారు.

"దురదృష్టవంతుడు అనవసరమైన తెగువ ప్రదర్శించాడు."

"అందుకే చావబోతున్నాడు. వీడు రైలు కింద నజ్జయిపోయాక, చూసిన వాళ్ళందరూ ఆత్మహత్యనుకుంటారు... అదిగో ఏదో ట్రైన్ వస్తున్నట్టుంది పద మనమా చెట్ల వెనక్కిపోయి దాక్కుందాం."

"ఎందుకు? పదా!"

"లేదు! ఈ బాస్టర్డ్ ముక్కలయిన శవాన్ని చూడాలని నాకు కోర్కెగా వుంది."

"ఓకే! నడవయితే...."

ఇద్దరూ వెళ్ళి ట్రాక్‌కి దగ్గరగా వున్న చెట్ల వెనక నక్కారు.

ఏదో గూడ్స్ ట్రైన్ లాగుంది ఆ నిశ్శబ్దంలో భయంకరంగా శబ్దంచేస్తూ పెనుభూతంలా వస్తోంది.

మాస్క్ వ్యక్తులిద్దరూ గుడ్లప్పగించి ట్రాక్ వంకే చూస్తున్నారు. కరుణ్ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. తనకతి సమీపంలోకి వచ్చేస్తున్న మృత్యువు సంగతి తెలియదతనికి. ట్రైన్ మరింత దగ్గరయింది.

ట్రైన్ వేగానికి భూమి అదరసాగింది.

వాళ్ళిద్దరూ ట్రైన్‌వంకా, కరుణ్ వంకా చూస్తున్నారు...

"వచ్చేసింది... వచ్చేసింది...." ఇద్దరిలో ఒకడు గుసగుసగా అన్నాడు.

"ధడ్, ధడ్! ధడ్! ధడ్!" ట్రైన్ కరుణ్ మీదుగా వెళ్ళిపోయింది.

అతని మొండెం ట్రాక్ మీదే నుజ్జయిపోయింది. తల మాత్రం ట్రైన్ వేగానికి తెగి, మాస్క్ వ్యక్తుల కాళ్ళ దగ్గరికొచ్చి పడింది.

"హ హ్యా హ్యా హ్యా... రాస్కెల్ కిక్కురుమనకుండా చచ్చాడు" అంటూ కరుణ్ తలని తన ఎడమ కాలితో తన్నాడు ఒకడు.

అది దొర్లుకుంటూ బంతిలా తుళ్ళిపోయింది.

"కెవ్వ్!" మని అరచిన కూతురు అరుపుతో ఆమె గదిలోకి వెళ్ళారు ఆనందరావు, జయలు.

"ఏమైందమ్మా.... ఎందుకలా అరిచావ్?" అడిగాడు ఆనందరావుగారు.

"భయంకరమైన కలొచ్చింది డాడీ!" వళ్ళంతా స్వేదంతో తడిసి పోయిన మంజుల తల్లి జయ.

"అది... అది...."

"చెప్పమ్మా!" అనునయంగా అన్నారు ఆనందరావుగారు.

"నేను రోడ్డు మీద వెళుతుంటే వేగంగా వస్తున్న లారీ ఢీకొన్నట్టు కలొచ్చింది" అసలు విషయం చెప్పలేదు ఆమె.

తల్లి తండ్రులకామె కరుణ్‌ని ప్రేమిస్తున్నట్టు తెలియదు.

"తెల్లవారి ఝామునొచ్చే కలలు నిజమవుతాయట! ఎందుకయినా మంచిది అమ్మాయికి ఏ తాయెత్తయినా కట్టించరా" అంతా విన్న అనందరావుగారి తల్లి కమలమ్మ అంది.

ఆ మాటకి మంజుల తల తిప్పి వాచ్‌వంక చూసింది. సమయం అప్పుడు ఉదయం నాలుగు గంటలు అయింది.

"అంటే... తన కరుణ్‌కి నిజంగా ప్రమాదం జరుగనుందా?" మంజుల ఆ ఆలోచనకే వణికిపోయింది.

"నువ్వు మరీనమ్మా! లేనిపోనీ శంకలతో బెదరగొడతావ్?" చూడు నీ మాటలకి మంజులెలా వణికిపోతుందో" అసలు విషయం తెలియని ఆనందరావుగారు తల్లిని విసుక్కున్నారు.

"అత్తయ్యగారి మీద విసుక్కుంటారేం? వారు చెప్పిందీ నిజమే. అమ్మాయికి తాయెత్తేదయినా కట్టిద్దాం."

"అలా బుద్ధి చెప్పమ్మా!" అంటూ అక్కడి నుంచి నడిచింది ఆనందరావుగారి తల్లి.

"అబ్బా! నువ్వూ అదే పాట పాడుతున్నావే. మంజుల! నీకేం కాదమ్మా. అవన్నీ వట్టి మూఢనమ్మకాలు. రెస్ట్ తీసుకో" అంటూ తమ గదిలోకి నడిచారు ఆనందరావుగారు. కూతురి తల నిమిరి భర్త వెనకే నడిచింది ఆమె తల్లి.

లైటార్పి పడుకుంది మంజుల, ఆలోచనల్లో ఎప్పటికో నిద్రపట్టిందామెకి.

✧ ✧ ✧ ✧ ✧ ✧

రాత్రి కలత నిద్రవల్ల ఉదయం ఆలశ్యంగా లేచింది మంజుల. టైం చూస్తే అప్పటికే ఎనిమిదయిపోయింది. తనని తానే తిట్టుకుంది ఆమె. ఆలశ్యంగా లేచినందుకు.

గబగబా బ్రష్ చేసి, స్నానం కానిచ్చి–

"అమ్మా నేను మా ఫ్రెండ్ ఇంటికెళ్ళి వస్తాను...." అంటూ చెప్పులు తొడుక్కుంది.

"జాగ్రత్తమ్మా! రాత్రి పాడుకలొకటి కన్నావ్..." వెనక నుంచి అరిచింది ఆమె నానమ్మ.

"టిఫిన్ తినెళ్ళు మంజూ...." అంది ఆమె తల్లి.

"వెంటనే వచ్చేస్తాగా" ఆదరా బాదరాగా బయటపడి, దొరికిన ఆటో ఎక్కి కరుణ్ ఇంటికి చేరుకుంది.

కరుణ్ వున్నట్టు పోర్టికోలో అతని మారుతీ జెన్ కనిపించింది. "హమ్మయ్యా! ఇంట్లోనే వున్నట్టున్నాడు" అనుకుని కాలింగ్ బెల్ మోగించింది. ఎంతసేపు బెల్ కొట్టినా తలుపు తీయలేదు కరుణ్.

"ఏమయింది? ఇంతసేపు బెల్ మ్రోగించినా తలుపు తియ్యడేం?" విసుగూ, భయం, కోపం ఒక్కసారిగా కలిగాయామెకి.

"కొంపతీసి తన కల నిజమవలేదు కదా! నానమ్మా, అమ్మా తెల్లవారు ఝామున వచ్చే కలలు నిజమవుతాయన్నారు...." ఆందోళనగా అనుకుందామె మరి కాస్సేపు ప్రయత్నించి... ఏం చేయాలో తోచక వెనుదిరిగింది. అప్పుడు గుర్తుకొచ్చాడామెకి డిటెక్టివ్ రాయ్!

వెంటనే దగ్గరలోనేవున్న టెలిఫోన్ బూత్‌లోకి నడిచి, డైరెక్టరీలో రాయ్ డిటెక్టివ్ ఏజెన్సీ నెంబర్ చూసి ఫోన్ చేసింది.

"హలో రాయ్ స్పీకింగ్" అవతలి నుంచి వినిపించింది.

"రాయ్‌గారూ! నేను మంజులని. అదే కరుణ్‌గారి ఫ్రెండ్‌ని...."

"అచ్చా మీరా? ఏమిటి బిషయం?"

"కరుణ్ గారూ...."

"ఆc... ఇక్కడే వున్నారు, ఇమ్మంటారా ఆయనకి ఫోన్... ఆమె మాట పూర్తవక ముందే అన్నాడు రాయ్.

"అక్కడే వున్నారా? ఇవ్వండి...." ఆమె టెన్షనంతా ఆ మాటకి దిగిపోయి రిలీఫ్ ఫీలయింది.

"హలో...." కరుణ్ గొంతు వినిపించింది ఫోన్లో.

"కరుణ్! మంజులని."

"ఏమిటి సంగతి?" ఎక్కడి నుంచి మాట్లాడుతున్నావ్... ఇంటి నుంచా?"

"కాదు. పబ్లిక్ ఫోన్ బూత్ నుంచి."

"అదేం?"

"మీ ఇంటికి వచ్చాను. కారుంది కదాని కాలింగ్‌బెల్ కొట్టాను. ఎంతకీ తలుపు తియ్యలేదేమిటాని... భయమేసి రాయ్‌గారికి ఫోన్‌చేస్తే. నువ్వక్కడే వున్నావని అన్నారు."

"అవును! కారు ఇంజన్ ట్రబులిస్తోంది. అందుకే కొంచెం పనుండి ఆటోలో రాయ్‌గారి ఆఫీసుకి వచ్చాను."

"కరుణ్! అక్కడే ఉండు వస్తాను. నీతో అర్జంటుగా మాట్లాడాలి."

"ఏమిటది?"

"కలిశాక చెబుతాను...." తననే పట్టిపట్టి చూస్తున్న ఎటెండెంట్ ముందు తనకి రాత్రి కలొచ్చిన విషయం చెప్పలేక ఫోన్ పెట్టేసి డైరెక్టరీలో ఉన్న రాయ్ అడ్రస్‌ని నోట్‌చేసుకుని, ఫోన్ బిల్ చెల్లించి ఆటోలో అక్కడికి చేరుకుంది. ఆమె కోసమే వెయిట్ చేస్తున్నట్టు బయటే నిల్చుని వున్నాడు కరుణ్.

అతనిని చూశాకగానీ మంజుల మనస్సు కుదుటపడలేదు. ఆమె ఆటో దిగి ఫేర్ చెల్లించబోతుంటే–

"ఆగు! పెద్దవాల్తేరు వెళ్ళాలి...." అంటూ అదే ఆటోలో ఆమెతో పాటు బయల్దేరాడతను. ఆటో మెల్లగా వెళ్ళసాగింది.

"ఏమిటి నాతో అర్జంటుగా మాట్లాడాలన్నావ్?" అన్నాడు కరుణ్.

"ఇక్కడ కాదు. ఏకాంతంగా మాట్లాడాలి" అతనికే వినబడేట్టు అందామె.

"అంత సీక్రెటా?" చిలిపిగా అన్నాడతను.

మంజుల మౌనంగా వుండిపోయింది. ఆటో సరిగ్గా పెదవాల్తేరులోని కరుణ్ ఇంతకుముందు వచ్చి ఎంక్వయిరీ చేసిన ఐస్‌క్రీం పార్లర్ చేరుకోగానే–

"ఇక్కడాపు!" అంటూ దిగాడు. వెనకే మంజుల దిగింది. ఆటో ఫేరి చెల్లించి పార్లర్‌లోకి నడిచాడు కరుణ్. 'ఐస్‌క్రీం పార్లర్లో ఇతని కేం పని?' అనుకుంటూ కరుణ్‌నే అనుసరించింది మంజుల. పార్లర్‌లో ఇంతకుముందుండే యువకుడి స్థానంలోనే ఓ మధ్యవయస్కుడు వున్నాడు. కరుణ్ రెండు ఐస్‌క్రీం కప్పులు తీసుకుని–

"ఇక్కడో యువకుండాలి రాలేదా?" అనడిగాడు.

"వాడా? మా అబ్బాయే సార్! విజయవాడ వెళ్ళాడు పనిమీద" చెప్పాడతను.

"ఊc... నీ సంగతేమిటి?" మంజులని అడిగాడు కరుణ్.

"ఇక్కడ కాదు... తర్వాత చెబుతాను...." పార్లర్లో జనాల్ని చూస్తూ అందామె.

"అబ్బా! నీ సస్పెన్స్‌తో చంపుతున్నావ్? ఏమిటో చెప్పా...."

"ఏహందీ... చెహెంబిహ్వార్హా..." అన్న మాటలకి మంజులతో మాట్లాడుతున్న కరుణ్ వెనుదిరిగి చూశాడు.

సన్నగా, నల్లగా వున్న ఓ పద్నాలుగేళ్ళ కుర్రాడు కౌంటర్‌లోని వ్యక్తిని వంద రూపాయలకి చిల్లరడుగుతున్నాడు. నొక్కుల జుత్తు... అంతేకాదు– ఆ కుర్రాడికి గ్రహణం మొర్రి కూడా వుంది.

కరుణ్ ఒక్క ఉదుటన లేచి నించున్నాడు. "హోటల్ డిలైట్, దర్వాన్ చెప్పిన కుర్రాడి పోలికలన్నీ ఇతనిలో వున్నాయి...."

"ఎక్కడికి కరుణ్? ఐస్‌క్రీం పూర్తిగా తినకుండా లేస్తావేం?" అడిగింది మంజుల.

"బహుశా నా కేసుకు సంబంధించిన అతి ముఖ్యమైన పర్సన్ ఆ కుర్రాడనినా నమ్మకం" మంజులతో చెప్పి వెళ్ళబోయాడు కరుణ్, కాఫీ కౌంటర్లో అతను చిల్లర్లేదని చెప్పటంతో అప్పటికే ఆ కుర్రాడు వెళ్ళిపోతున్నాడు.

"నో! నువ్వెళ్ళటానికి వీల్లేదు. నిన్ను నేను పోగొట్టుకోలేను....." ఉన్మాదిలా అరచింది మంజుల. పార్లర్లో అందరూ వాళ్ళవంకే చూశారొకసారి. మంజుల సర్దుకుని.

"ప్లీజ్ కరుణ్! నా మాట విను. ఇక నువ్వా కేసుని వదిలెయ్. ఆమె మాటలు వినిపించుకోనట్లు కరుణ్ పరుగులాంటి నడకతో పార్లర్‌లోంచి బయటపడ్డాడు. ఎక్కడా ఆ కుర్రాడి జాడ కనిపించలేదు. ప్రతిషాపు, ప్రతి సందూ వెదికాడు. అయినా ప్రయోజనం లేకపోయింది.

"షిట్!" చిరాగ్గా అనుకుని తిరిగి పార్లర్‌కి వచ్చాడు. మంజుల అతని కోసమే ఎదురుచూస్తోంది.

"మంజూ! నువ్వెంత పిచ్చిపని చేశావో తెలుసా? కేసు ముందుకు సాగటానికి నాకు మిగిలిన ఒకే ఒక్క అవకాశమైన ఆ కుర్రాడిని పట్టుకోలేకుండా అవరోధం కల్పించావ్."

"కరుణ్! ఇక్కడికి బీచ్ దగ్గరే కదా! అక్కడికెళదాం. నీకో సంగతి చెప్పాలన్నాను కదా! అక్కడ చెబుతాను...." సీరియస్‌గా అంది మంజుల.

కరుణ్ బిల్లు చెల్లించి ఆటో పిలిచి అసహనంగా కూర్చున్నాడు. మంజుల అతనికి అనుకుని కూర్చుంది. ఆటో రివ్వున బీచ్‌వైపు సాగిపోయింది.

✳ ✳ ✳ ✳ ✳ ✳

"చెప్పు! ఏమిటది?" ఇసుకలో చితికిలబడి అన్నాడు కరుణ్. సమయం ఉదయం పదిన్నర, పదకొండు గంటలవటం. మూలాన బీచ్‌లో ఎవరూ లేరు. దూరంగా జాలర్లు వలల్లో పడిన చేపల్ని ఒడ్డునుంచి లాగుతున్నారు.

"కరుణ్! నాకు రాత్రి ఓ భయంకరమైన కలొచ్చింది ఎవరో ఇద్దరు ముసుగు వ్యక్తులు నీకు మత్తుమందిచ్చి, నిన్ను రైల్వే ట్రాక్‌మీద పడేస్తే, ఆ రైలు...." ఇక చెప్పలేనట్లు ఆగిపోయిందామె.

"ఆఁ... ఆ రైలు" ఆమె వంకే చూస్తూ అన్నాడు కరుణ్.

"నేను చెప్పలేను కరుణ్! ఆ భయంకరమైన కలని నేను నా నోటితో చెప్పలేను...." కన్నీరు చెక్కిలి మీదకి జాలువారగా గద్గదంగా అందామె.

"మై స్వీట్‌హార్ట్! నా మీద నీకెంత ప్రేమ! రియల్లీ ఐయామెలక్కీ ఫెలో, నీలాంటి ప్రేమికురాలినే కోరుకుంటారు ఎవరయినా, కానీ ఒక్క విషయం. నువ్వంత బెంబేలు పడక్కర్లేదు. అది కేవలం కల."

"కలే! కానీ... అది తెల్లవారుఝామున వచ్చిన కల."

"అయితే?"

"ఆ సమయంలో వచ్చిన కలలు నిజమవుతాయట...."

"ఎవరు చెప్పారు?"

"మా నానమ్మ, అమ్మా."

"పిచ్చి మంజూ! నువ్వు, నేను కేసు వాదిస్తున్నానని చెప్పిన వాటి నుంచీ నెగటివ్ థింకింగ్ ఏర్పరచుకున్నావ్. దాంతో అదే నీ మెదడులో రికార్డయిపోయి అలాంటి కలలు వచ్చాయి. అంతే! పురాణకాలం కాదిది. మనం కనే కలల కేమాత్రం ప్రాముఖ్యం ఇవ్వక్కర్లేదని కలలమీద పరిశోధనలు చేసిన ఎందరో శాస్త్రవేతలు చెప్పారు. మనం మన మనసులో ఏర్పరచుకున్న భావాలే నిద్రలో మనకు సజీవరూపాలై దర్శనమిస్తాయట. అలాగే నీకూ ఆ కలొచ్చింది" తేలిగ్గా అన్నాడు అతను.

"నువ్వెన్ని చెప్పినా నాకు ధైర్యం చిక్కటంలేదు కరుణ్, నా కోసం ఆ కేసుని వదులుకో" బ్రతిమాలుతున్నట్లుగా అందామె.

"చూడు మంజూ! నేనో ప్రొఫెషన్‌లో లాయర్‌నే కావచ్చు. డబ్బు కోసమే నేను ఈ పని చేయవచ్చు. అయినా కమిట్ అయిన తరువాత అడీ నిస్సహాయస్థితిలో వున్న ఓ స్త్రీ నాకు అప్పగించిన కేసుని ఎలా మధ్యలోనే వదిలేయమంటావ్?"

మంజుల సమాధానమేం చెప్పలేదు. కాస్సేపు ఇద్దరిమధ్యా మౌనం హోరుమంటూ సముద్రుడు కరుణ్, మంజులని చైతన్యవంతుల్ని చేయాలన్నట్లు నిర్విరామంగా ఘోషిస్తున్నాడు.

"అయితే నీకు నా మాటకంటే ఆ కేసే ఎక్కువన్నమాట" చాలా సేపటి తర్వాత అంది మంజుల.

"నీకంటే నాకెవరూ ఎక్కువకాదు మంజూ! అయితే వర్క్ ఈస్ వర్ షిప్" అనే సిద్ధాంతం నాది. నా వృత్తిలో నాకు దైవం గోచరిస్తాడు. ఆ దైవాన్ని ఎలా వదులుకోగలను?"

"కానీ కరుణ్ నువ్వు ప్రమాదాల అంచుల్లోకి వెళుతున్నానని నా అనుమానం."

"అనుమానం... అంతే కదా! సరే అయితే ఓ విషయం."

"ఏమిటది?"

"నేనీ కేసు గురించిన సాక్ష్యాధారాలు సంపాదించడానికి ప్రయత్నిస్తూనే వుంటాను. నువ్వు చెప్పినట్లు నా మీదెవరయినా దాడులకు పూనుకున్నా, ఈ కేసును నువ్వు వదిలేసుకోకపోతే చంపుతామని బెదిరించినా ఆ మరుక్షణమే నేనీ కేసునుంచి విత్‌డ్రా అయిపోతాను."

"సరే!" అయిష్టంగా అందామె.

"దాడులు జరిగేవరకూ, బెదిరింపులు వచ్చేవరకూ ఎందుకు? ముందే విత్‌డ్రా అయిపోవచ్చు కదా!" అనుకుంది మనసులో.

"హమ్మయ్య! ఎలాగో మంజు గోల ఆపించాను. ఇకమీదట ఆమెకి తెలియకుండా ముందుకు సాగాలి' అనుకున్నాడతను.

"కారెందుకు ట్రబులిచ్చింది?" అడిగింది మంజుల.

"క్లచెస్ పోయాయి. ఇంజన్ కూడా ట్రబులిస్తోంది."

"కారు ఉండటం చూసి నువ్వింట్లోనే వున్నావనుకున్నాను."

"డోర్స్ లాక్‌చేసే ఉన్నాయే. అలా ఎలా అనుకున్నావ్?"

"డోర్స్ లాక్ వుంటుందన్న సంగతి ఆ గాబరాలో తట్టలేదు నాకు."

"పిచ్చి మంజూ...!" అన్నాడతను ఆమె భుజంమీద చెయ్యివేసి.

"ఊఁ! ఏమిటది పబ్లిక్ ప్లేస్‌లో?" అతని చేతుల్ని తీసేస్తూ అందామె.

"ఓహ్!" అంటూ బుద్ధిమంతుడిలా కూర్చున్నాడతను.

అప్పుడు ఆకలి తెలిసిందామెకి.

"ఇక వెళదాం కరుణ్" అందామె.

"ఏం? మరికాస్సేపు కూర్చుందాం."

"నేను ఉదయం టిఫిన్ కూడా తినలేదు."

"ఎందుకని?"

"ఆ పిచ్చి కలతో సరిగ్గా నిద్ర పట్టలేదు రాత్రి. లేచీలేవగానే తయారయి నీ దగ్గరకు ఉరుకులు పరుగులతో వచ్చేశాను."

ఆ మాటలతో ఆమెవైపు ప్రేమగా చూసి–

"అయితే పద! ఏదయినా రెస్టారెంట్‌కి వెళదాం" అన్నాడతను.

"కాదు! ఇంటికి వెళతాను. అమ్మకి వెంటనే వచ్చేస్తానని చెప్పి వచ్చాను."

"సరే! నిన్ను మీ ఇంటి దగ్గర దింపుతాను" అంటూ లేచాడతను.

ఇద్దరూ రోడ్డుమీదకు నడిచి ఓ ఆటో క్యాచ్ చేశారు.

⁜ ⁜ ⁜ ⁜ ⁜ ⁜

"ఇదిగో సార్ రిపోర్ట్!" రాయ్ టేబిల్‌మీద కొన్ని పేపర్లుపెట్టి అతనికి ఎదురుగా కూర్చున్నాడు ఏజెంట్.

ఓసారి అవి చదివి–

"గుడ్! అయితే అమ్మాయి నడబడిక మంచిదేనన్నమాట. నిన్న బచ్చి కేసప్పగించిన యుబకుడొస్తే అది రిపోర్ట్స్‌చేసి థౌజండ్ రూపీస్ ఫీజుతీసుకో!" అతనికిచెప్పి సీట్లోంచి లేచాడు రాయ్.

ఎదురుగా కరుణ్ కనిపించాడు.

"హాయ్ కరుణ్‌గారూ!" అంటూ నడిచి అతన్ని చేరుకున్నాడు.

"ఏమిటి కేసు, రిపోర్ట్సు అంటున్నాడు?" అడిగాడు కరుణ్.

"ఆఁ... నిన్నొక యువకుడు వచ్చాడు పెద్దవాళ్ళు, తనకి ఫలానా అమ్మాయితో పెళ్ళి జరిపించాలనుకుంటున్నారనీ... ఆమె ప్రబర్తనని ఎంక్వయిరీ చేసి మంచిదో కాదో చెప్పమన్నాడు... ఆ రిపోర్ట్స్."

"ఇటువంటి డిటెక్షన్ కూడా చేస్తారా మీరు?"

"ఎందుకు చేయం? ఈ రోజుల్లో అన్ని బిషయాల్లో ఎలా మనుష్యులు దిగజారిపోతున్నారో మా ఎంక్వయిరీలో చూస్తుంటే మతిపోతోంది"

కరుణ్ మౌనంగా వుండిపోయాడు.

"మీకెసెంతవరకూ వచ్చింది?"

"ఇంకా నా పట్టులోకి రాలేదు. త్వరలోనే వస్తుందని నమ్ముతున్నాను."

"గుడ్! ఈ కేసుతో మీ పేరు మారుమ్రోగాల!"

"థాంక్యూ!"

"నేను బయటకు వెళుతున్నాను. మీకేమీ పని లేకపోతే నాతోపాటు రాకూడదూ" అడిగాడు రాయ్.

"ఓ.కే!"

ఇద్దరూ రాయ్ కారులో కూర్చున్నారు.

"ఎలా వచ్చారు?" డ్రైవ్‌చేస్తూనే అడిగాడు రాయ్.

"ఆటోలో!"

"కారు రిపేరబలేదా?"

"ఈరోజు సాయంత్రం ఇస్తానన్నాడు మెకానిక్."

"మా అబసరం ఎమయినా వుందా?" అడిగాడు రాయ్.

"ప్రస్తుతానికి లేదు, కానీ ముందు ముందు వుండచ్చు." రాయ్ కారు బీచ్‌రోడ్డు నుంచీ ఈస్ట్ పాయింట్ కాలనీలోకి తిరుగుతుండగా–

"రాయ్ కారాపండి" ఒక్కసారిగా అన్నాడు కరుణ్.

"కీచు" మంటూ సడన్ బ్రేక్‌తో రాయ్ అంబాసిడర్ కారాగింది.

"మీరెళ్ళండి! నేను తరువాత కలుస్తాను" అంటూ కారు దిగిపోయాడు అతను.

"బాట్స్ ద మాటర్?" అడిగాడు రాయ్.

"రిటన్‌లో వచ్చి చెబుతాను" అంటూ హడావిడిగా నడిచాడతను.

రాయ్ కారు ముందుకు దూసుకుపోయింది.

కరుణ్ గబగబా నడుస్తూ తనకి కొంచెం దూరంలో నడుచుకుంటూ వెళుతున్న కుర్రాడిని చేరుకున్నాడు.

సన్నగా, నల్లగా, రింగుల జుత్తుతో వున్నాడా కుర్రాడు. గ్రహణం మొర్రివల్ల అతని ముక్కు, నోరు షేప్ లేకుండా వున్నాయి. ఈస్ట్ పాయింట్ కోలనీ నుంచి పెదవాల్తేరు వైపు తిరిగాడతను.

"ఈ కుర్రాడే... ఆ రోజు పార్లర్లో చిల్లర కోసం వచ్చినతను" అనుకుంటూ అతన్ని అనుసరిస్తూ పెదవాల్తేరులోని ఓ బిల్డింగ్‌లోనికి వెళ్ళిపోయాడా కుర్రాడు.

కరుణ్ కాస్త దూరంలో ఆగిపోయి ఆ బిల్డింగ్‌వైపు చూసాడు. పి. ప్రేమ్‌నాథ్, రియల్ ఎస్టేట్స్ అండ్ బిల్డర్స్ అన్న బోర్డు ఆ బిల్డింగ్ కుడివైపు రాసుంది.

పది నిముషాలు వెయిట్‌చేసి లోపలికి నడిచాడతను. సుమారు నలభై, నలభై అయిదేళ్ళున్న వ్యక్తి కరుణ్‌ని చూసి–

"ఎస్ ప్లీజ్?" అనడిగాడు.

"నాకు పెదవాల్తేరు, ఆ చుట్టుపక్కల ఇండివిడ్యువల్ త్రీ బెడ్‌రూం హౌసొకటి కావాలి" చెప్పాడు.

"ఇండివిడ్యువల్ హవుస్! త్రీ బెడ్‌రూమ్స్... ప్రస్తుతం లేవు. మీకు కావాలంటే అపార్ట్‌మెంట్స్‌లో వున్నాయి. పెదవాల్తేరు బస్టాప్‌కి దగ్గర్లోనే మేం నిర్మించిన "ఐశ్వర్యా" అపార్ట్‌మెంట్స్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఒకటి వుంది చూస్తారా?"

"అపార్ట్‌మెంట్స్ వద్దండీ."

"ఇండివిడ్యువల్ హౌస్ కావాలి. సరే... మా దగ్గరికి ఎవరయినా పార్టీస్ అమ్మిపెట్టమని వస్తే చెబుతాను.

"మీ బిల్డింగ్ క్యూట్‌గా బాగుంది. అలా అడక్కూడదనుకోండి... అయిన నాకిది నచ్చింది. దీన్నిమీరు...." చుట్టూ చూస్తూ అన్నాడు కరుణ్.

"అమ్మితే కొంటారా?" వెంటనే అడిగాడతను.

"ఎస్ అమ్ముతారా?"

"నా కయితే ఈ పాత బిల్డింగ్‌ని ఎప్పుడో అమ్మివేయాలనుంది. ఏందరి బిల్డింగ్‌లో అమ్మిపెట్టాను. కానీ నా బిల్డింగ్ అమ్ముకోలేకపోయాను. ఎవరికీ నచ్చలేదిది...." నవ్వుతూ అన్నాడతను.

"నేను కొంటాను...." అన్నాడు కరుణ్.

"సరే! అయితే చూస్తారా?" అడిగాడతను.

"వైనాట్!" లేచినిలబడ్డాడు కరుణ్.

అతను కరుణ్‌ని తీసుకుని ఒక్కోగదే చూపించసాగాడు.

"సార్! హనంషా అహిపోయింది... నేనెళ్ళిషోషాను" బిల్డింగ్ చూపిస్తున్న అతని దగ్గరకు వచ్చి చెప్పాడా గ్రహణం మొర్రి కుర్రాడు.

"ఓ. కే!" అన్నాడతను.

"అరే! ఆరోజు తనకి పాకెట్ యిచ్చింది అతనేనా, ఎవరు పంపించారో, తెలుసుకుందామంటే వెళ్ళిపోతున్నాడే. ముందుగా రోడ్డుమీద అడిగి వుండాల్సింది" తనని తానే తిట్టుకున్నాడు కరుణ్. ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు.

"ఇది బెడ్‌రూమ్... ఎదురుగా వుంది పూజామందిరం" అతను వివరిస్తుండగానే ఫోన్ మోగింది.

"మీరు చూస్తుండండి... నేను ఫోన్ కెంటెండయి వస్తాను" అంటూ బయటకు నడిచాడు.

కరుణ్ ఆలోచిస్తూ చుట్టూ చూశాడు. ఎదురుగా ఓ ఐరన్ సేఫ్ కన్పించింది. నుదురుకు పట్టిన చెమటని తుడుచుకుందామని కర్చీఫ్ తీశాడతను... దానితోపాటు ఓ కాగితం కిందబడింది. అది తనకి 'ఫేపోన్ బూత్‌లో దొరికిన హోటల్ డిలైల్ ఫోన్ నెంబర్ వున్న కాగితం. వెనక్కి తిప్పాడు కరుణ్, ఆ కాగితాన్ని 'O' 928272 నెంబర్‌లో ఢీకోడ్ చేశాడు... ఆశ్చర్యం!

"క్లిక్!" మన్న శబ్దంతో సేఫ్ ఓపెన్ అయింది. కానీ అదే సమయంలో బిల్డింగ్ ఓనర్ వస్తున్నట్టు బూట్ల శబ్దం వినిపించి– సేఫ్‌కున్న ఎలక్ట్రానిక్ స్విచ్చాన్‌చేసి కిటికీలోంచి బయటకి చూస్తూ నిల్చున్నాడు కరుణ్.

"అనుమానంలేదు. తన క్లయింట్ ఈ ఇంటికి సంబంధించిన మనిషే! దర్వాన్‌కి పాకెట్ అందించిన కుర్రాడు, ఈ కుర్రాడు ఒక్కడే ఆమె హోటల్ డిలైట్ ఫోన్ నెంబర్ రాసుకున్న కాగితం వెనక ఉన్న నెంబర్ ఈ ఇంట్లో సేఫ్‌దే! కనుక ఖచ్చితంగా ఆమె ఇక్కడి మనిషే.

"రండి!" అంటూ మిగిలిన గదులన్నీ చూపించాడతను. కానీ బిల్డింగ్ మొత్తంలో అతనో గదిని మాత్రం చూపించకపోవటం కరుణ్‌ని ఆశ్చర్యానికి గురిచేసింది. అయినా దాని గురించి అడగలేదు.

"ఎలా ఉంది? నచ్చిందా?" మీకు?" అడిగాడతను.

"బాగుంది. మా మిసెస్‌క్కూడా ఒకసారి చూపించాలి. ఇప్పుడే తీసుకొస్తాను" అన్నాడు కరుణ్.

"ఓ. కే!" అన్నాడతను.

"మీరు బ్యాచిలర్‌గా వుంటున్నారా? అతనింట్లో ఆడవాళ్ళెవరూ కనిపించకపోవడంతో అన్నాడుతను.

"లేదు! మా మిసెస్ ఊళ్ళోలేరు."

"ఇందాకటి కుర్రాడు మీ సర్వెంటా?"

"అవును!"

"అతనిల్లెక్కడా?"

"పెదవాల్తేరులోనే! కానీ కరెక్టుగా ఎక్కడోమాత్రం చెప్పలేను.

"ఏంలేదు. క్యాజువల్‌గా అడిగానంతే!"

"అయితే మీ మిసెస్‌ని తీసుకొస్తారా"

"తీసుకొస్తాను" అంటూ బయటకి నడిచాడు కరుణ్

"మళ్ళీ ఒకసారి అతనింట్లోకి వెళితే ఇంకా ఏమయినా ఆధారాలు దొరకవచ్చు. తనకి అజ్ఞాతంగా కేసప్పగించిన యువతి కాగితం వెనక రాసిన సేఫ్‌ని చూడగలిగితే మరింత సమాచారం లఅభించవచ్చు. అందుకే ఆమె సేఫ్ నెంబర్ కూడా రాసిందేమో?"

ఆలోచిస్తూనే ఫోన్‌బూత్ చేరుకుని మంజులకి ఫోన్ చేశాడు. లక్కీగా ఆమె ఫోనెత్తింది.

"హలో! నేను కరుణ్‌ని...."

"కరుణ్! ఏమిటి విషయం?"

నువ్వర్జంటుగా నిన్న మనం ఐస్‌క్రీం తిన్న పార్లర్ దగ్గరకు రాగలవా?"

"ఎందుకు?"

"నేను ఆ పార్లర్‌కి కొద్ది దూరంలోనే ఉన్న ఓ ఇల్లు కొంటానని ఆ బిల్డింగ్ ఓనర్‌తో ఓసారన్నాను. అతనిప్పుడు కొనుక్కోమని మొహమాట పెట్టేస్తున్నాడు. అయితే మా మిసెస్‌కి చూపించాలని ప్రస్తుతానికి దాటేశాను. నువ్వొచ్చి చూసి, మొహమాటం లేకుండా బిల్డింగ్ బాగోలేదని చెప్పెయ్! నేను సేవయిపోతాను, లేకపోతే నన్నతను వదిలేలాలేడు" కేసూ, ఎంక్వయిరీ అంటే మంజుల రాదనినోటికొచ్చినట్లు అబద్ధం చెప్పేశాడు అతను.

"అలాగే! వెంటనే బయల్దేరుతున్నాను."

"సరే వెయిట్ చేస్తాను" ఫోన్ పెట్టేసి, డబ్బులిచ్చి ఐస్‌క్రీం పార్లర్‌లోకి నడిచాడు కరుణ్.

"నమస్తేసార్!" అతనిని గుర్తుపట్టి అన్నాడు పార్లర్లోని యువకుడు.

"నిన్న వచ్చాను. లేవేమిటి?" అడిగారు కరుణ్.

"ఊరెళ్ళాను సార్!"

"ఆఁ... మీ ఫాదరనుకుంటా చెప్పారు."

"ఐస్‌క్రీం ఇమ్మంటారా సార్?"

"ఊఁ...."

ఓ కప్ క్వాలిటీ ఐస్‌క్రీం కరుణ్‌కిచ్చాడా యువకుడు.

"ఆ రోజు నువ్వు చూసినామె మళ్ళీ కన్పించిందా?" ఐస్‌క్రీం తింటూ అడిగాడు.

"లేదు సార్!"

"ఆరోజు ఆమె ఒకర్తే ఫోన్‌చేసి వెళ్ళిపోయిందా? లేకపోతే ఆమెతోపాటు ఎవరయినా... ఐమీన్ పదమూడు, పధ్నాలుగేళ్ళ కుర్రాడు కూడా వున్నాడా?"

"ఆమె ఒక్కర్తే ఫోన్‌చేసి వెళ్ళిపోయింది సార్!"

"అలాగా? ఐస్‌క్రీం అయిపోవటంతో ఖాళీ కప్‌ని పక్కనున్న డస్ట్‌బిన్‌లో పడేసి వాచీ చూసుకున్నాడు కరుణ్.

"మంజులకి తను ఫోన్‌చేసి అరగంటయిపోయింది. ఇంకా రాలేదేమిటి?" అసహనంగా కుర్చీలో కదిలాడతను. కాలం భారంగా గడుస్తున్నట్టుంది. మరొక పది నిముషాల అతని నిరీక్షణ అనంతరం ఆటోలోంచి దిగుతూ కనిపించింది మంజుల.

ఆమెని చూడగానే ఐస్‌క్రీం డబ్బులిచ్చేసి అక్కడికి చేరుకున్నాడు. కాళ్ళకి మట్టెలూ, మెడలో నల్లపూసలతో పెళ్ళయిన స్త్రీలా తయారై ఉందామె.

"సారీ కరుణ్! తొందరగానే వద్దామనుకున్నాను. అయితే సరిగ్గా అప్పుడే మా నాయనమ్మ 'గుండెదడగా ఉంది ఆస్పత్రికి తీసుకెళ్ళమా అంటూ వెంటపడింది. ఆమెని డాక్టర్‌కి చూపించి, మందులు కొనుక్కుని, ఇంటిదగ్గర దింపి వచ్చేసరికి లేటయిపోయింది."

"ఫర్వాలేదులే! పద వెళదాం" అంటూ ఆమెని తీసుకుని ప్రేమ్‌నాథ్ బిల్డింగ్ వైపు నడిచాడు.

వాళ్ళు వెళ్ళేసరికి తలుపులు మూసి ఉన్నాయి. కరుణ్ కాలింగ్ బెల్ మోగించాడు. ఏ విధమైన రెస్పాన్సూ రాలేదు, మళ్ళీ మోగించాడు లాభం లేకపోయింది.

"కరుణ్! చూడు...." తలుపు సందులోని చిన్న ఖాళీలోకి చూస్తూ అంది మంజుల.

కరుణ్ అటు చూసాడు. ఎవరో తలుపు దగ్గిర పడిపోయున్నారు. అతను వెంటనే తలుపుని బలంగా నెట్టాడు. ఖాళీ పెద్దదయింది. మళ్ళీ నెట్టాడు. మనిషి దూరగలిగేంత ఖాళీ అవ్వగానే లోపలికి వెళ్ళి చూశాడు. ప్రేమ్‌నాథ్ బోర్లాపడిపోయున్నాడు.

"ఏమయింది అతనికి? ఇందాక వచ్చినప్పుడు బాగానే ఉన్నాడు కదా" అనుకుని అతన్ని లేపి గోడకి జారగిల బెట్టాడు.

అప్పుడు కనిపించిందతనికి... ప్రేమ్‌నాథ్ గుండెల్లోంచి స్రవిస్తోన్న ఎర్రటి నెత్తురు. వెంటనే అతని ముక్కు దగ్గర వేలుంచి చూశాడు. శ్వాస ఆడటంలేదు ప్రేమ్‌నాథ్ చచ్చిపోయాడు.

అప్పుడే తనూ లోపలికి వచ్చిన మంజుల ఆ సంఘటన చూసి పెద్దగా అరిచింది.

"అరవకు మంజుల! ఇది మర్డర్! ఇతన్నెవరో చంపేసారు. అది కూడా కొద్ది నిమిషాల ముందే జరిగుంటుంది ఇతని శరీరం ఇంకా చల్ల బడలేదు" అంటూ గబగబా దగ్గరకు వెళ్ళాడు. చిత్రం! సేఫ్ ఓపెన్ చేసే ఉంది. కానీ ఖాళీగా ఉంది. అదొకలాంటి వాసన వస్తుంది సేఫ్‌లోంచి కరుణ్ గబగబా వెళ్ళి తనకి ప్రేమ్‌నాథ్ చూపించని రూమ్‌కి చేరుకున్నాడు ఆశ్చర్యం!

ఆ రూమ్ ఇప్పుడు తెరిచే ఉంది. దానిలో ఏ విధమైన సామాన్లు లేవు, అక్కడక్కడా తెల్లని పౌడర్ మాత్రం కన్పించింది. అలాంటి పౌడర్ బ్లాస్టయిపోయిన పీటర్ ఇంటిలోని సేఫ్‌లో కూడా వుండటం గుర్తొచ్చి... చిన్న కాగితలో ఆ పౌడర్‌ని కలెక్ట్ చేశాడు – ఎందుకయినా మంచిదని.

కరుణ్ వెనకాలే వచ్చిన మంజుల.

"ఏం చేస్తున్నావ్? ఇలాంటి ప్రదేశంలో ఉండటం చాలా ప్రమాదం వెళ్ళిపోదాం" వణుకుతూ అంది.

"నువ్విక్కడి వస్తువుల వేటిమీదా చేతులేయలేదుకదా?" అనుమానంగా అడిగాడు అతను.

"లేదు!" చెప్పిందామె.

కరుణ్ గబగబా బయటికివచ్చి, కర్చీఫ్‌ని చేతికి చుట్టుకుని తలుపు మూసి, కాలింగ్‌బెల్ మీద కర్చీఫ్‌తో తుడిచాడు.

"ఎందుకలా?" అడిగిందామె.

"ఇందాక నేను కాలింగ్‌బెల్ ప్రెస్ చేశాను. నా వేలిముద్రలు దానిమీద పడ్డాయి. వాటినితుడిచివేయకపోతే ప్రమాదం" అంటూ మంజులతో పాటు చుట్టూ చూస్తూ బయటపడ్డాడు. అదృష్టవశాత్తు బయటెవరూలేరు. అక్కడ్నుంచి కాస్త దూరం నడిచి ఒక ఆటోఎక్కి – అడ్రస్ చెప్పి –

"పోనీయ్!" అన్నాడు కరుణ్.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"భర్తను చంపిన భార్య" అన్న శీర్షికతో ఉన్న పేపర్‌లోని న్యూస్ ఐటమ్ ఆకర్షించి గబగబా చదడటం మొదలు పెట్టాడు కరుణ్.

"సిటిన్యూస్ : పెదవాల్తేరులో ఉన్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని అతని భార్యే చంపి పరారయింది. ప్రేమ్‌నాథ్ అనే అతను చాలా కాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతనికీ, అతని భార్యకీ తరచుగా గొడవలయ్యేవని, భర్త తిరుగుబోతు మనస్తత్వం వలన విసుగు చెందిన ఆమె నిన్న భర్తను కత్తితో గుండెల్లో పొడిచి చంపేసిందని తెలియ వచ్చింది. ఆ దంపతులకి పిల్లలు కూడా లేరు. ప్రేమ్‌నాథ్ శవాన్ని త్రీటవున్ పోలీసులు పోస్టమార్టమ్‌కి తరలించారు. ఎస్.ఐ. కేసు దర్యాప్తు చేస్తున్నారు. సాధారణంగా పోలీసుల వ్యవహారంలో కానీ, మరే ఇతర క్రిమినల్ విషయాల్లో కానీ ప్రజలందరూ మాకెందుకు లెద్దూ" అనుకుంటారు. అయితే ప్రేమ్‌నాథ్ హత్య విషయంలో పోలీసులకు ఎంతో సమాచారం ఇచ్చి, అవసరమైతే కోర్టుకు కూడా వస్తానని, అతన్ని అతని భార్యే చంపుంటుందని తాను గట్టిగా నమ్ముతున్నానని హతుడి ఇంటి ఎదురుగా వున్న హేమరాణి చెప్పడం విశేషం.

"మగవాడు తిరుగుబోతయితే సహించకూడదు నిజమే! ఆడదెంత పవిత్రంగా వుంటుందో... మగవాడూ అలాగే ఉండాలి. అలా లేకపోతే, అది భరించలేకపోతే చట్టబద్ధంగా విడాకులు తీసుకోవాలి. అంతేకాని ఇంత ఆటవికంగా భర్తని హత్య చేయడం క్షమించరాని నేరం" అని కూడా ఆమె పేర్కొన్నారు.

న్యూస్‌చదివేసి పేపర్ పక్కనపెట్టి, బాత్‌రూంలోకి నడిచాడు కరుణ్" పది నిముషాల్లో తయారయి ఇంటికి లాక్ చేసి కారులో కూర్చుని స్టార్టుచేసి ముందుకురికించాడు.

"నిన్న ప్రేమ్‌నాథ్ ఇంటికి వెళితే – అతనే స్వయంగా చెప్పాడు. తన భార్య ఊళ్ళో లేదని, మరామెలా హత్య చేసుంటుంది? లేకపోతే వూరెళ్ళినట్లు వెళ్ళి ఎవరికీ తెలియకుండా వచ్చి హత్య చేసి మాయమైందా? అసలు అతని భార్యే హత్య చేసిందని హేమరాణి ఎలా చెప్పగలుగుతుంది? పేపర్లో చెప్పినట్లు సాక్ష్యం చెబితే కోర్టులూ, పోలీసుల చుట్టూ తిరగాల్సిన ఖర్మ పడుతున్నా ఆమె ఎందుకంత ఇంట్రెస్టు తీసుకుంటుందీ విషయంలో? తనకా రోజు పాకెట్టు పంపిన స్త్రీయే ప్రేమ్‌నాథ్ భార్యా? అలా అయితే తనకీ పాకెట్టు పంపి ఇక్కడ భర్తనెందుకు హత్య చేస్తుంది? బహుశా భర్త ప్రవర్తన వలన విసిగిపోయి, చట్టబద్ధంగా అతన్ని పట్టించాలనుకుందా? చట్టబద్ధంగా పట్టించాలనుకుంటే అతను నేరస్థుడై వుండాలి. అంటే అతను నేరస్తుడా? అలా అయితే తాను కేసుని త్వరగా పరిశోధించి అతనికి శిక్ష పడేలా చేస్తే ఆమె అహం సంతృప్తిచెందేదేమో! కానీ తాను త్వరగా ఈ కేసుని ముగించలేకపోయినందుకు ఆమే భర్తని స్వయంగా హత్య చేసిందా? ఓహ్ అన్నీ ప్రశ్నలే! చికాగ్గా అనుకుని రాయ్ ఆఫీసు ముందు కారాపాడు.

"కరుణ్ జీ! నిన్న మీరిచ్చిన పౌడర్ టెస్టింగ్ కోసం లేబరేటరీకిపంపాం. అది బ్రౌన్ షుగర్" కరుణ్‌ని చూస్తూనే అన్నాడు రాయ్.

"బ్రౌన్‌షుగరా?" ఆశ్చర్యంగా అడిగాడు కరుణ్.

"యస్!"

"అలాంటి పౌడర్ ఆర్టిస్ట్ పీటర్ సేఫ్‌లో కూడా చూశాను. కానీ అప్పుడు నాకెందుకో ఆ పౌడర్నీ కలెక్ట్ చేయాలని తోచలేదు. బహుశా అదీ బ్రౌన్‌షుగర్ అయుంటుంది. అంటే ఆ ఆర్టిస్ట్‌కి, ఈ ప్రేమ్‌నాథ్‌కి లిద్దరి క్కూడా లింకుండే వుంటుంది."

"యేబీ!"

"మనం మళ్ళీ ఒకసారి బ్లాస్టయిపోయిన పీటర్ ఇంటికి వెళ్ళి చూద్దాం. విషయం అర్థమౌతుంది" అన్నాడు కరుణ్.

"ష్యూర్!" లేచినిలబడుతూ అన్నాడు రాయ్.

కరుణ్ కారులో ఇద్దరూ పీటర్ బిల్డింగ్‌కి చేరుకున్నారు.

"మునుపటిలా పోలీస్ కానిస్టబుల్ వుంటాడేమో అనుకున్నాను." అన్నాడు కరుణ్... బిల్డింగ్ ముందు ఎవరూ లేకపోవడం చూసి.

"ఈ విషయం పోలీస్‌లెప్పుడో మర్చిపోయాడు" నవ్వుతూ అన్నాడు రాయ్.

ఇద్దరూ కారుదిగి పీటర్ బిల్డింగ్‌లోకి నడిచారు. కానీ వారి నెక్కిరిస్తూ సేఫ్ వుండవలసిన ప్రదేశం ఖాళీగా దర్శనమిచ్చింది.

"ఇక్కడే నేను చూశాను రాయ్. ఇప్పుడాసేఫ్ లేదు" బిత్తరపోతూ అన్నాడు కరుణ్..

"బహుశా ఎబరో ఎత్తుకుపోయుంటారు...." తేలిగ్గా అన్నాడు రాయ్.

"హుం...." నిట్టూర్చాడు కరుణ్.

చేసేదిలేక ఇద్దరూ వెనుదిరిగారు.

"ఓ.కే. రాయ్! నేను మళ్ళీ కలుస్తాను" రాయ్‌ని అతని ఆఫీసు ముందు వదిలి చెప్పాడు అతను.

"అలాగే" రాయ్ లోపలికి నడిచాడు.

కరుణ్ కారు పెదవాల్తేరు వైపు పరిగెత్తసాగింది.

"ఒకసారి ఆ హేమరాణితో మాట్లాడితే ఉపయోగం వుండొచ్చు" కార్ డ్రైవ్ చేస్తూనే అనుకున్నాడు అతను.

ఆలోచనల్లోనే కారు పెదవాల్తేరు చేరుకుంది. కరుణ్ కారును ప్రేమ్‌నాథ్ ఇంటికి దూరంగా వుంచి నడుచుకుంటూ వెళ్ళాడు. ప్రేమ్‌నాథ్ ఇల్లు సీల్ చేయబడి వుంది. అతనింటికెదురింట్లో వుండే హేమరాణి కోసం అటునడిచాడు.

గేటు తీసుకొని లోపలికెళ్ళి కాలింగ్‌బెల్ ప్రెస్ చేశాడు. కొద్దిసేపటి తరువాత తలుపులు తెరుచుకున్నాయి. సుమారు ముప్ఫై అయిదేళ్ళున్న ఓ యువతి నుంచునుంది.

విశాలమైన నుదురు. పెద్ద పెద్ద కళ్ళు, మోడల్ తారలకున్నట్లు కొద్దిగా పైకి లేచిన ముక్కు, ఎర్రటి సన్నటి పెదిమలు. ఛామన చాయైనా, చూపు తిప్పుకోలేనంత అందంగా వుందామె.

"ఎవరు కావాలి?" అడిగిందామె. ఆమె రూపమంతా కోమలంగా కంఠస్వరం లేదు.

"నేనో టెలీఫిల్మ్ తీస్తున్నానండి. ఎదురింట్లో ప్రేమ్‌నాథ్‌గారి మిసెస్ మా ఫిల్మ్‌కి డైలాగ్స్ రాస్తున్నారు. అనుకున్నట్లుగాక మధ్యలో కథ మారింది. వారిని కలుద్దామని వస్తే ఎవరూ లేరు" అప్పటికప్పుడు ఓ కథల్లి చెప్పేశాడు.

"ఏమిటీ... హరిణి డైలాగ్స్ రాస్తుందా? మీ ఫిల్మ్ సబ్జెక్ట్ ఏమిటి? మర్డర్, క్రైమా?"

"అవునండి" సమాధానం చెప్పి "అయితే ఆమె పేరు హరిణి అన్నమాట" అనుకున్నాడు.

"అబ్బో! రాతలు కూడా రాస్తుందా ఆమె?" ఆశ్చర్యంగా అంది.

"ఇంతకు ముందు ఏవో సింగిల్ ఎపిసోడ్స్‌కి రాశారట."

"అయ్యో! మిమ్మల్ని బయటే నుంచోబెట్టాను. లోపలికి రండి" అడ్డం తొలగి దారిచ్చింది. కరుణ్ లోపలికి నడిచాడు.

"కూర్చోండి!" అంటూ అతనికి సోఫా చూపించింది ఆమె. కరుణ్ కూర్చుంటూ చుట్టూ చూసాడు. ఇల్లంతా ఖరీదైన హంగులతో అలరారుతోంది. గోడమీద ఓ పక్కనున్న పెయింటింగ్ చూసి ఉలిక్కిపడ్డాడతను. ఆకాశంలో ఎర్రటి సూర్యుడు, కిందంతా ఆవిర్లు చిమ్ముతున్న ఎడారి ఇసుకలో కళ్ళలోకి ప్రాణం వచ్చేసినట్లు పడున్న యువకుడికి ఓ స్త్రీ తన కడవతో నీళ్ళు తాగిస్తుంది. ఆ చిత్రం పేరు "ఎడారి సూర్యుడు"

సరిగ్గా ఇదే చిత్రాన్ని పీటర్ ఇంట్లో కూడా చూసాను. తనా చిత్రాన్ని అమ్మమంటే – "నా చిత్రాలమ్మే అలవాటు లేదు" అన్నాడతను. మరీమెకెలా వచ్చిందీ చిత్రం అనుకున్నాడు కరుణ్.

"అయితే మీది మర్డర్, క్రైం ఫిల్మా? అలాంటివయితే ఆమె చాలా బాగా రాస్తుందిలెండి..." అందామె వ్యంగ్యంగా.

"అవునండి. డైలాగ్స్ చాలా బాగా రాశారు..." అన్నాడు అతను.

"ఎందుకు రాయదూ? మొగుణ్ణి ఆ తెలివి తేటలతోనే హత్య చేసింది కదా!"

"ఏమన్నారు? వారు భర్తను హత్య చేసారా?"

"అవునండీ! మీకు తెలియదా?"

"తెలీదండీ! నేనీరోజే హైద్రాబాద్ నుండి వస్తున్నాను."

"ఓహో! నిన్న మొగుడ్ని చంపేసి పరారయిపోయింది."

"ఎందుకు?'

"ప్రేమ్‌నాథ్ తిరుగుబోతులెండి. అయితే అంత మాత్రానే చంపేయాలా? ఇష్టం లేకపోతే విడాకులు తీసుకోవచ్చుగదా!"

"అవునండీ కరెక్టే!" అంటూ కంటి చివరల నుంచి నలుదిశలా చూసి–

"హరిణిగారి దేఊరు?" అనడిగాడు.

"ఆవిడ పుట్టిల్లు హైద్రాబాద్‌లెండి!"

"హైద్రాబాద్‌లోనా! ఎక్కడో చెప్పగలరా?"

"వుండండి! ఆవిడెడ్రస్సు నా డైరీలో ఒకసారి నోట్ చేసుకున్నాను" అంటూ డైరీ తీసుకొచ్చి–

"వై. హరిణి."

డాటరాఫ్ : లేట్ రాజారావ్,

ఫ్లాట్ నెం : 93,

బంజారా హిల్స్,

హైదరాబాద్ – 500034. చదివిందామె.

"మీరామెతో బాగా క్లోజ్‌గా వుండేవారా?"

"అబ్బే! లేదండి."

"మరి మీకు ఆవిడ పుట్టిల్లు అడ్రస్సు ఎలా తెలుసు?"

"అది... అది... ఒకసారి వాళ్ళమ్మగారు రాసిన ఉత్తరం పోస్ట్‌మ్యాన్ మా ఇంటిలో పొరపాటుగా పడేస్తే, పొరుగువాళ్ళేకదా! ఎప్పుడైనా హైదరాబాద్ వెళితే పనికొస్తుందని..." చెప్పిందామె.

"చాలా థాంక్సండీ! నేను వస్తాను" లేస్తూ అన్నాడు కరుణ్.

"మీ టెలీఫిల్మ్ సంగతేమిటి?"

"కథ మారినంతవరకూ వేరే వాళ్ళతో మాటలు రాయించేస్తాం."

"అలాగా?"

"ఆఁ... మర్చేపోయాను... ఆ పెయింటింగ్ చాలా బాగుంది. ఎక్కడ కొన్నారు?" పీటర్ ఇంటిలో వున్నటువంటి చిత్రంలానేవున్న ఆ చిత్రాన్ని చూస్తూ అడిగాడు.

ఆమె ఒక్కసారిగి తడబడి–

"ఓ ఫ్రెండ్ ఇచ్చారండి" అనేసింది పొడిగా.

"థాంక్యూ! వస్తానండి" అంటూ బయటికి నడిచాడు కరుణ్.

వెంటనే తలుపు మూసుకుంది.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"హలో – నేను కరుణ్‌ని మాట్లాడుతున్నాను."

"చెప్పండి కరుణ్‌జీ! ఏమిటి విషయం?" అడిగాడు రాయ్ అటునుండి.

"నాకు హేమరాణి మీద అనుమానంగా వుంది–ప్రేమ్‌నాదని అతని భార్యే చంపిందని ఆమె ఘంటాపదంగా చెబుతోంది. అంతేకాదు ఆమె ఇంట్లో పీటర్ చిత్రించిన పెయింటింగుంది. అది ఓ ఫ్రెండ్ ఇచ్చాడని నాతో అంది. మీ ఏజెంట్లని నియమించి ఆమెపై ఓ కన్ను వేయండి."

"అచ్చా!"

"మీరెంత తొందరగా రిపోర్టిస్తే అంత మంచిది."

"అలాగే!"

"దాంతోపాటు, మీ ఏజెంట్లని హైదరాబాద్ పంపించి, ఈ అడ్రస్సులో హరిణి అనే వివాహిత వుంటుందేమో కనుక్కోవాలి."

"ఎవరామె?"

"ఆమె ప్రేమ్‌నాథ్ భార్య."

"ఎలా సంపాదించారు ఆ అడ్రస్సు?"

"హేమరాణి దగ్గర చిన్న కథల్లి, ఆమె ఇంట్లోకి వెళ్ళి."

"హ...హ్వా...హ్వా...కరుణ్‌గారూ బెరీ బెరీ బండర్" అతని భాషకి నవ్వొచ్చి కరుణ్ కూడా నవ్వాడు. హరిణి అడ్రసు రాయ్ రాసుకుంటుంటే ఫోన్‌లోనే చెప్పాడు.

"రైట్! హేమరాణి మీద నిఘా ఈ క్షణంనుంచీ పెట్టిస్తాను. మీరిచ్చిన హైదరాబాద్ ఎడ్రసుకి మరో ఏజెంట్‌ని వెంటనే పంపిస్తాను."

"థాంక్యూ వెరీమచ్ రాయ్‌గారూ" ఫోన్ క్రెడిల్ చేసాడు కరుణ్.

✧ ✧ ✧ ✧ ✧ ✧

సమయం రాత్రి ఎనిమిదయింది. హోటల్ డిలైట్‌లోని లైట్లు మరీ కాంతివంతంగానూకాక, మరీ డిమ్‌గానుకాక వెలుగుతున్నాయి. రోజూ తను కూర్చునే టేబిల్ కస్టమర్స్‌తో ఆక్యుపై అయిపోవటంతో మరో టేబుల్ దగ్గరికి వెళ్ళి కూర్చున్నాడు కరుణ్.

"సారీ సర్! ఇది రిజర్వ్ అయిపోయింది..." సుమారు యాభై ఏళ్ళ వయస్సున్న ఓ సర్వర్ అన్నాడు.

"కానీ ఇక్కడ రిజర్వ్‌డ్ బోర్డు లేదుగా?"

"మా వాళ్ళు ఆ బోర్డు పెట్టడం మరచిపోయారు" అపాలజెటిక్ చెప్పాడతను.

కరుణ్ చుట్టూ చూసాడు. దూరంగా ఖాళీ టేబిల్ కనిపించింది. అటు నడిచి అక్కడ కూర్చున్నాడు. వెంటనే వెయిటర్ వచ్చి మెనూ కార్డ్ చూపించి, కరుణ్ సూచించిన ఐటమ్స్ నోట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

కరుణ్ పాకెట్ డైరీ తీసి ఆ రోజు పాకెట్‌తోపాటు హరిణి పంపిన పేపర్ కటింగ్‌ని మళ్ళీ చదవసాగాడు.

నగరంలో బ్రైన్‌షుగర్, హెరాయిన్, నల్లమందు, మార్ఫిన్, కొకైన్, మాన్‌డ్రెక్స్ వంటి మత్తుపదార్థాలు యువతకి అమ్ముతున్నట్లు మురళీకృష్ణ, ఓ ప్రొఫెసర్, మరొక డాక్టర్ని పోలీసులు అనుమానించి కోర్టుకు హాజరు పరిచారు. అయితే సాక్ష్యాధారాలు లేక కోర్టు వారిని నిర్ధోషులుగా వదిలిపెట్టేసింది.

ఆ పేపర్ కటింగ్‌ని జేబులో పెట్టుకుని ఆలోచనలో పడ్డాడతను.

"ఎవరీ మురళీకృష్ణ, ప్రొఫెసర్, డాక్టర్లు? వాళ్ళెవరో మత్తు పదార్థాలు అమ్మేవాళ్ళకీ పేపర్‌కీ ఏమిటి సంబంధం? తాను ఎంక్వయిరీ నిమిత్తం వెళ్ళిన వెంటనే పీటర్ బిల్డింగ్ బ్లాస్టయిపోవడానికి కారణం ఏమిటి? రియల్ ఎస్టేట్ ఓనర్‌ని నిజంగా అతని భార్యే చంపిందా? లేకపోతే మరెవరయినా చంపారా? అతనింట్లో బ్రౌన్‌షుగర్ ఎందుకుంది? పీటర్‌దీ, ప్రేమ్‌నాథ్‌దీ మర్డరే అయితే వాళ్ళనెవరు మర్డర్ చేసారు? హరిణి తనకి కేసు అప్పగిస్తూ ఎందుకు పొడిపొడిగా వివరాలిచ్చింది?"

"గుడీవినింగ్ సార్! వెయిటర్ ఆర్డర్ తీసుకున్నాడా?" వైట్‌షర్ట్ బ్లాక్ ఫ్యాంటులోకి టక్ చేసుకున్న యువకుడు మర్యాదగా అడిగాడు కరుణ్‌ని.

ఆ మాటలకి ఆలోచనలు చెదిరిపోయిన కరుణ్ అతనివంక ప్రశ్నార్థకంగా చూసాడు.

"వెయిటర్ ఆర్డర్ తీసుకున్నాడా సార్?" మళ్ళీ అడిగాడతను.

"ఆఁ... తీసుకున్నాడు. మీరు..." మధ్యలోనే ఆగిపోయాడు కరుణ్.

"కొత్తగా హెడ్ వెయిటర్‌గా అపాయింటయ్యాను సార్... మురళీ అనే హెడ్ వెయిటర్ ప్లేస్‌లో" చెప్పాడతను.

"మురళా? యూ మీన్ మురళీకృష్ణా" పేపర్ కటింగ్‌లోని మురళీకృష్ణ పేరు గుర్తుకొచ్చి గబుక్కున అన్నాడు కరుణ్.

"ఎస్ సార్!" అనాలోచితంగా విసిరిన రాయి కరెక్టుగా కావలసిన పండుకే తగిలినట్లు అతన్నుంచి సమాధానం వచ్చింది.

"అతనితో నాకు పనుంది. అతను రావటంలేదని తెలిసింది. ప్లీజ్ – అతని అడ్రెస్సు ఇవ్వగలరా?" రిక్వెస్టింగ్‌గా అడిగాడు కరుణ్.

"ఒన్ మినిట్ సార్!" అంటూ అతను వెళ్ళి రిజిష్టర్లో చూసి మురళీకృష్ణ అడ్రస్ రాసుకొని తెచ్చిచ్చాడు.

"థాంక్యూ వెరీమచ్" అన్నాడు కరుణ్.

"వెల్కం సర్" అంటూ అతనక్కడినుంచి వెళ్ళిపోయాడు.

"ఎమ్. వి.ఎస్. మురళీకృష్ణ,

డోర్ నెం : 50. 40. 22,

టిపిటి కాలనీ, సీతమ్మధార,

విశాఖపట్నం - 530 013..."

కరుణ్ ఆ అడ్రసు చదవటం పూర్తవటం, వెయిటర్ అతనికి డిన్నర్ సర్వ్ చేయటం ఒకేసారి జరిగింది. కరుణ్ గబగబా భోజనం చేసి బిల్లు పే చేసి, కారులో సీతమ్మధారకి బయలుదేరాడు.

"పేపర్ కటింగ్‌లోని మురళీకృష్ణ, ఈ మురళీకృష్ణ ఒకరేనా? ఒకరయితే అతని ద్వారా ప్రొఫెసర్, డాక్టర్లెవరో కూడా తెలుస్తుంది."

"కీక్... కీక్... కీక్..." వెనకనుంచి మరో కారు అదేపనిగా హారన్ మోగించడంతో ఆలోచనలనుంచి తేరుకున్న కరుణ్ రియర్‌వ్యూలో చూసాడు. వెనకాల తెల్లమారుతీ సైడ్ కోసం హారన్ మోగిస్తోంది.

అప్పుడు చూసుకున్నాడతను, ఆలోచనలతో తాను లెఫ్ట్ నుంచి, రోడ్డు సెంటర్లో, అదీ స్లోగా డ్రైవ్ చేస్తూ, వెనక వాహనాలకి అవరోధం కల్పిస్తున్నానని. వెంటనే బాగా లెఫ్ట్‌కి వెళ్ళిపోయాడు.

తెల్లమారుతీ వెంటనే ముందుకు దూసుకుపోయింది.

సీతమ్మధార రోడ్డునుంచి లోపలికి తిరిగాడు కరుణ్. అక్కడినుంచి అంతా టిపిటి కాలనీయే! డోరు నెంబర్లు చూసుకుంటూ మెల్లగా కారుని పోనివ్వసాగాడు.

పది నిముషాలు తిరిగినా మురళీకృష్ణ డోర్ నెంబర్ కనపడలేదు. ఇలా లాభంలేదని - కారుని ఓ దగ్గర ఆపేసి కాలి నడకన బయలుదేరాడు.

చాలా ఇళ్ళకి డోర్ నెంబర్లు లేవు. అయినా విసుగులేకుండా చూసుకుంటూ నడవసాగాడు. ఇంతలో ఓ కిరాణాషాపు కనిపిస్తే అందులోకి నడిచి-

"ఇక్కడ మురళీకృష్ణగారి ఇల్లెక్కడండి...?" అడిగాడు.

"మురళీకృష్ణంటే... ఎందులో పనిచేస్తున్నారు అతను?"

"హోటల్ డిలైట్ హెడ్ వెయిటర్."

"ఏమో తెలీదండీ... డోర్ నెంబర్ ఏమైనా చెప్పారా?"

"50-40-22, టిపిటి కాలనీ" చెప్పాడు కరుణ్.

"ఇది 50-39-10... అంటే మా షాపుదన్నమాట. మీరు ఈ వీధికి కుడిపక్క వీధిలోకి వెళ్ళండి. అందులో 50-40-22 వుండచ్చు"

"థాంక్స్" అంటూ అటు నడిచాడు కరుణ్. కానీ అది 50-38-1తో స్టార్టయింది. "ఈ రెండూ కాదంటే కిరాణాషాపుకు ఎడమపక్క లైన్ అయి వుంటుంది" అనుకుని నడిచాడు.

అతని ఊహ నిజమే అయింది.

వరసగా వెదుక్కుంటూ వెళ్ళాడు.

బయట డోర్ నెంబర్ లేదుగానీ, ఎమ్.వి.ఎస్. మురళీ అన్న బోర్డు కన్పించింది. ఆ ఇంటి దగ్గర ఆగాడు.

నిజానికి అది ఇల్లనేకంటే బిల్డింగంటే సమంజసమేమో.

ఆ వీధిలో వుండే అన్ని ఇళ్ళకంటే రిచ్‌గా వుందది.

కరుణ్ వెళ్ళి కాలింగ్‌బెల్ మ్రోగించాడు. కొద్దిసేపటికి తలుపులు తీసి-

"ఎవరూ?" అంటూ ఓ అరవై ఏళ్ళ స్త్రీ బయటకొచ్చింది.

"మురళీకృష్ణ కావాలమ్మా ఉన్నారా?" అడిగాడు కరుణ్.

"నువ్వెవరూ బాబూ?" అందామె కళ్ళద్దాలు సవరించుకుంటూ.

"నా పేరు కరుణ్...!"

"నువ్వా బాబూ! రా లోపలికి. నిన్ను చూసి ఎంతకాలమైందీ? చూపు సరిగా ఆనటంలేదు" అంటూ లోపలికి దారి తీసిందామె.

"ఇదేమిటి నేను తెలిసినట్టుగా మాట్లాడుతుందీమె?!" ఆశ్చర్యంగా అనుకుని ఆమె వెనకే దారితీసాడు.

"కూర్చో బాబూ!" అంటూ సోఫా చూపించింది.

"మురళీకృష్ణ...." కరుణ్ మాట పూర్తికాకుండానే...

"వాడు వారం రోజుల్నుంచీ ఏమైపోయాడో, ఎక్కడికెళ్ళాడో తెలియదు బాబూ! ఇంతకుముందు ఇలా చెప్పకుండా వెళ్ళినా, మూడు-నాలుగు రోజులకే వచ్చేసేవాడు, ఈసారి వారం అయిపోయింది" నిట్టూర్చి అంది ఆమె.

కలర్ టివీ, స్టాండ్‌మీద అందంగా వుంది.

కింద అరలో వి.సి.ఆర్. హాల్‌కి ఓ మూల బి.పి.ఎల్. డబుల్‌డోర్ ఫ్రిజ్.

బెడ్ రూంలోంచి బయటకు కనిపిస్తున్న ఎయిర్ కూలర్, ఇంకో వేపు సోనీ మ్యూజిక్ సిస్టమ్, హాలంతా ఎర్రటి రాజస్తానీ కార్పెట్ చాలా రిచ్‌గా వుంది ఇల్లు.

"మాలతీ... మాలతీ...." కేకవేసిందా వృద్ధురాలు.

ఆ కేకకి ముప్పై, ముప్పై అయిదేళ్ళ వయసున్న ఓ స్త్రీ వచ్చింది.

ఆమె వెనకాలే నాలుగేళ్ళ పిల్లాడు వచ్చాడు.

"ఈ బాబు కరుణ్ అని మీ ఆయన స్నేహితుడు. విజయవాడలో వున్నప్పుడు మా పక్కింటిలోనే వుండేవారు...." చెప్పి-

"అమ్మా, నాన్నా బాగున్నారా బాబూ!" అందామె.

ఆమె తనని మురళీకృష్ణ స్నేహితుడనుకుంటుందనీ, అతనికి తన పేరుగల ఓ స్నేహితుడుండేవాడనీ అర్ధమయంది కరుణ్‌కి. ఎందుకంటే కరుణ్ వాళ్ళది విజయవాడ కాదు. వైజాగ్! ఇక కరుణ్ తల్లిదండ్రులు అతని చిన్నప్పుడే పోయారు. అతను మేనమామ దగ్గరే చదువుకుని పెరిగి పెద్దవాడయ్యాడు.

ఆమెకి కళ్ళు సరిగా కనిపించక పోవడం వలనా మురళీకృష్ణకి తన పేరుగల ఓ స్నేహితుడుండటం వలనా ఆమె పొరబడింది.

"ఇదీ ఒకందుకు మంచిదే" అనుకున్నాడు అతను.

"అమ్మా, నాన్నా బాగున్నారా బాబూ!" మళ్ళీ అడిగిందామె.

"ఆఁ... బాగానే ఉన్నారమ్మా" సమయోచితంగా అబద్ధం చెప్పేశాడతను.

ఇంతలో మురళీకృష్ణ భార్య ఫ్రిజ్‌లోంచి 'మిరిందా' తీసుకొచ్చి ఇచ్చింది.

అందుకొని సిప్ చేస్తుండగా కన్పించిందా పెయింటింగ్...

"ఎడారి సూర్యుడు!" పీటర్ ఇంటిలోనూ, హేమరాణి ఇంటిలోనూ ఉన్నటువంటి పెయింటింగ్.

"ఏమిటీ మిస్టరీ! పీటర్ చిత్రించిన పెయింట్స్ ఎవరికీ అమ్మనని అన్నాడు. మరి హేమరాణి-మురళీకృష్ణల ఇంట్లో అవెందుకున్నాయి? అంటే పీటర్‌తో వీళ్ళకి సంబంధాలున్నాయా? అవి ఎటువంటివి? తనకి హరిణికేసు అప్పగించిన దగ్గర్నుంచీ చూసుకుంటూ వస్తే, పీటర్ ఇల్లు బ్లాస్టయిపోవటం, ప్రేమ్‌నాథ్ హత్య, ఇప్పుడు మురళీకృష్ణ అదృశ్యం! వీటి వెనక ఎవరి హస్తం వుంది? హరిణి ఇచ్చిన పేపర్ కటింగ్‌లోని మురళీకృష్ణ ఇతనే అయితే, ప్రొఫెసర్, డాక్టర్లెవరు?"

"నీకు పెళ్ళయిందా కరుణ్‌బాబూ?" మురళీకృష్ణ తల్లి మాటలకి ఆలోచనలనుంచి తేరుకొని.

"లేదమ్మా! ఈ ఏడు చేసుకుందామనుకుంటున్నాను" చెప్పాడు కరుణ్.

"చేసుకో నాయనా! ఏ వయసులో జరగవలసిన ముచ్చట ఆ వయసులో జరిగితేనే అందం" అందామె.

మరికొద్దిసేపు కూర్చుని-

"వస్తానమ్మా!" అంటూ లేచాడు కరుణ్.

"రాక రాక వచ్చావు. భోజనం చేసెళ్ళు బాబూ!" అంది మురళీకృష్ణ తల్లి.

"ఇంకోసారొస్తానమ్మా, వస్తానండి" మురళీకృష్ణ భార్యాకి చెప్పి బయటకొచ్చాడు.

"మా కృష్ణ వస్తే నువ్వొచ్చావని చెబుతాను బాబూ!"

"అలాగేనమ్మా!"

"అప్పుడప్పుడు వస్తుండు."

"అలాగే" అంటూ వాళ్ళ దగ్గర శెలవు తీసుకుని వీధిలోకి నడిచి, తన కారు దగ్గరకు చేరుకున్నాడు.

డోర్ ఓపెన్‌చేసి, లోపల కూర్చుని స్టార్టుచేసి ముందుకు సాగిపోయాడు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"ఇంకా మీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను. మీరే వచ్చారు. మీకు నూరేళ్ళాయుష్షు" కరుణ్‌ని చూస్తూనే అన్నాడు రాయ్.

"హేమరాణి విషయం ఏమయింది?" అడిగాడతను.

"ఆమె ఒంటరిగా జీవిస్తోంది. ఇంకా పెళ్ళి కాలేదు. ఓ ప్రైవేట్ ఫర్మ్‌లో జాబ్ చేస్తుంది. మీరిచ్చిన అడ్రస్‌గల ఇంట్లోకి ఆమె వచ్చి వారం రోజులే అయింది."

"వారంరోజులా? అంటే ప్రేమ్‌నాథ్ హత్య జరిగినరోజే అన్నమాట. మరిఅటువంటప్పుడు ప్రేమ్‌నాథ్ తిరుగుబోతనీ, అతనికీ , అతని భార్యకీ పడదని ఎలా చెప్పగలిగింది?" అన్నాడు కరుణ్.

"పాయంటే?" రాయ్ అన్నాడు.

"అంతేకాకుండా, హరిణి హైదరాబాద్ అడ్రస్ కూడా నాకు చెప్పిందామె. మీకెలా ఈ అడ్రస్ తెలుసని అడిగితే– "ఓసారి హరిణి వాళ్ల అమ్మగారు కూతురికి రాసిన లెటర్ పోస్టుమేన్ పొరపాటుగా తమ ఇంట్లో ఇచ్చేశాడని, హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఉపయోగ పడుతుందని నోట్ చేసుకున్నానని అంది. అంటే అదీ అబద్ధమే నన్నమాట. ఇవన్నీ చూస్తూ వుంటే హేమరాణి చేతల వెనక ఏదో తెలియని అర్థమున్నట్టు అర్థమవుతుంది, ఏమిటది?"

"మీ ప్రశ్నలన్నింటికీ సరయిన సమాధానాలు కావాలంటే ఆమె మీద నిఘా కంటిన్యూ చెయ్యాల్సిందే!"

"యస్! చెయ్యండి. హైదరాబాద్ నుంచి ఏమయినా మెస్సేజ్ వచ్చిందా?"

"ఇంకా లేదు. బహుశా ఈరోజు రావచ్చు."

"ఓ.కే!"

"హోటల్ డిలైట్‌లోని హెడ్ వెయిటర్ మురళీకృష్ణ అడ్రసు తెలుసుకుని అతని ఇంటికి వెళ్లాను. కాని అతను దాదాపు పదిరోజులనించి ఇంటికే రావటంలేదట."

"మురళీకృష్ణ అడ్రస్ పట్టుకోగలిగారా? ఈజిట్?" అడిగాడు రాయ్.

"నూటికి నూరుపాళ్ళూ పేపర్ కటింగులోని మురళీకృష్ణనూ, నేను కనుక్కున్న ఈ మురళీకృష్ణనూ ఒక్కరే అని చెప్పలేను. కానీ ఈ మురళీకృష్ణని కూడా అనుమానించటానికి అతనింట్లో ఉండే ఓ ఐటమ్ ఆధారమయింది."

"ఏమిటది?" ఏంగ్జయిటీగా అడిగాడు రాయ్.

"హత్య చేయబడిన పీటర్ గీసిన చిత్రం అతనింట్లోనూ చూశాను. నేనడిగితే ఆ చిత్రాన్ని అమ్మనన్నాడు అతను. అటువంటి చిత్రాలే హేమరాణి ఇంటిలోనూ, మురళీకృష్ణ ఇంటిలోనూ వున్నాయి. నా క్లయింట్ ఇచ్చిన పీటర్ అడ్రస్‌లోని వ్యక్తిని కనుక్కుంటే మనకేదో సమాచారం దొరుకుతుందనే సూచన వుంది. పీటర్ బిల్డింగ్ నేను అతన్ని కాంటాక్ట్ చేసిన వెంటనే పేలిపోవడం, అతను గీచిన చిత్రాలు మురళీకృష్ణ ఇంటిలోనూ, హేమరాణి ఇంటిలోనూ కనిపించటంతో పేపర్ కటింగ్‌లోని మురళీకృష్ణ ఇతనే అయ్యుంటాడని అనిపిస్తోంది. కానీ మురళీకృష్ణ అదృశ్యంతో పేపర్ కటింగ్‌లోని మిగిలిన ప్రొఫెసర్, డాక్టర్లు ఎవరో తెలుసుకుందామనే నా ప్రయత్నం వమ్మయింది. ఇక మనకు మిగిలింది హేమరాణి మాత్రమే."

"ఎస్! ఆమెని, ఆమె మూవ్‌మెంట్లని జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తే మనకు క్లూ ఏదయినా దొరకొచ్చు" అన్నాడు రాయ్.

"హేమరాణి ప్రేమ్‌నాథ్ ఇంటికి ఎదురింట్లో దిగకముందు ఎక్కడుండేదో తెలుసుకుంటే మంచిది."

"అలాగే! మీరామెకి పీటర్ చిత్రించిన పెయింటింగ్ ఎలా వచ్చిందో కనుక్కున్నారా?"

"ఆఁ... ఓ ఫ్రెండ్ ఇచ్చాడని చెప్పింది. నేనా ప్రశ్న అడిగినప్పుడు ఆమె తడబడింది కూడా!"

"ఆ ఫ్రెండెవరో అడిగారా?"

"లేదు రాయ్! ఆమెకనుమానం వస్తుందేమో అని ఆ విషయం గురించి అడగలేదు. ఒకవేళ నేనలా అడిగితే, దానితో ఆమెకి అనుమానం వస్తే, నిజంగా ఆమె అనుమానితురాలయితే నేను మామూలుగా వాళ్ళింటికి వెళ్ళలేదని, ఎంక్వయిరీ నిమిత్తం వెళ్ళానని గ్రహించి తను జాగ్రత్తపడిపోయి తన వాళ్ళని కూడా, అలర్ట్ చేసేస్తుంది."

"మీరన్నది రైటే."

"ఈ కేసు చాలా చిత్రంగా వుంది. మనం ఎంక్వయిరీ నిమిత్తం వెళుతున్న వ్యక్తులందరూ మనం వెళ్ళగానే మరణించటమో, మరొకటో జరుగుతుంది. మొదటిగా పీటర్ మరణించటం, తరువాత ప్రేమ్‌నాథ్ హత్య, ఇప్పుడు మురళీకృష్ణ అదృశ్యం! ఇక హేమరాణి మిగిలింది ఆమె కూడా పై విధంగా అయిపోకూడదంటే మనం ఆమెకి తెలియకుండా ఆమెని వెంటాడాలి."

"యు బార్ రైట్ కరుణ్."

"ఓకే రాయ్ సాబ్... మరేమైనా విశేషాలున్నా, హైదరాబాద్ నుంచి మెసేజ్ వచ్చినా నాకు ఫోన్ చేయండి. నేను మళ్ళీ కలుస్తాను" అంటూ రాయ్ దగ్గర సెలవు తీసుకున్నాడు కరుణ్.

✧ ✧ ✧ ✧ ✧ ✧

సాయంత్రం ఆరు గంటలయింది. కరుణ్, మంజుల రామకృష్ణా బీచ్‌లో కూర్చున్నారు. వేరుశనక్కాయలమ్మేవాళ్ళూ, మురమురాలతో కారం మిక్సర్ అమ్మేవాళ్ళూ జంటలుగా కూర్చున్న యువతీయువకుల దగ్గరికెళ్ళి ఒక్కక్షణం నిలబడుతున్నారు. పెళ్ళికాని ప్రేమిక జంటలు అస్సలు వాళ్ళని గుర్తించటం కూడా లేదు. వాళ్ళ దగ్గరెవరైనా కొంటున్నారంటే వాళ్ళు పెళ్ళయిన జంటలే.

"ప్రేమికులకి ప్రతి క్షణం విలువైనదే... దాన్ని వాళ్ళు వదులుకోరు. పెళ్ళయిన వాళ్ళకి ప్రేమే జీవితం కాదు. వాళ్ళు ఆ స్టేజ్ దాటిపోయి వుంటారు. కాబట్టి వాళ్ళు ప్రేమికుల్లా కాకుండా కాస్త పరిణితి సాధిస్తారు. కనుక వాళ్ళు బాహ్యప్రపంచాన్ని దాటి వెళ్ళిపోరు.

అదే ప్రేమికులకీ, పెళ్ళయిన వాళ్ళకీ తేడా! రెండు స్టేజీల్లోనూ ప్రేమ వుంటుంది. కాని ప్రేమికుల్లా, పెళ్ళయినవాళ్ళు ప్రేమే లోకంగా జీవించరు. వాళ్ళ మధ్య బాధ్యతలు కూడా చోటు చేసుకోవటంతో జీవితం మీద అవగాహనతో కొత్త సవాళ్ళను ఎదుర్కొంటూ ముందుకు సాగుతారు. మరి కరుణ్ ఏమిటి ఏనాడూ అసలయిన ప్రేమికుడిలా కాకుండా, ఎప్పుడూ కేసులూ, ఎంక్వయిరీలు అంటాడు. ప్రేమించుకునేటప్పుడు అదే లోకం అవ్వాలి. అవతలి వారి రాక కోసం, మాట కోసం తహతహలాడాలి. ఆ స్టేజ్ దాటిపోతే, ఆ మధురానుభూతుల్ని మిస్సయితే మళ్ళీ వస్తాయా?"

"ఏమిటి మంజూ! బీచ్‌కెళదామని చెప్పి తీసుకొచ్చి మాట్లాడవేం?" అడిగాడు కరుణ్.

"ఏం మాట్లాడను? నేను నీకేం చెప్పాను? ప్రతిరోజూ నువ్వెక్కడ వున్నా, ఎంత బిజీగా వున్నా ఫోన్‌లో నాతో మాట్లాడమన్నానా... కాని రెండు రోజులు నువ్వా సంగతే మరచిపోయావ్. నీ పలుకే బంగారమైపోయింది."

"సారీ మంజూ! నిన్న ఒక్కరోజు ఫోన్ చేయటానికి అవ్వలేదు. మొన్న మాత్రం నీకు ఫోన్ చేస్తే మీ నాయనమ్మ ఎత్తింది. మంజులని పిలువమని ఎలా అడగను? అందుకే నోటికొచ్చినట్టు ఎవరి పేరో చెబితే "రాంగ్ నెంబర్" అని పెట్టేసిందావిడ. అదీ సంగతి."

"కరుణ్ ఒక్కమాట అడుగుతాను, నిజం చెబుతావా?" సీరియస్‌గా అందామె.

"ఏమిటి?" నవ్వుతూ అడిగాడతను. మంజుల సీరియస్‌గా వుంటే కరుణ్‌కి నవ్వొస్తూ వుంటుంది.

"నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?"

"వాటే సిల్లీ క్వశ్చన్? ఎందుకొచ్చిందా అనుమానం నీకు?"

"చాలామంది ప్రేమలో పడటాన్ని, ప్రేమించటాన్ని, ప్రేమించబడటాన్ని ఒకటేగా భావిస్తారు. ఇద్దరు వ్యక్తులు కలుసుకుని, ఒకర్నొకరు అద్భుతమైన వ్యక్తులుగా గుర్తించుకోవటంతో మొదలైన ఈ ప్రేమ, తన అద్భుతాన్ని కోల్పోకుండా వుండాలంటే ఇద్దరికీ బేసిక్‌గా కొన్ని అర్హతలు - విలక్షణమైన వ్యక్తిత్వమూ వుండాలి.

ప్రేమ అనేది అవతలివారికి ఆనందాన్ని ఇవ్వటానికి నిర్దేశించబడిందే తప్ప, కేవలం అవతలివారి నుంచి ఓదార్పు గానీ, ఉపశమనంగానీ పొందటానికి వాడుకునే వస్తువు కాదు. ఇతరులకేమీ ఇవ్వలేనివాడు, ఇతరుల ఆనందానికి ఇసుమంతయినా కృషి చెయ్యనివాడు ప్రేమించటానికి అనర్హుడు అంటాడు జిడ్డు కృష్ణమూర్తి" ఆవేశంగా చెప్పిందామె.

"జిడ్డు కృష్ణమూర్తిని నువ్వెప్పుడు చదివావ్?"

"మా నానమ్మ నిన్న జిడ్డు కృష్ణమూర్తి పుస్తకాలు కొనుక్కుంది. రాత్రి నేను సగం చదివాను."

"అవతలి వారినుంచి ఓదార్పు కానీ, ఉపశమనం కానీ పొందటానికి వాడుకునే వస్తువు కాదు ప్రేమంటే... నిజమే! నేనలా ఎప్పుడూ చెయలేదే?"

"హుఁ... రాత్రనకా, పగలనకా ఆ వెధవ కేసు వాదిస్తూ, ఆ కేసులో గెలువటానికి నైతికంగా నాకు బలమివ్వు మంజూ అనలేదా?"

"అన్నాను. నా మనిషిగా అది నీ కర్తవ్యం కూడా!"

"మరి జిడ్డు కృష్ణమూర్తి – "ఇతరుల ఆనందానికి ఇసుమంతయినా కృషి చెయ్యనివాడూ ప్రేమించటానికి అనర్హుడే అన్నాడు. నువ్వు నా ఆనందానికి ఏమయినా కృషి చేస్తున్నావా?"

"రెండేళ్ళ మన పరిచయంలో నువ్వెప్పుడూ అలా ఫీలవలేదా?" మంజుల మౌనంగా వుండిపోయింది.

"మాట్లాడవేం మంజూ! నేనీ కేసు టేకప్ చేసిన దగ్గర్నుంచేకదా మనం తరచూ కలవడం తగ్గింది. ముందు సంగతి మరచిపోయావా?"

"నిజమే కరుణ్! కలవడం, కబుర్ల పోగుల్లో నిండా మునిగిపోవటం అనే ఆనందం కాదు నాక్కావలసింది. నువ్వు ఏ విషయంలోనూ చిక్కుకోకుండా నా కరుణ్‌లా... నా ఊహల్లో కరుణ్‌లా... టెన్షన్లూ, ఏ క్షణం ఏమవుతుందో అనే అభద్రతాభావం లేకుండా ఉండాలని ఆశ! అప్పుడే నాకానందం."

"చూడు మంజూ! "ఇతరులకేమీ ఇవ్వలేనివాడు, తను ఆనందంగా బ్రతుకుతున్నానని అనుకోలేనివాడు, తను ఆనందంగా బ్రతకటానికి కావలసినంత కష్టపడలేనివాడు కూడా ప్రేమకి అనర్హుడే" అన్నాడు జిడ్డు కృష్ణమూర్తి. డబ్బు తీసుకుంటున్నా, నా వృత్తితో నిజాయితీగా కష్టపడి – సాయం అర్థించిన వాళ్ళకి – నాకు వీలయినంతలో సేవ చేసి ఆనందిస్తున్నాను. నేను కష్టపడి ఆనందంగా జీవించటానికి కారణం నా న్యాయవాద వృత్తి. దానిలో కొన్ని ఆటుపోటులు తప్పవ్. ఈ వృత్తే కాదు. ఏ వృత్తిలో అయినా, ఎలాంటి వారికైనా మరునిమిషం ఏం జరుగుతుందో చెప్పలేం. ఎన్నో కర్మాగారాల్లో అందులోని టెక్నీషియన్లు ప్రమాదవశాత్తు గాయాల పాలవటం, లేదా మరణించటం జరుగుతుంది. పొరపాటు జరిగితే తమ ప్రాణాలు పోతాయని, తాము నిర్వహిస్తున్న వృత్తి ప్రమాదకరమైందని వాళ్ళకి తెలుసు. అయినా వాళ్ళు అదే వృత్తిలో కొనసాగుతారు.

ఏ ప్రమాదమూ లేని ఉద్యోగాలు చేసే ఉద్యోగులు అయినా, నిత్యం ప్రమాదాలు జరిగే మృత్యుద్వారాలువంటి రోడ్లమీద రోజూ ప్రయాణించరావాల్సి వస్తుంది. అంతమాత్రాన వాళ్ళు ఉద్యోగాలు మానేసి ఇంట్లో వుండిపోతున్నారా?" ఆమెనే సూటిగా చూస్తూ అన్నాడు కరుణ్.

"అవన్నీ ఆయా వ్యక్తులు పొరపాటు చేసినప్పటిమాట."

"అలాగే నేను కూడా నా వృత్తిలో పొరపాటు లేకుండా, నన్నింతగా ప్రేమిస్తున్న నీకే నష్టం... అదే నాకేదయినాజరగటం అంటూ అయితే నీకది నష్టమే కాబట్టి చాలా జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాను. నీకు ఇంతకు ముందే చెప్పానుగా... నాకు ఈ కేసు పరంగా బెదిరింపులు, కేసు విత్‌డ్రా అయిపోమని హెచ్చరింపులు కాని వస్తే మరుక్షణం మానేస్తానని" అన్నాడు అతను.

"నీకు తెలియదు కరుణ్, నా మనసెందుకో ఈ మధ్య ఎప్పుడూ కీడు తలుస్తోంది. నిద్రపోతే ఏవేవో పీడకలలు, నీ కేసు కాదుకానీ, నేను అనుక్షణం మనశ్శాంతి లేకుండా జీవిస్తున్నాను."

"చూడు మంజూ! మన మనస్సొక పూలవనం వంటిదంటారు సైకియాట్రిస్టులు. ఆ వనంలో ఆనందం, సంతోషం, ధీమా, ధైర్యం, భద్రతా భావం వంటి పాజిటివ్ విత్తనాలని జల్లితే అవే పుష్పించి మనల్ని వాటి సువాసనలతో మైమరపిస్తాయట. అలా కాకుండా ఎప్పుడూ అపజాయాన్ని తలచుకుంటూ, భయం, నిరాశ, ఈ పని మన వల్లకాదు అనే భావాలు పెంచుకుంటే అని మన అన్ – కాన్షియస్‌లో స్థిర నివాసమేర్పరచుకుని, మనమే పని చేసినా వెనక్కు లాగుతాయట.

కనుక... నీ ఆలోచన ధోరణిని పాజిటివ్ వైపు మరల్చి, ధీమా తత్వాన్నీ, ఎప్పుడూ విజయం మనదే అన్న ఆశావాద ధృక్పధాన్ని అలవరచుకో."

"చెప్పటం సులువే కరుణ్! కాన చేసేసరికి అటువంటిని కష్టతరమౌతాయి." మెల్లగా అంది మంజుల.

"అయితే సెల్ఫ్‌హిప్నాటిజమ్ ప్రాక్టీస్ చెయ్."

"సెల్ఫ్ హిప్నాటిజమా?"

"అవును... అదెలాగంటే... నీకు నిద్రలో ఏవో పీడకలలు వస్తున్నాయన్నావ్. అలాంటప్పుడు నువ్వు – 'నేనిపుడు బాగా రిలాక్స్ అవుతున్నాను. నా నిద్రకు ఎటువంటి భంగం కలగదు. నాకు నిద్రలో ఎటువంటి పీడకలలు రావు. నేను నిద్రలోకి పోగలను... కొద్ది క్షణాలలో నేను నిద్రలోకి జారుకుంటాను. ఉదయం నేను నిద్ర లేచినప్పుడు ఎంతో ఫ్రెష్‌గా వుంటాను. నాకు ఈ నిద్ర ఎంతో తృప్తినీ, మానసిక శాంతినీ కలిగిస్తుంది" అనుకోవాలి.

సెల్ఫ్ హిప్నాటిజమ్ చేసుకున్న వ్యక్తిలో ఒక తేజస్సు వుంటుంది. వాళ్ళెప్పుడూ నీరసంగానూ, బాధాకరంగానూ వుండరు. సెల్ఫ్‌హిప్నాటిజమ్ ప్రాక్టీస్ చేసినవారు ధైర్యంగా, ఆత్మ విశ్వాసంతో ఉండగలుగుతారు. వాళ్ళకి సమస్యలు వస్తే ఇతరుల్లా కుంగిపోరు.

నీకు తెలుసా? మహాత్మాగాంధీ ఆఫ్రికాలో పర్యటించినప్పుడు పగలనక, రాత్రనకా తిరుగుతూ అలసట అనిపించినపుడల్లా సెల్ఫ్‌హిప్నాటిజం చేసుకుని మానసిక విశ్రాంతి పొందేవారు.

అంతేకాకుండా దీని వలన కోపం, ఉద్రేకం, అనవసరపుభయాలు, భ్రాంతులను జయించవచ్చు. దేశ విదేశాలలో హిప్నోథెరపిస్టులు, సైకియా ట్రిస్టులూ ఋజువు చేశారీ విషయాన్ని.

విదేశాలలో పిప్పి పళ్ళ బాధ వున్నవారు, ఆవి పీకించుకునే ధైర్యం లేనివారు సెల్ఫ్‌హిప్నాటిజం ప్రాక్టీసు చేయడం మామూలు విషయం. కొంతమంది అలాంటి సమయాల్లో 'ఎనస్థిషియా' లాంటి మత్తుపదార్థం లేకుండా హిప్నాటైజ్ చేయించుకుంటారు.

భయం, భ్రాంతి, అనుమానం అనేపెనుభూతాలు వంటి వాటికి మన మనస్సే నిలయం. అటువంటి వాటికి సరయిన మందు సెల్ఫ్‌హిప్నాటిజమ్. దీని సాధన కూడా చాలా సులభతరం, మనకే విషయంలో అయితే భయంకానీ, ఆందోళన కానీ వుందో ఆ విషయం గురించి సంపూర్ణ అవగాహనతో ఆలోచించి, విశ్లేషించి చూస్తే చాలా వరకు మన భావాలు అర్ధరహితమైనవనీ, సహేతుకంగా లేవని తేలుతుంది. అందుకని మనల్ని భయపెట్టే వాటికి ఎదురునిలిచిపోరాడాలి. దానికి సెల్ఫ్‌హిప్నాటిజం బాగా ఉపయోగపడుతుంది.

సెల్ఫ్‌హిప్నాటిజమ్‌లో మొదటి పాఠం... పాజిటివ్ థింకింగ్. కీడెంచి మేలంచమని మన పెద్దలంటారు. కానీ ఏ సమయంలోనూ మనస్సులోకి నెగెటివ్ థింకింగ్... అదే మన పెద్దల భాషలో అయితే కీడు గురించి తలపోయవద్దని సైకియాట్రిస్టులూ, హిప్నాటిస్టులూ సూచిస్తారు.

సెల్ఫ్ హిప్నాటిజమంటే అదేదో పెద్ద తతంగమనుకుంటారు తెలియనివాళ్ళు. కానీ అది తప్పు. సెల్ఫ్ హిప్నాటిజమంటే ఎప్పుడూ ప్రశాంత చిత్తాన్ని అలవరచుకోవటం. మన మనస్సనే గుర్రానికి కళ్ళేంవేసి అదుపులో వుంచుకోవటం.

"నేనీ పని చేయగలను... నేనీ పని చేయగలను" అని పదే పదే అనుకుంటే ఆటోమాటిక్‌గా అది మనఅన్-కాన్షియస్‌లోకి ఇంజెక్టయి మనం ఎందుకున్న పని ఎంత కష్టమైనదయినా చేయగలుగుతాం.

మన మనస్సు ఏ విషయం గురించయినా అదేపనిగా ఆందోళన చెందుతుంటే.... "నా మనస్సు ప్రశాంతంగా వుంది. నా సమస్య అసలు సమస్యేకాదు. నేను రిలాక్స్‌గా వుండగలను అని పదేపదే అనుకుంటే మనలో ఆందోళన తగ్గుముఖం పడుతుంది."

"కరుణ్! నీకీ విషయాలన్నీ ఎలా తెలుసు?"

"నా హిప్నాటిస్టు మిత్రుడి ద్వారా తెలుసుకున్నాను."

"మరి నువ్వు సెల్ఫ్ హిప్నాటిస్ నేర్చుకున్నావా?"

"నేర్చుకోవటమంటే ఇదేటైప్ ఇన్స్టిట్యూట్‌కో వెళ్ళి, ఫలానా సమయంలోనే నేర్చుకోవాలనేం లేదు మనకెప్పుడు ఖాళీగా వుంటే అప్పుడు మన మనస్సుకి ఆహ్లాదం కలిగించే మాటలతో, మన మీద మనకి నమ్మకం, ధైర్యం పెరిగే విధంగా సజెషన్స్ ఇచ్చుకోవటమే. దీనికి ఎర్లీ మార్నింగ్ కానీ భోజనానికి రెండు గంటల తరువాత, రాత్రి నిద్రకి ముందుగానీ చేసుకుంటే సత్వర ఫలితాలు వస్తాయి."

"అయితే నేనీరోజు నుంచే సెల్ఫ్ హిప్నాటిజిమ్ నేర్చుకుంటాను" ఉత్సాహంగా అంది మంజుల.

"గుడ్‌లక్...." నవ్వుతూ అన్నాడు కరుణ్.

చీకటి తెరలులోకాన్ని క్రమంగా కప్పేస్తున్నాయి. ఇద్దరూలేచి రోడ్డు మీద ఉన్న కరుణ్ కారు వైపు నడిచారు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"గుడీవినింగ్ రాయ్!" కరుణ్ మాటలకి ఏదో రాసుకుంటున్న రాయ్ తలెత్తి చూశాడు.

"గుడీవినింగ్ కరుణ్‌జీ... సిట్‌డౌన్...." అంటూ కుర్చీ చూపించాడు.

"ఎనీ మోర్ ఇన్ఫర్మేషన్ ఇన్ మై కేస్...?" అడిగాడు కరుణ్.

"యస్ మిస్టర్ కరుణ్. టెన్‌మినిట్స్ క్రితమే నేను మీ ఇంటికి ఫోన్ చేశాను. అయితే ఎవరూ లిఫ్ట్ చేయలేదు."

"చెప్పండి...."

"మీరిచ్చిన హైదరాబాద్ ఎడ్రస్‌లో హరిణీ అనే అమ్మాయి... ఐ మీన్ ప్రేమ్‌నాథ్ మిస్సెస్ ఉండేదట. కాని పది, పన్నెండు రోజుల క్రితమే ఆ ఇల్లు ఖాళీ చేసేసి వేరే ప్రాంతంలోకి షిఫ్టయిపోయారట."

"షిఫ్టయిపోయారా? అదే ప్రదేశమో తెలిసిందా?"

"లేదు...."

"హరిణీ ఎందుకు షిఫ్టయిపోయింది. హేమరాణి చెప్పినట్టు ఆమె భర్తని హత్యచేసి, ఎవరికీ దొరకకూడదని అలా చేసిందా?"

"అలా కూడా జరగటానికి పాజిబులిటి వుంది కరుణ్."

"రాను రాను కేసు పూర్తి జటిలంగా మారిపోతుంది...." నిట్టూరుస్తూ అన్నాడు కరుణ్.

"హైదరాబాద్‌లోనే వుండి హరిణీని ట్రేస్‌చేయమని మా ఏజెంట్‌కి చెప్పమంటారా?"

"కానీ అంత పెద్ద నగరంలో ఆమెనెలా గుర్తుపడతారు....?" అన్నాడు.

"ఆమె ఫోటో దొరికితే...."

"నేను ప్రేమ్‌నాథ్ ఇంటికెళ్ళినప్పుడు చూశాను. అతనింట్లో ఏ విధమైన ఫోటోకానీ లేదు. ఇల్లంతా సెర్చ్ చేద్దామంటే ఇల్లు పోలీసులు సీజ్ చేసి కాపలా వుంటున్నారుగా!"

రాయ్ కూడా ఆ మాటలతో ఏవీ పాలుపోనట్టు కరుణ్ వంక చూశాడు.

"హేమరాణీ విషయలేమైనా తెలిశాయా?"

"లేదు. ఆమెదంతా రొటీన్ లైఫ్. రోజూ ఉదయం తొమ్మిదింటికి తను పనిచేస్తున్న 'మాలబ్యాషేర్ & బ్రోకర్స్' ఆఫీసుకి వెళ్ళటం, తిరిగి సాయంత్రం ఆరూ, ఆరున్నరకి ఇంటికి చేరుకోవటం... అంతే!

"ఆమె ఎక్కడికైనా వెళ్ళటం, లేకపోతే ఆమెకోసం ఎవరయినా రావటం జరుగుతుందా?"

"ఇప్పటివరకూ లేదు. ముందుముందు చెప్పలేం."

"ఓకే రాయ్! గుడ్‌నైట్. ఏదయినా విషయం వుంటే ఫోన్ చేయండి" అంటూ బయటికి నడిచాడు కరుణ్.

✣ ✣ ✣ ✣ ✣ ✣

ఉదయం ఆరుగంటలయింది. కరుణ్ లేచి బాత్‌రూమ్‌లోకి నడిచి కాలకృత్యాలు తీర్చుకుని. మిల్క్ బ్రాయిలర్లో పాలు వేడిచేశాడు. కాఫీ కలుపుకుని, కిటికీలోంచి పేపర్‌బోయ్ లోపలికి వేసిన న్యూస్ పేపర్ తీసుకుని చూడసాగాడు.

మెయిన్ పేపల్లో ఇంపార్టెంట్ న్యూసేమీ లేదు. సిటీ ఎడిషన్ చేతిలోకి తీసుకుని, కాఫీ సిప్ చేస్తూ చూడసాగాడు.

"విద్యాశాఖామంత్రి నేడు నగరానికి రాక, ఆరుగురు పిల్లల్ని ఒకేసారి ప్రసవించిన స్త్రీ, మెంటల్ ఆస్పత్రిలో డాక్టర్ల కొరత... మొదటి పేజీని తిరగేస్తుండగా ఆకర్షించింది శీర్షిక అతన్ని...

"నగరానికి కొత్తగా వచ్చిన పోలీస్ కమీషనర్... తిరగదోడుతున్న పాతకేసులు" గబగబా చదవసాగాడు కరుణ్.

స్పాట్‌న్యూస్ : ఇటీవలే విశాఖ నగర్ పోలీస్ కమీషనర్‌జీ వెల్లంకి ప్రసాద్ భూపతి స్థానంలో వచ్చిన కొత్త కమీషనర్ శ్రీ కొండారాజేష్ పాత కేసుల్నీ, ఇంతవరకూ తమ శాఖ అతీగతీ తేల్చలేకపోయిన కొన్ని అనూహ్యమైన కేసుల్నీ గూర్చి తెలుసుకుని వెంటనే వాటి సంగతి చూడమని తన కింది అధికారులకి ఆజ్ఞాపించారని తెలిసింది.

వీటిలో ప్రముఖంగా ఈమధ్య విశాఖనగరంలో విచ్చలవిడిగా సంచరిస్తూ, నగర శివార్లలో తమ ముఠాలతో దోపిడీలు చేస్తూ పోలీసులతో "దొంగాట" లాడుతున్న తెలగపాముల, స్టువర్ట్‌పురం దొంగల కేసు, లాసన్స్ బే కాలనీలోని ఓ చిత్రకారుని ఇంటిని గుర్తుతెలియని వాళ్ళెవరో బాంబ్‌తో పేల్చివేసిన కేసూ, పెదవాల్తేరులోని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని అతని భార్యే హత్యచేసి పరారయిన కేసూ ప్రముఖమైనవి.

తమ శాఖ చూపుతున్న ఉదాశీన వైఖరి వలనే ఈ కేసుల దర్యాప్తు నత్తనడకతో సాగుతున్నాయని. వీటి సంగతి త్వరలోనే తేల్చుకోవాలనే పట్టుదలతో కొత్త కమీషనర్ వున్నారని ఆ పత్రిక పేర్కొంది. పేపర్ పక్కన పెట్టి కాఫీ సిప్‌చేస్తూ ఏదో ఆలోచించసాగాడు కరుణ్.

"ట్రింగ్–ట్రింగ్... ట్రింగ్–ట్రింగ్" ఫోన్ మోతకి ఆలోచనలు కట్టిపెట్టి రిసీవర్ చేతిలోకి తీసుకున్నాడు.

"హలో కరుణ్!" అట్నుంచి మంజుల గొంతు వినిపించింది.

"హాయ్ మంజూ! గుడ్‌మానింగ్. ఏమిటింత ఉదయమే ఫోన్ చేశావ్?"

"నువ్వు చెప్పినట్లే సెల్ఫ్ సజేషన్స్ ఇచ్చుకుని రాత్రి నిద్రపోయాను కరుణ్."

"వెరీగుడ్! రాత్రి మళ్ళీ పీడకలలు వచ్చాయా?"

"లేదు!"

"ఏమిటి సంగతులు?"

"ఈ రోజు పేపర్ చూశావా?" అడిగిందామె.

"ఇప్పుడు చూశాను. ఏం?"

"కొత్తగా వచ్చిన పోలీస్ కమీషనర్... పాత కేసులన్నీ శ్రద్ధతో తిరగదోడుతున్నాడట... ఆ రోజు మనం రియల్ ఎస్టేట్ ఓనర్ హత్య జరిగినపపుడు అక్కడే వున్నాం కదూ... ఐమీన్... జరిగాకే అనుకో... మనకేం అవ్వదుగా!" ఆందోళన ధ్వనించిందామె కంఠంలో.

"ఏమీ కాదు. కానీ మంజూ... ఇలాంటి విషయాలు ఫోన్‌లోనా మాట్లాడేది. కీప్ క్వయిట్. మరెప్పుడూ ఇలా మాట్లాడకు."

"సరేలే! ఈ రోజు ఏమిటీ నీ ప్రోగ్రాం?" అడిగిందామె.

"నీకు తెలుసుగా నా డ్యూటీ ప్రకారం అనుమానికుల కోసం గాలింపు, మధ్యాహ్నం లంచ్, తర్వాత రాయ్‌గారి దగ్గరికి వెళ్ళటం, డిన్నర్ తీసుకునేవరకూ మళ్ళీ ఊరిమీద పడి సెర్చింగ్."

"ఊఁ..." నిట్టూర్చిందామె.

"ఏమిటలా నిట్టూర్పులు విడుస్తావ్?"

"చక్కగా ఎవరినైనా నీ దగ్గర జూనియర్‌గా ఎపాయింట్ చేసుకుని ఆ పనులు వాళ్ళకి అప్పగించేయవచ్చుగా..."

"ఎవరినైనా జూనియర్‌గా చేర్చుకుందామనే నాకూ వుంది."

"మరి చేర్చుకో!"

"ఇద్దరు ముగ్గురు ఇంతకుముందు చేరారు... కానీ నీకో సంగతి తెలుసా? నా గొప్ప చెప్పుకోవటం కాదు కానీ... వాళ్ళూ నా వయస్సు వాళ్ళే. కొన్ని నెలలు కూడా నా దగ్గరుండలేదు. వాళ్ళకి తాము అప్రెంటిస్‌గా జాయినవ్వాలంటే... లాయర్‌గా మంచి పేరే కాదు... వయస్సులో కూడా తమకంటే పెద్దవాళ్ళయితేనే చేరతారు. నాకు అతి తక్కువ సమయంలోనే క్రిమినల్ లాయరుగా మంచిపేరు రావటంతో నా దగ్గర జూనియర్‌గా వాళ్ళు చేరినా, ప్రతి విషయాన్ని నన్ను అడిగి తెలుసుకోవటానికి, వచ్చిన కేసులోని ఎక్కడ పట్టు సంపాదించాలనే అంశాల్ని నా వెనకుండి గ్రహించటానికి అహం అడ్డువచ్చింది. "మా ఈడు వాడే అయినా ఇతన్ని మేం సార్‌సార్ అంటూ మన్నించాల్సి వస్తుందే" అని తెగబాధపడిపోయేవారు. నేనది గ్రహించి వాళ్ళతో ఎంత కలసిపోయినా వాళ్లలో డెవలప్‌మెంట్ అయిన "ఫ్రిజిడ్‌నెస్ పోలేదు. దాంతో వాళ్ళు వాళ్ళ అహాలకి తగ్గట్టు, తమకంటే వయసులో పెద్ద వాళ్ళయిన వారిదగ్గర చేరారు. ఇది మనిషియొక్క మనస్థత్వాన్ని సూచిస్తోంది. నిజంగా ఏదైనా నేర్చుకోవాలని అనుకున్న వాడు, ఆ విషయంలో పరిజ్ఞానం వున్న వ్యక్తి తమకంటే ఎంత చిన్నవాడయినా, అతనిలోని టాలెంట్‌పరంగా తమకంటే పెద్దవాడే కాబట్టి చిన్నా – పెద్దా అని చూడకుండా అతని దగ్గరున్నా విద్యనభ్యసించాలని అనుకోవాలి. కానీ చాలమందిలో అటువంటి మెంటల్ మెచ్యూరిటీ లేకపోవటంతోనే ఎవరయినా ఓ వ్యక్తి తన ప్రతిభతో గొప్ప పేరు తెచ్చుకున్నా దాన్ని అతడి వయసుతో ముడిపెట్టి చిన్నవాడయితే "ఆఁ... ఏదోలే" అని చప్పరించేస్తారు."

"ఊఁ... అయితే నన్ను చేర్చుకో" చిలిపిగా అంది మంజుల.

"నాకేం అభ్యంతరం లేదు..."

"అయితే జీతం ఎంతిస్తావ్?"

"అప్రెంటిస్‌లకు జీతం ఇవ్వరు. నువ్వే ఇవ్వాల్సుంటుంది."

"ఎంత?"

"ఎంత అనేకంటే ఏమిటి అంటే సమాధానం చెబుతాను."

"అయితే ఏమిటి?"

"రోజుకో స్వీట్..."

"ఓస్ స్వీటేనా?" వెంటనే అందామె.

"ఇంకా నేను పూర్తిగా చెప్పకుండానే అందేసుకుంటే ఎలా?"

"ఓ సారీ...!"

"స్వీట్లూ–హాట్లూ కాదు."

"మరి?"

"రోజుకో... స్వీట్... కిస్" ఆగి ఆగి చెప్పాడతను.

"ఇలాంటి విషయాలు ఫోన్‌లోనా మాట్లాడేది. కీప్ క్వయిట్ మరెప్పుడు ఇలా మాట్లాడకు."

"అమ్మదొంగా... నా మాటలు నాకే అప్పగిస్తున్నావే..."

"అవును తెలీకడుగుతాను... మీ లాయర్లకూ, పోలీసులకు అందరూ దొంగల్లానూ, డాక్టర్లకేమో అందరూ పేషెంట్లగానూ కన్పడతారా ఏమిటి ఖర్మ.

"హ...హ...హ...! గుడ్‌జోక్" నవ్వి అన్నాడు కరుణ్.

"ఓకే కరుణ్... మా నాయనమ్మ వస్తుంది... ఫోన్ పెట్టేస్తాను... ఈవినింగ్ గానీ లేకపోతే నైట్‌గానీ నేనే ఫోన్ చేస్తాను."

"పెట్టేసేముందు ఓ స్వీట్...కి..." అతని మాటలు పూర్తవకముందే అట్నుంచి మంజుల ఫోన్ క్రెడిల్ చేసేసింది.

"హు!..." దీర్ఘంగా నిట్టూర్చాడు కరుణ్.

గబగబా డ్రస్సయి ఇంటికి లాక్‌చేసి కారులో కూర్చుని సాగిపోయాడు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"కిర్రు" మంటూ కీచురాళ్ళు అదే పనిగా రొద చేస్తున్నాయి. ఎక్కడో దూరంగా కుక్క మొరిగింది. మున్సిపాలిటీ వాళ్ళ నిర్లక్ష్యాన్ని ప్రతిబింబిస్తూ వీధిలైట్లు చీకటి గుప్పెట్లో జరిగిపోయాయి.

రాత్రి పన్నెండు గంటలవటంతో వీధిలో మనుషుల సంచారం లేదు. రాయ్ డిటెక్టివ్ ఏజెన్సీ ఏజెంట్ మహేష్ హేమరాణి ఇంటి ఎదురుగా వున్న అగ్నిపూల చెట్టుకింద పడుకుని అటే చూస్తున్నాడు. గాలికి రాలిన అగ్నిపూలు అతనికి నేలమీద పడుకున్న భావనని కలగనివ్వటంలేదు. ఆ చీకటిలో పట్టి పట్టి చూస్తే కాని మహేశ్ కనిపించటంలేదు. ఒకవేళ ఎవరయినా అతన్ని చూసినా క్యాజువల్‌గా తీసుకుంటారు. ఎందుకంటే అతను ఓ మెకానిక్ దగ్గర తీసుకున్న డ్యూటీ బట్టలు ధరించి వున్నాడు. ఆ సమయంలో అతన్ని చూస్తే ఎవరో కూలీ చెట్టుకింద నిద్దరపోతున్నట్టుగా వుంది. మాసిపోయి, ఆయిల్ మరకలతో వున్న ఆ బట్టలు మహేశ్ రూపాన్ని బాగా మార్చేసాయ్.

"చీఫ్ రాయ్‌గారి అదేశం ప్రకారం రెండు మూడు రోజులనుంచీ ఈ హేమరాణిని నీడలా వెంటాడుతున్నా, అనుమానస్పదమైన విషయాలేవీ తెలియటంలేదు. బహుశా రాయ్‌గారు పొరబడి వుంటారు. హేమరాణి మీద నిఘా అనవసరమేమో" అనుకున్నాడతను.

అదే సమయంలో మారుతీ వ్యానొకటి వస్తూ కన్పించింది. మహేశ్ కళ్ళు మూసుకుని, మోచేయి కళ్ళకడ్డంగా పెట్టుకుని నిద్ర పోతున్నట్టు నటించాడు.

ఆ మారుతీవ్యాన్ మహేశ్‌ని సమీపించి స్లో అయింది. అతను ఒక్క క్షణం గాబరా పడ్డాడు.

"ఏమిటీ నన్నెవరైనా గుర్తు పట్టేశారా?" అనుకున్నాడు. అయినా కదలక మెదలక అలాగే ఉండిపోయాడు. ఆ వ్యాన్ "యూ" టర్న్ తిరిగి హేమరాణి ఇంటిముందు ఆగింది. మహేశ్ ఎలర్టయి చూడసాగాడు. అతను పడుకుని వుండటంతో దిగిన వ్యక్తి కాళ్ళే కన్పించాయి. వెంటనే లేచి నిలబడ్డాడతను. కానీ అప్పటికే వ్యాన్‌లో వచ్చిన వ్యక్తి లోపలికెళ్ళిపోయాడు.

"కనీసం కాలింగ్‌బెల్ కూడా మ్రోగించకుండా వెళ్ళిపోయాడంటే... తనకోసం ఎవరో వస్తారని ఆమెకి ముందే తెలిసి, తలుపులకి గడియ అయినా పెట్టుకోదా? అనుకుంటూ మెల్లగా లేచి వ్యాన్ దగ్గరికి చేరుకున్నాడతను. నాచురంగు వ్యాన్ అది. నెంబర్ ప్లేట్లమీద "ఫర్ రిజిస్ట్రేషన్ అని రాసి వుంది.

"ఇది కొత్త బండి కూడా కాదే. మరి నెంబర్‌కి బదులు ఇలా రాసుందేమిటి?" అనుకున్నాడతను.

చేసేదేమీలేక మళ్ళీ చెట్టుకిందకి వచ్చి పడుకున్నాడు. హేమరాణి ఇంట్లో లైట్లు వెలగటంలేదు.

"సమ్‌థింగ్ రాంగ్!" తనలోనే అనుకున్నాడతను. క్షణాలు నిమిషాలుగా, నిమిషాలు గంటలుగా మారిపోయాయి.

"కొక్కొరొక్కో!" ఎక్కడో కోడి కూత పెట్టింది.

"తెల్లవారిపోయిందే!" బయటికే అనుకున్నాడు మహేశ్. ఇంతలో మళ్ళీ వ్యాన్ అడుగునుంచి బూట్లు వస్తూ కనిపించాయి. వ్యాన్ తలుపులు తీసివేయటం, వెంటనే స్టార్టయి వెళ్ళిపోవటం. మహేశ్‌లేచి ఆ వ్యాన్‌లో వచ్చిన వ్యక్తి ఎవరో చూద్దామనుకునేసరికే జరిగిపోయాయ్.

"బ్యాడ్‌లక్!" నిట్టూర్చాడతను. వ్యాన్ వేగంగా వెళ్ళి కుడివైపుకు తిరిగిపోయింది. తిరిగి హేమరాణి ఇంటివైపు చూశాడతను. ఏ అలలూలేని నదిలా నిశ్శబ్దంగా వుందక్కడ.

చీకట్లను చీల్చుతూ భానుడు ఒక్కో వెలుగు అస్త్రాన్నే లోకంమీదికి సంధిస్తున్నాడు. భాస్కరుడి ఆగమనంలో చీకటి చల్లగా చిత్తగిస్తోంది. అదే సమయంలో, మహేశ్ స్థానాన్ని భర్తీ చేయటానికి మరో ఏజెంట్ అరుణ్ వచ్చాడు అతన్ని చూసి ముందుకు నడిచాడు మహేశ్. ఇద్దరూ వీధి చివరికి పోయి హేమరాణి ఇంటివైపే చూడసాగారు.

"ఏమయినా తెలిసిందా?" అడిగాడు అరుణ్. మహేశ్ జరిగిందంతా చెప్పాడు.

"ఓ.కే! నువ్వు రాయ్‌గారికి మెసేజ్ పాస్‌చేసి వెళ్ళిపో."

"ఓకే బై" వెళుతూ అన్నాడు మహేశ్.

"బై బై!" తిరిగి అన్నాడు అరుణ్.

⁂ ⁂ ⁂ ⁂ ⁂ ⁂

కరుణ్ కారు రాయ్ ఆఫీస్ ముందు ఆగింది. అతను కారు దిగి లోపలికి నడిచాడు. రాయ్ సీట్లోలేడు.

"రాయ్ సాబ్ లేరా?" అడిగాడు అక్కడే వున్న యువకుడ్ని.

"లేరు. వచ్చేస్తారు" చెప్పాడతను.

కరుణ్ రాయ్ టేబిల్‌మీద వున్న ఓ పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని చదవసాగాడు. అది పెంగ్విన్ ప్రచురణ కర్తలు ప్రచురించిన "ది నొటోరియస్ స్పైస్ అండ్ డిటెక్టివ్స్" అనే పుస్తకం.

గూఢచారులు, డిటెక్టివ్‌లు సేకరించే సమాచారం అందరికీ తెలిసిన న్యాయమైన మార్గాలద్వారానే జరుగుతుంది. ఒక డిటెక్టివ్ లేదా గూఢచారికి తన రోజులో చాలాభాగం పబ్లిష్ అయిన పేపర్స్, పుస్తకాలను దస్తాల కొద్దీ సేకరించిన వాటిని చదవటంతోనే గడపవలసి వస్తుంది.

ఉదాహరణకి – ఒక గూఢచారికి అతని ప్రభుత్వం తమ శతృదేశం "ధృవ రియాక్టరులో" అణ్వస్త్రాలకు పనికివచ్చే ఇంధనం తయారు చేస్తుందేమో కనుక్కోమని ఆదేశించింది. వెంటనే అతను "ధృవ రియాక్టర్" గురించి పబ్లిష్ అయిన ప్రతి పేపర్, ప్రతి పుస్తకం, ప్రతి న్యూస్ ఐటమ్ చదివాడు.

అలా చదవగా, చదవగా అతనికో విషయం తట్టింది. తమ శతృ దేశానికి అప్పట్లో వైద్యానికి పనికివచ్చే ఒక రకం రేడియో ఐసోటోప్స్‌కి కొరత ఏర్పడింది. డిపార్టుమెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీవారు అతిత్వరలో ఆ కొరత తీరుస్తామని తమ ప్రభుత్వానికీ, ప్రజలకీ హామీ ఇచ్చారు. ధృవ రియాక్టరులో అలాంటి ఐసోటోప్ తయారవుతుందని ఈ గూఢచారికి ముందే తెలుసు. దానినిబట్టి అతను ఓ విషయం కనుక్కున్నాడు. ధృవ రియాక్టరులో తయారవుతున్న ఐసోటోప్ ఆ దేశపు వైద్యావసరాలకే తగినంత లేదు. అందుకని అటామిక్ డిపార్టుమెంట్ – ఐసోటోప్ ఉత్పత్తిని పెంచినా, ముందుగా వైద్యావసరాలకే దానిని మళ్ళిస్తుంది. కనుక కనీసం తమ శతృదేశం మరో పదేళ్ళవరకూ అణ్వాయుధాలు తయారుచేయడానికి వీలుపడదు. ఇంత గొప్ప సమాచారం అతను కడుపులో చల్ల కదలకుండా తన ఆఫీసులో కూర్చునే తెలుసుకున్నాడు.

రాయ్ ఇంకా రాకపోవటంతోనూ, ఆ పుస్తకం ఇంట్రెస్టింగా ఉండటంతోనూ కరుణ్ చదవటం కంటిన్యూ చేశాడు.

చైనాకి చెందిన ఓ గూఢచారి ఎత్తు మూడడుగుల రెండంగుళాలు. అతని పేరు "చియాంగ్ హూ" ఇతను పొట్టివాడయినా మహా గట్టివాడు. తమదేశం ఇతన్ని గూఢచర్యం నిమిత్తం ఏ దేశానికి పంపినా, అతనెక్కడికి వెళ్ళి తన పనిని అతి సులువుగా చేసుకుని వచ్చేవాడు. అదెలాగంటే...

"చియాంగ్ హూ" కి ఓ సెక్రటరీ ఉండేది. ఆమె ఎత్తు అయిదడుగుల రెండంగుళాలు. ఆమె అతన్ని ఓ చిన్నపిల్లాడిలా తయారుచేసి, ఎత్తుకుని తిప్పేది. అతను ఆమె చంకలో వుండే అన్ని విషయాల్నీ తెలుసుకుని, తమ దేశానికి వర్తమానాల్ని పంపిస్తుండేవాడు.

ఇక అమెరికాకి భారతదేశంలోని లేబర్, ఆర్థిక, సైనిక, వైద్య రంగాల్లోని విషయాలన్నీ తెలిపినంతగా మరే దేశానికి తెలియదు. భారతదేశంలో ఏ సంవత్సరంలో ఎంత గోధుమ పండించిన సంగతినుంచి, ఏ బెటాలియన్‌కి ఎవరు కమాండింగ్ ఆఫీసరుగా వున్నారో కూడా తెలుసు.

రష్యా తన గూఢచారులని ప్రభుత్వోద్యోగులుగా, పైలెట్‌లుగా, రాయబార కార్యాలయ సిబ్బందిగా చూపిస్తోంది రికార్డులలో, రష్యన్లు మన భాషలను నేర్చుకోవడంకోసం కృషి చేస్తారు. దానివలన ప్రజలద్వారా మరిన్ని విషయాలు తెలుస్తాయని. రష్యా గూఢచారులు చాలమంది, హిందీ, బెంగాలీ – ఉర్దూ మాట్లాడగలరు. అమెరికన్స్‌కి ఆ ప్రావీణ్యం లేదు. ఇక బ్రిటిషు గూఢచారులకి డబ్బు అంత ధారాళంగా అందదు. వీరిలో అమెరికా గూఢచారులు తమ దేశంలో గ్రీన్‌కార్డు ఇప్పిస్తామంటే రహస్యాలు చెప్పేస్తున్న వాళ్ళున్నారు.

ఇక బ్రిటన్ ఎక్కువగా తన శతృదేశంలోని తిరుగుబాటు దారుల ద్వారా రహస్యాలు సేకరిస్తుంది.

చైనా గూఢచారులకు కష్టాలెక్కువ. వాళ్ళని ఎవరయినా ఇట్టే గుర్తిస్తారు. అందుకని వాళ్ళు యథేచ్ఛగా తిరగలేరు. వాళ్ళది బీదదేశం అవటం వలన డబ్బుకు కొరత. ఇతరదేశాల్లాగా భార్యా. బిడ్డలని వెంట తీసుకెళ్ళటానికి వాళ్ళ ప్రభుత్వం ఒప్పుకోదు. వాళ్ళు పార్టీలు, షికార్లూ చేయరు. ఎక్కువకాలం పుస్తకాలతో గడుపుతారు. దానివలన వారికి ఇక్కడి స్థితి మొత్తం తెలుస్తుంది.

ఫ్రెంచి, ఇటాలియన్ గూఢచారులకి భారతదేశపు మిలటరీ, కమర్షియల్ ఇంటిలిజెన్స్‌లపై ఆసక్తి ఎక్కువ.

ఆస్ట్రేలియన్ గూఢచారులు స్నేహ పూరితంగా అందరితో కలిసిపోయి, సమాచారం సేకరించే తెలివైన వాళ్ళు.

నెదర్లాండ్. స్కాండనేవియన్ దేశాలు – వాళ్ళు మన దేశంలోని పిల్లలకు సరఫరా చేస్తున్న పాలపొడిలాంటివి చేరవలసిన వాళ్ళకు చేరుతున్నాయా లేక రాజకీయ పందికొక్కులు మధ్యన మింగేస్తున్నారా అని మాత్రమే ఆరా తీస్తాయి. వాళ్ళు మిలిటరీ, కమర్షియల్ సమాచారంమీద అంత ఆశక్తి చూపరు.

"హలో కరుణ్! ఎంతసేపయింది మీరొచ్చి?" రాయ్ మాటలకు చదువుతున్న పుస్తకం పక్కనపెట్టి వెనుదిరిగి చూశాడు కరుణ్.

అప్పుడే లోపలకు వస్తున్నాడు రాయ్.

"అరగంటయింది..."

"సారీ... చిన్నపనిమీదెళ్ళాను..."

"ఫర్వాలేదు. మీరొచ్చేలోపల ఈ పుస్తకం చదివాను. వెరీ ఇంట్రస్టింగ్" అన్నాడు.

"అచ్ఛా! ఊఁ... ఎనీ ఇన్ఫర్మేషన్ మహేశ్?" కరుణ్ పక్కనే కూర్చున్న యువకుడిని అడిగాడు రాయ్.

తాను హేమారాణి ఇంటి దగ్గర కాపు వేసినప్పుడు జరిగిన సంగతంతా చెప్పాడతను.

"ఆల్‌రైట్! నువ్వు రెస్ట్ తీసుకుని మళ్ళీ నీ టైం ప్రకారం అక్కడి కెళ్ళు" అతన్ని పంపించేశాడు.

"ఆ వచ్చింది ఎవరై వుంటారబ్బా?" అడిగాడు కరుణ్.

"తొందరలోనే తెలుస్తుంది కరుణ్‌గారూ..." చిన్నగా నవ్వుతూ అన్నాడు రాయ్.

"హైదరాబాద్ నుండి ఏమయినా మెసేజ్ వచ్చిందా?"

"మెసేజ్ బచ్చింది. కాని హరిణి ఇల్లు ఖాళీ చేసేసి ఆ బూళ్ళోనే బుందో, లేకపోతే అసలు లేదో తెలియకుండా బుందట.

"ఆల్‌రైట్... మీ ఏజెంట్‌ని వచ్చేయమనండి. మనం హేమారాణి మీద దృష్టంతా కాన్‌సన్‌ట్రేట్‌చేస్తే సరి" అన్నాడు కరుణ్.

"అచ్ఛా..." సాలోచనగా అన్నాడు రాయ్.

"కొత్త కమీషనర్ పీటర్ కేసునీ, ప్రేమ్‌నాథ్ కేసునీ తిరగదోడుతున్నాడటగదా?"

"ఎస్! నేనూ చూశాను పేపర్లో!"

"వాళ్ళ దృష్టిలోకి మన పరిశోధన విషయం పడకుండా జాగ్రత్త పడాలి."

"యు బార్‌రైట్ కరుణ్! ఇంతకుముందు నాకు పోలీసులతో కొన్ని కేసుల బిషయమై క్లాష్ కూడా బచ్చింది.

"చూద్దాం! పోలీసుల పరిశోధనలలో మనకు కావల్సిన అంశాలేమైనా తెలుస్తాయేమో!"

"తెలిసినా మనకు చెప్పరు కరుణ్‌గారూ!"

"పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో నాకు తెలిసిన, ఫ్రెండ్స్ ఉన్నార్లెండి."

"అయితే మంచిదే."

"ఇక నాకు సెలవిప్పించండి రాయ్‌సాబ్!" లేచాడు కరుణ్.

"ఆల్‌రైట్ కరుణ్‌జీ."

✧ ✧ ✧ ✧ ✧ ✧

"ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్..." అదేపనిగా మోగుతున్న ఫోన్ బెల్‌కి మెలకువ వచ్చింది కరుణ్‌కి. లేచి ఫోనందుకున్నాడు.

"కరుణ్‌జీ... పేపర్ చూశారా?" రాయ్ కంఠంలోని ఆత్రుత స్పష్టంగా తెల్సిపోతుంది.

"లేదు రాయ్‌సాబ్! ఏమిటి విషయం?" ఆవులిస్తూ అన్నాడు కరుణ్.

"నేను చెప్పేకంటే మీరు చూస్తేనే బాగుంటుంది. పేపర్లో డిటైల్డ్‌గా బుంది.

"ఏ విషయం?"

"మీ కేసుకు సంబంధించినదే!"

"నా కేసుకా? ఏమిటది?"

"చూడండి... పేపరొచ్చే టైముంది మీకిపాటికి."

ఆ మాటలకి కరుణ్ వెంటనే ఫోన్ క్రెడిల్‌చేసి – బెడ్‌రూంలోంచి బయటికి నడిచాడు. రోజూ కిటికీ పక్కనే పడుండే పేపర్ కనిపించలేదు.

కరుణ్‌లోని ఏంగ్జయిటీవల్ల–

"విషయమేమిటో రాయ్ చెప్పొచ్చుకదా! అయినా ఈరోజు పేపరు వాడికేమయింది? ఇంకా పేపరు వేయలేదు. మళ్ళీ సెంటర్‌వరకూ వెళ్ళి పేపరు తెచ్చుకోవాలి" అనుకుని షర్టు వేసుకుని తలుపుతీసి బయటికొచ్చాడు.

అప్పుడు కనిపించింది పేపర్. బయట కిటికీ దగ్గర నేలమీద పడిపోయి ఉంది.

"బహుశా ఈరోజు పేపర్ బాయ్‌కి సరిగ్గా గురి కుదరలేదుకాబోలు. కిటికీలోంచి లోపలకి పడవలసిన పేపరు బయటే వుండిపోయింది" అనుకుని గబగబా సిటీ ఎడిషన్ తిరిగేసాడు.

మొదటి పేజీలోనే ఉంది ఆ వార్త.

"థ్రిల్లింగ్ కోసం హత్య!"

స్పాట్‌న్యూస్ :– సినిమా అనేది పవర్‌ఫుల్ మీడియా! దానిద్వారా ఎంతో చైతన్యాన్ని తీసుకురావచ్చు. కాని నేటి సినిమాలు క్రైం, వయొలెన్స్ వంటి కథాంశాలతో రూపొందించబడి... యువతకి నేరాలు ఎలా చేయాలో... నేరాలుచేసి ఎలా తప్పించుకోవచ్చునో బాగా నేర్పుతున్నాయి.

ఓ సినిమా చూసి, ఆ సినిమాలో హీరో విలన్ని ఎలా చంపాడో అదే విధంగా తనతో ఘర్షణపడిన వ్యక్తిని హత్యచేసి, తర్వాత భయంతో తనకు తానే పోలీసులకు లొంగిపోయిన ఓ యువకుడి వైనం సంచలనం రేపింది.

లాసన్స్ బే కాలనీలోని, ప్లాట్‌నెం. పద్దెనిమిదిలో నివసిస్తున్న పీటర్ అనే చిత్రకారుడ్ని యువరాజ్ అనే యువకుడు తాను చూసిన ఓ ఇంగ్లీష్ చిత్రంలో విలన్ని హీరో చంపిన విధంగానే టైం బాంబుతో హత్య చేసి తర్వాత భయపడి పోలీసులకు లొంగిపోయాడు."

ఆ వివరాలిలా ఉన్నాయి.

"ఒకసారి ఏదో విషయమై పీటర్‌కీ, తనకీ చిన్న గొడవ జరిగిందని... అప్పట్నుంచీ ఎలాగైనా అతన్ని చంపాలని నిర్ణయించుకున్నానని, హైదరాబాద్‌లో ఓ టైంబాంబ్ సంపాదించి, అతనిట్లో ఫిక్స్ చేసానని, ఆ టైం బాంబ్ పేలి అతను మరణించాడ"ని చెప్పాడు యువరాజ్. "అయితే హత్యచేసిన రెండు మూడురోజులు మామూలుగానే ఉన్న, తర్వాత తనకి భయం పట్టుకుందనీ... హత్యలుచేస్తే థ్రిల్లింగ్‌గా ఉంటుందని అనుకున్నానని... అయితే తనకి ఆందోళన ఎక్కువైందని... అందుకే పోలీసులకి లొంగిపోతున్నాని" అతడు పేర్కొన్నాడు.

నేటి సినిమాల్లోని నవరసాల్లో రౌద్రం, భీభత్సం, భయానకం, శృంగారం వంటివేతప్ప మిగతావైన కరుణ, దయాగుణం వంటివాటికి చోటులేకుండా పోయింది. ఇది బలహీనమైన ఇటువంటి యువకులతో సమాజానికి కీడు కలిగింపచేస్తున్నాయి."

వార్త మొత్తం చదివి ఆలోచనలోపడ్డాడు కరుణ్.

గబగబా తయారై రాయ్ ఆఫీసుకి వెళ్ళాడు.

"చూశారా పేపర్?" కరుణ్‌ని చూస్తూనే అన్నాడు రాయ్.

"చూశాను."

"పోలీసులు ఎఫ్.ఐ.ఆర్. రాసేసి, కేసును కోర్టుకు అప్పచెప్పేశారు."

"ఏ విషయంలో?"

"అదే ఆ యువరాజ్ పీటర్‌ని హత్యచేశాడనే విషయంలో."

"అభిప్రాయం ఏముంది? నేరస్తుడే స్వయంగా నేరం చేశానని అంటున్నాడూ."

"కానీ నాకెందుకో అనుమానంగా వుంది."

"ఎందుకని?"

"మీ ఏజెంట్లు చెప్పిన ప్రకారం ఆ రోజు పీటర్ ఇంటిలోని వాచ్ నుండి రెండు వైర్లు వ్రేలాడుతున్నాయనీ, వాచ్ రెండూ ఇరవై దగ్గర ఆగిపోయిందనికదా తేలింది."

"అబును!"

"మరి యువరాజ్ తన స్టేట్‌మెంట్లో పీటర్ ఇంటిలో బాంబ్ పెట్టానని చెప్పాడేకానీ... సరైన వివరణ ఇవ్వలేదు..." ఆలోచిస్తూ అన్నాడు కరుణ్.

"సరే! ఎలాగూ పోలీసులు అతడ్ని ఈరోజు కోర్టుకు హాజరు పరుస్తారు కాబట్టి, అక్కడతను చెప్పేది ఏమిటో చూడండి! ఆపైన మన ప్రయత్నం మనం చేద్దాం."

"సరే!" కరుణ్ రాయ్ దగ్గర శెలవు తీసుకుని బయటకు నడిచాడు. కారు స్టార్ట్‌చేసుకుని ఇంటికొచ్చాడు.

ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్..."

వెళ్ళి రిసీవరెత్తాడు.

"హలో కరుణ్!" అట్నుంచి మంజుల గొంతు విన్పించింది.

"హలో మంజూ! ఏమిటి సంగతి?"

"పేపర్లో వార్త చూశావా?"

"చూశాను..."

"ముద్దాయి తనకి తానే నేరం అంగీకరించాడు. నీ పని సులువైందనుకుంటాను."

"...........!"

"ఏమిటి మాట్లాడవు?"

"ఇక్కడేదో మెలికుందని నాకనిపిస్తోంది మంజుల!"

"నీ లాయర్ బుద్ధికి అలాగే తోస్తుంది. నాకు మాత్రం సగం టెన్షన్ తగ్గిపోయింది. మిగతా ప్రాబ్లెమ్స్ కూడా వాటంతటవే సాల్వ్ అయిపోవాలి అని నా ఇష్టదైవాన్ని కోరుతున్నాను."

"మంచిది..."

"ఏమిటి ముభావంగా మాట్లాడుతున్నావ్?"

"సాయంత్రం ఉడా పార్క్‌లో వైశాఖీ కళావేదిక దగ్గర ఉంటాను అయిదున్నరకి రా..."

"చూశావా! సగం బరువు తగ్గిపోయింది కదా! ఆటోమాటిక్‌గా నీకూ మళ్ళీ ఉడా పార్కులు, బీచ్‌లు... వాటితోపాటు నేనూ గుర్తొస్తున్నాము."

"వస్తావుగా!"

"వస్తాను!"

"అయితే ఉంటాను..."

"అలాగే" ఆమె రిసీవర్ పెట్టేసిన చప్పుడికి తానూ క్రెడిల్ చేసాడు రిసీవర్.

ఇంటికి లాక్‌చేసి హోటల్ డిలైట్‌కి వెళ్ళాడు కరుణ్.

"కౌన్ హై వో సప్నోమే ఆయాఁ...

కౌన్ హై వో దిల్‌కో చురయా–

ఓ ప్రియా...ఓ...ఓ...ఓ...

ఓ ప్రియా...ఓ...ఓ...ఓ..." రాజేంద్రకుమార్ పాత సినిమాలోని హిందీ పాట స్థబ్దంగా అయిపోయిన కరుణ్‌లో చైతన్యాన్ని నింపినట్టయింది.

అనాలోచితంగా ఓ టేబిల్ దగ్గర కూర్చుని వెయిటర్ కోసం చూడసాగాడు.

"సార్! ఇది రిజర్వ్‌డ్ టేబిల్! అక్కడ కూర్చోండి" అంటూ క్రితంసారి చెప్పిన యాభై ఏళ్ళ వెయిటరే మళ్ళీ వచ్చినమ్రతగా చెప్పాడు కరుణ్‌కి.

అతను రిజర్వ్‌డ్ టేబిల్ అన్నా, దానిమీద "రిజర్వ్‌డ్" అన్న బోర్డేమీ లేదు.

అయినా కరుణ్‌కేమీ మాట్లాడాలనిపించక అతను చూపించిన టేబిల్ దగ్గరకి వెళ్ళి కూర్చున్నాడు.

వెంటనే ఓ వెయిటర్ వచ్చి అతని ముందు వినయంగా నించున్నాడు.

"రోస్టెడ్ బ్రెడ్ స్లై సెస్ విత్ జామ్" చెప్పాడు కరుణ్.

అతను వెళ్ళిపోయాడు.

ఈసారి స్పీకర్లలోంచి షమ్మీకపూర్ హిందీ చిత్రం "బ్రహ్మచారి" లోని-

"మై గాఁవూ... తుమ్ సోజాఁవూ..."

"మై గాఁవూ... తుమ్ సోజాఁవూ..."

"సుఖ్ సప్నోఁమే ఖోజాఁవూ...

మై గాఁవూ తుమ్ సోజాఁవూ..." అనే పాట కరుణ్‌లోని నిరాసక్తతని పూర్తిగా పారద్రోలింది.

ఇంతలో అతనికి బ్రేక్‌ఫాస్ట్ సర్వ్ చేయబడింది. తిని, బిల్ పే చేసి తన కారు దగ్గరికి నడిచాడు.

ఇంతలో ఐదడుగుల ఐదంగుళాల పొడవూ, తెల్లని శరీరచ్ఛాయ, పిరుదుల వరకూ జడతో వున్న ఓ స్త్రీ వెళ్ళిపోతుంది.

కరుణ్ వెంటనే ఐస్‌క్రీం పార్లర్‌లోని యువకుడు తనకి ఫోన్ చేసిన యువతి కోసం ఎంక్వయిరీ చేసినప్పుడు చెప్పిన స్త్రీ గుర్తులు ఆమెలో కనిపించి, గబగబా వెళుతున్న ఆ స్త్రీ ముందుకెళ్ళి చూశాడు.

ఆమె కూడా తన వెనుకనుంచి వచ్చి, తన మొహంవంక చూస్తున్న కరుణ్‌ని చూసింది.

"ఆమె ఎర్రటి పెదవుల కింద కంది గింజంత నల్లటి బ్యూటీస్పాట్" పార్లర్‌లోని యువకుడు చెప్పిన విషయం గుర్తొచ్చి, ఆమె పెదవులకింద చూసాడు.

లేదు... ఎటువంటి మచ్చకూడా లేదు.

కరుణ్ చేష్టలకి ఆమెకి కోపం వచ్చినట్టుంది.

తీక్షణంగా చూసి మిరంత వేగంగా అడుగులేస్తూ ముందుకు సాగిపోయింది.

"కలికాలం... ఈ రోజుల్లో పెళ్ళయిన ఆడదాన్నీ, పెళ్ళికాని ఆడదాన్నీ కిందనుంచి పైదాకా చూట్టమే... వాళ్ళప్పచెల్లెళ్ళనీ మరొకడు అలాగే చూత్తే తెలుత్తాది" కరుణ్నే చీత్కారంగా చూస్తూ వెళ్ళిపోయిందో ముసలామె.

కరుణ్ ఖంగుతిన్నాడా మాటలకి.

"తన ఉద్దేశ్యం వేర"ని ఎలా చెప్పగలడు వాళ్ళకి?

మౌనంగా తలొంచుకుని కారు డోర్ తీసి లోపల కూర్చుని స్టార్ట్ చేశాడు.

మరుక్షణం రయ్‌మని కోర్టువైపు సాగిపోయింది తన కారు.

పది నిమిషాల్లో కోర్టు ఆవరణలో కారాపి లోపలికి నడిచాడు.

నల్లని కోటులు ధరించి హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్న సీనియర్ లాయర్లు.

వాళ్ళ వెనకాలే ఫైల్స్, ఇతర సామాగ్రి పట్టుకుని ఫాలో అవుతున్న వాళ్ళ జూనియర్లు.

స్టాంపులమ్మే వాళ్ళూ, దరఖాస్తులు రాసేవాళ్ళూ, వాళ్ళ మధ్యలో చిన్న కెటిల్‌తో టీ పట్టుకుని "ఆఁ... టీ... హాట్ టీ..." అంటూ తిరుగుతున్న కుర్రాడు-

తమ కేసు ఏమైందో, తమనెప్పుడు కోర్టు బంట్రోతు లోపలికి పిలుస్తాడోనని ఎదురుచూస్తున్న వ్యక్తులు, చేతులకి అరదండాలు తగిలించి నేరస్తుల్ని తీసుకొస్తున్న పోలీసులు...

కరుణ్ రోజూ వచ్చే ప్రదేశమే అయినా... ప్రతి విషయాన్ని గమనిస్తూ నడుస్తున్నాడు.

"యువరాజ్ కేసు ఎన్నింటికి హియరింగ్‌కి వస్తుంది?" కోర్టు గుమాస్తాని అడిగాడు కరుణ్.

"పదిన్నరకి సార్..." చెప్పాడతను.

కరుణ్ టైం చూసుకున్నాడు. పదిన్నర అయింది.

అడ్వకేట్స్ వెయిటింగ్ హాల్లోకి నడిచాడు. అక్కడంతా గందరగోళంగా వుంది.

తిరిగి కిందికొచ్చి తన కారు దగ్గరే నిల్చున్నాడు.

అదే సమయంలో పోలీస్ వ్యాన్ కోర్టు ఆవరణలోకి ప్రవేశించింది. కరుణ్ అటే చూడసాగాడు.

ఆ వ్యాన్ అతనికి పదడుగుల దూరంలో ఆగింది. ఎనిమిదిమంది పోలీసులు దిగారు.

వారితో పాంటు, మాసిన గడ్డం, నుదురు మీదకి పడుతున్న రింగుల జుత్తుతో ఓ యువకుడు దిగాడు. అతని వయసు ముప్పై, ముప్పైమూడు వరకు వుంటుంది.

సన్నగా, పొడవుగా వున్నాడు. టీ షర్టు, వెలసిపోయిన జీన్స్ ధరించాడు.

ఎవరి వంకా చూడలేనట్లు నేలనే చూస్తూ పోలీసుల వెంట వెళ్ళిపోయాడతను.

ఇంతలో బుల్లెట్ మీద వచ్చాడు త్రీ టౌన్ ఎస్సై సుధాకర్.

కరుణ్‌ని చూసి నవ్వుతూ విష్ చేసాడు.

కరుణ్ కూడా విష్ చేసి–

"ఇప్పుడు మీవాళ్ళు తీసుకొచ్చారు కదా? ఎవరతను?" అడిగాడు.

"వాడే సార్... పీటర్ అనే ఆర్టిస్ట్‌ని బాంబ్‌తో హత్యచేసింది" చెప్పేసి లోపలికి వెళ్ళిపోయాడు ఎస్సై.

కరుణ్ టైం చూసుకున్నాడు.

పదిన్నర కావస్తూంది.

వెంటనే అతను కోర్టు హాల్లోకి నడిచాడు.

పత్రికా రిపోర్టర్లూ, కోర్టులో ఇతర సిబ్బందీ, పేపర్లో వార్త చూసిన జనాలతో కోర్టు గ్యాలరీ నిండిపోయింది. సరిగ్గా పదిన్నరవగానే కోర్టులోని బంట్రోతు మేజిస్ట్రేట్‌గారు వస్తున్నారని, అందరూ నిశ్శబ్దంగా వుండాలని సూచించాడు! అప్పటివరకూ రణగొణ ధ్వనులతో నిండిన కోర్టు హాలు ఒక్కసారిగా పిన్‌డ్రాప్ సైలెన్స్‌తో నిశ్శబ్దంగా అయిపోయింది. మేజిస్ట్రేట్ హుందాగా కోర్టు హాల్లోకి ప్రవేశించారు. అందరూ గౌరవ సూచనగా లేచి నించున్నారు. మెజిస్ట్రేట్ తన సీటులో కూర్చున్న తరువాత అందరూ తిరిగి కూర్చున్నారు.

వెంటనే త్రీ టౌవున్ ఎస్సై – యువరాజ్ మీద తయారుచేసిన ఎఫ్.ఐ.ఆర్. అతనే స్వయంగా రాసిచ్చిన రిపోర్ట్సు, బ్లాస్టయిపోయిన పీటర్ బిల్డింగు ఫోటోలు అన్నీ కోర్టు గుమాస్తాకి అందించాడు. అతను బంట్రోతు కిస్తే, బంట్రోతుద్వారా మెజిస్ట్రేట్ వాటిని పరిశీలించి, నేరస్తుణ్ణి విచారించడానికి పూనుకున్నాడు.

"కలువకొలను యువరాజ్, కలువకొలను యువరాజ్, కలువకొలను యువరాజ్" బంట్రోతు మూడుసార్లు పిలిచాడు.

వెంటనే ఇద్దరు కానిస్టేబుల్స్ యువరాజ్ చేతికున్న బేడీలు తొలగించి, అతన్ని కోర్టు బోనులో నించోబెట్టారు.

"నీ పేరేమిటి?" అడిగాడు మెజిస్ట్రేట్.

"కలువకొలను యువరాజ్."

"పీటర్ అనే వ్యక్తిని చంపానని నువ్వే అంగీకరిస్తున్నావా?" అడిగాడు మెజిస్ట్రేట్.

"అవెను."

"అతన్నెందుకు చంపవలసి వచ్చింది?"

"పెద్ద కారణమేం లేదు. ఓ మనిషిని చంపాలని, అలా చంపితే ఎలా వుంటుందో చూడాలని అనిపించింది."

"అందుకని అతన్ని బాంబ్‌పెట్టి హత్యచేశావా?"

"అవును!"

"బాంబు ఎక్కడిది నీకు?"

"హైదరాబాద్‌లో ఓ వ్యక్తి దగ్గర కొన్నాను."

"ఎవరా వ్యక్తి?"

"అతని పేరు తెలియదు."

"అతనెక్కడుంటాడు?"

"తెలియదు."

"మరి నువ్వెలా అతన్ని కలిశావ్?"

"నేను ఒకసారి హైదరాబాద్ పాతబస్తీలోంచి నడుస్తుండగా హఠాత్తుగా కొంతమంది వచ్చి బాంబులు వేసి, దొరికిన వాళ్ళని దొరికినట్లు పొడిచేసి పారిపోసాగారు. ఒక్కసారిగా గందరగోళ వాతావరణం ఏర్పడింది అక్కడ. పొగ, మంటలు, కేకలతో ఆ ప్రాంతమంతా అతలాకుతలమైపోసాగింది...

అప్పుడు బాంబులువేసి పారిపోతున్న వాళ్ళను వెంబడించాన్నేను. కొద్దిదూరం వెళ్ళిన తర్వాత వాళ్ళు నన్ను చంపబోయారు.

నేను వెంటనే వాళ్ళతో–

"నాకో బాంబు కావాలి! నా శత్రువుని చంపాల"ని అన్నాను.

మొదట వాళ్ళు అనుమానించినా, నేను డబ్బు చూపించేసరికి ఫలానా దగ్గరుండమని చెప్పి, ఏ బాంబు కావాలని అడిగారు. టైం బాంబయితే బాగుంటుందని చెప్పాన్నేను. అయితే పదివేలు అవుతుందని అన్నారు వాళ్ళు. కానీ నా దగ్గర ఆరువేలే వున్నాయని చెప్పాను.

"సరే మరునాడు అఫ్జల్‌గంజ్ సెంట్రల్ లైబ్రరీ దగ్గరుండ" మని చెప్పారు వాళ్ళు.

మరునాడు నేను వాళ్ళు చెప్పిన టైంకి, చెప్పిన చోట ఎదురుచూస్తూ వున్నాను. అప్పుడొకతను వచ్చి బాంబు ఇచ్చి, ఎలా ఫిక్స్ చేయాలో చెప్పి, డబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు.

"మరి హత్య చేసినవాడివి... పోలీసులకెందుకు లొంగిపోయావ్?"

"హత్యచేసి సినిమాల్లో హీరోలు చాలా మామూలుగా వుండటం, ఆ విషయం ఎవరూ కనుక్కోలేక పోవటం, పోలీసులూ, ప్రజలూ ఆ హత్య విషయమే మాట్లాడుకోవటం వంటి సంఘటనలు ఊహించుకుంటూ హత్య చేసాను–

రెండు మూడురోజులు బాగానే వున్నాను. తర్వాత ఏదో తెలియని భయం నన్ను పట్టుకుంది. నావైపు ఎవరుచూసినా, వాళ్ళకి నా విషయం తెలిసిపోయిందేమో అనే గుబులు, పోలీసు వీధిలోంచి వెళితే నా కోసమే అనే ఆందోళన, పేపర్ చూస్తే ఏ రోజయినా పీటర్‌ని ఫలానా వ్యక్తే చంపాడని ఉంటుందేమో అనే టెన్షన్...

ఇలా అన్నిరకాలుగా చిత్రహింసలు పడి, చివరికి తట్టుకోలేక పోలీసుల ముందు సరెండర్ అయిపోయాను."

"పీటర్‌నే ఎందుకు హత్య చేయాలనుకున్నావ్?"

"ఒకసారి నాకూ, అతనికి చిన్న ఘర్షణ జరిగింది. ఎప్పట్నుంచో హత్యచేసి థ్రిల్ పొందుదామని ఎదురు చూస్తున్న నాకు ఆ సంఘటనతో అతన్ని చంపాలని తోచింది...

అదే సమయంలో నేను చూసిన ఓ ఇంగ్లీష్ చిత్రంలో హీరో విలన్ని ఇలాగే చంపుతాడు. అంతే... నేను బాంబు సంపాదించటం, మలేరియా డిపార్ట్‌మెంట్ అని అతని ఇంట్లోకి ఖాకీ డ్రస్‌తో వెళ్ళి బాత్‌రూం, లావెట్రీ శుభ్రం చేస్తున్నట్లు నటించి, అతను చూడకుండా హాల్లో వున్న ఇండోర్ ప్లాంట్‌లో బాంబుని వుంచి వచ్చేయడం జరిగింది.

అతని మాటలకి కరుణ్ నిటారుగా అయ్యాడు.

"ఇతను చెబుతోంది పచ్చి అబద్ధం! బాంబు పీటర్ ఇంట్లోని వాచ్‌కి అమర్చి ఉన్నట్టూ, టైం రెండుగంటల ఇరవై నిమిషాలకి సెట్ చేసినట్లు రాయ్ ఏజెంట్లు చెప్పారు.

కానీ ఇతను పీటర్ బిల్డింగ్‌లోని హాల్లో వున్న ఇండోర్ ప్లాంట్లో బాంబు పెట్టానంటున్నాడు.

ఎందుకు కావాలని నేరం తనపై వేసుకుంటున్నాడు?

"బాంబ్ ఎన్ని గంటలకు సెట్‌చేసావ్?" మెజిస్ట్రేట్ అడిగారు.

"రాత్రి రెండు గంటలకి."

కరుణ్‌కి పూర్తిగా అర్థమయిపోయింది. ఇతను చెబుతుందంతా అబద్ధం! రాయ్ ఏజెంట్లు చూస్తుండగానే పీటర్ బిల్డింగ్ సరిగ్గా రెండూ ఇరవైకి బ్లాస్టయిపోయింది. మరితను బాంబుని రెండుగంటలకి సెట్ చేశానంటున్నాడంటే ఇతను చెబుతోంది అబద్ధం!

పోలీసులు వెళ్ళేసరికే పీటర్ బిల్డింగు ఇంచుమించు మొత్తం అగ్నికీలల్లో చిక్కుకుపోవటంతో వాళ్ళకి రెండుగంటల ఇరవై నిమిషాల దగ్గర ఆగిపోయిన వాచ్‌కానీ, దాన్నుంచి కిందకి వ్రేల్లాడుతున్న వైర్లు ఆచూకీ గానీ దొరికి ఉండదు. అందుకే బ్లాస్టయిన మరుసటి రోజు కూడా పేపర్లలో ఆ విషయం రాలేదు.

బ్లాస్టయిన మరుక్షణం రాయ్ ఏజెంట్లు పీటర్ బిల్డింగులోకి వెళ్ళారు. కాబట్టి ఆ పాయింట్లు తమకి తెలిసాయి.

"కేసుని ఎల్లుండికి వాయిదా వేస్తున్నాను."

కోర్టు సమయం ముగిసిపోవటంతో మెజిస్ట్రేట్ లేచి తన ఛాంబర్‌లోకి నడిచారు.

వెంటనే అప్పటిదాకా మౌనంగా వున్న వాళ్ళందరూ రణగొణ ధ్వనులతో ఆ ప్రదేశాన్ని శబ్ద కాలుష్యంలోకి నెట్టేశారు.

యువరాజ్‌ని పోలీసులు తీసుకెళ్ళిపోసాగారు.

కరుణ్ గబగబా వెళ్ళి అతనితో ఏదో మాట్లాడదామని ప్రయత్నించాడు.

కానీ అప్పటికే అతన్నెక్కించుకున్న పోలీస్ వ్యాన్ కోర్టు ఆవరణ దాటిపోయింది. కరుణ్ వెనుదిరిగి తన కారు దగ్గరకొచ్చి డోర్ తీసి లోపల కూర్చున్నాడు.

ఇంజన్ స్టార్ట్‌చేసి ముందుకు దూకించాడు.

✳ ✳ ✳ ✳ ✳ ✳

ఉడా పార్కులో జనం పలచగా వున్నారు. కరుణ్ వాచీలో టైమ్ చూసుకున్నాడు.

అయిదు గంటల ఇరవై అయిదు నిముషాలయింది.

మంజుల రావటానికి ఇంకో అయిదు నిమిషాల సమయముంది.

అతను వైశాఖీ వేదికవైపు నడిచాడు.

ప్రతిరోజూ ఆ వేదికపై ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఆరోజు పద్మాకుమారి కూచిపూడి నృత్యం జరగుతుందని నిర్వాహకులు మైకుల్లో ఎనౌన్స్ చేస్తున్నారు. అక్కడొకరు, అక్కడొకరు తప్ప పెద్దగా ప్రేక్షకులు లేరు.

కరుణ్ పచ్చికమీద కూర్చున్నాడు. ఉడా పార్కు సాగర తీరాన వుండటం వలన చల్లని పిల్లగాలులు మేనిని తాకి మనసుకి ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

పార్కులోని పుష్ప పరిమళం కరుణ్‌కి ఏదో లోకాలకు తీసుకుపోతున్నట్లుగా వుంది. కనులు మూసుకుని కరుణ్ ఆలోచనా ప్రవంతిలో వున్నాడు.

ఇంతలో పచ్చికమీద నడుస్తూ వచ్చి అతని పక్కనే కూర్చుని, అతని భుజంమీద చెయ్యేసింది మంజుల. ఉలిక్కిపడి కనులు తెరిచాడతను. నవ్వుతూ ఆమె కనిపించింది.

"ఏమిటి ఏదో ఆలోచిస్తున్నావ్?" అడిగిందామె.

"మంజూ! కేసు కొత్త మలుపు తిరిగింది."

"అబ్బా! రాగానే కేసూ, గీసూ అంటావేమిటి?"

ఆ మాటతో కరుణ్ మౌనం వహించాడు. వేదికపై కూచిపూడి నృత్యం మొదలయింది. అమ్మాయి చిన్నదే అయినా చక్కగా నాట్యం చేయసాగింది. జనాలు ఒక్కొక్కరూ వచ్చి చేరుతున్నారు.

"నువ్వేమయినా తీసుకుంటావా?" అడిగాడు అతను.

"మజా తాగుదాం!" అందామె.

"అలాగే" అంటూ పక్కనే వున్న రెస్టారెంట్లోంచి రెండు మజా కూల్‌డ్రింక్స్ తెచ్చిచ్చాడతను. సిప్ చేస్తూ నాట్యాన్ని తిలకించసాగారిద్దరూ. గంటసేపు కూచిపూడి నృత్యం సాగింది తర్వాత నిర్వాహకులు ఆమెని సత్కరించి, నగదు బహుమతి అందించారు.

"నృత్యం చాలా బాగా చేసింది" మెచ్చుకోలుగా అంది మంజుల.

"ఊఁ..." అన్నాడు కరుణ్.

"ఏమిటలా మన్ను తిన్న పాములా?"

"నాకేమీ పాలుపోవటం లేదు మంజు!"

"ఏ విషయం?"

"అదే కేసు విషయం!"

"ఏమయింది?"

కరుణ్ కోర్టులో జరిగిందంతా చెప్పాడు.

"నాకు ముందు నుంచీ అతనీ హత్య చేయలేదనే అనుమానంగా వుంది. కోర్టులో అతను చెప్పినదాన్ని విన్నాక అది నిజమే అని రూఢీ అయింది. అతనెందుకు ఆకారణంగా నేరం తన నెత్తిమీద వేసుకుంటున్నాడు? హంతకులు తమని కాపాడుకోవటానికి ఇతన్నో పావులా ఉపయోగించుకుంటున్నారని నా కనిపిస్తోంది."

మంజుల మౌనంగా అతన్నే చూస్తుంది.

"సారీ! బోర్ కొట్టిస్తున్నానా? పద అలా తిరిగి వద్దాం!" అంటూ లేచాడు. ఆమె కూడా లేచింది. ఇద్దరూ ఉడా పార్క్‌లోనే వున్న మ్యూజిక్ ఫౌంటెన్‌కి టిక్కెట్ తీసుకుని లోపలికి నడిచారు, కొన్ని పాప్యులర్ తెలుగు, హిందీ సినిమా పాటల ట్యూన్స్ తీసుకుని వాటిని

డెక్‌లలో వినిపిస్తే, అందులోని మ్యూజిక్‌కి తగ్గట్టు ఫౌంటెన్‌లోకి నీళ్ళు పైకి ఎగజిమ్ముతున్నాయి. మ్యూజిక్‌లోబీటింగ్ పెరిగినప్పుడు ఎక్కువగానూ, లేకపోతే తక్కువగానూ నీరు స్లో అవటం... ఒక్కో వాద్య పరికరానికి ఒక్కో ఫౌంటెన్ నీరుని స్లో చేయటం... బాగా చక్కగా వుంది.

"ఇలాంటి మ్యూజిక్ ఫౌంటెన్ ఆంధ్రాలో ఇదొక్కటే. బెంగుళూరులో ఒకటుంది" చెప్పాడు కరుణ్.

"చాలా బాగుంది" అంది మంజుల.

నలభై నిముషాలపాటు జరిగిందా కార్యక్రమం. అప్పటికి సమయం సాయంత్రం ఏడున్నరయింది.

"మీకేమీ తొందర లేదుకదా?" అడిగాడు కరుణ్.

"లేదు."

"అయితే వెళ్ళి బీచ్‌లో కూర్చుందాం" అన్నాడతను.

"సరే!"

ఇద్దరూ ఉడా పార్క్‌లోంచి బయటకు నడిచి, కారులో వెళ్ళి రామకృష్ణా బీచ్‌లో కూర్చున్నారు.

దూరంగా ఓడలలోని లైట్లు అక్కడేదో నగరం ఉందన్న భ్రమ కల్పిస్తున్నాయి. చీకటి పడినా జంటలు జంటలుగా జనం వున్నారు.

"ఏదయినా మాట్లాడు కరుణ్!" అంది మంజుల.

""నేనేం మాట్లాడినా అది నీకు నచ్చదు" అన్నాడతను.

"సరే! అయితే నేనే మాట్లాడతాను."

"అలాగే!"

"ఇలా ఒంటరిగా, హోటళ్ళలో తింటూ ఎన్నాళ్ళుంటావ్? హోటల్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిదికాదు తెలుసా?"

"ఎందుకంత డొంకతిరుగుడు! మనమెప్పుడు పెళ్ళి చేసుకుందాం? అని అడగొచ్చుగా?" నవ్వుతూ అన్నాడు అతను.

"హమ్మయ్య నవ్వావ్! అయ్యో ఈ చీకటిలో కన్పించటంలేదు. కనీసం టార్చయినా వుంటే బాగుండు – ఏయ్ మిణుగురు పురుగుల్లారా అక్కడక్కడ తిరుగుతారేం? ఇటు రండే... మీ కాంతిలో నేనవి ఏరుకుంటాను..." దూరంగా ఎగురుతున్న మిణుగురు పురుగులవైపు చూస్తూ అంది మంజుల.

"ఏమిటి మంజూ... ఏమిటి ఏరుకునేది?"

"తమరు నవ్వారు కదా కరుణ్ గారూ! నవరత్నాలు నేల మీద అదే – ఇసుకలో పడితే ఏరుకుందామని."

"పెంకి మంజూ!" మళ్ళీ నవ్వుతూ అన్నాడు కరుణ్.

"చాలు కరుణ్! ఇప్పటికే నీ నవ్వులతో రాలిన రత్నాలతో నేను అరబ్ షేట్‌ల్ని మించి ధనవంతురాలినయిపోయాను."

"ఆట పట్టించింది చాలు."

"మరేమిటి ఇలా మూడీగా వుంటావ్? ఏదయినా కవిత చెప్పు" అల్లరిగా అందామె.

"నేనా! కవితా? చాల్లే... జడుసుకుని జ్వరం తెచ్చుకుంటావ్. అనక మీ నాయనమ్మ నిన్ను తీసుకుని సాధువుల వెంటా, బాబాలవెంటా తిప్పుతుంది. అప్పుడు ఈ దర్శనం కూడా వుండదు" అన్నాడు కరుణ్.

"అబ్బో! ఏదో నా కోసం తహ తహ లాడిపోతున్నట్లు."

"అంటే! ఏమిటి నీ ఉద్దేశ్యం?"

"అమ్మో! అంత సీరియస్సా... ఏదో సరదాకి అన్నాను లెద్దూ!"

ఇంతలో చిన్నగా జల్లు కురవడం ప్రారంభమైంది.

"కరుణ్! వర్షం వస్తుంది. ఇక వెళదాం. టైం కూడా అయిపోయింది...." లేచి నిలబడి అంది మంజుల. కరుణ్ కూడా లేచాడు, ఇద్దరూ ఇసుకలో నడవసాగారు. అతని వెనక నడవసాగింది మంజుల.

ఒకటి... రెండు... మూడు... నాలుగు... అయిదు... ఆరు... ఏడూ...."

"ఏమిటి అంకెలు లెక్కపెడుతున్నావ్?" వెనక్కి తిరిగి అన్నాడతను.

"నీతోపాటు ఏడడుగులునడిచాను" అతని వంకే చూస్తుందామె.

"ఆ తరువాత నడవవా?"

"ఓ మగవాడు, ఓ ఆడది ఏడడుగులు కలిసి నడిచారంటే దానికర్థం వాళ్ళు జీవితాంతం కలిసివుండే దాంపత్య బంధం అన్నమాట."

"ఇదెవరు చెప్పారు? మీ నాయనమ్మేనా?"

"దీనికి మా నాయనమ్మే ఎందుకు? ఎన్ని తెలుగు సినిమా పాటల్లో వినలేదు."

"మెచ్చదగిందే నీ సినిమా పరిజ్ఞానం" అంటూ కార్ డోర్ ఓపెన్ చేసి లోపల కూర్చున్నాడతను. మంజుల కూడా తలుపు తీసి కూర్చుంది. వెనకే కారు ముందుకు పరుగెత్తింది.

"నువ్వు రోజూ సెల్ఫ్ హిప్నాసిస్‌చేస్తున్నావా?"

"చేస్తున్నాను."

"వెరీగుడ్!" మాటల్లోనే మంజుల ఇంటికి దగ్గర్లోకి చేరుకుంది కారు.

"కరుణ్! ఇక్కడాపెయ్! నేను వెళ్ళిపోతాను" అందామె. అతను కారునాపాడు.

"గుడ్‌నైట్" అంది మంజుల.

"గుడ్‌నైట్" అని కారును వెనక్కి తిప్పాడు కరుణ్.

✧ ✧ ✧ ✧ ✧ ✧

కోర్టుకు వెళ్ళారా?" అడిగాడు రాయ్.

"వెళ్ళాను."

"ఏం చెప్పాడతను?"

"తానే హత్య చేసినట్లు చెప్పాడు."

"అయితే ఇక అప్పీలే లేదు. అతనికి శిక్ష వేసి, కేసు క్లోజ్ చేసేస్తారు."

"కానీ రాయ్‌సాబ్! అతను చెప్పేదంతా అబద్ధం. నిజానికా హత్య అతను చేయలేదు."

"అలా ఎలా చెప్పగలగుతున్నారుమీరు?"

"మీ ఏజంట్లు ఇచ్చిన రిపోర్టులు ప్రకారం అర్ధరాత్రి ఎన్నింటికి పీటర్ బిల్డింగు బ్లాస్టయింది?"

"రెండు గంటల ఇరవై నిముషాలకి."

"కానీ యువరాజ్ తాను బాంబుని రెండు గంటలకి సెట్ చేసానని కోర్టులో చెప్పాడు."

"అలాగా?"

"బాంబు ఎక్కడ సెట్ చేయబడిందని మీ ఏజంట్లు చెప్పారో మీకు గుర్తుందా?"

"బాచ్‌కి సెట్ చేయబడిందని, ఆ బాచ్ నుంచి రెండు బైర్లు కిందికి వ్రేల్లాడుతున్నాయనీ, బాచ్ రెండు ఇరవై దగ్గరాగిపోయి వుందని చెప్పారు.

కానీ యువరాజ్ తాను పీటర్ హాల్లో ఇండోర్ ప్లాంట్‌లో బాంబు పెట్టానని చెప్పాడు."

"ఐసీ!"

"ఇదంతా చూస్తే ఆ హత్య అతను చేయలేదని తెలియటంలేదా?

"ఎస్ మిస్టర్ కరుణ్!"

"కానీ చేయని నేరానికి అతనెందుకు బాధ్యత వహిస్తున్నాడు?"

"ఏదో కారణం వుండేటుంది కరుణ్."

"అదెలాంటి కారణం? అతన్నెవరయినా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారా? లేకపోతే అతని మనుష్యుల్ని కిడ్నాప్‌చేసి, అతనిచేత అలా చెప్పిస్తున్నారా? అదీ కాకపోతే అతనికి డబ్బు ఎర చూపించారా? ఇవే కానీ మనం తెలుసుకుంటే అసలు నేరస్తులెవరో గుర్తించవచ్చు... దాంతో పీటర్ హత్యా రహస్యమేకాదు, ప్రేమ్‌నాథ్ మర్డర్ మిస్టరీ, మురళీకృష్ణ హత్యకు కారణాలు కూడా తెలుస్తాయి. మురళీకృష్ణ ఆచూకీ దొరికితే అతని ద్వారా మత్తుపదార్థాల రాకెట్ అనుమానితులైన ప్రొఫెసర్, డాక్టర్లెవరో కూడా తెలుస్తుంది...."

"అయితే ఇప్పుడు మనమేం చెయ్యాలి?"

"యువరాజుతో మాట్లాడగలిగితే చాలా ఉపయోగం వుండవచ్చు."

"కానీ కోర్టు కేసు నడుస్తుండగా అనుమానితుల్ని ఎబరితోనూ మాట్లాడనివ్వరని మీకూ తెలుసుకదా కరుణ్! దానికితోడు నేరం చేశానని అంగీకరిస్తున్నాడు కూడా."

"అదే పెద్ద ప్రాబ్లమ్."

"ఒకపని చేయండి రాయ్‌సాబ్! యువరాజ్ బ్యాక్‌గ్రౌండ్ ఏమిటో కనుక్కోండి. అతని తల్లిదండ్రులెవరో, అతని ఇల్లు, అతనేం చేస్తుండేవాడో కనుక్కోండి."

"అలాగే!"

"రేపు కేసు మళ్ళీ హియరింగ్‌కి వస్తుంది. వీలైతే సాయంత్రంలోగా కావాలా వివరాలు నాకు."

"తప్పకుండా."

"ఓకే రాయ్‌సాబ్! అయితే నేను మళ్ళీ సాయంత్రం కలుస్తాను."

"రైట్."

కరుణ్, రాయ్ ఆఫీస్‌లోంచి బయటపడి తన కారులో కూర్చుని ఇంజన్ స్టార్ట్ చేసాడు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

ట్రింగ్... ట్రింగ్...! ట్రింగ్... ట్రింగ్...! ఫోన్ మోతకి చదువుతున్న రీడర్స్ డైజస్ట్‌ని ప్రక్కనబెట్టి రిసీవర్ చెవికానించుకున్నాడు కరుణ్.

"హలో కరుణ్‌గారూ!" అట్నుంచి రాయ్ కంఠస్వరం.

"నేనే చెప్పండి! మీ ఆఫీస్‌కి వద్దామని అనుకుంటే మీరే ఫోన్ చేసారు."

"యువరాజ్‌ని గురించి కొంత సమాచారం దొరికింది."

"చెప్పండి...."

"అతనిది డాబాగార్డెన్స్ ఏరియా! అతనికి తల్లిదండ్రులు లేరు" అక్కా-బావల దగ్గరుంటున్నాడు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి ఖాళీగా వున్నాడు. అక్కా-బావలు కూడా సరిగ్గా చూడరని మా ఎంక్వయిరీలో తెలిసింది."

"వాళ్ళ ఫ్యామిలీ ఆర్థికంగా స్తోమత వున్నదేనా?"

"కాదనుకుంటాను. వాళ్ళు చిన్న పెంకుటింట్లో వుంటున్నారు. వాళ్ళ బావ మున్సిపాలిటీలో అటెండర్, వాళ్ళకి ఇద్దరు పిల్లలు."

"యువరాజ్ ప్రవర్తన ఎలాంటిదట?"

"చుట్టుపక్కల వాళ్ళు చెప్పేదాన్ని బట్టి చూస్తే అతనికి చాలా సాఫ్ట్ నేచర్! కానీ ఓ అమ్మాయిని ప్రేమించాడని, ఆమె కూడా ఇతన్ని ప్రేమించిందని తెల్సింది."

"ఐసీ."

"అతనికి అక్కా బావలుతో సంబంధాలు ఎలా వుండేవట?" తిరిగి అడిగాడు కరుణ్.

"యువరాజ్‌ని వాళ్ళు చాలాసార్లు ఇల్లువదిలి వెళ్ళిపొమ్మనేవారనీ, ఆ విషయంలో చాలాసార్లు గొడవలు జరిగేవని తెలుస్తుంది."

"ఓకే రాయ్‌సాబ్!" అన్నాడు కరుణ్.

"మీకీ సమాచారం యూజవుతుందా?" రాయ్ అడిగాడు.

"అవుతుందనే అనుకుంటున్నాను."

"అయితే వుంటాను."

"ఓకే!!" రిసీవర్ క్రెడిల్ చేశాడు కరుణ్.

రాయ్ చెప్పినదాని ప్రకారం యువరాజ్ ఆర్థికస్తోమత ఆరువేలిచ్చి బాంబుకొనే పరిస్థితిలోలేదు. అటువంటప్పుడు తన మానసిక సరదాకోసం అంత ఖర్చుపెట్టి అతనా బాంబు కొనటం అనేది అబద్ధం అనుకున్నాడు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

సమయం... ఉదయం పదిన్నర! కోర్టుహాలు న్యాయవాదులతోనూ, ప్రెస్ రిపోర్టర్లు, ఫోటో గ్రాఫర్లతోనూ, జనాలతోనూ నిండిపోయింది. మేజి స్ట్రేట్‌గారు వస్తున్నారని, అందరినీ నిశ్శబ్దంగా వుండమని కోర్టుబంట్రోతు హెచ్చరించాడు.

గోలగోలగా వున్న కోర్టుహాలు సైలెన్స్ అయిపోయింది. మేజిస్ట్రేట్ వచ్చి తన స్థానంలో కూర్చున్నారు.

కోర్టు బంట్రోతు "కలువకొలను యువరాజ్...." అంటూ మూడు సార్లు పిలవగానే యువరాజ్‌ని ఇద్దరు కానిస్టేబుళ్ళు తీసుకొచ్చి బోనులో నిలబెట్టారు.

"కలువకొలను యువరాజ్ అనే నువ్వు... హత్య చేస్తే ఎలా వుంటుందో అని పీటర్ అనే చిత్రకారుణ్ని బాంబుతో హతమార్చావ్."

యువరాజ్‌నే చూస్తూ అన్నారు మేజిస్ట్రేట్. అతను తలొంచుకుని వుండిపోయాడు.

"దానివలన నువ్వు సాధించిందేమిటి?"

"....."

"మీలాంటి యువత ముందుండి భారతావనిని ప్రగతిపథంలో తీసుకెళ్ళాలి. కానీ అలా జరగటంలేదు. వివిధవ్యసనాలతో వింత వింత పోకడలతో మిమ్మల్ని మీరు నాశనం చేసుకుని, సమాజానికి కీడు చేస్తున్నారు" మేజిస్ట్రేట్ మాటల్లో ఏదో ఆవేదన.

కోర్టుహాల్లోని వారంతా యువరాజ్‌ని, మేజిస్ట్రేట్‌నీ మార్చి మార్చి చూస్తున్నారు. ప్రెస్ రిపోర్టర్లు గబగబా న్యూస్ రాసుకుంటున్నారు. కరుణ్ త్రీటవున్ ఎస్సై సుధాకర్ వైపు చూశాడు. అతని కళ్ళల్లో ఏదో సాధించిన ఫీలింగ్.

"నువ్వు చెప్పుకోవలిసింది ఇంకేమైనా వుందా?" మేజిస్ట్రేట్ యువరాజ్‌ని చూస్తూ అడిగారు.

"ఏమీలేదు సార్!" యువరాజ్ మాటలు మేజిస్ట్రేట్‌కి ఆ చుట్టు పక్కల వాళ్ళకి మాత్రమే వినిపించాయి.

మేజిస్ట్రేట్ ఒకసారి కోర్టుహాలంతా కలియజూసారు. తర్వాత తనకి కుడివైపున వున్న న్యాయదేవత వైపు ఓసారి చూసారు. అతనలా చూశారంటే తన తీర్పును వెలువరించబోతున్నారని అర్థం.

చీమ చిటుక్కుమంటే విన్పించేటంత నిశ్శబ్దం.

"రాతియుగం నుంచీ మానవుడు అభివృద్ధి చెందుతూ వస్తున్నాడు. ఆ అభివృద్ధిలో భాగంగానే ఎన్నో అద్భుతాలు సృష్టించాడు మానవుడు. నాగరికంగా ఎదుగుతూ, సమాజ జీవనానికి, సంఘీభావానికి కొత్త అర్థం చెప్పాడు.

కానీ నేడు యువకులు పలురకాల మానసిక ధోరణులతో నేర ప్రవృత్తితో సంఘ జీవనానికి తీవ్రమైన విఘాతం కలిగిస్తూ తాము పతనమై తమ తోటివారినీ వినాశనంలోకి నెడుతున్నారు. మనిషిలో సాధారణంగా నేరప్రవృత్తిని ప్రేరేపించేది 'న్యూరో ట్రాన్స్‌మిట్టర్' అనే జన్యువు. దీనిని అదుపుచేసే ఎంజైమ్ 'మోనోమైన్ ఆక్సిడేజ్ ఎ' ఈ ఎంజైమ్ తగుపాళ్ళలో లేకపోతే మనుషుల్లో నేరాలు చేయాలని, భీభత్సం సృష్టించాలనీ వుంటుంది.

దీనికితోడు నేటి సినిమాలు! ఎందులో చూసినా నరుక్కోవటం, చంపుకోవటం, బాంబులు బంతుల్లా విసురుకోవటమే...."

మేజిస్ట్రేట్ మాటలకు కోర్టు గ్యాలరీలో నవ్వులు విరిసాయ్.

"దయచేసి నా మాటలకు నవ్వకండి. నేను ఆవేదన చెందుతున్నానీ పరిస్థితికి! బంగారు భవిష్యత్తులో తమని తాము ఉద్ధరించుకుని సమాజానికి ఉపయోగపడవలసిన యువతరం అర్థరహితమైన, అశీల్ల నేర మనస్తత్వాన్ని పెంపొందించే నేరాలను ఉద్రేకపరిచే సినిమాలు చూసి హత్యలు, దోపిడీలు చేస్తున్నారు. ఈ సినిమాలు ముందుగా చూసేది మన సెన్సార్ బోర్డు సభ్యులు బహుశా వాళ్ళు కళ్ళకి గంతలు కట్టుకుని చెవుల్లో దూదులు పెట్టుకుని చిత్రాలు సెన్సార్ చేస్తుంటారేమో."

మళ్ళీ కోర్టు గ్యాలరీలో జనాల్లో నవ్వులు.

"ఏది ఏమయినా... ఓ నిండు ప్రాణాన్ని తనికి థ్రిల్లింగ్ కలగాలని బలిగొన్న యువరాజ్‌లాంటి యువకులు సమాజ జీవనంలో...కడివెడుపాలల్లో విషపు చుక్కవంటివారు...." ఒక్కక్షణం ఆగాడతను.

యువరాజ్ కన్నుల్లోంచి ఓ కన్నీటి చుక్క అతని చెక్కిలి మీద నుంచి రాలిబోను అంచులపై పడింది.... మేజిస్ట్రేట్ మాటలకి.

ఆ సంగతి కరుణ్ ఒక్కడే గమనించాడు. తిరిగి మెజిస్ట్రేట్ మాట్లాడసాగారు.

"నేరం చేసినప్పటికినూ, అతనిలో పరివర్తన కలిగింది. తాను చేసింది తప్పని తెలుసుకున్నాడు. నేరస్థులకి న్యాయస్థానాలు శిక్ష విధించేది కూడా వాళ్ళ హింసకి ప్రతి హింస చేయడానికి కాదు. వారిలో పరివర్తన కలగాలనీ, వాళ్ళ మనసునిండా అలుముకున్న చీకటి అనే నేర నైజాన్ని దూరంగా తరిమేసి, స్నేహం, సౌభ్రాతృత్వం, తోటివారిని ప్రేమించగలగటం వంటి చిరుదీపాన్ని వెలిగించాలనే.

కనుక యువరాజ్ అనే ఈ యువకుడికి ఐ.పి.సి. 302, 304 సెక్షన్‌ల క్రింద అతను చేసిన నేరానికి నాలుగేళ్ళు కఠిన కారాగారశిక్ష – మూడేళ్ళు సాధారణ కారాగారశిక్ష విధించటం అయినది. శిక్షాకాలంలో అతని ప్రవర్తనని బట్టి శిక్షని తగ్గించే వీలు ఉంటుందని, అతను

గమనించి నడుచుకోవాలనీ, శిక్షాకాలం పూర్తయిన తరువాత అతను సమాజంలో చక్కగా మెలుగుతూ, చక్కటి జీవనాన్ని కొనసాగించాలని కోరుతుంది కోర్టు." తీర్పు వెలువరించి తన ఛాంబర్‌లోకి సాగిపోయారు మెజిస్ట్రేట్.

"నో యువరానర్! అతనీ ఘాతుకం చేయలేదు. దీని వెనుక ఏదో ప్రబలమైన కారణముంది. కష్టపడి, శ్రమలకోర్చి పరిశోధన చేయకుండానే ఎర గాలానికి చిక్కిన వేటగాళ్ళలా ఈ పోలీస్‌లు యువరాజ్ నేరం చేశానని చెప్పగానే సంతోషంగా అతనిపై ఎఫ్.ఐ.ఆర్. పుటప్‌చేసి, కేస్‌ని కోర్టుకి అప్పగించేసి చేతులు దులుపుకుందంతే. నిజానికి హంతకుడు అతను కాదు...." ఆక్రోశించింది కరుణ్ మనసు. మౌనంగా అయినా ఏం చెయ్యలేకపోయాడు.

"వెయ్యిమంది నేరస్థులు తప్పించుకున్నా సరే... ఒక్క నిర్ధోషికూడా అకారణంగా శిక్ష అనుభవించరాదు." అనే న్యాయశాస్త్ర ఘోష చెవుల్లో పదే-పదే గింగురుమంటున్నట్టు కరుణ్‌కి తల పగిలిపోయేంత తలపోటు ప్రారంభమైంది. సత్తువ లేక నిలబడ్డాడు. యువరాజ్‌ని తీసుకుని పోలీస్‌లు వ్యాన్‌వేపు నడవసాగారు. త్రీటవున్ ఎస్సై విజయగర్వంతో తన బుల్లెట్ దగ్గరికి నడిచాడు.

ప్రెస్, ఫోటో గ్రాఫర్లు కెమెరాలకి పని కల్పించారు.

"క్లిక్...."

"క్లిక్...."

"క్లిక్...."

కెమెరాలు ఓ నిర్ధోషిని రేపు ప్రపంచానికి దోషినిచేసి చూపించటానికి పోటీ నడుతున్నాయి. అందరూ యువరాజ్‌ని వింతగా, అసహ్యంగా, ఛీత్కారంగా చూస్తున్నారు.

ఆరుగురు కానిస్టబుళ్ళు అతన్ని వ్యాన్‌లో కూర్చోబెట్టారు. మరుక్షణం వ్యాన్ సెంట్రల్‌జైల్ వేపు దూసుకుపోయింది.

కరుణ్ నిర్వికారంగా నడుస్తూ తన కారు దగ్గరికి చేరుకున్నాడు. డోర్ ఓపెన్ చేసి, ఇగ్నీషన్ తిప్పాడు. ఇంజన్ స్టార్ట్ చేసి ముందుకు దూకించాడు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"ఏమిటి కరుణ్‌గారూ మౌనంగా ఉన్నారు?" అడిగాడు రాయ్.

"యువరాజ్‌కి ఏడేళ్ళు జైలుశిక్ష వేశారు."

రాయ్ మౌనంగా వుండిపోయాడు కరుణ్ చెప్పింది విని.

ఇంతలో బోయ్ రెండు కప్పులతో కాఫీలు తెచ్చి టేబుల్‌మీదుంచి వెళ్ళిపోయాడు. కరుణ్ కాఫీ సిప్ చేయసాగాడు.

"జైలుశిక్ష పడిపోయిన తరువాత మనమేం చెయ్యగలం కరుణ్‌గారు...?"

"ఒక్కసారి అతనితో మాట్లాడి, ఎందుకిలా చేశాడో" తెలుసుకుంటే...."

'అయితే సెంట్రల్ జైలుకెళ్ళి అతన్ని కలిసిరండి...."

"చిన్న ప్రాబ్లం ఉంది రాయ్‌గారూ...."

"ఏమిటది?"

"నేనెవరో పోలీసులందరికీ తెలుసు! అటువంటప్పుడు నేను యువరాజ్‌ని కలిసానంటే ఆ సంగతి అందరికీ తెలిసిపోతుంది. ఈ కేస్‌లో నేను ఇన్‌వాల్వ్ అయ్యానని తెలిస్తే నేరస్తులు జాగ్రత్తపడిపోతారు."

"అయితే మా ఏజంట్లని పంపమంటారా?"

"లేదు. నేనే వెళ్ళాలి. దానికేదయినా మార్గం వుంటే చూడండి."

"ఏమని పోలీసులకి చెప్పి యువరాజ్‌ని కలుసుకుంటారు?"

"అతని స్నేహితుడిగా చెబుతాను."

"గుడ్! అయితే నాతోరండి." అంటూ రాయ్ చిన్న కారిడార్‌లోంచి ఓ గదిలోకి నడిచాడు. అక్కడున్న ఓ పెద్ద బాక్స్‌ని తెరిచాడు. కరుణ్ ఒంగి ఆ బాక్సులోకి చూశాడు. అందులో రకరకాల విగ్గులు, పెట్టుడు గడ్డాలు, మీసాలు, రకరకాల దుస్తులు! వాటిలో పోలీస్ ఖాకీని, ఎడ్వకేట్లని, డాక్టర్లకి సరిపడే గౌన్‌లు, ఆడవాళ్ళు ఉపయోగించే దుస్తులు అన్ని రకాలూ ఉన్నాయి.

"ఏమిటవన్నీ?" ఆశ్చర్యంగా అడిగారు కరుణ్.

"మా డిటెక్టివ్‌లకి ఎప్పుడు ఏ వేషం వేయాల్సుంటుందో తెలియదు. సందర్భానుసారం ఈ విగ్గులు, గడ్డాలు, మీసాలూ, డ్రస్సులతో తయారయి పరిశోధనలు చేయాల్సుంటుంది. అందుకే ఇవన్నీ" వివరించాడతను.

కరుణ్ చిన్నగా నవ్వాడు.

"మీరెప్పుడు యువరాజ్‌ని కలవాలనుకుంటున్నారు?"

"రేపే...."

"అయితే మీరతన్ని కలవటానికి వెళ్ళేముందు నా దగ్గరకు రండి."

"ఎందుకు?"

"మీ రూపాన్ని ఎవరూ గుర్తుపట్టనంతగా మార్చి పంపిస్తాను." కరుణ్‌కి ఈ ఆలోచన థ్రిల్లింగ్‌గా అనిపించింది. 'సినిమాల్లోనే మారువేషాలేస్తా రనుకున్నాను. జీవితంలో కూడా ఒక్కోసారి తప్పదన్నమాట' అనుకున్నాడు.

"ఓ.కె. రాయ్‌సాబ్! నన్నెంత బాగా మేకప్ చేస్తారోమరి. ఎవరూ గుర్తుపట్టకూడదు" అన్నాడు.

"హ...హ...హ్హా...హ్హా! రేపు మీరే చూస్తారుగా! నేను మీ రూపురేఖల్ని మార్చేసిన తర్వాత అద్దంలో చూసుకుంటే మిమ్మల్ని మీరే గుర్తుపట్టలేరు."

"మీకు మేకప్‌కూడా వచ్చా?"

"అవన్నీ డిటెక్టివ్‌లకి రావాలి కరుణ్‌గారూ! నేనెన్నిసార్లు ఎన్ని అబతారాలెత్తానో ఇన్వెస్టిగేషన్లకోసం."

"అప్పుడు మిమ్మల్నెవరూ గుర్తుపట్టలేదా?"

"ఇందులో రకాలున్నాయి! లైట్‌గా మేకప్ మార్చుకుని, మన నడకలోగానీ, మాట తీరులోకానీ తేడా చూపిస్తే... మనల్ని ఎరిగినవాళ్ళు కూడా ఇతను మనకి తెలిసిన ఫలానా మనిషిలానే ఉన్నాడు. కాకపోతే నడకవేరు అనో, మాట వేరనో అనుకుంటారు.

అలా కాకుండా అసలు మనల్ని ఎవరూ... అంటే ఇంట్లోవాళ్ళు సైతం గుర్తుపట్టకూడదనుకుంటే మటుకు మన ఆకారంలో ముఖ్యమైన వైన తలకట్టుని మీసాలుంటే తీసేసి, లేకుంటే పెట్టుకుని కనుబొమ్మలు షేప్ మార్చుకుని, మాట్లాడే ఉచ్చారణ... అదే ప్రొనౌన్సేషన్‌ని మార్చేసి, నడక స్టైయిల్‌ని మార్చేస్తే ఎవరూ గుర్తుపట్టరు."

"వెరీగుడ్ రాయ్‌గారూ! రేపు నేను యువరాజ్ దగ్గరికి వెళ్ళటానికి రెండు గంటలు ముందే మీ దగ్గరకొస్తాను. నా రూపురేఖల్ని పూర్తిగా మార్చేయండి! సరిపోతుందా టైమ్?"

"అలాగే కరుణ్‌జీ రెండు గంటలెక్కువే...."

"అయితే నాకు శెలవిప్పిస్తే ఇంటికి వెళతాను."

"ఓ.కే...."

కరుణ్ రాయ్ ఆఫీసులోంచి బయటపడి ఇంటివైపు సాగిపోయాడు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

సమయం రాత్రి పన్నెండయ్యింది.

గాలి సవ్వడి తప్ప మరేం విన్పించడంలేదు. అరనిమిషానికొకసారి మాత్రం ఎక్కడో మూర్ఖానైట్ వాచింగ్ చేస్తూ ఊదుతున్న ఈల మటుకు వినిపిస్తుంది. అక్కడొకటీ అక్కడొకటీ వెలుగుతున్న మున్సిపాలిటీవాళ్ళ వీధి దీపాలు చీకటి ముందు చేతులెత్తేసి ఓడిపోయిన సైనికుల్లా వున్నాయి.

అరుణ్ చెట్టుకింద పడుకుని హేమారాణి ఇంటివేపే చూస్తున్నాడు. దీపాలన్నీ ఆరిపోయి చీకటిలో ఒదిగిపోయింది ఇల్లు. క్షణాలు భారంగా గడుస్తున్నాయి.

అరుణ్ వీధి చివరన వున్న తన మోపెడ్ వంక చూసుకున్నాడొకసారి తాళం వేయబడి ఒంటరిగా ఉందది.

"లాస్ట్ టైం బండి లేకపోవటంతో హేమారాణి ఇంటికొచ్చి వెళ్ళిన వ్యక్తిని ఫాలో కాలేకపోయాను ఈసారి అలా జరగడానికి వీల్లేదు" అనుకున్న అరుణ్ మరునాటినుంచీ రాయ్‌కి చెప్పి ఆఫీసు బండి తీసుకున్నాడు. కానీ మళ్ళీ ఎవరూ హేమారాణి కోసం రాలేదు.

"పీ...పీ...పీ...." ఘూర్ఖా విజిల్ శబ్దానికి ఆలోచనలనుంచి తేరుకున్న కరుణ్ మరింత ముడుచుకుని పడుకున్నాడు. అతను పడుకున్న చోట లైటు లేదు. 'అంతవరకూ తను అదృష్టవంతుడే, అనుకున్నాడు.

ఈసారి ఘూర్ఖా విజిల్ మరింత దగ్గరనించి వినిపించింది. అతను మెల్లగా సైకిల్ తొక్కుకుంటూవస్తున్నాడు.

"అసలీ ఘూర్ఖా వాడు ఇటు వస్తున్నాడేమిటీ ఈ రోజు? ఎప్పుడూ షాపులుండే మెయిన్‌రోడ్డు చూసుకుని పోయేవాడు కదా!" అనుకున్నాడు.

ఘూర్ఖా అతనిన దాటిపోతున్న సమయంలోనే ఆ వీధిలోకి ఓ వ్యాన్ ఎంటరయింది.దాని హెడ్‌లైట్ల వెలుగులో అతను గూర్ఖాకి కనిపించాడు.

"కౌన్ హై? కౌవ్ హై తూ...?" అతని దగ్గర సైకిలాపి, లాఠీ తీసి పొడుస్తూ అడగసాగాడతను.

"నిద్రొస్తుంటే పడుకున్నాను బాబూ!" పల్లెటూరివాడిలా అన్నాడతను.

"నిద్రొస్తుందీ... కహానీ బోల్‌తేహై ముజ్‌కో! చోరీ కర్నే ఆయా తుమ్" మీదిమీదికొస్తూ అన్నాడు గూర్ఖా.

అదే సమయంలో ఆ మారుతీ వ్యాన్ హేమారాణి ఇంటిముందు ఆగటం... వెంటనే ఓ స్త్రీ ఆ వ్యానెక్కటం... మరుక్షణం వ్యాన్ కదిలి పోవటం జరిగింది. 'ఇంతకుముందు మహేశ్ చెప్పిన వ్యాన్ ఇదే! నెంబర్ ప్లేట్లమీద ఫర్ రిజిస్ట్రేషన్ అని వుంది అనుకున్నాడతను.

ఇక ఉపేక్షించి లాభం లేదని–

"లెగెహె... గూర్ఖా ముండాకొడుకా" అంటూ అతనిని ఒక్కతోపు తోసాడు. ధబ్‌మని కిందపడి–విజిలూదుకుంటూ వెంటపడ్డాడు గూర్ఖా.

అరుణ్ చకచక తాళం తీసి బండి స్టార్టు చేసుకుని ఆ వ్యాన్‌ని వెంబడించాడు.

గూర్ఖా తన బండిమీద నెంబర్ నోట్ చేసుకోవటం చూసి నువ్వు కున్నాడతను... "పిచ్చివాడా... ఇది ఓ లారీ నెంబర్రా. రేపు నువ్వు ఫలానా బండిమీద ఒకడు వచ్చి ఇలా చేశాడని పోలీసులకు చెప్పినా వాళ్ళు నమ్మరు. ఈ నెంబర్ లారీదయితే నువ్వు మోపెడ్‌దంటావేం అని నీకు కళ్ళద్దాలు రాస్తారు కొనుక్కుని వాడమని."

అరుణ్ చూస్తుండగానే వ్యాన్ వీధి మలుపు తిరిగింది. అతను తన బండి వేగం హెచ్చించాడు. వీధి చివరకు వెళ్ళి ముందుకు చూశాడు. వ్యాన్ కనుచూపుమేరలో కన్పించలేదు. అయినా అరుణ్ వేగంగా ముందుకు వెళ్ళసాగాడు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

కరుణ్ నిద్రలేచి బ్రష్ చేశాడు. కాఫీ కలుపుకుని పేపర్ తీసుకుని చూడసాగాడు.

"హత్య చేసిన వ్యక్తికి ఏడేళ్ళు జైలుశిక్ష" ఆ వార్త వెంట అతని దృష్టి పరిగెత్తింది. యువరాజ్ ఫోటోతోపాటు ఆ న్యూస్ ప్రచురించారు.

సిటీన్యూస్. సినిమాలో హీరోయిన్ని చంపినట్లు, అదే ఫక్కీలో ఓ చిత్రకారుణ్ణి యువరాజ్ అనే యువకుడు బాంబుపెట్టి చంపటం పాఠకులకు తెలుసు. అతనికి నిన్న కోర్టు ఏడేళ్ళు కారాగారశిక్ష విధించింది. అందులో నాలుగు ఏళ్ళు కఠిన కారాగారశిక్ష, మూడుడేళ్ళు సాధారణ కారాగార శిక్ష విధించబడింది.

హత్య చేస్తే సాధారణంగా యావజ్జీవ శిక్ష వేయాల్సి వున్నా, నేరస్తుడు తనకు తానే లొంగిపోయి, హత్య చేసినందుకు పశ్చాత్తాపం చెందినందువలన అతనికి శిక్ష తగ్గించబడింది. అతని సెంట్రల్ జైలులో వుంచాలని ముందుగా అనుకున్నా, ఇక్కడ ఖైదీ సంఖ్య వుండలసిన దానికంటే ఎక్కువైపోవటంతో నేరస్తుడ్ని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు జైళ్ళ సూపరింటెండ్ శ్రీ దయాకరరావు తెలిపారు" అని పేర్కొందా పత్రిక.

"యువరాజ్‌ని రాజమండ్రి సెంట్రల్ జైలుకి తరలించారా? ఇంకా అతన్ని కలుసుకుని అతనెందుకీ నేరాన్ని తనమీద వేసుకున్నాడో అడగాలను కున్నానే" కరుణ్ ఆలోచనలో పడ్డాడు.

"ఒకసారి రాయ్ దగ్గరికి వెళ్ళొస్తే మంచిది" అనుకుని గబగబా స్నానం చేసి కారులో రాయ్ ఆఫీసుకు చేరుకున్నాడు. కరుణ్‌ని చూసి రాయ్ చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"రాయ్‌సాబ్ యువరాజ్‌ని రాజమండ్రి సెంట్రల్ జైలుకి తరలించారట."

"ఎస్ కరుణ్‌జీ! నేనూ పేపర్లో చదివాను."

"మన సెంట్రల్ జైలులో ఖైదీలెక్కువైపోయారని అతన్ని అక్కడికి తీసుకుపోయారట" చెప్పాడు కరుణ్.

"అబును కరుణ్‌జీ! మన జైళ్ళు ఇక్కడి మనుష్యుల మనస్తత్వాల్లాగే ఇరుకైనవి. నిజానికి విశాఖపట్నంలోనే కాదు హైదరాబాద్, సికిందరాబాద్ సెంట్రల్ జైల్లు అయిదు వందల మందిని బుంచడానికి వీలవుతున్నా ఒక్కసారి పధ్నాలుగు వందల మంది ఖైదీలను వుంచుతున్నారు. అదే విధంగా చంచల్‌గూడా జైలులో ఏడువందల మంది ఖైదీలనుంచటానికే సామర్థ్యం కలిగుంటే మనవాళ్ళు పదమూడు బందలమంది

ఖైదీలను బోనులో పెట్టినట్లు పెట్టేస్తున్నారు. మన స్టేట్‌లో చంచల్‌గూడ, రాజమండ్రి, వరంగల్, విశాఖపట్నం, కడప, సికింద్రాబాద్‌లలోని ఆరు సెంట్రల్ జైళ్ళు, రెండు లేడీస్ జైల్లు, మూడు బోస్టన్ స్కూళ్ళు తొమ్మిది జిల్లా జైళ్ళు, నూటయాభై సబ్ జైళ్ళతో కలిపి మొత్తం పది హేనువేల నాలుగువందల మందిని వుంచుతున్నారు.

పరిమితమైన గదులు, బారక్స్‌లతో కిక్కిరిసి ఖైదీలుండటం రకరకాల పరిమాణాలకి దారితీస్తోంది. సరయిన శానిటేషన్ ఫెసిలిటీస్ లేక పోవటంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. అందరికీ సరిపడా నీరు అందుబాటులో లేక ఖైదీలు వారాల తరబడి స్నానాలు లేకుండా గడిపిన సందర్భాలున్నాయి.

దీనికి కారణం డెబ్బైశాతం మంది ఖైదీలు తమపై నేర ంమోపబడి, కోర్టులో కేసు ముందుకు సాగక, తీర్పు వెలువడకపోవటం, ఇదే పరిస్థితి కర్ణాటకలో కూడా వుంది. అక్కడ వివిధస్థాయి జైళ్ళలో మొత్తం ఎనిమిదివేలమంది ఖైదీలుండగా అందులో డెబ్బై అయిదు శాతం మంది విచారణలో వున్న ఖైదీలే. మహారాష్ట్ర ఖైదీల్లో ఆరువేల నాలుగు వందల మంది శిక్ష పడ్డవారు కాగా పదిహేనేవేల అయిదు వందల డెబ్బై ఆరు మంది విరాచణ ఖైదీలు.

మన దేశంలో ఒక లక్షా తొంభై ఆరువేల రెండు వందల నలభైమంది ఖైదీలుండగా, వారిలో ఒక లక్షా ముప్పై నాలుగువేల ఎనిమిదివందల ముప్పే' ఎనిమిది మంది రిమాండులోనో అండర్ ట్రయిల్స్‌గానో... అంటే విచారణ లేకుండా శిక్షననుభవిస్తూ వున్నారు. దేశంలోని పదకొండు వందల యాభై అయిదు. జైళ్ళను పీడిస్తున్న ప్రధాన సమస్యలు ఏడు! అందులో అతి ముఖ్యమైనవి... ఖైదీలు కిక్కిరిసి వుండటం మొదటిది కాగా... కేసు విచారణలోని జాప్యం మరొకటి...." వివరించాడు రాయ్.

"అయితే నేను రాజమండ్రి వెళ్ళియువరాజ్‌ను కలుస్తాను."

"ఆల్‌రైట్ కరుణ్‌జీ!" షేక్‌హాండ్ ఇచ్చాడు రాయ్. కరుణ్ మళ్ళీ ఇంటికొచ్చి మంజులకి ఫోన్ చేశాడు.

"ఎవరు కావాలి?" అటునుంచి మంజుల నాయనమ్మ అడిగింది" కరుణ్ తడబడినా తేరుకుని...

"మంజుల వుందా?" అని అడిగాడు.

"స్నానం చేస్తుంది. నువ్వెవరూ?" కొంచెం కోపం ధ్వనించిందా మాటల్లో...

"మా చెల్లెలు మీ మంజులకి స్నేహితురాలండీ...."

"అయితే?..."

"ఏం లేదు. తాను మంజులకి ఏదో విషయం చెప్పాలంట. అందుకని ఆఫీసులో వుంటాను. అక్కడికి మంజులని ఫోన్ చేయమంది. చిన్న అబద్ధం చెప్పాడు.

"స్నానం అయిపోవచ్చింది దానిది. నెంబరేమిటి?" అడిగింది. కరుణ్ తన నెంబర్ చెప్పాడు. జాగ్రత్తగా విని రాసుకుని–

"మీ చెల్లెలు పేరేమిటి...?" అడిగింది.

"కరుణ్... ఆఁ... కాత్యాయిని... అని చెప్పండి."

"అలాగే...." ఫోన్ పెట్టేసిందామె.

"హమ్మయ్య!" దీర్ఘంగా నిట్టూర్చి గబగబా రెండు జతల బట్టలు సూట్‌కేసులో పెట్టుకున్నాడు. 'ఎందుకయినా మంచిద'ని పేస్ట్, బ్రష్, సోప్ గుర్తుకొచ్చి వాటినీ పెట్టుకున్నాడు. 'వెళ్ళిన వెంటనే పనవకపోతే రెండు రోజులు ఏ హోటల్లో అయినా దిగి పని చూసుకునే రావాలి' అనుకున్నాడు.

"ట్రింగ్...ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్...." గబగబా వెళ్ళి రిసీవర్ చేతిలోకి తీసుకున్నాడు.

"బహుశా మంజుల అయివుంటుంది. అంటే తన నెంబర్ చూసుకుని కాత్యాయిని అంటే అర్థం చేసుకుని వుంటుంది" అనుకున్నాడు.

"హలో కరుణ్‌గారా?" అటునుంచి రాయ్ గొంతు.

"ఆ... రాయ్ సాబ్ చెప్పండి!" మంజుల కాకపోయేసరికి డిజపాయింటై అన్నాడు.

"రాత్రి పన్నెండ గంటలకి హేమారాణి ఇంటికి ముందొచ్చిన మారుతీ బ్యాన్ వచ్చిందట."

"అందులో ఎవరున్నారో తెలిసిందా?"

"లేదు కరుణ్‌గారూ! దానికి బన్ వే గ్లాస్‌లు ఫిట్‌చేసి ఉన్నాయిట. ఈసారి ఆ బ్యక్తి బ్యాన్ దిగలేదట, హేమారాణే ఆ బ్యాన్‌లోకి వెళ్ళిందట. కానీ మా ఏజెంట్ బాళ్ళని వెంబడించలేకపోయాడు..." అంటూ అరుణ్ చెప్పినదంతా కరుణ్‌కి చెప్పాడు రాయ్.

"ఆమె తిరిగి ఎన్నింటికొచ్చిందట?"

"మామూలుగా సాయంత్రం ఆఫీస్‌నుంచి వచ్చే సమయానికి వచ్చిందంట."

"ఓకె!"

"మీరు రాజమండ్రి ఎప్పుడు వెళుతున్నారు?"

"వెంటనే బయలుదేరాలనుకుంటున్నాను."

"గుడ్‌లక్ కరుణ్ గారూ!"

"థాంక్యూ రాయ్‌సాబ్!" కరుణ్ ఫోన్ క్రెడిల్ చేశాడు. వెంటనే మళ్ళీ ఫోన్ రింగయింది. రిసీవర్ చెవికానించుకుని–

"కరుణ్ హియర్!" అన్నాడు.

"కరుణ్! నేనూ... మంజులని."

"ఊఁ... చెప్పు మంజూ!"

"నువ్వే చెప్పాలి!" ఏమిటి ఫోన్‌లో మా నాయనమ్మకి ఏవో కథలు వినిపించావ్?

"గెస్ చేశావా నేనేనని."

"అంత పిచ్చిదానిలా కనపడుతున్నానా? నీ ఫోన్ నెంబర్ ఇచ్చావుగా..."

"ఏమిటి ఇప్పుడే స్నానం చేసి వచ్చావా? ఫోన్‌లోకూడా ఫ్రెష్‌గా సువాసనలు వెదజల్లుతున్నావ్?"

"మా నాయనమ్మ స్నానం చేస్తున్నానని చెప్పి ఉంటుంది. దాంతో నన్ను పొగుడుతున్నావ్... ఏం కావాలో చెప్పేయ్... పొగడనక్కరలేదు."

"ఏం కావాలన్నా ఇస్తావా?"

"ఏం కావాలి నీకసలు?"

"ఓ...స్వీట్...కిస్..."

"ఆ మాటకు ఏమీ మాట్లాడలేదామె."

"అరె మంజూకి కోపం వచ్చిందేమో" అనుకున్నాడతను. అంతలోనే...

"ప్చ్...!" అంటూ శబ్ద తరంగాల ద్వారా ఆమె చుంబనం అతన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది.

కరుణ్, మంజుల స్నేహం రెండేళ్ళదయినా, అదే వాళ్ళ మధ్య తొలిముద్దు. ఫోన్‌లోనే అయినా... మంజుల తనకిచ్చిన ఆ అపూర్వమైన కానుక అతని హృదయాంతరాళాల్లోకి చొచ్చుకుపోయింది. ఒక్క నిమిషం అతనికి ఏదో తెలీని అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాడు.

"కరుణ్...కరుణ్..."

"ఊఁ..."

"ఏమిటి మౌనంగా వుండిపోయావ్?"

"నువ్విచ్చిన తొలిముద్దును ఆస్వాదిస్తున్నాను డియర్."

"అయితే ఇంకెప్పుడూ ఇలా పొరపాటు చేయను."

"అదేం...?"

"నేనలా చేసిన ప్రతిసారీ నువ్వు మాట్లాడకుండా మౌనంగా ఉండిపోతావని."

"సర్లే కాని! చిన్న పనిమీద రాజమండ్రి వెళుతున్నాను. రేపీపాటికి రిటర్న్ అవుతాను."

"ఏం పని?"

"కేసు గురించిన సమాచార సేకరణకే." చెప్పాలనిపించకున్నా తప్పలేదు. ఆమె మౌనంగా ఉండిపోయింది.

"నువ్వలా మౌనంగా ఉండిపోతే ఎలా మంజూ?"

"ఓకె! వెళ్ళిరా... రేపు ఇదే సమయానికి ఫోన్ చేస్తాను" అంది ఆమె.

"అలాగే!"

"ఉంటానయితే!"

"అలాగే..."

"అలాగే... అలాగే ఏంటి?" చిరుకోపంగా అంది మంజుల.

"మరేం చెప్పమంటావ్?"

"ఎవరి దగ్గరయినా, ఏదయినా తీసుకుంటే బదులు తీర్చాలని కూడా తెలియదా?" ఒక్క క్షణం ఆమె మాటలు అర్థం కాలేదు. తరువాత స్ఫురించి...

"ప్చ్!" అంటూ కిస్ చేశాడు కరుణ్.

అక్కడ మంజుల ఎర్రబారిన కపోలాలు, మొదటి చుంబనం వలన లతలా కంపించిన ఆమె శరీరం చూసే భాగ్యం అతనికి కల్గలేదు, లేకపోతే అతనో థియరీ తయారు చేసి వుండేవాడు. అది–

"ఓ... ప్రేమికుల్లారా...! మీరు మీ తొలిముద్దును మీ పార్టనర్‌తో పంచుకోవాలంటే... దానికెప్పుడూ ఫోన్‌ని మాత్రం ఉపయోగించకండి. దానివలన మీరేం మిస్సవుతున్నారో మీకు తెలియదు" అని ఉండేది.

"ఫోన్ పెట్టేస్తున్నాను మంజూ!"

"అలాగే!"

"నిజంగానే పెట్టేస్తున్నాను..."

"సరే" చిన్నగా అరిచి చెప్పిందామె.

"ఈ ఒక్కసారికి నువ్వే ఫోన్ పెట్టేయ్ మంజూ! నేనిలా నువ్వు వింటుండగా కట్‌చేసి ఆ పని చేయలేకపోతున్నాను... ఐ ఫీల్ మోర్ ఎమోషనల్.'

"నా స్థితి అలాగే వుంది కరుణ్..." నిజాయితీగా అందామె. తప్పనిసరయి తానే ఫోన్ క్రెడిల్ చేశాడు కరుణ్. సూట్‌కేస్ తీసుకుని ఇంటికి లాక్‌చేసి కారులో బయలుదేరాడు. హైవే మీదకు వచ్చింది కారు. కరుణ్ ఎక్స్‌లేటర్ అదుగంటా తొక్కిపెట్టాడు. నలభై... యాభై... అరవై... డెబ్బై... ఎనభై కిలోమీటర్ల స్పీడుతో పరిగెత్తసాగింది కారు.

✳ ✳ ✳ ✳ ✳ ✳

సమయం మధ్యాహ్నం రెండు గంటలయింది. కరుణ్ కారు రాజమండ్రి సెంట్రల్ జైలుకు కాస్త దూరంలో ఆగింది. కారు దిగి డోరు క్లోజ్‌చేసి మెల్లగా నడుస్తూ జైలు మోయిన్ గేటు దగ్గరకి చేరుకున్నాడు.

"ఎవరు కావాలి?" అడిగాడు సెంట్రీ.

"నిన్న విశాఖపట్నం నుండి ఇక్కడి జైలుకు తీసుకురాబడ్డ యువరాజ్‌ని కలవాలి.

"విజిటర్స్ టైం మూడు నుండి నాలుగున్నరవరకు మీరు మూడింటికి రండి" చెప్పాడతను.

చేసేదిలేక కరుణ్ వెనుదిరిగాడు. గంట సమయం ఎలా గడపాలో అర్థమవలేదతనికి. కారులో కూర్చునే ఆలోచించసాగాడు.

"యువరాజ్‌తో మాట్లాడి మొత్తం వివరాలు తెలుసుకునేసరికి రెండు రోజులు పట్టొచ్చు. ఏదయినా హోటల్లో దిగటం మంచిది." అనుకుని కార్లో ఊళ్ళోకి బయలుదేరాడు. ఒకళ్ళిద్దర్ని అడిగి రాజమండ్రి మొత్తానికి "ఆనంద్ రిజాన్సీ హోటల్ బాగుంటుందని తెలుసుకుని కారుని అటు పోనిచ్చాడు. పార్కింగ్ ప్లేస్‌లో కారుని పెట్టి హోటల్‌వేపు చూశాడు. చూడటానికి బాగానే ఉందది. సూట్‌కేస్ తీసుకుని లోపలికి నడిచాడు.

"ఎస్ సార్!" రిసెప్షనిస్ట్ నవ్వుతూ పలకరించాడు.

"రూమ్ కావాలి!"

"ఓకె. సార్! మీ పేరు, ఏ పర్పస్ మీద వచ్చారో, అడ్రస్, ఫోన్ నెంబర్ చెప్పండి." నమ్రతగా అడిగాడతను.

"నా పేరు కరుణ్! మాది బట్టల వ్యాపారం! దానికోసమై వచ్చాను" చెప్పి అడ్రస్ మార్చి ఇచ్చాడు.

"ఎన్నిరోజులుంటారు సార్?"

"బహుశా ఇవాళా, రేపూ ఉండొచ్చు."

"ఓకె. సార్! ఫర్ డే రూమ్‌కి వన్‌ఫిఫ్టీ అవుతుంది. రెండురోజులంటున్నారు కాబట్టి వన్ డే చార్జ్ అడ్వాన్స్‌గా పే చేయండి."

కరుణ్ నూటయాభై రూపాయాలిచ్చాడతనికి. అతను బిల్లూ, రూం తాళం చెవులూ ఇచ్చి బోయ్‌ని పిలిచాడు.

"సార్‌కి వన్ నాట్ ఫైవ్ రూం చూపించు" అన్నాడు.

"రండి సార్!" కరుణ్ చేతిలోని సూట్‌కేస్, రూం తాళాలు తీసుకుని ముందు నడిచాడా కుర్రాడు. తాళం తీసి మంచినీళ్ళు పెట్టి-

"భోజనం తెమ్మంటారా సార్?" అడిగాడు.

"తీసుకురా..."

"వెజ్జా... నాన్‌వెజ్జా?" అడిగాడు!

"వెజిటేరియనే..." చెప్పి లుంగీలోకి మారి, బాత్రూంలోకి నడిచాడు. పదినిమిషాల్లో స్నానం చేసి వచ్చాడు. అప్పుడే రూంబోయ్ వేడి-వేడి భోజనం తెచ్చాడు. టేబుల్‌మీద అమర్చి వెళ్ళిపోయాడు. భోజనంచేసి టైం చూశాడు కరుణ్. రెండుగంటల ఏభై నిమిషాలయింది. గబగబా డ్రస్సయి రూంకి తాళంవేసి కారులో మళ్ళీ సెంట్రల్ జైలుకి వెళ్ళాడు.

"మీ పేరేమిటి?" సెంట్రీ అడిగాడు.

"కరుణ్."

"ఎవరిని చూడాలి?"

"యువరాజ్‌ని."

"లోపలికెళ్ళి ఎడమ పక్కనున్న వ్యక్తిని అడగండి. వివరాలు చెపుతాడు" అంటూ కరుణ్ పేరూ. సమయం నోట్ చేసుకున్నాడా సెంట్రీ.

"కరుణ్ లోపలికి నడిచి, ఎడమవైపుకు తిరిగాడు. అక్కడో కానిస్టేబుల్ బెంచీమీద కూర్చుని ఉన్నాడు. అతని దగ్గర లావుపాటి పుస్తకం వుంది. కరుణ్‌ని చూసి ఎవరు కావలి అన్నట్లు తలెగరేశాడు.

నిన్న విశాఖపట్నం నుండి తీసుకువచ్చిన యువరాజనే అతను కావాలి. అతనే సెల్‌లో వున్నాడు" అడిగాడు కరుణ్.

"అతనికి మీరేమవుతారు?" వెంటనే అన్నాడతను.

"ఫ్రెండ్!"

"అతన్ని ఇక్కడికి తీసుకువచ్చిన వెంటనే మెడికల్ టెస్టులూ గట్రా చేశారు. అతనికేదో జబ్బుందని రాజమండ్రి గవర్నమెంటు ఆస్పత్రిలో చేర్చారు. మీరతన్ని కలవాలంటే సూపర్నింటుగార్ని కలిసి పర్మిషన్ ఉత్తరం తీసుకుని వెళ్ళాలి... అదిగో అలావెళ్ళి కుడివైపుకు తిరిగితే సూపర్నింటుగారి ఆఫీసు వస్తుంది. వెళ్ళండి" చెప్పాడతను.

"యువరాజ్‌కి జబ్బా... అతన్ని హాస్పిటల్‌లో జాయిన్ చేశారా?" అనుకుంటూ సూపర్నింట్ ఆఫీసువైపు నడిచాడు కరుణ్.

అతనెళ్ళేసరికి సూపరింటెండ్ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. కరుణ్‌ని చూసి కూర్చోమన్నట్టు సైగ చేశాడు. అతను కూర్చున్నాడు. నిమిషంసేపు ఫోన్‌లో సంభాషించి, రిసీవర్ క్రెడిల్ చేశాడతను.

"చెప్పండి" అన్నాడు కరుణ్‌ని చూస్తూ...

"విశాఖపట్నం నుండి తీసుకురాబడ్డ యువరాజ్‌ని కలవాలి సార్" అన్నాడు అతను.

"అతనికి మీరేమవుతారు?"

"యువరాజ్ నా ఫ్రెండ్ సార్."

"I am sorry mr. He had been infected with he positive. He is under going treatment for Aids in government hospital. If you want to meet him. I can give you a permission letter."

"Yes sir. please do that for me" సూపరింటెండ్ చెప్పింది విని షాక్‌లో వుండే అన్నాడు కరుణ్. అతను లెటర్ రాసి కరుణ్‌కిచ్చాడు.

"Thank you" అనిలేచి బయటికి నడిచాడు అతను. కారులో కూర్చుని గవర్నమెంట్ హాస్పిటల్‌వైపు సాగిపోయాడు. సూపరిండెంట్ చెప్పింది అతనికి మింగుడు పడలేదు.

"యువరాజ్‌కి ఎయిడ్సా?" అనుకున్నాడు. కారు గవర్నమెంట్ హాస్పిటల్‌కి చేరుకుంది. కారు దిగి హాస్పిటల్‌లోకి నడిచాడు.

"యువరాజ్ అనే అతను కావాలి" రిసెప్షన్‌లో ఉన్న యువతిని అడిగాడు. కరుణ్‌వైపు ఓసారి చూసి "మేడమీదకెళ్ళండి" అందామె.

గబగబా మేడమీదకెళ్ళాడతను. ఎవరూ చెప్పకుండానే యువరాజ్‌ని పోల్చుకోగలిగాడతను. ఇద్దరు కానిస్టేబుళ్ళూ, ఒక హెడ్ కానిస్టేబుల్ బయట కూర్చున్న రూమ్ దగ్గరికి నడిచి, సూపరింటెండ్ రాసిచ్చిన ఉత్తరం వాళ్ళకి చూపించాడు. లెటర్ కూడబలుక్కుని చదివిన హెడ్‌కానిస్టేబుల్‌కి. విషయం అర్థం కాకపోయినా, యువరాజ్ పేరూ, కిందని తమ సూపరింటెండ్ సంతకం సీలూ చూసి–

"మీరెవరూ సార్...?" అనడిగాడు.

"యువరాజ్ స్నేహితుణ్ని. అతనితో మాట్లాడాలి" చెప్పాడు.

"మాకేం అభ్యంతరం లేదు. నర్స్‌ని కూడా ఒక మాట అడిగితే–"

"నర్స్‌ని అడిగే పైకి వచ్చాను" అద్దాల్లోనుంచి కనిపిస్తున్న యువరాజ్‌నే చూస్తూ అన్నాడు కరుణ్.

"అయితే వెళ్ళండి..." చెప్పాడతను.

వెంటనే గ్లాసు డోర్స్ తీసుకుని లోపలికి నడిచాడు కరుణ్. అలికిడికి కళ్ళు తెరిచి చూశాడు యువరాజ్. అతని మొహం పీక్కుపోయి వుంది. కళ్ళు లోతుకుపోయాయి. చేతులు తోటకూరకాడల్లా శరీరానికి అటూ ఇటూ పడున్నాయి. మనిషి మునుపటికన్నా బాగా నీరసించిపోయి వున్నాడు.

కరుణ్ అతని దగ్గరగా బల్ల జరుపుకుని కూర్చున్నాడు.

"నా పేరు కరుణ్... నేను వైజాగ్‌లో క్రిమినల్ లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాను." తననితాను పరిచయం చేసుకున్నాడు. యువరాజ్ ఏ భావమూ లేకుండా అతనివంక చూశాడు.

"చేయని నేరాన్ని ఎందుకు మీపై వేసుకున్నారు?" ఉపోద్ఘాతాలేవీ లేకుండా సూటిగా అడిగాడు కరుణ్.

ఆ మాటలకు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు యువరాజ్.

"దయచేసి చెప్పండి. మీ పనివలన అసలైన దోషులు తప్పించుకుపోతారు."

"నేనే హత్య చేశాను. నేను హంతకుడ్ని."

"కాదు. ఆ సంగతి నాకు బాగా తెలుసు. మీరెవరి బెదిరింపులకో, ఒత్తిడికో తలవంచి ఇలా చేశారు."

"లేదు లేదు... నేనే చేసావా ఘాతుకం." బలహీనంగా ఉన్న అతని గొంతులో స్థిరత్వం.

"చెప్పండి! మిమ్మల్ని ఎవరయినా బెదిరించి మీతో ఇలా చెప్పించారా? వాళ్ళెవరో చెప్పండి" యువరాజ్‌నే చూస్తూ అన్నాడు కరుణ్.

"మీకెన్నిసార్లు చెప్పాలి? నేనే ఆ హత్య చేశాను. దయచేసి నన్ను విసిగించకండి... వెళ్ళిపోండి..."

"లేదు మీరా హత్య చేయలేదు. కోర్టులో మీరు చెప్పిందంతా అబద్ధం. బాంబు పీటర్ ఇంటిలోని ఇండోర్ ప్లాంట్‌లో పెట్టానని మీరు అన్నారు. కానీ బాంబు అతనింట్లో వాచ్‌కి ఫిక్స్ చేయబడి, తెల్లవారిజామున రెండుగంటల ఇరవై నిమిషాలకి పేలింది. మీరు బాంబు రెండు గంటలకి పేలిందని చెప్పారు. ఇక్కడే మీరు అబద్ధం చెపుతున్నారని తెలిసిపోయింది. ప్లీజ్ చెప్పండి... ఎందుకిలా చేయని నేరాన్ని చేసినట్లు కోర్టుని నమ్మించారు?"

"ఈ విషయాలన్నీ మీకెలా తెలుసు?"

"కొన్ని కారణాల వలన పీటర్‌మీద నిఘా పెట్టించటం జరిగింది. మా మనుషులు చూస్తుండగానే అతని బిల్డింగ్ రెండుగంటల ఇరవై నిమిషాలకి పేలింది. బాంబు అతనింట్లో వాల్‌క్లాక్ టైమింగ్స్‌కి ఫిక్స్ చేయబడిందని వాళ్ళు చెప్పారు. ఎందుకిలా చేశారు? బెదిరింపుకీ లొంగక, వత్తిడులకీ తలవంచక ఏమాశించి ఆ నేరాన్ని చేశానని అంటున్నారు. డబ్బుకి అమ్ముడుపోయారా?" కఠినంగా అడిగాడు కరుణ్.

"కోర్టు నా మాట నమ్మింది... ఏడేళ్ళు జైలుశిక్ష కూడా వేసింది. నేననుకున్నదొకటీ, జరిగింది మరొకటీ..." కన్నీళ్ళతో అన్నాడు యువరాజ్.

"ఏమిటి మీరనుకున్నది?" వెంటనే అడిగాడు కరుణ్.

"ఎందుకు కరుణ్‌గారూ! అయిపోయిందాని గురించి మళ్ళీ తవ్వకండి."

"చేయని నేరానికి ఓ నిర్దోషి శిక్ష అనుభవిస్తుంటే నిజమైన ఏ న్యాయవాదీ చూస్తూ ఊరుకోలేదు యువరాజ్ గారూ... నన్నో స్నేహితుడిగా భావించి నిజం చెప్పండి. అసలైన దోషులు చట్టం నుండి తప్పించుకుపోకుండా... మీ వంతు సహాయం మీరూ చేయండి" ప్రాధేయ పూర్వకంగా అడిగాడు కరుణ్.

యువరాజ్ కనులు మూసుకుని మౌనంగా వుండిపోయాడు కొన్ని క్షణాలు.

"మీరూహించింది నిజమే! నేనీ హత్య చేయలేదు." కళ్ళు తెరిచి కరుణ్‌నే చూస్తూ చెప్పాడతను.

"టక్...టక్...టక్..." గ్లాసుడోరు మీద హెడ్‌కానిస్టేబుల్ పిడికిలితో కొట్టి చప్పుడు చేశాడు. కరుణ్ వెనుదిరిగి చూశాడు.

హెడ్ కానిస్టేబుల్ ఏదో చెబుతూ, బయటకి రమ్మని కరుణ్‌నుద్దేశించి సైగ చేస్తున్నాడు. గ్లాసు డోర్స్ అవతలి నుంచి అతను మాట్లాడేది లోపలికి అస్సలు వినిపించటంలేదు. కరుణ్ లేచివెళ్ళి డోర్ తెరిచాడు.

"టైం అయిపోయింది సార్..." చెప్పాడు హెడ్ కానిస్టేబుల్.

"ఒక్క అయిదు నిమిషాలు ప్లీజ్" బ్రతిమాలుతున్నట్లు అన్నాడు కరుణ్. అయిష్టంగా మొహం పెట్టి వెళ్ళమన్నట్టు తలూపాడతను. కరుణ్ గబగబా యువరాజ్ దగ్గరకొచ్చి కూర్చున్నాడు.

"మరెందుకు ఆ నేరాన్ని మీపై వేసుకున్నారు?"

"నేను ఎమ్మే చేశాను. ఏజ్ బారయిపోయింది కానీ... ఎక్కడా ఉద్యోగం రాలేదు. ఎన్నో ప్రయివేట్ కంపెనీల్లో ఎంతో నమ్మకంగా పని చేశాను. కానీ అక్కడి మనుష్యుల పాలిటిక్స్‌ని నా సున్నిత మనసు ఎదుర్కోలేక ఎక్కడా నిలదొక్కుకోలేకపోయాను. అక్కా, బావలు నన్ను సోమరిపోతునన్నారు. తిట్టారు. ఈసడించుకున్నారు. ఆఖరికి ఇంటిలోనుండి కూడా వెళ్ళిపొమ్మన్నారు. మళ్ళీ ఉద్యోగ ప్రయత్నాలు చేశాను. చాలా ప్రయివేట్ కంపెనీలు "ఉద్యోగం ఇస్తాం అయితే ఐదువేలు డిపాజిట్ కట్టిండి, పదివేలు డిపాజిట్ కట్టండి" అన్నాయి. పి.జి. పట్టాకి విలువలేకుండాపోయింది. పచ్చనోటు పట్టుకున్నోడికే అందరూ పట్టం కడుతున్నారు. ఈ సొసైటీలో నేనే విధంగానూ పనికిరాని వాడినని తెలిసిపోయింది..." ఆవేశం వలన ఒక్కక్షణం ఆగిపోయాడు యువరాజ్.

"అలాంటి సమయంలో నా జీవితంలోకి ప్రవేశించింది అంజలి! గుంటూరు నుంచి ట్రాన్స్‌ఫరై వచ్చిన తన అన్నా - వదినలతో ఆమె జీవించేది. తల్లీ-దండ్రీ లేకపోవటంతో అన్నయ్య దగ్గరే ఆమె వుండేది. మా ఎదురింట్లోనే వాళ్ళు అద్దెకు దిగారు. మా ఇంటిలో నా పరిస్థితి తెలిసి నాపై ఆమెలో ఏర్పడిన జాలి, సానుభూతి కొన్నాళ్ళకు ప్రేమగా పరిణమించింది. బయటెక్కడ కనబడినా చొరవగా తానే మాట్లాడేది. నేనెందుకూ పనికి రానివాడిననే ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో నాలో నేనే ముడుచుకుపోతున్న సమయంలో తన చల్లని ఓదార్పుతో, ఆత్మీయత నిండిన స్నేహపుజల్లుతో నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేసింది. "నాకెవరూ లేరు, నేను ఒంటరివాడిని" అనే ఫీలింగ్‌ని నా నుండి దూరం చేసేసింది. ఆమె స్నేహంతో నాలో కొత్త ఉత్సాహం, ఊపిరి పోసుకున్నాయి. యవ్వన ప్రారంభపు వేడిలో పుట్టిన ప్రేమ కాదు అంజలిది. ఓ విలక్షణమైన వ్యక్తిత్వం ఆమెది. నాకంటే వయసులో చిన్నదయినా ఎన్నో నిర్ణయాలు ధైర్యంగా తీసుకునేది.

మేమిద్దరం రోజూ కలుసుకునేవాళ్ళం, ఆమె చదివే కాలేజీకి రోజూ వెళ్ళేవాడిని. తను డిగ్రీ ఫస్టియరే చేస్తున్నా ఎంతో నాలెడ్జ్ వుందామెలో! మా వీధిలో మా సంగతి తెలిసి అందరూ గుస గుస లాడుకుంటున్నా ఆమె తన ధోరణి మార్చుకోలేదు. ఆమె గట్స్ అటువంటివి.

"మానవ జన్మ ఎత్తినందుకు మనల్ని మనమే ఉద్ధరించుకోవటం కాదు... ఎదుటవారికీ ఉపయోగపడాల"ని చెప్పేది. తన ప్రతి బర్త్‌డే పార్టీ నాడూ రక్తదానం చేసేది. అదే అలవాటూ నాకు అయింది. నాలో ఏర్పడిన డిప్రెషన్‌లో ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాను. కానీ... ధైర్యం చాలేదికాదు అంజలి నా జీవితంలోకి ప్రవేశించిన తరువాత నేను మామూలు మనిషిని అయ్యాను. జీవితంలో స్థిరపడాలని, ఆమెతో వైవాహిక బంధం ఏర్పరచుకోవాలనీ అనుకున్నాను. వాళ్ళింట్లో ఆమె అన్నయ్య ఒప్పుకోలేదు. కానీ అంజలి ధైర్యంగా "చేసుకుంటే యువరాజ్‌ని చేసుకుంటాను. లేకపోతే పెళ్ళి లేకుండానే ఉండిపోతాన"ని అనటంతో అతను మెత్తబడ్డాడు.

కానీ నా దురదృష్టం నన్ను అంజలికి దూరం చేసింది. జీవితంలో నేనెప్పుడూ ఆమె చెయ్యి అందుకోలేని అగాధాల్లో కూరుకుపోయాను."

"ఏమయింది... ఎందుకని?" ఆత్రుతగా అడిగాడు కరుణ్.

సృష్టిలోని ప్రతి వస్తువూ, ప్రతి ప్రాణీ మానవుడికి ఉపయోగపడుతుంది. చెట్లు... పళ్ళూ, ఫలాలు ఇవ్వటమే కాకుండా మోడుబారిపోయాక నిశ్శబ్దంగా మనిళ్ళలో ఫర్నీచర్‌గా మారిపోతుంది. పశువులు పాలిచ్చి, గొర్రెలు, మేకలు మనకోసం బలై మనల్ని బ్రతికిస్తున్నాయి. పక్షులు తమ కిలకిల రావాలతో మనలో ఆహ్లాదాన్ని నింపుతున్నాయి. కొండలు, సెలయేళ్ళు, నదులూ, సముద్రాలూ, క్రిమి కీటకాదులు కూడా మనకెంతో సేవ చేస్తున్నాయి. వాటి నుండి మనమెంతో లాభం పొందుతున్నాం. కానీ మనుష్యులు మాత్రం సాటి మనిషిని వంచిస్తున్నాడు. తమ ఎదుగుదల కోసం అవసరమైతే అడ్డు కూడా తొలగించుకుంటున్నారు.

"మందలో మమేకమై బృందగానం

ఆలపించకు నేస్తం!

మంది నుంచి విడివడి

సాటి మనిషికి ఊతమివ్వు!!

చెలిమిలోనే బలిమి ఉందని

జగతికంతా సాటి చెప్పు..."

అని తను రాసిన కవితని పదే పదే వినిపించి ఇతరులకు సాయపడాలని గుర్తు చేసేది. ఆమెలానే నేనూ నా పుట్టినరోజు నాడు రక్తదానం చేయటం అలవాటయింది. అలా రెండుసార్లు నా రక్తం దానమిచ్చాను. మూడోసారి కూడా బ్లడ్ డొనేట్ చేయాలని వెళితే... నా రక్తాన్ని పరీక్షించిన డాక్టర్లు నా బ్లడ్‌లో హెచ్.ఐ.వి. పాజిటివ్ కనిపించిందనీ, అది ఎయిడ్స్‌కి తొలి దశని చెప్పారు. నాకు లోకమంతా ఒక్కసారిగా శూన్యమయిపోయినట్ల నిపించింది. అదే అంజలి పరిచయం కాకముందయితే ఆనందంగా చావుని ఆహ్వానించి వుండగలిగేవాడిని.

"మీరెలా ఎయిడ్స్ బారిన పడ్డారు?" అడిగాడు కరుణ్.

"బహుశా నేను రెండోవసారి రక్తదానం చేసేటప్పుడు ఎయిడ్స్ రోగికి ఉపయోగించిన సిరంజిలే పూర్తిగా శుభ్రం చేయకుండా నాకు ఉపయోగించి వుంటారు.

"మీకెవరితోనైనా... ఐ మీన్ అపరిచిత స్త్రీలతో లైంగిక సంబంధాలున్నాయా?"

ఆ మాటలకి నీరసంగా నవ్వాడు యువరాజ్.

"అంజలి పరిచయం కాకముందు నేనో గాలివానలో కొట్టుకుపోతున్న చిగురుటాకులాంటివాడ్ని. నిరంతరం ఆత్మహత్య ఆలోచనలే తప్ప, మరేం ఆలోచించలేకపోయేవాడిని. అంజలిని కూడా ఆరాధించాను, అభిమానించాను, ప్రేమించాను... కానీ... ఏనాడూ కూడా ఆమె చేతి చిటికెన వేలు కూడా తాకలేదు. ఎప్పుడయితే నాకీ వ్యాధి మొదలైందని తెలిసిందో అప్పట్నుంచి నేను ఇంట్లోంచి బయటికి వచ్చేశాను. అంజలిని కలవటం మానేశాను. అయితే ఆమెకి డాక్టర్ల ద్వారా విషయం తెలిసి నా కోసం వెదకటం ప్రారంభించింది. నెలరోజులు అవిశ్రాంతంగా గాలించి ఓ రోజు పట్టుకుని నన్ను...

"నువ్వెందుకు ఇంట్లోంచి వెళ్ళిపోయావో... నాకెందుకు కనిపించకుండా దూరంగా వుంటున్నావో తెలుసుకున్నాను... రాజ్... ఈ వ్యాధి నీకు నా మూలంగానే వచ్చింది. రక్తదానం చేయటం నీకు అలవాటు చేసింది నేనే! గవర్నమెంటు డాక్టర్ల నిర్లక్ష్యపు సాలెగూళ్ళలో చిక్కుకునేలా నేనే చేశాను... అంటూ ఏడ్చింది. నాపై ఆమెకున్న నమ్మకానికి నా మనసు తట్టుకోలేని భావోద్వేగానికి లోనైంది. అయినా అణచుకుని ఆమెని వదిలించుకుని వెళ్ళిపోయాను.

"నిన్ను ఒంటరిగా పోనివ్వను. చావయినా బ్రతుకైనా కలిసే ఇక మన ప్రయాణం" అంటూ అడ్డుపడింది. ఎంత చెప్పినా వినలేదు. నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించే మనిషిని జీవితంలో పొందగలనా అనుకునేవాడిని అంజలి పరిచయం అవకముందు. ఆ అదృష్టం సొంతం చేసుకోగలిగాను. అంతకంటే కావలిసిందేముంది మనిషికి? అది చాలు ఈ జీవితానికి. ఇక నేనేమైపోయినా ఫర్వాలేదు. కానీ అంజలి తనపట్టు విడవటంలేదు. ఆమెకి నచ్చజెప్పి మనం కలిసే జీవిద్దాం... "నేను తప్పకుండా నాలుగురోజుల్లో వస్తాను. మీ కాలేజీ దగ్గర కలుస్తాను" అని నమ్మించాను. ఆమె అప్పటికి వెళ్ళిపోయింది. నాకు త్వరగా చావొస్తే బావుణ్ణు... అంజలి నుంచి, ఆమెకే హానీ కలగకముందే సెలవు తీసుకోవచ్చు అనుకున్నాను. ఆ రోజు నుండి మళ్ళీ సూసైడ్ ఆలోచనలు మనసులో సుడులు తిరగటం మొదలుపెట్టాయి. ఎలాగూ చావు తప్పదని తెలిసినప్పుడు... అనుక్షణం చస్తూ బ్రతకటమెందుకనుకున్నాను.

అదే సమయంలో పీటర్ హత్యవార్త పేపర్లో చూశాను. నాకై నేను ఆత్మహత్య చేసుకోవటానికి ఆ స్థితిలో కూడా ధైర్యం చాలలేదు.

పీటర్ హత్య నేనే చేశానని పోలీసులకు లొంగిపోతే... కోర్టు హత్యానేరం కింద ఉరి తీస్తుంది కదా... నా ప్రమేయం లేకుండానే చావొచ్చని ఆలోచించాను. ఆలోచిస్తూనే నాలుగురోజుల గడిపాను. ఆ రోజు అంజలి కాలేజీ దగ్గర నా కోసం ఎదురుచూడటం దూరం నుండి గమనించాను. ఆమెకి నాపైనున్న ప్రేమకి ఒక ప్రక్క ఆనందం, ఆమె పిచ్చితనానికి కోపమూ కలిగాయి. మౌనంగా నిష్క్రమించాను, ఆమెను కలవకుండానే. మరో రెండు రోజులు ఆలోచించి పోలీసులకు లొంగిపోయాను.

అయితే నేను ఆశించినట్లు నాకు ఉరిశిక్ష వేయలేదు. నేను అనుకున్నది ఒకటైతే, జరిగింది మరొకటి. నా అంజలి నుండి దూర తీరలకు వెళ్ళిపోవటానికే ఈ నేరం చేసినట్లు కోర్టుని నమ్మించాను కరుణ్‌గారూ! ఎవరి బెదిరింపులకో, మరెవరి ఒత్తిడులకో తలవొంచి డబ్బుకు అమ్ముడు పోయికాదు."

చాలాసేపు నుండి మాట్లాడటంతో అతనికి ఊపిరి అందనట్టు ఎగశ్వాస తీయసాగాడు... అతని గుండెల్ని చేతిలో రాసి...

"ఎంత పిచ్చి పని చేశారు మీరు... ప్రేమించిన మనిషికి హాని కలుగుతుందని, ఆమెకు దూరమవ్వటానికి మీకీ ఛాయిస్ కన్పించిందా?" అడిగాడు కరుణ్.

"మరేం చేయను? ప్రాణాలు తీసే ఎయిడ్స్ వ్యాధి నాకు సోకిన ఆమె నాతోనే జీవితం పంచుకుంటానంటుంది. ఆమెకు నాపైనున్న ప్రేమభావం కరిగిపోవాలంటే ఇదొక్కటే మార్గం అనిపించింది నాకు... దాని వలన అంజలికి నేనంటే అసహ్యం కలుగుతుంది. దాంతోపాటు క్షణ క్షణం చావు గురించి ఆలోచిస్తూ, రోజులు లెక్క పెట్టుకునే నరకయాతనా తప్పుతుందని అనుకున్నాను. కానీ ఈసారి నేనే ఓడిపోయాను" యువరాజ్ కళ్ళు కన్నీటి కుండలయ్యాయి.

"మిమ్మల్ని కలవాలని ఆమె వస్తే...?"

"మనసు రాయి చేసుకుని తిరస్కరిస్తాను..." ఆ మాటలు అంటున్నప్పుడు అతని గొంతులో జీర.

"ఎయిడ్స్ వ్యాధిపై వివిధ దేశాల సైంటిస్టులు తీవ్రంగా పరిశోధనలు చేస్తున్నారు. బహుశా త్వరలోనే ఆ వ్యాధి ఔషధాన్ని కనుక్కుంటారు. మీరు మానసికంగా కృంగిపోవద్దు యువరాజ్."

"హుఁ... సముద్రంలో మూడొంతులు మునిగిపోయిన ఓడని అప్పుడే తీరం నుండి బయలుదేరిన వాళ్ళేం ఆదుకోగలరు. నాకా ఆవ లేదు."

అతన్ని ఓదార్చటానికలా అన్నా... కరుణ్‌కి ఆ మాటల్లో నిజం స్ఫురించి మౌనం దాల్చాడు.

"సార్ టైమయిపోయింది" ఈసారి హెడ్‌కానిస్టేబుల్ గ్లాసు డోర్ తెరచి తల లోపలికి పెట్టి చెప్పాడు.

"నిజమైన దోషులు త్వరలోనే చట్టానికి దొరుకుతారు. అప్పుడు మీరు నిర్దోషిగా బయటకు వస్తారు. నేను వెళ్ళొస్తాను... యువరాజ్‌గారూ! ఆత్మస్థైర్యం పెంచుకోండి... ఏ రోగానికయినా మెడిసన్‌కన్నా ముందు తీసుకోవలసిన మందు అదే" అంటూ బయటకు నడిచాడు.

అతను హోటల్‌కి చేరుకునేసరికి నాలుగవుతుంది. వెంటనే రూమ్ ఖాళీ చేసి విశాఖపట్నం బయలుదేరాడు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"రండి కరుణ్‌గారూ! చాలా తొందరగానే బచ్చేశారే! వెళ్ళిన పని ఏమైంది...?" కారు దిగి ఆఫీసులోకి వచ్చిన కరుణ్‌ని చూసి అడిగాడు రాయ్.

"అతను దోషి కాదు రాయ్‌గారూ!" చెప్పి కూర్చున్నాడు.

"ఆర్ యూ ష్యూర్?"

"ఎస్ రాయ్ సాబ్! అతనే చెప్పాడీ సంగతి."

"మరెందుకు పీటర్‌ని మర్డర్ చేశానని కోర్టులో చెప్పాడు."

"మీకు వివరాలన్నీ చెబుతాను. ముందు కొంచెం మంచినీళ్ళు కావాలి."

వెంటనే బోయ్‌ని పిలిచి "సార్‌కి మంచినీళ్ళు ఇబ్బు. తర్వాత రెండు కాఫీ" చెప్పాడు రాయ్.

బోయ్ చల్లటి ఐస్‌వాటర్ ఇచ్చాడు కరుణ్‌కి. తాగేసి గ్లాసు టేబుల్ మీద పెట్టాడతను. ఇంతలో కాఫీలు వచ్చాయి.

"తీసుకోండి కరుణ్‌జీ!" అంటూ ఓ కప్పు తను తీసుకున్నాడు రాయ్. కాఫీ సిప్ చేస్తూ జరిగినదంతా చెప్పాడు కరుణ్. ఆశ్చర్యంతో రాయ్ కళ్ళు పెద్దవయ్యాయి అతను చెప్పింది విని.

"సో యువరాజ్ హంతకుడు కాదని తేలిపోయింది."

"ఎస్..."

"హేమారాణి సంగతేమిటి?"

"ఇంకా ఏమీ సరిగ్గా తెలియలేదు. ఆమె ఇంటికి రెండుసార్లు బచ్చిన ఆ మారుతీ బ్యాన్ మనిషెవరో, హేమారాణికీ మధ్య ఏం సంబంధముందో అర్థంకాలేదు."

"మీ ఏజెంట్లు ఆమెని ఫాలో అవుతున్నారుగా?"

"ఎస్ కరుణ్‌జీ!"

"ఓకే రాయ్ సాబ్! నాకు చాలా టైర్డ్‌గా వుంది. ఇంటికెళ్ళి రెస్ట్ తీసుకుంటాను."

"అలాగే..."

కరుణ్ ఇంటికొచ్చి డ్రస్ మార్చుకున్నాడు. బయటికెళ్ళే ఓపికలేక ఫ్రిజ్‌లో వున్న యాపిల్స్, అరటిపళ్ళు తిని బెడ్‌పై వాలిపోయాడు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్" ఫోన్ రింగ్‌తో తెలివి వచ్చింది కరుణ్‌కి. బద్ధకంగా లేచాడు. వాచ్ ఉదయం ఆరున్నరయినట్లు సూచిస్తోంది. ఫోనెత్తి చెవికానించుకున్నాడు.

"హలో కరుణ్!" అటునుండి మంజుల గొంతు.

"హాయ్ మంజూ..."

"ఏమిటీ ఫోన్ రింగవుతున్నా తీయవూ?"

"సారీ డియర్! నిద్ర మత్తు వదల్లేదు."

"ఏం రాత్రి లేట్‌గా పడుకున్నావా?"

"లేదు! ప్రయాణ బడలికవల్ల తొందరగా మెలకువ రాలేదు."

"ఎప్పుడొచ్చావ్?"

"నిన్న రాత్రి తొమిదిన్నరవుతుంది."

"ఏమిటీ సంగతులు? ఎంతవరకూ వచ్చింది నీ ఎంక్వయిరీ?"

"ఏమిటీ నాకు సూపిరియర్‌లా అడుగుతున్నావు? నీకు ఈ సబ్జెక్ట్ బోర్ కదా!"

"బోరని కాదు కానీ... పూర్తయిందా? లేకపోతే మళ్ళీ రాజమండ్రి వెళ్ళాలి... అదనీ ఇదనీ ఊర్లమ్మట తిరుగుతావా అని."

"పొద్దున్నే పోట్లాట పెట్టుకున్నావా?"

"ప్రేమలో అదీ ఓ భాగమే. ఎప్పుడూ ప్రేమించుకోవటమే అయితే థ్రిల్లేం వుంటుంది? అప్పుడప్పుడు తగువులాడుకుని ఆనక ఎవరు ముందు మాట్లాడాలో తెలియక, ఏదీ తేల్చుకోలేక మౌనసాగరంలో మునిగిపోయి, చివరికి పశ్చాత్తాపంతో ఇద్దరూ ఒక్కసారే ఒకర్నొకరు పలకరించుకుంటే అప్పుడు తెలుస్తుంది ప్రేమలో మజా!"

"అబ్బా ఏం చెప్పావ్ యార్... ఏదైనా లవ్ ఇనిస్టిట్యూట్‌లో గాని జాయినయ్యావా ఏమిటి?"

"అదేం ఇన్‌స్టిట్యూట్ టైప్ ఇన్‌స్టిట్యూట్‌లాగా?"

"అలాంటివి ఇక్కడ లేవు. కానీ అమెరికా, పారిస్‌లో వున్నాయట."

"అందులో ఏం నేర్పుతారట?"

"ప్రేమలో పడటం ఎలా? మీకు నచ్చిన యువతి లేదా యువకుడిని ఆకర్షించటం ఎలా? ప్రేమికుల మధ్య గొడవలు ఎలా సాల్వ్ చేసుకోవాలి? ఏ టైప్ వ్యక్తిత్వం వున్న వాళ్ళతో ఏ విధంగా నడుచుకోవాలి? ఇలాంటివన్నమాట."

"అలాగా! అయితే అందులో అన్నీ వుండుంటాయ్ కానీ రెండు రకాల మనస్థత్వాల వారితో ఎలా నడుచుకోవాలో అన్నది మాత్రం వుండదని నేను ఘంటాపథంగా చెప్పగలను."

"ఏమిటా రెండు రకాల మనస్థత్వాలు?"

"ఒకటి పోలీసులు... రెండవది లాయర్లు."

"ఎందుకని?"

"ఆ రెండు రకాల మనస్థత్వాల్నీ ఎవరూ సరిగ్గా అంచనా వేయలేరు కనుక."

"యూ సిల్లీ! ఆ మాటకొస్తే ఆడవాళ్ళని అస్సలు అంచనా వేయలేము. "ఆడదాని హృదయపు లోతు సముద్రమంత" అని ఓ కవి సెలవీయలేదా?"

"సెలవిచ్చాడా! హాలీడే కదూ?" కొంటెగా అందామె.

"ఏమిటీ తెగ రెచ్చిపోతున్నావ్? ఇంట్లో ఎవరూ లేరా?"

"ఉంటే ఏమిటిట? నాకలాంటి భయాలేం లేవు."

"కాలం ఎప్పుడూ ఎవరికోసమూ ఆగదు. అది నిత్యం ముందుకే సాగిపోతుంది. ఆ గమనంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. అమ్మాయిలు పొద్దున్నే అబ్బాయిలకు ఫోన్‌లు చేసి అల్లరి పెట్టడాలు, ఇంట్లోని పెద్దవాళ్ళంటే భయం లేకపోవడాలు ఇవన్నీ సంభవిస్తాయి."

"ఏమిటీ వేదాంతిలా మాట్లాడుతున్నావు?"

"ఏక్స్యువల్‌గా మగవాడు పెళ్ళయ్యాక వేదాంతం, ఆధ్యాత్మికం, సన్యాసం మొదలయిన వాటిపట్ల ఆకర్షితుడవుతాడు. కానీ పెళ్ళికి ముందే నువ్వు నాకా గతి పట్టిస్తావేమోనని అనుమానం."

"అనుమానాలు, మూలశంకలు పోలీసులకూ, లాయర్లకు మామూలేలే... నేను ఎలాగో ఎడ్జస్టవుతా తప్పుతుందా?" సాగదీస్తూ అందామె. ఆమె మాటలకి నవ్వొచ్చిందతనికి. ఇంతలో–

"ఉంటాను కరుణ్... సాయంత్రం ఏడింటికి ఫోన్ చేస్తాను" గాబరాగా అంది మంజుల.

"ఏమిటంత తొందర? మరి కాసేపు మాట్లాడు డియర్."

"మా నాయనమ్మ పూజ అయిపోవస్తుంది. అదిగో గంట కూడా మోగించేసింది."

"అయితే ఏమిటట? నీకెవరన్నా భయం లేదుగా!"

"అబ్బ... ఏదో సరదాకి అంటాం... నిజమయిపోతుందా... అసలే మా నాయనమ్మ ఆవులిస్తే పేగులు లెక్క పెడుతుంది."

"ఆవులు కష్టం డియర్! గేదెలిస్తాను" నవ్వాపుకుంటూ అన్నాడు అతను.

"వద్దు. ఆ గేదెల మీద నువ్వే ఊరేగు. నీ నల్లకోటుకీ, గేదెల రంగుకి మాచ్ అవుతుంది."

"నాకేం అభ్యంతరం లేదు. రేపొద్దున్న నేనెలా తిరిగితే నువ్వూ అలాగే తిరగాలిగా... ఆ విసయం ఆలోచించుకో."

అటువైపు మంజుల ఫోన్ పెట్టేయటంతో తనూ ఫోన్ పెట్టేశాడతను.

బ్రష్ చేసి బాత్‌రూంలోకి నడిచాడతను పది నిముషాల్లో స్నానం చేసేసి, డ్రస్సప్ అయ్యాడు. బయటకి వెళ్ళబోతూ ఒకసారి పేపర్ తిరగేశాడు. ఇంపార్టెంట్ న్యూసేమీ లేదు. పేపర్ టీపాయ్ మీద ఉంచేసి, ఇంటికి లాక్ చేసి కారులో హోటల్ డిలైట్ చేరుకున్నాడు. కారు పార్క్ చేసి లోపలికి నడిచి రోజూ కూర్చునే టేబుల్ దగ్గరే కూర్చుని...

"రోస్టెడ్ బ్రెడ్ స్లైడ్ విత్ బట్టర్" చెప్పాడు. వెయిటర్ అతని ఆర్డర్ తీసుకుని వెళ్ళిపోయాడు.

"చాందీ జైసా రంగ్‌హై తేరా...

సోనే జే సే వాల్..." పంకజ్ ఉదాస్ గజల్స్ స్పీకర్లలోంచి వినిపిస్తున్నాయి మంద్రంగా. హోటల్లో జనం పల్చగా వున్నారు. ఇంతలో...

"సారీ సార్... ఇది రిజర్వ్ అయిపోయింది. అక్కడ కూర్చోండి" రెండు సార్లు తనకు చెప్పిన వెయిటరే ఇద్దరు భార్యా–భర్తలు వెళ్ళి కూర్చుంటుంటే చెప్పాడు. అప్పుడు కూడా రిజర్వ్‌డ్ బోర్డు లేదు. ఆ దంపతులు వేరే టేబుల్ దగ్గిరికి నడిచారు.

"ఇతనేవిటీ? ఎవర్నీ ఆ టేబుల్ దగ్గర కూర్చోనివ్వడా? సర్వే చేయటానికి బద్ధకం కాబోలు" అనుకున్నాడు కరుణ్.

అతనార్డర్ చేసిన బ్రేక్‌ఫాస్ట్ సర్వే చేశాడు వెయిటర్. మౌనంగా తినసాగాడు. ఇంతలో నలుగులు యువకులు వచ్చి–

"ఇది రిజర్వుడయిపోయింది సార్" అటు పక్క టేబుళ్ళకి పంపి వేసే వెయిటర్ టేబుల్ దగ్గర కూర్చున్నారు. వాళ్ళని చూసి ఆ వెయిటర్ అటు నడిచాడు.

మర్యాద పూర్వకంగా వాళ్ళని అక్కడి నుండి తగలేస్తాడా ముసలాడు" మనసులోనే నవ్వుకుంటూ బ్రేక్‌ఫాస్ట్ పూర్తయిపోవటంతో బిల్ పే చేసి బయటకు నడిచాడు కరుణ్.

కానీ ఒక్క నిముషం అక్కడే గనక అతను వుండి వుంటే జరగబోయే అనూహ్యమైన సంఘటనని చూసేవాడతను.

✧ ✧ ✧ ✧ ✧ ✧

కరుణ్ కారు రాయ్ ఆఫీసు ముందు ఆగింది. దిగి లోపలికి నడిచాడతను.

"ఆ హేమారాణి ఇంటి ముందు కాపు కాయటం చాలా కష్టంగా ఉంది సార్" రాయ్ ఏజెంట్ అన్నాడు.

"ఎందుకని?" రాయ్ అడిగాడు.

"ఆ రోజు నన్ను చూసిన గూర్ఖా రోజూ నా కోసం ఆ ప్రదేశంలో వెతుకుతున్నాడు. వాడొచ్చే సమయానికి నేను చెట్టెక్కవలసి వస్తుంది. ఇలా ఎన్నో రోజులు తప్పించుకోలేమని అనిపిస్తుంది."

అతనికేదో చెప్పబోయిన రాయ్ కరుణ్ రావటం చూశాడు.

"రండి కరుణ్‌గారూ..." అంటూ ఆహ్వానించి చెయిర్ చూపించాడు.

"ఏమిటి హేమరాణి గురించేమయినా తెలిసిందా? మీ ఏజెంట్ ఏదో చెబుతున్నట్టున్నారు!" అన్నాడతను.

అరుణ్ చెప్పింది రాయ్ కరుణ్‌తో చెప్పాడు. కరుణ్ ఆలోచనలో పడ్డాడు.

"అయితే నువ్వొక పని చెయ్ అరుణ్. హేమరాణి ఇంటి ముందే కాపు వేయటం మానేసి, ఆమె స్ట్రీట్ చివరలో వుండు. ఎలాగూ ఆమె ఇంటికి బచ్చే బ్యక్తి సుబ్బు బండే బైపు నుండే కదా రావాలి... ఆ స్ట్రీట్‌లోకి రావాలంటే చీకటే మార్గం కదా? రెండో వైపు డెడ్ ఐండ్ ఉంది. కనుక ఆమె ఇంటికి బచ్చే ఏ బ్యక్తయినా లేదా వెహికల్ అయినా అక్కడి నుండే గమనించు. గూర్ఖా నిన్ను బెదికేది హేమరాణి ఇంటి ముందు చెట్టు దగ్గరే కాబట్టి, నీకు సమస్య వుండదు. ఆమె ఇంటి నుండి తిరిగి వచ్చేబాళ్ళని ఫాలో చెయ్. ఈసారి మోపెడ్ కాదు. మన మోటర్ సైకిల్ తీసుకెళ్ళు. అప్పుడు నీకు ఈజీ అవుతుంది" చెప్పాడు రాయ్.

అలాగేనంటూ అరుణ్ శెలవు తీసుకుని బయటకు నడిచాడు.

"ఏమిటి కరుణ్‌జీ ఆలోచనలో మునిగిపోయారు?" అడిగాడు రాయ్.

"హేమరాణిని మనం అబ్జర్వ్ చేస్తున్నట్లు ఎవరికీ తెలియకూడదు. నా కేసు ముందుకు నడవాలంటే మనకి మిగిలింది ప్రస్తుతం ఆమె ఒక్కర్తే. మురళీకృష్ణ ఆచూకీ కూడా తెలియలేదు."

"అతనింటికి మీరు మళ్ళీ వెళ్ళారా?"

"లేదు..."

"ఓసారి బెళ్ళి చూడండి... ఎందుకయినా మంచిది. అతనిప్పుడు ఇంటికి వచ్చి ఉండొచ్చుకదా!"

"కరెక్టే... వెళ్ళి చూస్తాను."

"కాబాలంటే మనం అతనింటిపై కూడా ఒక కన్నేసి ఉండొచ్చు."

"అవసరం లేదు రాయ్ సాబ్, నేనిప్పుడే వెళ్ళి అతనింటికి వచ్చాడో లేదో తెలుసుకుంటాను. నా క్లయింట్ ఇచ్చిన పేపర్ కటింగ్‌లోని మురళీకృష్ణా, ఇతనూ ఒకరే అయితే కేసు సగం పూర్తయిపోయినట్లే... అతని ద్వారా ఆ పేపర్ కటింగ్‌లో వున్న ప్రొఫెసర్, డాక్టర్లెవరో తెలిసిపోతుంది."

"యూబార్ రైట్ కరుణ్‌జీ!"

"అయితే వెళ్ళొస్తాను రాయ్‌సాబ్" లేచి నిలబడ్డాడు.

"గుడ్‌లక్" చెప్పాడు రాయ్.

కరుణ్ బయటకు నడిచి తన కారులో మురళీకృష్ణ ఇంటివైపు బయలుదేరాడు. పది నిముషాల్లో కారు అతనుండే ఏరియాకి చేరుకుంది. కారుని వీధి మొదట్లోనే వదిలేసి కాలినడకన అతనింటికి చేరుకున్నాడు. కాలింగ్ బెల్ ప్రెస్ చేసి వెయిట్ చేయసాగాడు. కొద్ది క్షణాల తర్వాత తలుపు తెరచుకుంది. కరుణ్‌ని చూసి–

"రండి" అంటూ ఆహ్వానించింది మురళీకృష్ణ భార్య మాలతి. అతనామెతోపాటు నడిచి సోఫాలో కూర్చున్నాడు. ఆమె లోపలికి వెళ్ళి తన అత్తగారికి కరుణ్ వచ్చిన సంగతి చెప్పింది.

"వచ్చావా కరుణ్‌బాబూ! వీడు అప్పట్నించీ ఇంటికి రాలేదు. పది పన్నెండు రోజులపైనే అయిపోయింది. మాకేదో భయంగా ఉంది" మురళీకృష్ణ తల్లి చెప్పింది.

"అప్పట్నుంచీ రాలేదా?" ఆశ్చర్యంగా అన్నాడతను.

"లేదండి. ఇంతకు ముందు కూడా ఇలా చెప్పకుండా ఊర్లు వెళ్ళినా నాలుగయిదు రోజుల్లో వచ్చేసేవారు. ఎప్పుడూ ఇన్ని రోజులు రాకుండా వుండలేదు. పోలీస్ కంప్లైంట్ ఇవ్వాలనకుంటున్నాం" చెప్పింది మాలతి.

"ఏమయిపోయాడతను. తనకు తానుగా ఎక్కడికైనా వెళ్ళాడా? లేకపోతే అతన్నెవరయినా కిడ్నాప్ చేశారా? చేస్తే ఎందుకు చేసినట్లు?" తీవ్రంగా ఆలోచించసాగాడతను. కొద్దిసేపు అక్కడ మౌనం రాజ్యమేలింది.

మురళీకృష్ణ తల్లీ, భార్యల మొహాల్లో విచారరేఖలు. కరుణ్ అక్కడ మరి ఉండలేక–

"వస్తానండి నేను. మరొక రెండు మూడు రోజులు చూసి పోలీస్ కంప్లయింట్ ఇద్దాం. నేనూ ప్రయత్నిస్తాను అతని గురించి" అంటూ బయటకు నడిచాడు.

⁎ ⁎ ⁎ ⁎ ⁎ ⁎

"ట్రింగ్... ట్రింగ్...! ట్రింగ్... ట్రింగ్...!" ఫోన్ మోగగానే రిసీవర్ ఎత్తి–

"హలో! కరుణ్ హియర్" అన్నాడతను.

"కరుణ్ ఏం చేస్తేన్నావ్?" అట్నుంచి మంజుల అడిగింది.

"ఆఁ ఏం లేదు. ఏదో మాగజైన్ చదువుతున్నాను..." కేసులోని ముఖ్యమైన పాయింట్లు ఎలా ముందుకు ప్రొసీడవ్వాలని ఆలోచిస్తున్నా" ఆమెకి చిన్న అబద్ధం చెప్పాడు.

"ఏడింటికి ఫోన్ చేస్తానన్నానా? టైమెంతయిందో చూడు" కరుణ్ రిస్ట్‌వాచ్‌లో టైం చూసుకున్నాడు. సరిగ్గా సాయంత్రం ఏడుగంటలవుతోంది.

"వెరీగుడ్! పంక్చువాలిటీ మెయిన్‌టెన్ చేస్తున్నావే!"

"నీకేమయినా పనుందా ఇప్పుడు?"

"ఏం?"

"ఈ రోజు గురువారం కదా! సాయిబాబా టెంపుల్‌కి వెళదాం. ఈస్ట్ పాయింట్ కాలనీలో వున్న షిర్డీ టెంపుల్ దగ్గరకు వస్తాను. వెయిట్ చెయ్యి."

"ఎందుకలా? నేనే మీ ఇంటికి దగ్గరలో వున్న మిల్క్‌బూత్ దగ్గర వుంటాను రావచ్చుకదా."

"సరే! వెంటనే బయలుదేరు" అటునుంచి ఫోన్ డిస్‌కనెక్టయింది. కరుణ్ ఇంటికి లాక్ చేసి కారులో మంజుల ఇంటివైపు బయలుదేరాడు. ఆమె బాధపడుతుందని వస్తానన్నాడు కానీ అప్పుడు ఎక్కడకీ కదలాలని లేదతనికి. ఆలోచిస్తూనే డ్రైవ్ చేయసాగాడతను. పది నిమిషాల్లో కారు మిల్క్ బూత్ చేరుకుంది. సరిగ్గా అప్పుడే వస్తూ కనిపించింది మంజుల. అతను డోర్ ఓపెన్ చేసి వుంచాడు. ఆమె వచ్చి కారులో కూర్చోగానే ఈస్ట్ పాయింట్ కాలనీ వైపు పరిగెత్తసాగింది కారు.

"ఏమిటి మాట్లాడకుండా ఆ మౌనం?" సీరియస్‌గా డ్రైవ్ చేస్తున్న కరుణ్‌ని అడిగింది మంజుల.

"ఏం లేదు."

"మరయితే ఏదైనా మాట్లాడు!"

"నువ్వే మాట్లాడు మంజూ! వింటూ డ్రైవ్ చేస్తాను."

"ఏం నువ్వు మాట్లాడుతూ డ్రైవ్ చెయ్యలేవా?"

"నువ్వు మాట్లాడుతూ వుంటే బాగుంటుంది."

"థ్యాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్" అందామె.

కారు మెత్తగా రోడ్డుమీద పరుగులు తీస్తోంది.

"బాబా దర్శనం చేసుకుని, తరువాత కాసేపు బీచ్‌లో కూర్చుందాం" చెప్పిందామె.

"అలాగే!" మాటల్లోనే కారు బాబా గుడిని సమీపించింది. కార్లు, స్కూటర్లు, సైకిళ్ళు-గుడి చుట్టు పక్కల విపరీతమైన జన సందోహం.

"ఓహ్! హెవీ క్రౌడ్" అన్నాడతను.

"గురువారం కదా!"

కారుని ఎక్కడాపాలో తెలీలేదు కరుణ్‌కి. ఎక్కడా స్థలం లేదు. చేసేదిలేక గుడికి దూరంగా ఆపాడు కారుని. ఇద్దరూ దిగి నడిచారు. చెప్పులు బయటి కుర్రాడికి అప్పగించి లోపలికి ప్రవేశించారు. కాళ్ళు కడుక్కుని క్యూలో నిల్చున్నారు. మెల్లగా కదలసాగింది క్యూ. దర్శనం అయిపోయిన వారు ప్రసాదం తింటూ గుడి ప్రాంగణంలోనే చతికిలబడుతున్నారు. వాలంటీర్లు క్యూలో నిలుచున్న భక్తుల్ని త్వరగా కదలమంటూ హెచ్చరిస్తున్నారు. కరుణ్, మంజులలకి బాబా దర్శనం కావటానికి అరగంట పైనే పట్టింది.

"కూర్చో కరుణ్" అంటూ అతని చేతిలో బాబా ప్రసాదం వుంచి ఓ గట్టుపై కూర్చుందామె.

ఆమె ప్రక్కనే కూర్చుని ప్రసాదం తినసాగాడు అతను.

"అయ్యో మర్చిపోయాను! విభూది తీసుకోలేదు. నువ్విక్కడే వుండు. నే వెళ్ళి తీసుకొస్తాను" అంటూ లేచింది. జనం రాను రాను పలచబడ్డారు. కరుణ్ బయటికి చూస్తూ మంజుల రాక కోసం వెయిట్ చేయసాగాడు.

ఇంతలో ప్రేమ్‌నాథ్ ఇంటిలో పని కుర్రాడు వెళ్ళిపోతూ కనిపించాడు. ఒక్క ఉదుటున బయటకు వచ్చాడు కరుణ్.

"ఇదిగో నిన్నే..." పిలిచాడు కుర్రాడిని.

"హెఁవిషయండీ? కరుణ్‌నే చూస్తూ అడిగాడు.

"నీ పేరేమిటి?"

"శ్రీహినూ."

"ఏమిటి?"

"శ్రీహినూ!"

"శీనూ... అవునా?" అవునన్నట్టు తలూపాడు కుర్రాడు.

"నువ్వెక్కడ పని చేస్తున్నావ్?"

"హెక్కషా షెయ్యట్లేషు..."

"ఏం..."

"మా అయ్యషారు షష్షిపోయాదుగా..."

"ఎవరు మీ అయ్యగారు?"

"ప్రేష్‌నాష్."

"మరి అమ్మగారి పేరు?"

"అమ్మషారు లేరు."

"అదేం?"

"ఊరెళ్ళిపోయారుగా!"

"ఏ ఊరు?"

"షెలీషు."

"మీ అయ్యగారూ, అమ్మగారూ తరచూ పోట్లాడుకునేవారా?"

"లేషు..."

"లేదా?"

"అయ్యషారే అమ్మషారిషో షోట్లాషేవారు."

"ఎందుకని?"

"అయ్యషారు ఎప్పుషూ ఇంషికి ఆషవాళ్ళని తీసుకొచ్చేవాషు."

"ఎవరా ఆడవాళ్ళు?"

"అయ్యగారి ఫ్రెండ్షు."

"అయ్యగారి ఫ్రెండ్సా?"

"హవును."

"మీ అయ్యగారు మంచివాళ్ళా? అమ్మగారు మంచివాళ్ళా?"

"అమ్మషారే."

"మీ అమ్మగారు వూరుళ్ళేముందు నీకో పాకెట్ ఇచ్చి కరుణ్‌గారికి ఈ పాకెట్ ఇవ్వమని హోటల్ డిలైట్‌కి నిన్ను పంపారా?"

"లేషు" ఠక్కున బదులిచ్చాడతను.

"లేదా? బాగా గుర్తు తెచ్చుకో..."

"లేషన్నానా..." వెళ్ళిపోసాగాడు కుర్రాడు.

"ఇదుగో బాబూ ఆగు..." కరుణ్ పరుగులాంటి నడకతో అతన్ని వెంబడించాడు. అది గమనించి పరుగందుకున్నాడా కుర్రాడు. "ఇతనే తనకి ఇమ్మని ఆ పాకెట్ డిలైట్ దర్వాన్‌కి ఇచ్చాడు" రూఢీగా అనుకున్నాడు కరుణ్.

ముందు పరిగెడుతున్న ఆకుర్రాడినీ, వెంబడిస్తున్న కరుణ్‌నీ వింతగా చూడసాగారు జనం. ఇంతలో ఆ కుర్రాడు రోడ్ సైడునున్న తుప్పల్లోకి దూరిపోయాడు. బాగా చీకటిగా వుండటంతో కరుణ్‌కేమీ కనిపించలేదు. అయినా తనూ లోపలికి చొచ్చుకెళ్ళి చూశాడు. ఎంత గాలించినా కనిపించలేదు ఆ కుర్రాడు.

"చేతికందినట్లే అంది మాయమైపోయాడే" అనుకుంటూ వెనుదిరిగి గుడికి చేరుకున్నాడు కరుణ్.

"ఎక్కడికిపోయావ్?" చిరాగ్గా అడిగింది మంజుల.

"అదీ... ఓ... ఫ్రెండ్ కనిపిస్తే అలా వెళ్ళి మాట్లాడి వచ్చాను."

"ఇక వెళదామా?" అందామె.

"ఓ.కే!"

ఇద్దరూ బయటికి నడిచి డబ్బులిచ్చి చెప్పులబ్బాయి దగ్గర జోళ్ళు తీసుకున్నారు వాళ్ళ కారు బీచ్‌వైపు పరిగెత్తసాగింది. మంజుల బాబా విభూది తను పెట్టుకుని, కరుణ్ నుదిటిపై రాసింది. బీచ్‌రోడ్ కార్పోరేషన్ వాళ్ళ లైటింగ్‌లో పట్టపగల్లా వుంది. ఎనిమిది గంటలవటంతో బీచ్‌లో పెద్దగా జనంలేరు. కరుణ్ కారాపి దిగాడు. మంజుల కూడా దిగింది.

"ఇక్కడే కూర్చుందామా? లోపలికి వెళదామా?" రోడ్డు పక్కనున్న సిమెంటు బెంచీలని చూపిస్తూ అడిగాడు కరుణ్.

"ఇక్కడే కూర్చుందాం!"

ఇద్దరూ సిమెంటు బెంచీలపై ఆశీనులయ్యారు. చంద్రుని కిరణాలు సముద్ర జలాలపై పడి వెండిలా మెరుస్తున్నాయి. నీటి కదలికకి వెండి ముద్దలు సుతారంగా ఒకదానికి ఒకటి ఒరుసుకుంటున్నట్లుంది సాగరం.

"కరుణ్ అటు చూడు!" అతనికి చూపించిందా దృశ్యాన్ని.

"ఏమిటి?" ఆమె చూపించిన దిక్కుచూసి అడిగాడతను.

"చంద్రకిరణాలు పడి సముద్రం ఎంత అందంగా కన్పిస్తుందో కదూ?"

"అవును!" అన్నాడతను.

ఆమె ఆనందంగా ఆ దృశ్యాన్నే చూస్తుండిపోయింది.

"ఆ కుర్రాడిని పట్టుకుంటే తనకి చాలా వివరాలు తెలుస్తాయి. హరిణి పంపిన పాకెట్ గురించి అడగ్గానే ఆ కుర్రాడు పారిపోయాడంటే తనకి అతనే ఆ పాకెట్ దర్వాన్‌ద్వారా అందించాడు" అనుకున్నాడతను.

"కరుణ్! ఇక వెళదాం."బీచ్‌లో టైం చూసుకుని అందామె.

"ఊఁ" అంటూ లేచాడతను. ఆమెని మిల్క్‌బూత్ దగ్గర దించేసి రాయ్ ఆఫీస్‌వైపు పోనిచ్చాడు కారుని. పది నిమిషాల్లో అక్కడికి చేరుకుంది కారు. దిగి డోర్ క్లోజ్‌చేసి లోపలికి నడిచాడు.

"గుడీవినింగ్ కరుణ్‌జీ..." అతడ్ని చూస్తూనే అన్నాడు రాయ్.

"గుడీవినింగ్ రాయ్‌సాబ్..."

"ఏమిటిలా వచ్చారు?"

"మీకోసారి చెప్పాను కదా మిసెల్స్ కుర్రాడు. అతన్ని పట్టుకోవాలి మనం. అతనిల్లు పెదవాల్తేరులోనే. కరెక్ట్‌గా ఎక్కడో తెలియదు. అతన్ని పట్టుకుంటే వివరాలేమయినా తెలియవచ్చు" చెప్పాడు కరుణ్.

"అలాగే!"

"సాధ్యమైనంత తొందరగా మనమా పని చేస్తే మంచిది."

"ష్యూర్!"

"హేమారాణి గురించిన వివరాలేమయినా తెలిసాయా?"

"లేదు కరుణ్‌జీ!"

"ఓకె! నేనింటికి వెళతాను" లేచి నిలబడ్డాడు కరుణ్.

"ఆల్‌రైట్ కరుణ్‌గారూ! మా ఏజెంట్‌ని వెంటనే పంపించి మీరు చెప్పిన విబరాలు... అదే పధ్నాలుగేళ్ళ పిల్లవాడు, నల్లగా, సన్నగా, రింగుల జుట్టుతో "మిసెల్స్" వున్నబాడిని ట్రేస్ చేయమని చెబుతాను.

"ఓకె. గుడ్‌లక్!"

"గుడ్‌నైట్ కరుణ్‌జీ!"

⁂ ⁂ ⁂ ⁂ ⁂ ⁂

రాత్రి పన్నెంటు గంటల సమయం!

చంద్రుని వెలుగులో ఆ ప్రదేశమంతా చేయి తిరిగిన చిత్రకారుడు గీసిన చిత్రంలా వుంది. పవర్ కట్‌వల్ల వీధిలైట్లు లేకపోయినా– చీకటి– చంద్రుని వెండి కిరణాల ధాటికి చిరునామా లేకుండా కనుమరుగయింది.

హేమారాణి వీధి చివరి దుఖాణాల చావిడిలో ముసుగుతన్ని నిద్రపోతుందో ఆకారం... చూసేసరికి ఎవరో బిచ్చగాడు పడుకున్నట్టున్నా... ఆముసుగులో ఉన్నది రాయ్ ఏజెంట్ అరుణ్... అతను కప్పుకున్న దుప్పటి కన్నాల్లోంచి హేమారాణి ఇంటివేపే చూస్తున్నాడతను. కొంచెం దూరంలో వున్న చెత్తకుండీ ప్రక్కనే అతని ఇండ్... సుజికీ మోటార్ సైకిల్ వెన్నెల్లో అభ్యంగన స్నానం చేస్తున్నట్లున్నది.

ఇంతలో...

"పీ...ప్! పీ...ప్!" అంటూ విజిలేసుకుని అటే రాసాగాడు గూర్ఖా... అది విని మరింతగా ముడుచుకుని పడుకున్నాడు అరుణ్.

గూర్ఖా అతన్ని దాటుకుని ముందుకెళ్ళిపోయాడు. తన సైకిల్‌మీద. సరిగ్గా హేమారాణి ఇంటి ముందున్న చెట్టు దగ్గర సైకిల్ దిగి చుట్టూ పరీక్షగా చూశాడు ఎవరూ అక్కడున్న జాడ లేకపోవడంతో మళ్ళీ విజిలేసుకుంటూ ముందుకెళ్ళిపోయాడు.

అదే సమయానికా వీధిలోకి ఎంటరైంది. ఓ మారుతీ వ్యాన్... అరుణ్ కళ్ళు చిలికించి చూశాడు. ఆ వ్యాన్ సరాసరి వెళ్ళి హేమారాణి ఇంటిముందు ఆగింది. అందులోంచి ఓ వ్యక్తి దిగి ఆమె ఇంటిలోకి నడిచాడు.

దూరంగా వుండటం వలన అరుణ్‌కి అతని రూపురేఖలు తెలియలేదు.

వీధి చివరిదాకా వెళ్ళిన గూర్ఖా... డెడ్ ఎండ్ అవటం వలన తిరిగి వస్తూ కన్పించాడు. విజిలేయకుండానే అరుణ్‌ని దాటుకుని మెయిన్ రోడ్డు వేపు సాగిపోయాడతను.

అరుణ్ చూపు మార్చకుండా హేమారాణి ఇంటివేపే చూడసాగాడు. ఆమె ఇంటిలోంచి రెండు ఆకారాలు బయటకొచ్చి వ్యానెక్కాయి. మరుక్షణం అరుణ్ తన బైక్ దగ్గరకి పరిగెత్తి స్టార్ట్ చేశాడు. వ్యాన్ తనని దాటిపోగానే వెంబడించడం మొదలుపెట్టాడు.

పెదవాల్తేరు నుంచి సరాసరి సిరిపురం వేపు తిరిగింది వ్యాన్. వన్ వే గ్లాసవటం వలన వ్యాన్‌లోని మనుషులు బయటకు కనిపించటం లేదు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉండటం వలన వ్యాన్ ఎనభై కిలోమీటర్ల స్పీడ్‌తో వెళ్ళసాగింది.

ఆ వేగాన్ని అందుకోవటం అరుణ్‌కి కష్టంగా ఉంది.

సిరిపురం నుండి మద్దెలపాలెం మీదుగా హైవేకి చేరుకుంది వ్యాన్. సీతమ్మధార, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, ఎన్.ఎ.డి. జంక్షన్‌లు దాటుకుని గాజువాక వేపు దూసుకుపోతుంది.

మితిమీరిన వేగం వలన అరుణ్ కంట్లోంచి నీళ్ళు రాసాగాయి. అయినా వ్యాన్‌ని అతి చొరవగా ఫాలో అవసాగాడు.

కొత్త గాజువాక సమీపిస్తుండగా వ్యాన్ వేగంలో మార్పు వచ్చింది. ఎనభయ్, డెబ్బై, అరవైనుంచి నలభై కిలోమీటర్ల వేగంతో పయనించ సాగింది.

అరుణ్ కూడా అదే వేగంతో వ్యాన్‌ని అనుసరించసాగాడు.

ఉన్నట్టుండి వ్యాన్ మళ్ళీ స్పీడందుకుని కొంచెం ముందుకెళ్ళి– పూర్తిగా ఆగిపోయింది... అరుణ్ అంత తొందరగా బైక్‌ని కంట్రోల్ చేయలేకపోయాడు.

దానివలన వ్యాన్‌కి కొంచెం ముందుకెళ్ళిపోయాడు. అయినా బైక్‌ని ఆపితే వాళ్ళకి అనుమానం వస్తుందని మెల్లగా పోనివ్వసాగాడు. రన్నింగ్‌లోనే బైక్ రియల్‌వ్యూని సరిచేసి, వ్యాన్‌ని అందులోంచి చూడసాగాడు. మెల్లగా బైక్ వెనకాలే రాసాగింది వ్యాన్.

వాళ్ళకి అనుమానం రాకూడదని బైక్ రన్నింగ్‌లోనే పెట్రోల్ "ఆఫ్"లో పెట్టాడు. దాంతో కొంచెం దూరం ముందుకెళ్ళి దానంతటదే కుదుపులతో ఆగిపోయింది బైక్.

అరుణ్ బైక్ దిగి ఏదో రిపేర్ చేస్తున్నట్లు బైక్ ప్లగ్‌తీసి మళ్ళీ పెడుతూ ఓరకంట వెనక్కి చూశాడు.

ఆశ్చర్యం!

తనకి కొంచెం దూరంలో వ్యాన్ కూడా ఆగిపోయి వుంది. ఇంజన్ మాత్రం రన్నింగ్‌లోనే ఉంది. వ్యాన్ హెడ్‌లైట్ల కాంతివల్ల అరుణ్ ఆ చీకట్లో కూడా స్పష్టంగా కన్పిస్తున్నాడు. ఏం చేయాలో తోచక బండి కిక్ కొట్టసాగాడు.

అప్పుడు కదిలింది వ్యాన్– ముందు మెల్లగా... తరువాత ఒక్కసారిగా పికప్ అందుకుంది. దాని వేగంవల్ల చక్రాలు "కీచు" మంటూ రోడ్డుని ఒరుసుకుని పెద్దగా శబ్దం చేశాయి.

అరుణ్ ఉలిక్కిపడి చూసాడు...

అదే సమయంలో వ్యాన్ హెడ్‌లైట్లు ఆరిపోయాయి. వ్యాన్ ఊహించని వేగంతో తనవైపే వస్తుంది. అప్పుడర్థమైందతనికి... తనని వాళ్ళు ఎటాక్ చేయబోతున్నారని...

అంతే...

ఒక్క ఉదుటున డ్రైవ్ చేశాడు. కానీ ఫలితం లేకపోయింది... అఖండమయిన వేగంతో వచ్చిన వ్యాన్ అరుణ్‌నీ, బైక్‌నీ ఢీకొని, ఆగకుండానే ముందుకు దూసుకుపోయింది. అరుణ్ శరీరం నుండి రక్తం స్రవిస్తుండగా తన బండివంక చూశాడు. ఏదో రాక్షస హస్తం నలిపివేసినట్లు అప్పడంలా అణిగిపోయింది అది. మరుక్షణం అతనికి స్పృహ తప్పింది...

⁂ ⁂ ⁂ ⁂ ⁂ ⁂

కరుణ్ తలుపుకి లాక్ చేస్తుండగా...

ట్రింగ్...ట్రింగ్...! ట్రింగ్...ట్రింగ్...!" అంటూ ఫోన్ మోగింది.

మళ్ళీ వెనక్కి వెళ్ళి ఫోనెత్తి...

"కరుణ్ స్పీకింగ్" అన్నాడు.

"కరుణ్‌జీ నేను రాయ్‌ని."

"చెప్పండి సార్!"

"మిసెల్స్ పిల్లాడు మీరు చెప్పినట్లే పెదవాల్తేరులోనే వుంటున్నాడు. అతనింటిని ట్రేస్ చేశారు మా ఏజెంట్లు."

"వెరీగుడ్!"

"కానీ ఆ అబ్బాయి రెండు రోజులనుంచి ఇంటికి రాబటంలేదు."

"షిట్!"

"అతనికి తల్లిదండ్రులు లేరు. అక్కడా ఇక్కడా పని చేసుకుంటూ తెలిసినవాళ్ళ ఇంట్లో ఉంటున్నాడు. వాళ్ళని ఎంక్వయిరీ చేస్తే అతను రెండు రోజులుగా పత్తాలేడని తెలిసింది."

కరుణ్ ఏమీ మాట్లాడలేదు.

"మరొక బ్యాడ్ న్యూస్ కరుణ్‌గారూ!"

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాడు.

"అరుణ్ రాత్రి హేమారాణి ఇంటిముందు వెయిట్ చేస్తుంటే ఓ మారుతీ వ్యాన్ వచ్చి హేమారాణిని ఎక్కించుకుని వెళుతుంటే అతను ఫాలో అయ్యాడట. ఆ వ్యాన్ పెదవాల్తేరు నుంచీ కొత్త గాజువాక చేరుకుంది. అక్కడ అరుణ్‌ని గుద్దేసి ఆగకుండా ముందుకెళ్ళిపోయిందట. అరుణ్‌ని తెల్లవారు జామున మూడుగంటలకి గాజువాకలో ఉన్న "కృష్ణవేణి" హాస్పిటల్లో ఎడ్మిట్ చేశారట ఎవరో! అతనికి కుడిచెయ్యి ఫ్రాక్చరయింది. లాస్ట్ మూమెంట్‌లో తప్పించుకున్నాడట అతను."

"ఇప్పుడెలా ఉంది అతని హెల్త్ కండిషన్?"

"నో ప్రాబ్లెం!"

"ఈ చర్యతో హేమారాణి కూడా అనుమానస్పదమయినదేనని తెలుస్తోంది.

"ఎస్ కరుణ్‌జీ... ఆమె ఇల్లు తెల్లవారేసరికి ఖాళీ చేయబడి ఉందట. మార్నింగ్ డ్యూటీ ఏజెంట్ చెప్పాడు."

"అంటే ఆమె కూడా అండర్ గ్రౌండ్‌లోకి వెళ్ళిపోయిందన్నమాట. మొట్టమొదట పీటర్ హత్య, హెడ్ వెయిటర్ మురళీకృష్ణ అదృశ్యం, తరువాత రియల్ ఎస్టేట్ ఓనర్ ప్రేమ్‌నాథ్ ఖూనీ, మిసెల్స్ కుర్రాడి గల్లంతు, ఇప్పుడు హేమారాణి మాయమవటం! ఇక నేనీ కేసులో ముందుకెళ్ళటానికీ, అసలు దోషుల్ని పట్టుకోవటానికీ ఉపయోగపడే మనుష్యులెవరూ లేరు. టోటల్లీ ఇనఫ్!"

రాయ్ ఏమీ మాట్లాడలేదు.

కొద్దిసేపు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం.

"మీరిప్పుడు అరుణ్ దగ్గరికెళుతున్నారా?" అడిగాడు కరుణ్.

"వెళదామనే అనుకుంటున్నాను."

"నేనూ వస్తాను."

"రండి వెయిట్ చేస్తాను" అంటూ ఫోన్ క్రెడిల్ చేశాడు రాయ్.

కరుణ్ ఇంటికి లాక్‌చేసి కారులో రాయ్ ఆఫీసుకి చేరుకున్నాడు.

ఇద్దరూ గాజువాకలోని కృష్ణవేణి హాస్పిటల్‌కి వెళ్ళాడు.

రూమ్ నెంబర్ నలభై ఎనిమిదిలో వున్నాడు అరుణ్.

కరుణ్, రాయ్‌లను చూసి లేవబోయాడు.

"నో...నో లేబద్దు అరుణ్" వారించాడు రాయ్.

"ఎలా జరిగింది?" కూర్చుంటూ అడిగాడు కరుణ్.

జరిగిందంతా వివరించాడు అరుణ్.

అతని చేతికి పిండికట్టు వేయబడి వుంది.

నుదుటిమీద బేండేజ్, కాళ్ళకి కూడా దెబ్బలు తగిలాయి.

"నన్ను ఢీకొని ఆ వ్యాన్ ఆగకుండానే ముందుకెళ్ళిపోయింది... ఇంతకు ముందు వచ్చిన వ్యానే అది. నెంబర్ ప్లేటుకు బదులు పసుపుపచ్చ పెయింటుతో "ఫర్ రిజిస్ట్రేషన్" అని రాసుంది" చెప్పాడతను.

"హేమారాణి ఇంటిలోకి వెళ్ళిన వ్యక్తి పోలికలు తెలియలేదు కదూ!"

"అవునుసార్! దూరంగా వుండటంవల్ల అస్సలు గుర్తుపట్టలేకపోయాను. కానీ మనిషి ఐదడుగుల ఎనిమిదంగుళాల ఎత్తుండొచ్చు. మరీ లావూ, సన్నమూ కాని పర్సనాలిటీ."

"అచ్చా!" తలూపుతూ అన్నాడు రాయ్.

కొద్దిసేపు కూర్చుని అరుణ్‌ని రెస్ట్ తీసుకోమని చెప్పి వచ్చేశారు వాళ్ళు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

రాత్రి తొమ్మిది గంటలయింది సమయం!

"హోటల్ డిలైట్" అన్న అక్షరాలు నీలిరంగు విద్యుద్దీపాలతో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి.

కరుణ్ కారు పార్కింగ్ ప్లేస్‌లో పెట్టి దిగాడు.

అతన్ని చూడగానే దర్వాన్ వినయంగా అభివాదం చేసి తలుపు తెరిచాడు.

"థాంక్యూ" అంటూ లోపలికి నడిచాడతను.

రోజూ తను కూర్చునే టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

అతన్ని చూడగానే వెయిటర్ వచ్చి నిల్చున్నాడు ఆర్డర్ కోసంద.

"ప్లెయిన్ మీల్స్ విత్ వెజిటబుల్ కర్రీస్" చెప్పాడు కరుణ్.

అతను వెళ్ళిపోయాడు.

"బతానాబీ నహీ ఆతా!

చుపానాబీ నహీ ఆతా!!

హమే తుమ్ సే మొహబ్బత్ హై...

బతానాబీ నహీ ఆతా...!!"

బాజీగర్ హిందీ చిత్రలోని ఆ పాట స్పీకర్‌లోంచి చెవులకింపుగా వినిపిస్తోంది.

ఇంతలో నలుగురు యువకులు లోపలికి ఎంటరయ్యారు.

సరాసరి వచ్చి ఓ టేబుల్ చుట్టూ కూర్చున్నారు.

ఇరవై, ఇరవై రెండు సంవత్సరాల వయస్సుంటుంది వాళ్ళకి.

ఇంచుమించు అందరూ లూజ్ షర్ట్స్, జీన్స్ ఫ్యాంటులు ధరించారు.

"వాహ్! క్యా సాంగ్ హై యార్?" వాళ్ళలో ఓ యువకుడు తన్మయంగా అన్నాడు.

మిగతా ముగ్గురూ అవునన్నట్లు తలలూపారు.

"ఈ టేబుల్ రిజర్వ్ అయిపోయింది సార్" అంటూ వేరే టేబుల్ దగ్గరికి పంపించేస్తాడు ఆ వృద్ధ వెయిటర్ వీళ్ళని" అనుకున్నాడు కరుణ్. అది అతని టేబులే.

అతనలా అనుకుంటుండగానే కిచెన్లోంచి బయటికొస్తూ కనిపించాడా వెయిటర్.

మెల్లగా నడుచుకుని ఆ నలుగురి యువకుల దగ్గరికి వచ్చాడు.

కరుణ్ అటే చూడసాగాడు.

ఆ వెయిటర్ని చూడగానే–

"రాజస్థానీ బిర్యానీ విత్ తందూరీ చికెన్" అంటూ ఆర్డరిచ్చారు వాళ్ళు.

ఒక్కక్షణం పరిశీలనగా వారి వంక చూసి వెళ్ళిపోయాడు వెయిటర్.

తన అంచనా తప్పినందుకు ఆశ్చర్యపడ్డాడు కరుణ్.

"బహుశా వాళ్ళు రిజర్వ్ చేసుకున్నారేమో ఆ టేబుల్. లేకపోతే అతని తీరుచూసి హోటల్ మేనేజ్‌మెంట్ మందలించి వుంటారు. అందుకే పూర్వంలా వచ్చినవాళ్ళని అతి మర్యాదతో పక్కటేబిళ్ళకి పంపేయటం లేదు" అనుకున్నాడు.

కరుణ్‌కి డిన్నర్ సర్వ్‌చేసి, అన్నీ అమర్చి వెళ్ళిపోయాడు వెయిటర్.

భోజనం చేస్తూ ఆ యువకుల వైపే చూడసాగాడతను.

ఇంతలో వాళ్ళు ఆర్డరు చేసిన "రాజస్థానీ బిర్యానీ, తందూరీ చికెన్" తీసుకొచ్చి టేబిల్ పైనుంచాడతను.

అది కాదు కరుణ్‌ని ఆకర్షించింది.

అవి సర్వ్ చేస్తూ ఆ నలుగురికీ చిన్న ఎర్రటి పాలిథిన్ కవర్లలో ఏదో అందించాడా వెయిటర్.

వాళ్ళు వెంటనే ఆ కవర్లని జేబుల్లోకి కుక్కేసారు.

ఆనందంగా, ఆదరా బాదరగా తినీ తిననట్లు భోజనంచేసి ఆ వెయిటర్ చేతికి వందరూపాయల నోట్లు ఎనిమిది అందించి, కౌంటర్లో తిన్న వాటికి మళ్ళీ బిల్లు పేచేసి హడావుడిగా వెళ్ళిపోయారు.

కరుణ్‌కి ఏమీ అర్థంకాలేదు.

"సాధారణంగా ఈ హోటల్లో తింటే వెయిటరే బిల్లు తెచ్చిస్తాడు. కొంతమంది ఆ వెయిటర్‌తోనే బిల్లుకూడా చెల్లింపజేస్తారు. మరికొందరు తామే బిల్లు చెల్లిస్తారు. మరి ఆ యువకులు ఏమిటి ఇక్కడ వెయిటర్‌కి ఎనిమిది వందలు ఇచ్చి, మళ్ళీ కౌంటర్లో కూడా బిల్లు చెల్లించారు?" అనుకున్నాడు.

భోజనం పూర్తయిపోవడంతో వాష్ బేసిన్‌లో చెయ్యి కడుక్కుని వెయిటర్ ఇచ్చిన బిల్లు తీసుకుని కౌంటరులో పే చేసి బయటికి నడిచాడు కరుణ్

✧ ✧ ✧ ✧ ✧ ✧

"ట్రింగ్...ట్రింగ్..." కాలింగు బెల్ మోతకి బ్రష్ చేస్తున్న కరుణ్ వెళ్ళి తలుపు తీసాడు.

ఎదురుగా మంజుల.

"ఏమిటీ ఇప్పుడు బ్రష్ చేస్తున్నావ్?"

"లేట్‌గా లేచాను మంజూ!"

"బేడ్ హేబిట్!"

"కూర్చో! వచ్చేస్తాను" అంటూ బెడ్‌రూంలోకి నడిచాడు.

మంజుల సోఫాలో కూర్చుంది.

ఆ రోజు న్యూస్ పేపర్ తీసుకుని చదవసాగింది.

కరుణ్ స్నానంచేసి వచ్చాడు.

"ఏమిటీ, ప్రొద్దున్నే దేవత ప్రత్యక్షమైనట్లు వచ్చావ్?"

"అమ్మా, నాన్న ఊరెళ్ళారు. నానమ్మ బుర్ర తినేస్తుందేమో అని భయంవేసి... ఫ్రెండింటికెళ్ళి వస్తానని ఇంట్లోంచి ఊడిపడ్డాను."

"మంచిపని చేశావ్" అంటూ కిచెన్‌వేపు నడిచాడు.

పది నిముషాల్లో కాఫీ కలిపి... రెండు కప్పుల్లో తెచ్చి–

"మంజూ! హేవిట్" అన్నాడు.

అందుకుని కాఫీ సిప్ చేసింది.

"కాఫీ కలపటమేనా? వంట కూడా చెయ్యటం వచ్చా?"

"ఎందుకట?"

"అది కూడా వస్తే నాకు మంచిది కదా!"

"ఓహో! ఈ రూట్‌లో వస్తున్నావా?"

"ఈ రోజుల్లో అమ్మాయికి కట్నం ఇవ్వకపోతే పెళ్ళవనట్లు, అబ్బాయిలకి వంట రాకపోతే ఎవరూ పిల్లనివ్వటంలేదు తెలుసా?"

"నాకా బాధ లేదు."

"ఎందుకని?"

"నేను కొత్తగా పిల్లని వెతుక్కోనవసరం లేదుగా?"

"ఆ పిల్లకూడా నీకు వంట చేయటం వస్తేనే నిన్ను పెళ్ళి చేసుకుంటానని అంటే?"

"అలా అనదని నా నమ్మకం!"

"పోనీ ముందు అనదనుకో! పెళ్ళయిన ఏడాది తర్వాతో రెండేళ్ళ తర్వాతో అలా అంటే ఏం చేస్తావ్?"

"అందరి భార్యల భర్తల్లా గరిట పట్టుకుంటాను. తప్పుతుందా?"

అతని మాటలకు చిన్నగా నవ్విందామె.

"ఎంతవరకూ వచ్చింది నీ కేస్?"

"ముందుకు సాగడానికి వీలు లేకుండా అన్ని దారులూ మూసుకుపోయాయి."

"అతను చెప్పింది విని మౌనంగా ఉండిపోయిందామె.

"బయటికెక్కడికయినా వెళదాం...! నా బుర్ర బాగా వేడెక్కిపోయింది" అన్నాడతను.

"ఎక్కడికెళదాం?"

"నీ ఇష్టం! నాకు కొంచెం రిఫ్రెష్‌మెంట్ కావాలి."

"అయితే యారాడా వెళదాం."

"ఓకె! డ్రస్సయి వచ్చేస్తాను." అంటూ లోపలికి నడిచాడు. వైట్ షర్ట్, బ్లాక్ జీన్స్‌లో టక్ చేసుకున్నాడు. షూస్ వేసుకున్నాడు.

"వెళదామా మంజూ!" అంటూ బయటకు వచ్చాడు.

"ఊఁ!" అంటూ లేచిందామె.

ఇద్దరూ బయటికొచ్చారు. కరుణ్ ఇంటికి లాక్‌చేసి కారులో కూర్చున్నాడు. మంజుల ఎక్కగానే యారాడ కొండవేపు దూసుకుపోయింది వాళ్ళ కారు.

✣ ✣ ✣ ✣ ✣ ✣

"ఇక్కడి నుండి ఘాటీ వస్తుంది..." మెయిన్ రోడ్ నుండి కారుని లెఫ్ట్‌కి కట్ చేసి చెప్పాడు కరుణ్.

"అవును! ఇంతకు ముందు ఫ్రెండ్స్‌తో ఒకసారి వచ్చాను..." కరుణ్ గేర్ మార్చి సెకండ్ గేర్ వేశాడు. కారు ఎత్తు ఎక్కుతున్నకొద్దీ చుట్టుపక్కల ఇళ్ళన్నీ చిన్నవిగా, బొమ్మల్లా కన్పిస్తున్నాయి. బాటకిరువేపులా చెట్లు... దూరంగా కొండలు. అంతా పచ్చదనం పరచుకుని మనసుకీ, కంటికీ ఆహ్లాదాన్ని కలిగిస్తోంది.

వాళ్ళ కారు యారాడ లైట్‌హౌస్ ముందు ఆగింది. ఇద్దరూ కారు దిగి టికెట్ తీసుకున్నాడు.

"ఇప్పుడు ఈ మెట్లెక్కి వెళ్ళాలి" నిలువుగా కన్పిస్తున్న మెట్లని చూపిస్తూ చెప్పాడు.

"అవును... కొంచెం కష్టమే అయినా పైకి వెళ్ళి చూస్తే కలిగే ఆనందం ముందు ఈ కష్టం తక్కువనే చెప్పాలి" అందామె.

"నీ హేండ్‌బేగ్ నాకిచ్చెయ్... పట్టుకుంటాను!" అంటూ ఆమె చేతిలోంచి తీసుకున్నాడు.

"నువ్వు మంచి ప్రేమికుడివి కరుణ్! కానీ మంచి భర్తని అవునో, కాదో తెలియటంలేదు" మెల్లగా మెట్లు ఎక్కుతూ అందామె.

"అది తెలియటానికి టైముంది. అయినా ఇప్పుడే చెబుతున్నాను- మంచి భర్తని కూడా నేను."

"ఇప్పుడే ఇలా నోటితో చెప్పేస్తే లాభంలేదు."

"మరి?"

"అప్పుడు కూడా ఇలా నా బ్యాగ్‌లు మోయాలి. అప్పుడే నువ్వు చెప్పింది నమ్ముతాను"

"కేవలం నీ బ్యాగ్‌లు మోస్తేనే సరా?"

"ఇప్పుడే చెబితే జడుసుకుంటావ్. ఇంకా చాలా లిస్టుంది. మెల్ల మెల్లగా చెబుతాను" అతన్ని ఏడిపిస్తూ అందామె.

"రోటిలో తల పెట్టాక రోకలిపోటుకు వెరవటం దండగని మన పెద్దలన్నారు. అలా సరిపెట్టుకుంటాను. చేసేదేముంది మరి నాకు." జాలి గొలిపేలా మొహం పెట్టి అన్నాడతను.

"అంటే నీ కంటికి అంత రాక్షసిలా కనబడుతున్నానా...?" చిరుకోపంగా అందామె.

"ఓహ్! కోపంలో ఎంత అందంగా వున్నావ్ డియర్!"

"ఛీ...! కోపంలో అందంగా వుండటమేమిటి?"

"నిజం మంజూ!"

"మగవాళ్ళ తెలివితక్కువ పనులకు ఆడవాళ్ళకి కోపం వచ్చినప్పుడు... ఆ మగవాళ్ళు వాడే పద ప్రయోగం అది. ఆ మాటంటే ఆడవాళ్ళు పొంగిపోతారని భ్రమపడతారట వాళ్ళు. నువ్వూ అలాంటి మగవాళ్ళ జాబితాలోకి చేరిపోయావ్!"

"ఎవరు చెప్పారు నీకీ సంగతి మీ నాయనమ్మేనా?"

"అన్నిటికీ మా నాయనమ్మని ఆడిపోసుకుంటావేం?"

"నాకలా అనిపించింది మరి."

"ఏం కాదు. ఓ రచయిత్రి ఏదో కథలో రాసింది."

"రచయిత్రి రాసిందా? బహుశా వాళ్ళాయనగారు, ఆయనెప్పుడు అలా అని వుండడు. అందుకని అలాంటి కాంప్లిమెంట్ పొందే ఆడవాళ్ళ మీద. అసూయతో రాసిందలా."

"కట్టు కథలు, అబద్ధాలు చెప్పమంటే నీ తరువాతే..."

"మా వృత్తే అది కదా!"

మాటల్లోనే లైట్‌హౌస్ పైకి చేరుకున్నారు ఇద్దరూ. సముద్రమట్టానికి బాగా ఎత్తుగా ఆ లైట్‌హౌస్ వుండటంతో అక్కడినుండి సిటీ అంతా కనిపిస్తోంది. సముద్రంలోని ఓడలు చిన్నవిగి కనిపిస్తున్నాయి. చల్లని గాలి హోరుమంటూ వీస్తోంది.

"ఈ లైట్ హౌస్ ఎప్పుడు కట్టించారు?" అడిగాడు కరుణ్ అక్కడున్న వ్యక్తిని.

"1942లో సార్!"

"అబ్బా! ఏభై సంవత్సరాల పైనే అయిపోయింది..." ఆశ్చర్యంగా అంది మంజుల.

"ఇంకొక లైట్ హౌస్ భీమిలీలో ఉంది. అది 1628లో డచ్‌వాళ్ళు అక్కడ కట్టించారు. ముందు అదే మనపోర్టు. తరువాత పోర్టుని ఇక్కడ స్థాపించింది బ్రిటీష్‌వాళ్ళు" చెప్పాడతను.

అప్పుడు గుర్తుకొచ్చిందామెకి– మూడేళ్ళ క్రితం భీమిలీ వెళ్ళినపుడు అక్కడ శిధిలమయిపోయిన లైట్‌హౌస్. మూడొంతులు కూలిపోయి, జీర్ణావస్థలోకి వెళ్ళిపోయిన కట్టడాలు. తరువాత వాటిని పడగొట్టేసినట్లు పేపర్లో చదివింది. కొద్దిసేపు అక్కడినుంచి ప్రకృతి అందాలు చూసి కిందికి దిగిపోయారు.

"పిక్నిక్ సీజన్‌లో యారాడ బాగా రష్‌గా ఉంటుంది" అందామె.

"అవును."

"అటువేపు వెళ్ళి కూర్చుందాం, సముద్రం కన్పిస్తుంది!" అంటూ లైట్‌హౌస్ ఎడమవేపుకు తిరిగిందామె... కరుణ్ ఆమెని అనుసరించాడు.

ఇద్దరూ పచ్చని పచ్చికలో కూర్చున్నారు.

"కరుణ్! అందరికంటే ఎవరు గొప్పవాళ్ళంటావ్?" ఉన్నట్లుండి అడిగిందామె.

"బ్రూనై సుల్తాన్ హసన్ లాల్ బోల్సియా! అతనికి 1,28,450 కోట్ల రూపాయల సంపద ఉంది. ఓ ఆంగ్ల పత్రిక జరిపిన సర్వే ప్రకారం ఈ విషయం తెలిసింది..." అన్నాడతను.

"అబ్బా... గొప్పవాళ్ళంటే ఆ గొప్పవాళ్ళు కాదు."

"మరి...?"

"మనమెన్ని సాధించినా అతని ముందు చాలా తక్కువే! ఆలోచించు చూద్దాం!"

"మనమెన్ని సాధించినా అతని ముందు చాలా తక్కువేనా? ఆఁ... ఇంకెవరూ భగవంతుడు!"

"యువార్ రైట్... చూడు ఆ ప్రకృతిని! ఏ చిత్రకారుడు అంత గొప్ప చిత్రం గీయగలడు... ఏ శిల్పి అంత సహజంగా శిల్పాల్ని చెక్కగలడు?" డాల్ఫిన్ నోస్‌ని చూపిస్తూ అందామె.

"నిజమే!" అన్నాడు కరుణ్.

"అన్ని కళలూ, అన్ని స్పందనలూ, భగవంతుడికి తెలుసు..." దూరంగా చూస్తూ అందామె.

"మంజూ...! మనకి పెళ్ళయ్యేవరకూ నువ్వు మీ నాయనమ్మతో క్లోజ్‌గా వుండకు."

"అదేం?"

"ఇంత చిన్న వయసులో అంత భక్తి భావం... నాకెందుకో- భయాల్ని కలిగిస్తోంది" చిన్నగా నవ్వుతూ అన్నాడతను.

"అబ్బా... నీకు మా నాయనమ్మని అన్నిటికీ ఆడిపోసుకోవటం అలవాటయిందే! అసలు భగవంతుడి మీద భక్తికి వయసంటూ వుంటుందా? ఏ వయసు వారికైనా భక్తి వుండాల్సిందే..." అందామె.

"అదికాదు డియర్! నిన్ను మీ నాయనమ్మ ఏ "సతీసక్కుభాయి" లాగానో ఏ "మీరా" లాగానో మార్చేస్తుందని నా భయం."

"పోన్లే! వాళ్ళంత మంచి పేరొస్తే ఇక కావలసిందేముంది?"

"నువ్వలా అయితే నా గతేం కావాలి?"

"అంటే? దేవుడియందు భక్తిభావం వండకూడదనా నీ అభిప్రాయం?"

"ఉండాలి. కానీ అదే లోకం కాకూడదు."

"మరేది లోకంగా వుండాలి?" చిలిపిగా అందామె.

"ఇదీ" అంటూ ఆమె చేతిని తన పెదాలకానించుకున్నాడు.

"ఇది పబ్లిక్ ప్లేస్. అయినా పెళ్ళవకుండా ఇవేం పిచ్చివేషాలు?" లేని కోపం నటించిందామె.

"కోపం వచ్చిందా? సారీ డియర్" బ్రతిమాలుకున్నాడతను.

"ఊఁ!" నవ్వొస్తున్నా బయటికి బెట్టుగా అందామె. సమయం మధ్యాహ్నం అయినట్లు సూర్యుడు నడినెత్తిమీద వున్నాడు.

"కరుణ్! ఇక ఇంటికి పోదాం" అందామె.

"సరే!" అంటూ లేచాడతను.

ఇద్దరూ కారు దగ్గరికి నడిచారు. డోర్లు ఓపెన్ చేసి కూర్చున్నారు. మరుక్షణం కారు ముందుకు సాగిపోయింది.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"ఏమిటి కరుణ్‌జీ సంగతులు?" అతను వచ్చి తన ఎదురుగా కూర్చోగానే అడిగాడు రాయ్.

"ఏముంది, కోర్టుకెళ్ళటం... తినటం... పడుకోవటం..."

"మీ కేసు..." మధ్యలోనే ఆగిపోయాడు రాయ్.

"మీకు తెలుసు కదా! ఏ విధంగానూ ముందుకెళ్ళటానికి వీలు లేకుండా అయిపోయింది."

"మురళీకృష్ణ ఇంటికి బచ్చాడో లేదో తెలుసుకున్నారా?"

"బహుశా రాలేదేమో. నేను మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళలేదు."

"బెళ్ళి చూస్తే మంచిదేమో!"

"నిజమే! కానీ అతను వచ్చుంటాడన్న ఆశలేదు. అయినా ప్రయత్నిస్తాను."

"ఇంకా ఒక్కసారి బాగా ఆలోచించండి. బాంబు దాడిలో మరణించిన పీటర్‌కి గానీ, భార్య చేతిలో హత్య చేయబడిన ప్రేమ్‌నాథ్‌కిగానీ ఫ్రెండ్స్ వుండేవుంటారు బాళ్ళనీ ఎంక్వయిరీ చేస్తే మనకి ఏదైనా క్లూ దొరక్కపోదు."

ఆ మాటలతో ఆలోచనలో పడ్డాడు కరుణ్.

"ఆc! ప్రేమ్‌నాథ్‌కి పెదవాల్తేరులో ఓ అపార్టుమెంటుంది. అందులో గ్రౌండ్ ఫ్లోర్ ఖాళీగా వుందని నాతో చెప్పాడు."

"అచ్ఛా..."

"ఆ అపార్టుమెంటు కట్టించిన కాంట్రాక్టరెవరో తెలుసుకుని, అతని దగ్గరికెళతాను."

"బెఫ్ట్?"

"ప్రేమ్‌నాథ్ ఫ్రెండ్ సర్కిలెవరో తెలుసుకుంటాను. బహుశా ఆ కాంట్రాక్టరుకి తెలిసే వుంటుంది."

"రైట్ కరుణ్‌జీ..." అన్నాడతను.

రాయ్ దగ్గర శెలవు తీసుకుని బయటకు నడిచాడు కరుణ్. తన కారులో పెదవాల్తేరులో వున్న అపార్టుమెంట్ చేరుకున్నాడు.

"ఐశ్వర్యా అపార్టుమెంట్స్" దూరంనుండే కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. కారు దిగి నడిచాడు. అపార్టుమెంట్ గేటు పక్కనున్న గోడకి అపార్ట్‌మెంట్ పేరు, ప్రేమ్‌నాథ్ రియల్ ఎస్టేట్ అండ్ బిల్డర్స్ అన్న పేరూ చెక్కి వుంది. కరుణ్ లోపలికి నడిచి అపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్‌ని కలిశాడు.

"ఎవరు కావాలి సార్?" అడిగాడతను.

"ప్రేమ్‌నాథ్‌గారు..." అతని మాటలు పూర్తవకుండానే...

"వారు పోయారు కదా సార్..." అన్నాడతను.

"అవును... ఈ అపార్టుమెంట్ కట్టిన కాంట్రాక్టర్ ఎవరో మీకు తెలుసా?"

"పృథ్వీ కాంట్రాక్టర్స్ అనీ... కలెక్టర్ జంక్షన్లో వుంటుంది సార్!"

"ఆయన భార్య హరిణిగారే హత్య చేశారని పేపర్లలో చూశాం సార్! ఫ్యాక్ట్ ఏమిటో తెలియదు."

"ప్రేమ్‌నాథ్‌గారికి ఫ్రెండ్స్ ఎవరూ లేరా?"

"నాకు మరి తెలియదు సార్!" అన్నాడతను.

"ఓ.కే! థాంక్యూ... వస్తాను" అంటూ బయటికి నడిచాడు కరుణ్. కారులో కూర్చుని కలెక్టర్ ఆఫీసుకు బయలుదేరాడు. పది నిమిషాల్లో చేరుకుంది అతని కారు. చుట్టూ చూశాడతను. కలెక్టర్ ఆఫీసుకి ఎదురుగా, రామకృష్ణా బీచ్‌కి వెళ్ళే దారిలో కనిపించింది– "పృథ్వీ కాంట్రాక్టర్స్" అన్న బోర్డు. కారుని అటు పోనిచ్చాడు. కారాపి, దిగి లోపలికి నడిచాడు.

"ఎవరు కావాలి సార్?" బోయ్ అడిగాడు.

"మీ సార్ వున్నారా? కొంచెం మాట్లాడాలి" చెప్పాడతనితో.

"ఒక్క నిమిషం" అంటూ లోపలికి వెళ్ళి వెంటనే తిరిగొచ్చి–

"వెళ్ళండి సార్!" అన్నాడు.

కరుణ్ లోపలికి నడిచాడు. గదిలోని ఏ.సి. వలన శరీరానికి చల్లటి అనుభూతి కలిగింది అతనికి.

"చెప్పండి" అన్నాడు వీల్‌ఛైర్‌లో కూర్చున్న వ్యక్తి.

"నా పేరు కరుణ్... ప్రేమ్‌నాథ్‌గారి "ఐశ్వర్యా అపార్ట్‌మెంట్స్"కి మీరే కాంట్రాక్టర్రా?" అడిగాడతను.

"అవును!"

"ఆయన ఎన్ని అపార్టుమెంట్స్ కట్టించారు?"

"వైజాగ్‌లో నాలుగైదు కట్టించారు."

"వైజాగ్‌లో అంటున్నారు... వేరే ఊళ్ళలో కూడా వారి అపార్ట్‌మెంట్స్ వున్నాయా?"

"విజయవాడ, సికింద్రాబాద్‌లో కూడా వున్నాయి."

"అలాగా!"

"మీకేం కావాలి?"

"మాది హైదరాబాద్. నేనూ అపార్టుమెంట్స్ కట్టించి, అమ్ముదామని అనుకుంటున్నాను... ఓసారి మాటల్లో మీ గురించి చెప్పారు ప్రేమ్‌నాథ్‌గారి ఫ్రెండ్" అన్నాడతను.

"ఎవరూ వైకుంఠంగారా?" అడిగాడతను.

"ఆc... ఆయనే అనుకుంటాను. వాళ్ళది సి.బి.ఎమ్. కాంపౌండే కదూ?" తెలిసినట్లుగా అన్నాడు కరుణ్.

"కాదండీ... సీతమ్మధార."

"సీతమ్మధారా... సి.బి.ఎమ్. కాంపౌండనుకున్నానే."

"అత్తిలి వైకుంఠంగారు... యూరాలజిస్ట్‌గా కె.జి.హెచ్.లో పని చేస్తున్నారు. ఆయనేనా?"

"అవును!"

"ఆయనది సీతమ్మధారే..." చెప్పాడతను.

"ఓహో!"

"ఎక్కడ కట్టిద్దామనుకున్నారు మీరు?"

"ఇంకా ఏం నిర్ణయించలేదు. సైట్‌వాల్యూ, ఎక్కడ కడితే మనకి మంచి ప్రాఫిట్స్ మిగులుతాయో మీరే చెప్పాలి. అందుకే మీ కోసం వచ్చాను..." అందంగా అబద్ధం చెప్పాడు.

"ప్రస్తుతం మురళీ నగర్‌లోనే సైట్ వాల్యూ తక్కువగా వుంది. ఆ చుట్టుప్రక్కల చాలామంది ఎంప్లాయిస్ వున్నారు. అక్కడ కడితే మీకు మంచి సేల్సూ వుంటాయి. ప్రాఫిట్లూ మిగులుతాయి."

"అయితే అక్కడే కడదాం. నేను మిమ్మల్ని మళ్ళీ రెండు మూడు రోజుల్లో కలుస్తాను. మీ కార్డేమయినా వుందా?" ఆసక్తి కనబరుస్తూ అన్నాడు. వెంటనే అతను తన విజిటింగ్ కార్డిచ్చాడు.

"వస్తానండీ! ఫోన్ చేయటంకానీ, మిమ్మల్ని కలవటం కానీ చేస్తాను" అంటూ బయటికి నడిచాడు. కారులో కూర్చుని కె.జి. హాస్పిటల్‌కి చేరుకున్నాడు. యూరాలజీ విభాగంలోకి నడిచాడు.

"ఎవరు కావాలి?" ఓ నర్స్ అడిగింది.

"వైకుంఠంగారు."

"వస్తారు కూర్చోండి రౌండ్స్‌కి వెళ్ళారు వార్డుల్లోకి" చెప్పి బయటికి నడిచిందామె. కరుణ్ కూర్చొని టేబిల్‌మీదున్న మెడికల్ బుక్ తీసి చూడసాగాడు. అక్కడున్న పాతకాలంనాటి వాల్‌క్లాక్ శబ్దం తప్ప దాదాపు నిశ్శబ్దం రాజ్యమేలుతున్నట్లుంది. మధ్యలో ఓసారి ఇందాకటి నర్స్ వచ్చి ఏవో పేపర్లు తీసుకుని...

"వచ్చేస్తున్నారు..." అని చెప్పి వెళ్ళిపోయింది.

కొద్దిసేపటికి వచ్చాడు డా॥ వైకుంఠం. కరుణ్‌వంక ప్రశ్నార్థకంగా చూసి తన సీటులో కూర్చున్నాడు. అతనికీ ప్రేమ్‌నాథ్ వయసే ఉంటుంది.

"నా పేరు రమేషండీ! ప్రేమ్‌నాథ్ గారికి రెలిటివ్‌ని" చెప్పాడు.

"ప్రేమ్‌నాథ్‌కి రెలిటివా? ఏ ఊరు మీది?"

"హైదరాబాద్ సార్."

"వాళ్ళ మిసెస్ హరిణీగారి రెలిటివా?"

"కాదు. ప్రేమ్‌నాద్‌గారు నాకు దూరపు చుట్టం."

"ఊc... పోయాడుకదా!" అన్నాడతను.

"అవును సార్!"

"నా గురించి మీకెలా తెలిసింది?"

"చాలాసార్లు మీ గురించే చెప్పేవారు. ఒకటి రెండుసార్లు మీ ఇంటికి కూడా ప్రేమ్‌నాథ్‌తో కలిసివచ్చాను."

"నేనెప్పుడూ మిమ్మల్ని చూడలేదే" అన్నాడతను.

"అదేమిటో నేనొచ్చిన రెండుసార్లూ మీరు లేరు."

"అలాగా!"

"హరిణి ఇంత పని చేస్తుందని మేము కలలో కూడా అనుకోలేదు."

"మీరు పొరబడుతన్నారు మిస్టర్ రమేష్. ఆమె చెయ్యలేదు ఈ పని."

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారు?"

"ఆమెనెరిగిన వాళ్ళెవరయినా ఆ మాటే చెబుతారు."

"అది పోలీసు యంత్రాంగం కనిపెట్టవలసిన విషయం!"

"లేదు సార్! హరిణే అతన్ని హత్య చేసుంటుంది...." వై కుంఠాన్ని కావాలనే రెచ్చగొట్టాడు కరుణ్. దానివలన అతను మరికొంచెం మాట్లాడతాడు. అప్పుడు మరికొన్ని అధారాలైనా దొరకొచ్చుని.

"మీరు ప్రేమ్‌నాథ్‌గారి తరపువారు కాబట్టి అతనివైపు మాట్లాడవచ్చు. నేను వాళ్ళ కుటుంబానికి సంబంధించినంతవరకూ పరాయివాడిని అయినా నాకు తెలిసింది చెబుతాను. హరిణి ఓ దురదృష్టవంతురాలు. ప్రేమ్‌నాథ్ నా స్నేహితుడే. అయినా అతని గురించి లేనిమంచిని చెప్పలేను. అతనికి లేని దుర్వసనంలేదు. తాగుడు, తిరుగుడు, జూదం అన్నీ ఉన్నాయి. అతనికి పెళ్ళయి పద్దెనిమిదేళ్ళయినా పిల్లలు కలగకపోవటానికి కారణం అతని తాగుడే. విపరీతంగా తాగటంవలన అతనికి వంధ్యత్వం ఏర్పడింది. దానివలన పిల్లలు పుట్టలేదు. నిజంగా హరిణిలాంటి సహనమూర్తిని ఎక్కడ చూడలేదు నేను. అతని చర్యలు దాదాపు పద్దెనిమిదేళ్ళు భరించింది. చివరి కామె...."

"హత్య చేసిందా?" సడన్‌గా అడిగాడు కరుణ్.

"లేదు రమేష్... అతనికి విడాకులు ఇవ్వాలని నిర్ణయించుకుంది. మగవాడు ఎన్ని కష్టాలు పెడుతున్నా పంటి బిగువున భరిస్తూ ఆడవాళ్ళు పడుండాలనే మనస్తత్వం ప్రేమ్‌నాథ్ ది. 'ఈ రోజుల్లో కూడా ఇంత నెమ్మదైనా స్త్రీలున్నారా?' అనుకునేవాడిని. హరిణిని భర్త పెట్టే బాధలు సహిస్తూ ఊరురుకునేది కాదు. అందుకే మీ అందరికీ ప్రేమ్‌నాథ్‌గారి వైఖరి అవగాహన కాలేదు. రెండు మూడుసార్లు అతనికోసం వెళితే ఏం జరిగిందో తెలుసా?"

"ఏం జరిగింది సార్?"

నేను "ప్రేమ్‌నాథ్ వున్నాడా అమ్మా?" అనడిగితే... ఆమె బయటకు వెళ్ళారని చెప్పింది. నేను తిరిగి వచ్చేస్తుంటే వాళ్ళ బెడ్‌రూం కిటికీలోంచి ప్రేమ్‌నాథ్ కనిపించాడు... వేరే స్త్రీతో! అటువంటి సమయంలో కూడా భర్తని నడివీధిలో పడకూడదనే భావంతో తన గుండెల్లో దాచినట్లు దాచింది. నిజంగా ఆమె ఉన్నత సంస్కారం అప్పుడే నాకు తెలిసింది.

అతను ఇంత నీచమైనవాడా? అనుకున్నాను... ఒకసారి నేనుండగానే ఆమెని నానా దుర్భాషలాడి... చెయ్యి కూడా చేసుకున్నాడు...."

"ఇవన్నీ మాకు తెలియనే తెలియవు సార్. మా బంధువులంతా ఆమెను తప్పుబడుతున్నారు అసలు సంగతి తెలియక...."

"వాళ్ళని నా దగ్గరకు తీసుకురండి. అసలు విషయం చెబుతాను. అయినా ఇందులో హరిణీగారి తప్పుకూడా వుంది. ఇంత జరుగుతున్నా తన వాళ్ళకీ చెప్పకుండా, ఇటు భర్త వాళ్ళకీ తెలుపకుండా మిన్నకుండటం బాగా లేదు."

"మీరు చెప్పేది నిజమే!"

"కాదని ఎవరంటారండీ?" ఇవేకాదు. ఇంకా చాలా ఉన్నాయి చెప్పాలంటే, బయటకు కనిపించేటంత మంచివాడు కాదతను. అయినా భర్తలో మార్పుకోసం, ఆమె తన జీవితాన్ని లాటరీ చేసుకుని వేచి వుండేది. ఎంతటి సహన మూర్తులయిన ఎంతటి నిరీక్షణకైనా తుది సమయం ఉంటుంది. భర్త ఇక మారడనీ తన సహనానికీ, నిరీక్షణకీ అర్థంలేదని తెలుసుకుందామె. భర్తనుండి విడిపోదామనే నిర్ణయానికి వచ్చింది. ప్రేమ్‌నాథ్‌కి ఆమె నిర్ణయం మింగుడు పడలేదు. ఆమె తీసుకున్న ఆనిర్ణయం అతడి ఇగోమీద దెబ్బ కొట్టినట్లు భావించి విడాకులు ఇవ్వటానికి నిరాకరించాడు. ఆమె ఆ నిర్ణయం అతడ్ని మార్చేయలేదు. కానీ కాస్త దూకుడు తగ్గించింది...."

"అతని స్నేహితుడిగా మీరు నచ్చచెప్పేవారు కాదా?"

"ఎన్నోసార్లు చేశానా ప్రయత్నం! వినేవాడు కాదు. పిల్లలు ఉంటే కాస్త మారతాడని ఎవరినయినా పెంచుకోమని కూడా సలహా యిచ్చాను. వినలేదు. ఆమె మాత్రం ఇంట్లో పనిచేసే పిల్లవాడిని కన్నకొడుకులా చూసుకునేది. వాడి నిజమైన పుట్టినరోజేదో తెలియకపోయినా తమ పెళ్ళిరోజును వాడి పుట్టినరోజుగా భావించి ఆనాడు కొత్తబట్టలు యిచ్చేది."

"ఆ మిసెస్ కుద్రాడేనా?"

"అవును! ఆ పిల్లవాడికి ఎనిమిది సంవత్సరాలు ఉండేటప్పుడు పనిలో చేరాడు వాళ్ళింట్లో. అప్పట్నుంచీ వాళ్ళతో కలిసిపోయాడు. ప్రేమ్‌నాథ్ కూడా ఆ పిల్లవాడ్ని ఇష్టపడినా, హరిణిగారంత ఎఫెక్షన్‌తో వుండేవాడు కాదు."

"ఆ అబ్బాయి వాళ్ళింట్లోనే వుండేవాడా?"

"లేదు! తనకి తెలిసిన వాళ్ళింట్లో ఉండేవాడు."

"అతడికి తల్లీ దండ్రీ లేరా?"

"లేరని చెప్పినట్టు గుర్తు!"

"హరిణీ పొరపాటు చేసిందండీ!"

'ఏమిటీ?" చటుక్కున కరుణ్‌వంక చూసి అడిగాడతను.

"అదే! ప్రేమ్‌నాథ్‌ని ఆమే చంపిందని పోలీసులూ, పేపర్లూ భావిస్తున్నాయి కదా. ఖండించవచ్చుగా!"

"ఉన్నన్నాళ్ళుభర్త బాధించాడు. ఇక వాళ్ళు తయారవటానికా?" పరిశోధిస్తున్నారుగా పోలీసులు – చూద్దాం ఏమవుతుందో. దేవుడనేవాడు ఉంటే అసలు దోషులు దొరికి, ఆమె నిర్దోషిత్వం ఋజువవుతుంది, లేకపోయిన ఫర్వాలేదు, ఆమె అజ్ఞాతంగా, ప్రశాంతంగా జీవిస్తుంది."

"హరిణిమీద మీకెంత నమ్మకం?"

"దానికి రెండే రెండు కారణాలు, ఒకటి... ఆమె ప్రవర్తనా, మంచి తనాన్ని ఎరిగినవాణ్ని కావటం! రెండు ప్రేమ్‌నాథ్ హత్య జరిగిందన్న రోజునే ఇంచుమించు గంటా, రెండు గంటల తేడా ఉండొచ్చు.... హైదరాబాద్ నాంపల్లి స్టేషన్లో నేను హరిణీని చూడటం... ఒకే వ్యక్తి రెండు ప్రదేశాల్లో కనిపించటమో, సంచరించటమో జరగదు కదా!"

"ఈజిట్!"

"ఎస్ మిస్టర్ రమేష్!"

"మరి! మీరు హరిణి దోషికాదని ప్రెస్‌కీ, పోలీసులకూ, చెప్పవచ్చు కదా! పోనీ మీ మాటలు పట్టించుకోరు. అనుకోవటానికి మీరు మామూలు వ్యక్తి కాదు. నగరంలో అంతో ఇంతో పేరున్నవారేగా?"

"ఇటువంటి విషయాలు చెప్పుకోవటానికి బాగానే వుంటాయ్. కానీ ప్రాక్టికల్స్‌లో ఎవరికీ మంచి చేయవు. ఒకవేళ నేనలా చెప్పనంటే దానికి అనేక రంగులు పూసి, వివిధ రకాలుగా చెప్పుకుంటారు. దాంతో నా ఫ్యామిలీ డిస్టర్బ్ అయినా అవుతుంది. నాకు భగవంతుడిమీద సంపూర్ణ నమ్మకం వుంది. అమెనింకా ఎంతోకాలం చీకటిలో వుంచదని."

"సార్! సూపరింటెండ్‌గారు లైన్‌లో వున్నారు." వార్డుబోయ్‌వచ్చి చెప్పాడు.

"వస్తున్నాను పద!" అనీ–

"ఇరవై – ఇరవై ఒక్క సంవత్సరాల నుంచీ – అంటే మేం హౌస్ సర్జన్ చేస్తున్నప్పటినుంచీ...."

"వైకుంఠం చెప్పింది విని ఆశ్చర్యంగా నోట మాట రానట్టు వుండిపోయాడు కరుణ్.

"హౌస్ సర్జనా?"

"అవును! ఆంధ్రా యూనివర్శిటీ మెడికల్ కాలేజీలోనే మేమిద్దరం ఎమ్.బి.బి.ఎస్. చేశాం. నేను యూరాలజీలో స్పెషలైజేషన్ చేస్తే అతడు కార్డియాలజీ చేశాడు. కానీ వెంటనే... అంటే రెండు... మూడేళ్ళే కార్డియాలజిస్ట్‌గా ప్రాక్టీస్ చేసి తర్వాత అపార్ట్‌మెంట్ బిజినెస్‌లోకి దిగిపోయాడు... వస్తాను! సూపరింటెండ్‌గారు లైన్‌లో వున్నారట?" అంటూ అటు నడిచాడు. వెంటనే కరుణ్ జేబులోంచి హరిణి పంపిన పేపర్ కటింగ్ తీసి చదవసాగాడు.

"నగరంలో బ్రౌన్‌షుగర్, హెరాయిన్, నల్లమందు, మార్ఫిన్, కకొకైన్, మాన్ డ్రెక్స్ వంటి మత్తు పదార్థాలు యువతకి అమ్ముతున్నట్లు మురళీకృష్ణ, ఓ ప్రొఫెసర్, మరొక డాక్టర్‌ని పోలీసులు అనుమానించి కోర్టుకు హాజరుపరిచారు. అయితే సాక్ష్యాధారాలు లేక కోర్టు వారిని నిర్దోషులుగా వదిలిపెట్టేసింది."

"అంటే ఆ ముగ్గురిలో ఉన్న డాక్టర్... ప్రేమ్‌నాథ్? కరుణ్‌ని ఆ ప్రశ్న స్థిమితం లేకుండా చేసింది. కొద్దిసేపు ఏవో పుస్తకాలు తిరగేయటం. మరికొద్దిసేపు పచార్లు చేయటం... మళ్ళీ కూర్చోవటం... చేస్తున్నాడు. అలా గంట అయింది. వైకుంఠం రాలేదు. అతనిలో అసహనం పెరిగిపోయింది.

"సార్! మిమ్మల్ని రేపు కలుస్తామన్నారు వైకుంఠంగారు! ఏదో అర్జెంటు పనిమీద సూపరింటెండ్‌గారితో బయటకు వెళ్ళారు" నర్సు వచ్చి చెప్పింది.

"మై గుడ్‌నెస్" అనుకుని బయటకు నడిచాడు. కారులో కూర్చుని రాయ్ ఆఫీసుకు చేరుకున్నాడు.

"ఏనీ న్యూస్ కరుణ్ జీ?" కారు దిగుతున్న కరుణ్‌ని చూసి అడిగాడు రాయ్.

"ఎస్ రాయ్ సాబ్! చాలా ఇంపార్టెంట్ పాయింట్ దొరికింది."

"ఏమిటది?" మురళీకృష్ణ దొరికాడా?"

"కాదు. అతనింటికి వెళ్ళలేదు."

"మరి?" లోపలికి నడిచి తన ఛైర్‌లో కూర్చుని అన్నాడు రాయ్.

"హత్య చేయబడిన ప్రేమ్‌నాథే... నా క్లయింట్ ఇచ్చిన పేపర్ కటింగ్‌లో డాక్టర్ అని చిన్న క్లూ దొరికింది. అది నిజం అవచ్చు, కాకపోవచ్చు కాని ఇప్పుడు రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తోన్నా... అదే చేసిన అతను ఒకప్పుడు డాక్టర్."

"నిజమా? ఎలా తెలిసిందా సంగతి?"

"అతని స్నేహితుడు డా॥ వైకుంఠం ద్వారా."

"అతన్నెలా పట్టుకున్నారు?"

జరిగినదంతా వివరించాడు కరుణ్.

"వెరీగుడ్ కరుణ్‌జీ! మూసుకుపోయాయేనుకున్న ద్వారాలన్నీ మళ్ళీ తెరుచుకున్నాయ్. ప్రొసీడ్! రేపు మళ్ళీ ఆ బైకుంఠంగారిని కలుసుకుని రండి. మరిన్ని విషయాలు తెలియవచ్చు."

"ఎస్ రాయ్ సాబ్!"

"మురళీకృష్ణ ఇంటికి వెళ్ళండి. బై ఛాన్స్ అతనూ దొరికితే, మనం అనుకుంటున్నట్టు అతనూ నేరస్తుడే అయితే ఇక మీరు విజయం సాధించినట్లే."

"అవును రాయ్‌గారూ! ఇది మీ చలవే! మీరు సూచించిన తర్వాతే నాకు ఈ పాయింట్లు తట్టి ప్రేమ్‌నాథ్ ఫ్రెండ్స్ సర్కిల్‌లో ఎంక్వయిరీ చేయాలని తోచింది. మెనీ మెనీ థ్యాంక్స్."

"అప్పుడే ఎందుకు? చెప్పే సమయం ముందుంది. అప్పుడు ఒట్టి థ్యాంక్సే కాదు. ఈ కేసులో మీరు నెగ్గి, అసలు దోషులు కోర్టులో శిక్షింపబడితే థాంక్స్‌లతోపాటు నా ఫీజు కూడా తీసుకుంటాను."

"వైనాట్?" నవ్వుతూ అన్నాడు కరుణ్.

* * * * * *

హోటల్ డిలైట్ ముందు కరుణ్ కారు ఆగింది. అతను దిగిడోర్ క్లోజ్‌చేసి ముందుకు నడిచాడు. అతన్ని చూడగానే చిరునవ్వుతో విష్ చేసి వందనంగా డోర్ ఓపెన్ చేశాడు దర్వాన్. చిన్నగా తలూపి లోపలికి అడుగుపెట్టాడు అతను.

రోజూ తను కూర్చునే టేబిల్ దగ్గర కూర్చుని మీల్స్ ఆర్డరిచ్చి ఓసారి హోటలంతా చూశాడు. పెద్దగా రష్ లేదు. వెయిటర్లు నిశ్శబ్దంగా ఎవరికీ కావలసింది వారికి సర్వ్ చేస్తున్నారు.

స్పీకర్లలోంచి లైట్ మ్యూజిక్ విన్పిస్తోంది. ఇంతలో ఇద్దరు యువకులు వచ్చి – 'ఇది రిజర్వయిపోయింది సార్ అనే వెయిటర్ టేబిల్ దగ్గరే కూర్చున్నారు. కరుణ్ ఆసక్తిగా చూడసాగాడు. ఆ యువకులని చూడగానే అటు నడిచాడు ఆ వెయిటర్. అతన్ని చూడగానే వాళ్ళు చిన్నగా నవ్వారు. ఆ వెయిటర్ కూడా చిరునవ్వు చిందించాడు.

"రాజస్థానీ బిర్యానీ విత్ తందూరీ చికెన్" అంటూ చెప్పారు వాళ్ళు. వెంటనే లోపలికి నడిచాడు ఆ వెయిటర్, కరుణ్ అటే చూస్తూ కూర్చున్నాడు. ఇంతలో కరుణ్ ఆర్డర్ చేసిన ఐటమ్ సర్వ్ చేసి వెళ్ళి పోయాడు వెయిటర్. తింటున్నా అతని దృష్టంతా ఆ యువకులపైనే ఉంది. కొద్దిసేపటి తరువాత వాళ్ళు అడిగిన రాజస్థానీ బిరియానీ, తందూరీ చికెన్ సర్వ్ చేశాడు వెయిటర్. వాటితోపాటు రెండు చిన్న పాలిథిన్ కవర్లు కూడా అందించాడు. వెంటనే వాటిని జేబుల్లో పెట్టుకుని భోజనం చేయసాగారు వాళ్ళు సంతోషంగా.

"ఆ పేకెట్లు ఏమిటి? ఎందుకు ఆ పాకెట్లని వాళ్ళు అంత రహస్యంగా అందుకుంటున్నారు? వాటిని వెయిటర్ ఇవ్వగానే హడావుడిగా ఎందుకు జేబుల్లో దాచేసుకుంటున్నారు? ఆ పేకెట్లని అందుకునేటప్పుడు వాళ్ళ మొహాల్లో ఎందుకంత ఆనందం కన్పిస్తోంది?" ఆలోచిస్తూనే భోజనం చేయసాగాడు కరుణ్.

ఆ యువకులిద్దరూ అప్పటికే తినేసి వెయిటర్‌కి నాలుగు వందలు ఇవ్వటం, కౌంటర్లో బిల్లు పేచేసి వెళ్ళిపోవటం జరిగింది. కరుణ్‌కి ఆ రిజర్వ్ టేబిల్ తతంగం వెనుక ఏదో మిస్టరీ ఉన్నట్లు తోచింది.

భోజనం పూర్తి కావటంతో లేచి వాష్ బేసిన్‌లో చెయ్యి కడుక్కుని, బిల్ పే చేసి బయటకు నడిచాడు. కారులో కూర్చుని రాయ్ ఆఫీసుకి చేరుకున్నాడు.

"ఏమిటి రాయ్ సాబ్ బయటకు వెళుతున్నారా...?" అనడిగాడు రాయ్‌ని అతని కారు దగ్గర నిలబడటం చూసి.

"లేదు కరుణ్‌జీ... ఇప్పుడే బయటకెళ్ళి బస్తున్నాను... రండి..." అంటూ లోపలికి నడిచాడు.

కరుణ్ కారు దిగి అతన్ని అనుసరించాడు.

"ఏమిటి సంగతులు?" కరుణ్ కూర్చోగానే అడిగాడతను, హోటల్ డిలైట్ రిజర్వ్ టేబిల్ సంగతి చెప్పాడతను.

"ఐ సీ!"

"నాకెందుకో ఆ తతంగం వెనుక నీలి నీడలు ఏవో వున్నాయని తోస్తోంది."

"మేభీ! మనకు యూజయ్యే విషయమే అయితే ఇన్వెస్టిగేషన్ చేద్దాం."

"ఆ టేబిల్ దగ్గర కూర్చునే యువకులు "రాజస్థానీ బిరియానీ విత్ తందూరీ చికెన్" అంటున్నారు. వెంటనే వాళ్ళకవి సర్వే చేస్తున్నాడా వెయిటర్. వాటితోపాటు చిన్న ఎర్రటి పాలథిన్ కవర్లలో ఏదో అందిస్తున్నాడు. నలుగురు యువకులు వచ్చినప్పుడు ఏనిమిది వందలు ఇచ్చారు. ఇద్దరు వచ్చినప్పుడు నాలుగు వందలు ఇచ్చారు. అంటే ఆ పాకెట్‌కి రెండు వందలని నా నమ్మకం. "రాజస్థానీ బిరియానీ, తందూరి చికెన్" అనేది వాళ్ళ "కోడ్" అని అనుకుంటున్నాను అందులో మిస్టరీని మనం ఛేధించాలి."

"ఆల్‌రైట్ కరుణ్‌గారూ!"

"మీ ఏజెంట్లిద్దరిని రేపు నాతో పంపండి. నేను చెప్పినట్లే చేస్తే ఆ వెయిటర్‌కి అనుమానం రాదు. ఎలాగోలా మనం ఆ పాకెట్లలో ఏముందో తెలుసుకుంటే మంచిది."

"రేపే ఎందుకు కరుణ్‌జీ! ఈ రోజే తీసుకెళ్ళండి."

"లేదు రాయ్ సాబ్! నేను ఇప్పుడే అక్కడ భోజనం చేసి వస్తున్నాను. కాబట్టి రేపు నేనూ, మీ ఏజెంట్లూ కలిసి వెళతాం. అయితే ఒక్క విషయం. నాతో పంపే ఏజెంట్లిద్దరూ ఎరౌండ్ ట్వంటీ. ట్వంటీ టూ ఇయర్స్ ఏజ్ వాళ్ళయి వుండాలి!"

"ష్యూర్ కరుణ్‌జీ!"

"అయితే రేపు నైట్ వస్తాను" అంటూ లేచాడతను.

"గుడ్‌నైట్ కరుణ్‌జీ" అన్నాడు రాయ్?

"గుడ్‌నైట్" అంటూ బయటకు నడిచాడు కరుణ్.

⁂ ⁂ ⁂ ⁂ ⁂ ⁂

"చెప్పింది గుర్తుంది కదా! మీరు చాలా క్యాజువల్‌గా, అతనికే విధమైన అనుమానమూ రాకుండా బిహేవ్ చేయాలి. అతని టేబుల్ దగ్గర కూర్చుని, అతను రాగానే "రాజస్థానీ బిరియానీ విత్ తందూరీ చికెన్" అంటూ ఆర్డరివ్వాలి. మీరు కొత్త వాళ్ళని ఏమాత్రం అనుమానం రానివ్వకూడదు. మీరు ఆర్డరిచ్చిన ఫుడ్‌తోపాటు ఆ బెయిటర్ మీకు రెండు చిన్న ఎర్రటి పాలిథిన్ పాకెట్లు అందిస్తాడు. వెంటనే మీ మొహాల్లో ఆనందం కనిపించినట్టు ఎక్స్‌ప్రెషన్ ఇవ్వాలి. బీకేర్ ఫుల్! ఎక్కడా ఏ విధమైన తేడా రాకూడదు" తన ఏజెంట్లు పరశురామ్, చైతన్యలకి చెప్పాడు రాయ్.

"ఇంకో విషయం! మీకతను ఆ పాకెట్లు ఇవ్వగానే మీరతనికి నాలుగు వందల రూపాయలు ఇవ్వాలి. తరువాత మీరు తిన్న ఫుడ్‌కి కౌంటర్లో బిల్ పే చేయాలి. ఈ డబ్బు మీ దగ్గరుంచండి" అంటూ వెయ్యి రూపాయలు వాళ్ళిద్దరికీ ఇచ్చాడు కరుణ్.

"మర్చిపోబద్దు! కేర్ ఫుల్‌గా బుండాలి మీరు. లేకపోతే మన ప్లాన్ విఫలం అయిపోతుంది..." లేచి నిలబడుతూ అన్నాడు రాయ్.

"నో సర్! మీరు చెప్పింది చెప్పినట్లు చేస్తాం" అన్నారు వాళ్ళిద్దరూ. వాళ్ళ వయస్సులు ఇరవై నుండి ఇరవై రెండు లోపల వుంటుంది.

"ఓ.కే రాయ్ సాబ్! అయితే మేము ఇక వెళ్ళి వస్తాం" తనూ నిలబడి చెప్పాడు కరుణ్.

"గుడ్‌లక్ కరుణ్‌జీ!" చేయి కలిపి చెప్పాడు రాయ్.

కరుణ్, పరశురామ్ చైతన్య, కారులో కూర్చున్నారు. మరుక్షణం కారు ముందుకు దూసుకుపోయింది.

రాత్రి తొమ్మిదిన్నరవుతున్నా రోడ్లన్నీ రష్‌గానే వున్నాయి.

"మిస్టర్ పరశురామ్, చైతన్యా... ఇంకా ఏమైనా సందేహాలుంటే ఇప్పుడే అడగండి" డ్రైవ్ చేస్తూనే అడిగాడు కరుణ్?

"నథింగ్ సార్" ఇద్దరూ ఒకేసారి అన్నారు. కారుని హోటల్ డిలైట్‌కి కొద్ది దూరంలో ఆపేశాడు కరుణ్.

"మీరిద్దరూ ఇక్కడి నుండి నడిచి రండి. నేను ముందు వెళ్ళిపోతాను" అన్నాడు.

"ఓకే సార్! కారియాన్" అన్నాడు పరశురామ్. వెంటనే కారుని ముందుకు పోనిచ్చాడు కరుణ్. హోటల్‌కి చేరుకుని పార్కింగ్ ప్లేస్‌లో కారాపి లోపలికి నడిచాడు. తన టేబుల్ దగ్గరికి వెళ్ళి కూర్చున్నాడు. వెయిటర్ రాగానే మీల్స్ ఆర్డరిచ్చి రాయ్ ఏంజట్ల రాక కోసం వెయిట్ చేయసాగాడు. స్పీకర్లలోంచి వెస్టర్న్ మ్యూజిక్ కాస్త పెద్దగానే వినిపిస్తోంది.

ఇంతలో అతనికి మీల్స్ సర్వే చేయబడింది. అదే సమయంలో పరశురామ్, చైతన్య హోటల్లోకి ప్రవేశించారు. కరుణ్ కనుసైగలతోనే వాళ్ళు కూర్చోవలసిన టేబుల్ చూపించాడు. వాళ్ళిద్దరూ అర్థం చేసుకుని ఆ టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

కరుణ్ టెన్షన్‌గా చూడసాగాడు. ఎక్కడా ఆ వెయిటర్ జాడలేదు. ఇంతలో పరశురామ్, చైతన్యలు కూర్చున్న టేబుల్ దగ్గరికి ఓ వెయిటర్ నడిచి ఆర్డర్ కోసం నిలబడ్డాడు.

"రాజస్థానీ బిరియానీ విత్ తందూరీ చికెన్" అంటూ వాళ్ళిద్దరూ ఆర్డరిచ్చి అతని వైపు చిరునవ్వుతో చూసారు. అదేం గమనించకుండానే అతను వెళ్ళిపోయాడు.

కరుణ్ వాళ్ళిద్దరి వైపూ చూసి తల అడ్డంగా వూపాడు. వాళ్ళకి అర్థంకాలేదు. చైతన్య లేచి కరుణ్ ప్రక్కనుండి వెళ్ళాడు నెమ్మదిగా...

"వెయిటర్ ఇతను కాదు..." అతనికే వినపడేటట్టు చెప్పి చుట్టూ చూశాడు కరుణ్. హోటల్లో అందరూ ఎవరి హడావిడిలో వాళ్ళు వున్నారు.

చైతన్య కాస్త ముందుకెళ్ళి ఎవరి కోసమో వెయిట్ చేస్తున్నట్టు తచ్చాడి, తిరిగి తమ టేబుల్ దగ్గరికి నడిచి కూర్చున్నాడు.

ఇంతలో వాళ్ళు ఆర్డర్ చేసిన రాజస్థానీ బిరియానీ, తందూరీ చికెన్ తీసుకొచ్చి టేబిల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు వెయిటర్. వాళ్ళకే పాకెట్టూ అందించలేదతను. కరుణ్ కేసి ఓమారు చూసి తినటం మొదలు పెట్టారు వాళ్ళిద్దరూ.

"ఆ వెయిటర్ ఈ రోజు రాలేదా? లేకపోతే మన ప్లాన్ అర్థమై అతను ఈ వెయిటర్‌ని పంపించాడా?" తీవ్రంగా ఆలోచించసాగాడు కరుణ్.

సరిగ్గా అప్పుడే నలుగురు యువకులు హోటల్లోకి ప్రవేశించారు. మొట్ట మొదటిసారిగా ఈ నలుగురు యువకులే ఆ వెయిటర్ దగ్గర్నుంచి ఎర్రటి పాలిథిన్ కవర్లు తీసుకుని ఎనిమిది వందలు ఇచ్చిన వాళ్ళని గుర్తించాడు కరుణ్.

వాళ్ళు సరాసరి వెళ్ళి పరశురామ్, చైతన్యలు కూర్చున్న టేబిల్ దగ్గరే కూర్చున్నారు. చుట్టూ చూశారు. ఇంతలో రాయ్ ఏజెంట్లకి సర్వే చేసిన వెయిటర్ వెళ్ళి ఆర్డర్ కోసం నిల్చున్నాడు.

"వెయిటర్ డేవిడ్‌గారు రాలేదా?" వాళ్ళలో ఓ యువకుడు అడిగాడు.

"లేదు సార్! ఆయన ఏదో అర్జంటు పనుండి రాలేదు. రేపు వస్తారు!" సమాధానం చెప్పాడు వెయిటర్.

వెంటనే ఆ యువకుల మొహాల్లో నిరాశ ఆవరించింది. లేచి బయటకు నడిచారు.

"అతని పేరు డేవిడ్ అన్నమాట" అనుకున్నాడు కరుణ్. తన భోజనం పూర్తవటంతో బిల్ చెల్లించి బయటకు నడిచాడు. కారు పక్కకి తీసి హోటల్‌కి కొంచెం దూరంలో ఆపి–దిగి కారు కానుకుని నిల్చున్నాడు.

కొద్దిసేపటికి పరశురామ్, చైతన్యలు బయటికి వచ్చారు. కరుణ్‌ని చూసి అతన్ని సమీపించారు.

"మన బాడ్‌లక్! అతనీరోజు రాలేదట. రేపు ఇదే సమయానికి మళ్ళీ వద్దాం!" అన్నాడు కరుణ్.

"రైట్ సార్" అన్నాడు వాళ్ళు.

* * * * * *

ఉదయం ఆరయింది. కరుణ్ నిద్ర లేచి బ్రష్ చేశాడు. మిల్క్ బాయిలర్లో పాలు కాచి, కాఫీ కలుపుకుని తాగుతూ పేపర్ తిరగేయసాగాడు. మెయిన్‌లో వార్తల హెడ్‌లైన్స్ చూసి సిటీ ఎడిషన్ తిరగేశాడు.

"కలెక్టర్ దురుసు ప్రవర్తన, డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కి లాభాల పంట, యువతని అలరించిన రాక్ షో" మొదటి పేజీ తిరగేశాడు.

"వ్యక్తి అదృశ్యం"

ఆ వార్త వెంట అతని చూపులు పరిగెత్తాయి.

సీతమ్మధారలో నివాసముంటున్న మురళీకృష్ణ అనే వ్యక్తి గత ఇరవైరోజులనుండీ కనిపించటంలేదు. అతను నగరంలోని ఓ పెద్ద హోటల్లో హెడ్ వెయిటర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు, తల్లీ, భార్యా వున్నారు.

ఇతను ఇరవైరోజుల క్రితం విధి నిర్వహణకు వెళ్ళి తిరిగి ఇంటికి రాలేదు. గతంలో కూడా ఇంట్లో చెప్పకుండా బయటి వూళ్ళోకి వెళ్ళి నాలుగు అయిదురోజుల్లో తిరిగి వచ్చేసేవాడనీ, ఈసారి ఇరవై రోజులు పైనే అతనింటికి రాకపోవటంతో అతని భార్య మాధవి ఫోర్ టవున్ పోలీసులకి ఫిర్యాదు చేసింది.

కేసుని ఫోర్ టవున్ ఎస్సై చంద్రమోహనరావు దర్యాప్తు చేస్తున్నారు.

"అయితే మురళీకృష్ణ ఇంటికి రాలేదన్నమాట" న్యూస్ చదివి అనుకున్నాడతను. పేపర్ పక్కన పడేసి, బాత్‌రూంలోకి నడిచాడు. స్నానం చేసి డ్రస్సప్ అయ్యాడు. ఇంటికి లాక్ చేసి కారులో హోటల్ డిలైట్‌కి వెళ్ళాడు. కారు పార్క్ చేసి లోపలికి నడిచాడు. అలవాటుగా ఎప్పుడూ తను కూర్చునే టేబిల్ దగ్గర కూర్చుని వెయిటర్‌కి టిఫిన్ ఆర్డరిచ్చాడు.

"రాయినైనా కాకపోతిని

రామపాదము సోగగా

బోయినైనా కాకపోతిని

పుణ్య కావ్యము రాయగా..."

దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన గీతం సుశీల మధురగళం ద్వారా ఇంపుగా వినిపిస్తోంది. ఇంతలో అతనికి టిఫిన్ సర్వే చేశాడు వెయిటర్. తింటూ అన్ని వైపులా చూశాడు. అప్పుడే కిచెన్‌లోంచి బయటకు వస్తూ కనిపించాడు డేవిడ్.

"రాత్రి డిన్నర్‌కి వచ్చినప్పుడు ఇతని సంగతి తేల్చాలి" అనుకున్నాడు. అప్పటిదాకా స్తబ్ధుగా వున్న హోటల్ జనాల రాకతో హుషారు పుంజుకుంది. టిఫిన్ తినటం పూర్తయింది. బిల్ కట్టి బయటకు నడిచాడు కరుణ్.

⁂ ⁂ ⁂ ⁂ ⁂ ⁂

కింగ్‌జార్జి హాస్పిటల్ ఆవరణలో కారాపి దిగాడు కరుణ్. రోగులను తీసుకువచ్చే వాళ్ళు, పరామర్శించటానికి వచ్చిన వాళ్ళు అటూ ఇటూ తిరుగుతున్న నర్సులు, డాక్టర్లతో సందడిగా వుందక్కడ.

కరుణ్ యూరాలజీ వార్డు వైపు నడవసాగాడు. ఇంతలో అతనికి డాక్టర్ వైకుంఠం ఎదురొచ్చాడు.

"నమస్తే సార్! మీ గురించే వస్తున్నాను." అన్నాడు కరుణ్.

"ఓ రమేష్... మీరా! వెళ్ళి కూర్చోండి. అయిదు నిముషాల్లో వచ్చేస్తాను." అంటూ ముందుకెళ్ళిపోయాడు అతను. కరుణ్ నడిచాడు.

"ఎవరు కావాలి సార్?" అడిగాడో హౌస్‌సర్జన్.

"వైకుంఠంగారు... ఇప్పుడే కలిశారు. వెయిట్ చేయమన్నారు" అతనితో చెప్పాడు.

"అలాగా!" అంటూ అతను వార్డుల వైపు సాగిపోయాడు. కరుణ్ కూర్చుని వైకుంఠం రాక కోసం ఎదురు చూడసాగాడు. పది నిముషాల తర్వాత వచ్చాడు అతను.

"సారీ! లేటయింది" వస్తూనే అన్నాడు.

"ఫర్వాలేదు సార్!"

"నిన్న అర్జెంట్‌గా సూపరింటెండెంట్ గారితో బయటకు వెళ్ళాల్సి వచ్చింది."

"ఓహో!"

"మీరెప్పటిదాకా వుంటారు వైజాగ్‌లో?"

"ఈరోజు సాయంత్రం ట్రైన్‌కి వెళ్ళిపోతున్నాను సార్. వెళ్ళేముందు మిమ్మల్ని ఓసారి కలిసి వెళ్ళిపోదామని" తడుముకోకుండా అబద్ధం చెప్పాడు కరుణ్.

"అలాగా."

"మా బంధువులందరికీ ప్రేమ్‌నాథ్ నిర్వాకం తెలియచేస్తాను."

"మర్చిపోకుండా చెయ్యండా పని!" టక్కున అన్నాడతను.

"అతను మరీ పురుషోత్తముడనుకోకపోయినా, ఇంత నీచమైనవాడని తెలియదు సార్!" వైకుంఠం ఎక్కువగా మాట్లాడకపోవటంతో సంభాషణని పొడిగిస్తూ అన్నాడు కరుణ్.

"బయటికి సాఫ్ట్‌గా కనిపించేవాళ్ళే ప్రమాదకరమైన వాళ్ళు. అతని తత్వం. హరిణీగారి మంచితనం తెలియని వాళ్ళెవరయినా ఇప్పటి పరిస్థితుల్లో హరిణీగారినే హంతకురాలంటారు."

"ప్రేమ్‌నాథ్‌కి ఎవరైనా శత్రువులున్నారంటారా?" అడిగాడు కరుణ్.

"నాకు తెలిసినంత వరకూ ఎవరూ లేరు మరి."

"అతన్ని హత్య చేస్తే ఎవరికయినా లాభం వుంటుందంటారా? ఐ మీన్ బిజినెస్‌లో పార్టనర్స్... ఇలాంటి వాళ్ళకి."

"లేదు. అతనికెవరూ పార్టనర్స్ లేరు."

"అతను అపార్టుమెంట్ బిజినెస్ ఒకటే చేసేవాడా? ఇంకా ఏదైనా "ఇతర వ్యాపకాలు" కూడా ఉన్నాయా?" వ్యాపకాలు అన్న పదాన్ని వత్తి పలుకుతూ అడిగాడు కరుణ్.

"నాకు తెలిసి అదొక్కటే బిజినెస్ అతనికి. ఇంకేమయినా వుండేవో లేవో అంతగా తెలియదు."

"మీతో అన్ని విషయాలు చెప్పేవాడు కాదా?"

"సాధారణంగా చెప్పేవాడు మరి."

"హరిణి హైద్రాబాద్‌లో ఎక్కడుంటుంది? అడిగాడు కరుణ్.

"మీకు తెలియదా?"

"తెలుసనుకోండి! కానీ రీసెంట్‌గా ఖాళీ చేసేసింది. హైద్రాబాద్‌లోనే ఉంటుందో, మరేదయినా ఊరెళ్ళిపోయిందో!"

"నాకు మాత్రమేం తెలుస్తుందండీ?"

"అతనెందుకని డాక్టర్ వృత్తి వదిలేసి, బిజినెస్‌లోకి దిగాడు?"

"అతనికి స్థిరంగా వచ్చే రాబడి కంటే, ఒక్కసారే ధనవంతుణ్ణయి పోవాలనే కోరిక ఉండేది. అది కూడా ఒక కారణం కావచ్చు."

"హరిణి అతని చర్యలకు ఎదురు తిరిగేదా?"

"అలా ఎదురు తిరిగే మనిషే అయితే ఇన్నేళ్ళు ఎందుకు ఆగుతుంది? విడాకులు ఇవ్వాలనే నిర్ణయానికి ఎప్పుడో వచ్చేసేది."

"నాదొక చిన్న అనుమానం సార్!"

"ఏమిటది?"

"ప్రేమ్‌నాథ్, హరిణిలకి ఏదో గొడవయ్... అతనామెను హత్య చేయాలనుకుంటే, తనని తాను రక్షించుకోవడానికి ఆమె ఈ హత్య చేసిందేమో?"

"ఒక మనిషిని చంపేటంత క్రూరత్వం ఆమెలో లేదని ఘంటా పదంగా చెప్పగలను. కానీ మీరు చెప్పిన "వ్యూ" లో ఆలోచిస్తే అలా జరగటానికి అవకాశం ఉండవచ్చు" సాలోచనగా అన్నాడతను.

"అంతే కాని భర్త ప్రవర్తన వలన విసిగిపోయి, అతన్ని హత్య చేయలేదంటారు?"

"అలా చెయ్యాలనుకునే మనిషే అయితే విడాకులకు ఎందుకు సిద్ధ పడుతుంది?" తిరిగి ప్రశ్నించాడు వైకుంఠం.

"మీరు చెప్పింది నిజమే!"

"........."

"ఏది ఏమయినా మేమందరం చూసిన ప్రేమ్‌నాథ్‌లో మరో మనిషి ఉన్నాడన్నమాట."

"డెఫ్‌నెట్‌గా!"

"సార్! వార్డ్ నెంబర్ పదిలో ఉన్నతని కండిషన్ అబ్‌నార్మల్ స్టేజికెళ్ళిపోతోంది..." హడావుడిగా వచ్చిన నర్స్ వైకుంఠంతో అంది.

"నేను వస్తాను సార్!" లేచాడు కరుణ్.

"ఒ కే!" వీడ్కోలుగా అతనితో చేతులు కలిపాడు డా॥ వైకుంఠం. కరుణ్ బయటికి నడిచి, తన కారులో కూర్చుని, ముందుకు దూకించాడు.

✳ ✳ ✳ ✳ ✳ ✳

"ట్రింగు... ట్రింగ్...!" కాలింగ్ బెల్ మోతకి చదువుతున్న పుస్తకం మూసి తలుపు తెరిచాడు కరుణ్.

"వాకిట్లో మంజుల నిల్చుని ఉంది.

"హేయ్ మంజూ! లోపలికి రా!" ఆహ్వానించాడు.

"ఉంటావో... ఉండవో అని అనుమానపడుతూనే వచ్చాను..." లోపలికి వచ్చి సోఫాలో కూర్చుని అందామె.

"భోజనం చేసావా?" నవ్వుతూ అడిగాడతను.

"చేశాను! నువ్వో?"

"ఇప్పుడే చేసి వచ్చాను."

"ప్రాక్టీస్ మేక్స్. మేన్ ఫర్‌ఫెక్ట్ అన్నారు తెలుసా?" అడిగిందామె.

"నిజమే. అయితే ఏమిటట?"

"నువ్వు ఇంట్లో వంటా గింటా ప్రాక్టీస్ చేయకుండా హోటల్లో తినేసి వస్తుంటే... రేపొద్దున్న మంచి వంటవాడివెలా అవుతావ్?"

"పెళ్ళయ్యాక నువ్వు తర్ఫీదిస్తావుగా!"

"చచ్చాం! నీకు నేర్పడానికి మళ్ళీ వంట నేర్చుకోవాలా?"

"తప్పదు మరి!"

"నాకు వంట చేయటం వస్తే నిన్నెందుకు చేయమంటాను?"

"ఒక పనిలో సూపర్‌వైజ్ చెయ్యాలంటే దానికి ముందుగా ఆ పనిలో నైపుణ్యం ఉండాలి ఫ్రెండ్. లేకపోతే ఎక్కడ తప్పు జరుగుతుందో తెలుసుకోవటం కష్టమౌతుంది."

"నీ లాయర్ బుద్ధులు నా మీద ప్రయోగించకు నేస్తం. అలా నన్ను వంటగత్తెని చేసి, ఆనక నువ్వే నాకంటే రుచిగా చేస్తావ్ డియర్! అని పొగిడేసి బుట్టలో వేద్దామనా?"

"యాహూ... అయితే నీ బలహీనతేమిటో నాకు తెలిసిపోయిందోచ్!"

"ఏమిటది?"

"నువ్వు పొగడ్తలకి పొంగిపోతావని!"

"ఏం కాదు!" చిన్నపిల్లలా అందామె.

"మీ అమ్మా-నాన్నా ఊర్నుంచి వచ్చేశారా?"

"నిన్ననే వచ్చారు."

"ఈ మధ్య నీకేం పీడకలలు రాలేదా?"

"లేదు!"

"అయితే సెల్ఫ్ హిప్నాసిస్ బాగా పని చేస్తుందన్న మాట!"

"ఊఁ!"

"మునుపటి మీద నీలో చాలా మార్పు వచ్చింది మంజూ! బాగా చలాకీ తనం కూడా పెరిగిపోయింది నీలో... అదే సమయంలో అల్లరీనూ."

"మరి మనం అల్లరి చెయ్యాలంటే మనకన్నా పెద్దవాళ్ళ దగ్గరేకదా చేయాలి. చిన్నవాళ్ళ దగ్గర పెద్దరికంగా... హుందాగా ఉండాలి. తెగ అల్లరి చేసే గడుగ్గాయిలు కూడా తమకంటే చిన్నవాళ్ళ దగ్గర ఆరిందల్లా వ్యవహరించటం చూడలేదా?"

"చూశాను."

"అదీ కాకుండా మనం అల్లరి చెయ్యడానికైనా భరించే ఓ మనిషి ఉండాలిగా. అది మనం ప్రేమించే మనిషే అయితే ఇక చెప్పనవసరంలేదు."

"ఊఁ!"

"అదీగాక పెళ్ళయ్యే వరకే మగవారు మంచి ప్రేమికుడుగా, మంచి స్నేహితుడుగానూ ఉంటాడు. తర్వాత అతనిలో నిరంకుశ ధోరణులు మొదలై పెళ్ళాం గట్టిగా నవ్వకూడదు. మాట్లాడకూడదని ఆంక్షలు విధిస్తాడు."

"ఇదీ మీ నాయనమ్మే చెప్పిందా?"

"ఇదిగో! ఇంకోసారి మా నాయనమ్మనంటే ఊర్కోను."

"మరెవరు చెప్పారు? ఏదో కథలో ఓ రచయిత్రా?"

"కాదు! "మానసిన విశ్లేషణ"లో తొలి తెలుగు నవల అంటూ మీ మగ రచయితే చెప్పాడులే ఓ నవలలో."

"చంపాడు కదా మగవాళ్ళందర్నీ" బాధగా మొహం పెట్టి అన్నాడు అతను.

"అది నిజమేనా?"

"ఏమో! నాకేం తెలుసు?"

"అలా కప్పదాటు జవాబులు చెప్పకు! నిజాన్ని నిజాయితీగా ఒప్పుకోవాలి."

"హుఁ! కోర్టు బోనులో అందర్నీ నిలబెట్టి ప్రశ్నలడిగి, జవాబులు రాబట్టే నేను నీకిలా దొరికిపోయాను. దీన్నే ప్రారబ్ధం అంటారు."

"ఏది ఎలా వున్నా ఆ మాటలు నిజమే! ప్రేమికురాలిగా ఉన్నప్పుడే స్త్రీకి అల్లరి అందాన్నిస్తుంది. తర్వాత అది ఎబ్బెట్టుగా వుంటుందని నా నమ్మకమూనూ. కనుక నేనూ ఆ రచయితతో ఏకీభవిస్తున్నాను."

"భవించు... భవించు."

"అంత నిస్పృహ చెందకు నేస్తం! మీరు నిస్పృహతో బాధపడుతున్నారా? అయితే మీకు కావాలి మీలో ఉత్సాహాన్ని పెంచే గుండూ వారి జిడ్డూ లేహ్యం... ట్రింగ్... ట్రింగ్...!"

"ఏమిటీ ఈ మధ్య టీవీ ఎక్కువగా చూస్తున్నట్టున్నావ్?"

"అవును... చూస్తున్నాను! ఉదయం ఆరు నుంచీ రాత్రి పన్నెండు వరకూ అన్ని ఛానెల్స్‌లోనూ చాలా మంచి కార్యక్రమాలు వస్తున్నాయి."

"ఏమిటా కార్యక్రమాలు?"

"సినిమాలు, సీరియల్స్, పాటలు, వగైరా, వగైరా."

"ఇవి మంచి కార్యక్రమాలా?"

"కాదా?"

"కాదు!"

"కానీ ఈ ఛానెల్స్ పెరిగిన తర్వాత చాలామంది మగవాళ్ళు హేపీగా వున్నారట."

"ఎందుకు?"

"ఫలానా కార్యక్రమం ఈ రోజు వస్తుందని తెలిసి, ఆ సమయానికల్లా ఆడవాళ్ళు వంట చేసుకుని... భర్తలకు తొందరగా వడ్డించేసి టీవీల ముందు కూర్చుంటున్నారట. ఇంతకు ముందు అనాసక్తంగా వంటపనీ, ఇంటిపనీ చేసుకునే ఇల్లాళ్ళు ఈ ఛానెల్స్ పుణ్యమాని ఓ టైం టేబుల్ ప్రకారం అన్ని పనులూ పూర్తి చేసుకుని, అటు భర్తతో మెప్పులు పొందుతూ, ఇటు వాళ్ళూ వినోదవంతమైన కాలక్షేపం చేస్తున్నారట."

"ఓహో! పాపం ఆ ఇల్లాళ్ళకు ఓ సంగతి తెలియదేమో!"

"ఏమిటది?"

"అదేపనిగా టీవీ చూస్తే ఆరోగ్యానికి హానికరం. ఈ విషయాన్ని టెల్ అవీవ్ యూనివర్సిటీలోని ప్రొఫెసర్ మోషే అడాన్‌సన్ నిర్ధారించారు. ఎక్కువగా టీవీ చూడటంవలన శరీరంలోని ఒత్తిడి హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. అవి ఎక్కువ స్థాయిలో వున్నప్పుడు జ్ఞాపకశక్తికి అత్యవసరమయిన మెదడులోని చేపవంటి భాగంలోని నరాల కణాలను పాడు చేస్తాయి. దానివలన మానసిక అస్థిరత పెరుగుతంది. తరువాత అది ఆల్‌జెయిమర్" అనే వ్యాధిలోకి నెడుతుంది.

అదేపనిగా టీవీ చూడటం అంటే "మెదడుపై విద్యుత్ ఆక్రమణ చేయటం" అని న్యూ సైంటిస్ట్ అనే అమెరికన్ పత్రిక పేర్కొంటుంది. టీవీ చూసే బదులు పుస్తకాలను చదివితే, అది కల్పనా శక్తినీ, ఆలోచనా సామర్థ్యాలను కలిగిస్తుంది. టీవీ ప్రతి దృశ్యాన్నీ, శబ్దాన్నీ చూసే వారి కోసం కల్పించబడుతుంది. కానీ పుస్తక పఠనం అలా కాదు చదివేటప్పుడు పాఠకులు ఆయా సంఘటనలనీ, రచయిత వర్ణించిన ప్రదేశాలనీ ఊహించుకుంటారు.

మానసిక బలాన్ని ఈ విధంగా సృజనాత్మకంగా మలుచుకోవటంతో చదివే వాళ్ళకి మానసిక మాంద్యం అరికట్టబడుతుంది. కనుక టీవీచూడటం తగ్గించు. కొన్ని ఇంపార్టెంట్ ప్రోగాములో లేకపోతే న్యూస్ వంటివో చూడు. కరెంట్ ఎఫైర్స్ తెలుస్తాయి. బి.బి.సి. వార్తలు చూడు. ఇంటర్ నేషనల్ లెవల్లో నేటి ప్రపంచ స్థితిగతులు నీ కళ్ళ ముందు ఆవిష్కరించబడతాయి."

"అమ్మ బాబోయ్! నువ్వు చెబుతుంది నిజమేనా?"

"ఎస్ మైడియర్ మంజూ!"

"మరి పుస్తకాలు కూడా అదేపనిగా చదవకూడదు కదా... ఇది మా నాయనమ్మ చెప్పిందిలే."

"కొంతవరకూ అదీ నిజమే! కానీ పుస్తకాన్ని చదువుతూ మనకి కావలసినపుడు, లేదా ఏదయినా పని వున్నప్పుడు మూసేసి, తరువాత మళ్ళీ చదువుకోవచ్చు. కానీ టీవీ ప్రోగ్రాం అలా కాదే! మొదలుపెడితే అయ్యేవరకూ చూడవలసిందే. మధ్యలో లేస్తే ముందేం జరిగిందో తెలియదు. తర్వాత కథ అర్ధమవదు. అదే టీవీకి, పుస్తకానికీ వున్న తేడా."

"నిజమే!" నెమ్మదిగా అందామె.

"సరే! ఏమిటి నీ ప్రోగ్రాం?"

"ఏం లేదు."

"అయితే బయటికి వెళదామా?"

"టైం మూడవుతోంది. బయట ఎండ మాడ్చేస్తుంది. ఎక్కడికీ వెళ్ళవద్దు. ఇక్కడే కబుర్లు చెప్పుకుందాం."

"నీ ఇష్టం."

"కరుణ్! నీ కేసుకు సంబంధించిన ఏచీవ్‌మెంట్సేం లేవా?"

"అరే! నీకీ సబ్జెక్ట్ బోర్ కదా. అంత ఇంట్రస్టుగా అడుగుతున్నావేం?"

"నిజానికి నువ్వీ కేస్ డీల్ చేయటం నాకు బోరు కాదు, ఇష్టంలేకనూ కాదూ. ఆ రోజు ఆ కలతో నేనెంతో కలత చెందాను. నా భయంతో నిన్ను డిస్టర్బ్ చేసానేమో! కానీ నీకు ఏ వృత్తిలో మంచి పేరు వస్తే నాకొచ్చినట్టు కాదా?" అతన్నే సూటిగా చూస్తూ అందామె.

"వెల్‌సెడ్ మంజూ...! సాధారణంగా స్త్రీలందరిలోనూ, భిన్న ప్రవృత్తులుంటాయ్. తమ భర్త అతను చేసే పనులతో మంచి పేరు తెచ్చుకోవాలనీ అనుకుంటారు. దాంతోపాటు వచ్చిన పేరు ఎటువంటి కష్ట, నష్టాలూ లేకుండా రావాలనీ అనుకుంటారు. ఇది ఆయా స్త్రీలకు తమ భర్తలపట్ల ప్రేమభావాన్ని సూచిస్తుంది. కానీ మంజూ!

ఒక్కటి గుర్తుంచుకుంటే మంచిది... "కష్టేఫలే" అన్నారు మన పెద్దలు... కష్టపడినవాడికి ఫలితం దక్కుతుంది. అందుకని మానవప్రయత్నం మనం చేస్తే, అది మంచి పనయితే భగవంతుడు హర్షించి మన పనిలో మనకి విజయాన్ని చేకూరుస్తాడు.

"అవును కరుణ్... "నా..." నీకు ఏమీ కాకూడదనే, నువ్వీ కేసు వదిలెయ్ అని అన్నాను. ముందు... కానీ "ఈ కేసులో ముందుకు వెళ్ళటానికి అన్ని దారులూ మూసుకుపోయాయి" అని మొన్న నువ్వు చెబుతున్నప్పుడు నీ నిస్సహాయక నన్ను చాలా ఇబ్బంది పెట్టింది. ఓ వ్యక్తికి అతను ప్రాణాధికంగా ప్రేమించే వృత్తికానీ, కళగానీ, క్రీడగానీ, దేనిలోనయినా ఆశాజనకమైన పరిస్థితులు కనుచూపు మేరలో లేకపోతే అతని హితైషులు ఆ సమయంలో అతనికెంతో ఉత్తేజమివ్వాలి. నేను నిన్నిలా ప్రోత్సహించకపోగా, నిరుత్సాహపరచాను..." ఇక మీదట అలా జరగదు...

కరుణ్ ఆమెవేపు చూసాడు ఒక్కక్షణం.

"మంజూ! నువ్వింత లోతుగా ఆలోచించగలవా?"

"అవును కరుణ్...! ఓ రచయిత భార్యో, ప్రియురాలో తాను రచయిత్రి కాకపోవచ్చు. కానీ అతని రచనలకి, ఆమే మొదటి పాఠకురాలై ఆ రచనలో ఉన్న మంచినీ, చెడునీ, తనకున్న పరిజ్ఞానంతో విశ్లేషించి చెబుతుంది. ఓ క్రీడాకారుడి భార్య, ఓ కళాకారుడి ప్రియురాలు కూడా వాళ్ళ కష్టంలో భాగం పంచుకుంటారు. అలాగే లాయర్, డాక్టర్ల తాలుకూ స్త్రీలు కూడా వాళ్ళని ఉత్తేజపరచాలి. మంచి పని చేస్తున్నప్పుడు తను అండదండలు, సూచనలు, సహాయం అందించాలి. అప్పుడే వాళ్ళు తమ వృత్తుల్లో రాణిస్తారు."

"చాలు మంజూ! నాకు కావలసింది కూడా అదే!" అతని కళ్ళల్లో ఆనందపు వెలుగులు.

"నువ్వీ కేసులో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను..."

"తప్పకుండా విజయం సాధిస్తాను డియర్."

"అయిదవుతోంది ఇక వెళతాను..." లేచిందామె.

"సరే మీ ఇంటివరకూ దింపనా?"

"సరే!"

కరుణ్ డ్రస్సయి వచ్చాడు. ఇంటికి లాక్‌చేసి, కారులో బయలుదేరారు వాళ్ళు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

సమయం రాత్రి 8.30 ని॥

కరుణ్ కారు రాయ్ ఆఫీసు ముందు ఆగింది. అతను దిగి ఆఫీసులోకి నడిచాడు.

అప్పటికే అక్కడ రాయ్ ఏజెంట్లు పరశురామ్, చైతన్యలు కూర్చుని ఉన్నారు.

"గుడీవినింగ్ కరుణ్‌జీ!" రాయ్ మాటలకు వాళ్ళిద్దరూ కరుణ్‌కేసి చూసి విష్ చేశారు.

"గుడీవినింగ్!" అంటూ కూర్చున్నాడు కరుణ్.

"మేం రెడీ సార్!" అన్నారు ఏజెంట్లు ఇద్దరూ...

"వెరీగుడ్! నిన్న చూసారుగా ఆ టేబిల్ దగ్గరే కూర్చోండి... వెయిటర్ రాగానే "రాజస్థానీ బిరియానీ విత్ తందూరీ చికెన్" అంటూ ఆర్డరిచ్చి అతనితో పరిచయమున్నట్టే చిన్నగా నవ్వండి. ఆ వెయిటర్ పేరు డేవిడ్! అతనికి ఏభై సంవత్సరాల వయస్సుంటుంది.. ఆ హోటల్లోని వెయిటర్లందరిలోకీ అతనే పెద్ద వయస్సువాడు. నిన్న మీకా సంగతి చెప్పటం మరచిపోయాను" అన్నాడు కరుణ్.

"నిన్న అతనెందుకు హోటల్‌కి రాలేదంటారు...?" అడిగాడు రాయ్.

"ఏదో అర్జంట్ పని వుండి శెలవు పెట్టాడని మరో వెయిటర్ చెప్పాడు."

"వెళదామా సార్?" అడిగాడు పరశురామ్.

"వెళదాం! రాయ్ సాబ్! మీ ఏజెంట్ల ఉత్సాహం చూసారుగా..." నవ్వుతూ అన్నాడు కరుణ్.

"దటీజ్ డ్యూటీ మైండెడ్! బోయ్స్... బీకేర్‌ఫుల్!" తన ఏజెంట్ల వేపు తిరిగి హెచ్చరించాడు రాయ్.

"ఓ.కె. రాయ్ సాబ్! మేం వెళ్ళొస్తాం!"

"గుడ్‌లక్ కరుణ్‌జీ!" లేచి నిలబడి అన్నాడు రాయ్.

కరుణ్ వెనకనే పరశురామ్, చైతన్యలు. రాయ్ వాళ్ళని కారుదాకా సాగనంపాడు.

ముగ్గురూ కూర్చోగానే కారు హోటల్ డిలైట్ వేపు దూసుకుపోయింది.

"సార్! ఇక్కడ కారాపేయండి. మేం ముందు నడిచి వెళ్ళిపోతాం" హోటల్‌కి కొంచెం దూరంలోకి కారు రాగానే అన్నాడు పరశురామ్.

కరుణ్ కారాపాడు. ఏజెంట్లిద్దరూ దిగి నడిచి వెళ్ళిపోయారు కొన్ని నిముషాల తర్వాత కరుణ్ హోటల్‌ని సమీపించి, కారు పార్కింగ్‌లో పెట్టి లోపలికి నడిచాడు. టేబుల్ దగ్గిర కూర్చుని ఓసారి డేవిడ్ టేబుల్ వైపు చూసాడు. పరశురామ్, చైతన్యలు అప్పటికే అక్కడ కూర్చుని వున్నారు. ఇంకా డేవిడ్ వాళ్ళని చూసినట్లులేదు.

"ఇప్పుడేమవుతుంది? డేవిడ్ వాళ్ళకి సర్వ్ చేస్తాడా? లేకపోతే కొత్త వాళ్ళని పోల్చుకుని వేరే టేబుల్ వైపు పంపించేస్తాడా?" కరుణ్‌లో ఎగ్జయిటీ. అదే సమయంలో కిచెన్‌లోంచి వస్తూ కనిపించాడు డేవిడ్. కరుణ్ కంటి చివరల నుంచి అటే చూడసాగాడు. స్పీకర్లలోంచి "డెడ్‌షెపర్డ్" ఆల్బమ్‌లోని ఇంగ్లీష్ పాటలు హార్ట్ బీట్‌ని పెంచే విధంగా వినిపిస్తున్నాయి.

ఇంతలో కరుణ్ టేబుల్ దగ్గరికి ఓ వెయిటర్ వచ్చి ఆర్డర్ కోసం నిలుచున్నాడు.

"వెజిటబుల్ మిల్స్" వెంటనే చెప్పాడతను. వెయిటర్ వెళ్ళిపోయాడు. ఉత్కంఠతతో పరశురామ్, చైతన్యలను గమనించసాగాడు కరుణ్. డేవిడ్ వాళ్ళనో సారి పరీక్షగా చూశాడు.

"రాజస్థానీ బిరియానీ విత్ తందూరీ చికెన్" అతన్ని చూడగానే చిన్నగా నవ్వి చెప్పాడు పరశురామ్. డేవిడ్ వాళ్ళిద్దరివంకే చూస్తూ కిచెన్ వైపు సాగిపోయాడు.

"థ్యాంక్‌గాడ్!" అనుకున్నాడు కరుణ్. అతనికి మీల్స్ సర్వ్ చేసి వెళ్ళిపోయాడు వెయిటర్. తింటూ ఏజెంట్లవైపే క్రీగంట చూడసాగాడతను. సమయం భారంగా గడుస్తున్నట్లుంది.

"ఇంతకు ముందు రెడుసార్లూ ఆ యువకులు ఆర్డరిచ్చిన వెంటనే వాళ్ళు కోరింది సర్వ్ చేసాడే– "మరిప్పుడు ఇంత సమయం తీసుకున్నాడేం? కొంపదీసి డేవిడ్‌కి అనుమానం రాలేదుకదా?" అనుకున్నాడతను.

సరిగ్గా అప్పుడే డేవిడ్ కిచిన్‌లోంచి బయటపడ్డాడు. అతని రెండు చేతుల్లో రెండు ప్లేట్లు. అది చూసి కరుణ్‌లో టెన్షన్ తగ్గింది.

పరశురామ్, చైతన్యల ముందు ఆ ప్లేట్లు పెట్టాడతను. క్యాజువల్‌గా చూసినట్లు చుట్టూచూసి... జేబులోంచి తీశాడు ఎర్రని పాలిథిన్ కవర్లు రెండూ. వాళ్ళిద్దరికీ ఆ పాకెట్లు అందించాడు. అవి చూడగానే వారి మొహాల్లో ఏదో ఆనందం. వెంటనే వాటిని జేబుల్లో పెట్టేసుకున్నారు. ఆదరా బాదరా భోజనం పూర్తిచేసి డేవిడ్‌చేతిలో నాలుగు వందలుంచి కౌంటర్‌లో బిల్ పే చేసి బయటపడ్డారు.

"మార్వలెస్" అనుకున్నాడు కరుణ్. పరశురామ్, చైతన్యల నటనకి. తన భోజనం కూడా గబగబా కానిచ్చి, బిల్ పే చేసి బయటకు నడిచాడు. కారులో కుర్చుని మెల్లగా పోనివ్వసాగాడు. హోటల్‌కి కొంచెం దూరంలో కనిపించారు ఏజెంట్లిద్దరూ. కరుణ్ కారాపాడు. వెంటనే ఇద్దరూ కారు ఎక్కారు. రయ్‌మని దూసుకుపోయింది కారు.

"బ్యూటిఫుల్ ఏక్టింగ్ మిస్టర్ పరశురామ్ అండ్ చైతన్యా!" ప్రశంసగా అన్నాడు కరుణ్.

"థాంక్యూ సార్!" సంతోషంగా అన్నారు ఇద్దరూ ఒకేసారి.

"మీ నటనతో డేవిడ్ మిమ్మల్ని అనుమానించే వీలు లేకుండా చేశారు." వారిద్దరూ చిన్నగా నవ్వారు.

"ఏవి ఆ పాకెట్లు" డ్రైవ్ చేస్తూనే అడిగాడతను. తీసిచ్చారు వాళ్ళు. ఒక్కో పాకెట్లో పది నుంచీ ఇరవై గ్రాముల వరకూ వుంటుంది. పౌడర్. వాటిని తన జేబులో పెట్టుకున్నాడు.

రాత్రి పదిగంటలవుతుండటంతో అంతగా ట్రాఫిక్ లేదు. మరో పది నిముషాల్లో వాళ్ళ కారు రాయ్ ఆఫీసు ముందు ఆగింది. వాళ్ళ కారుని చూడగానే రాయ్ గబగబా బయటికొచ్చాడు. అతని మొహంలో ఆత్రుత కన్పిస్తోంది.

కరుణ్, ఏజెంట్లు ఇద్దరూ కారు దిగారు. రాయ్‌ని చూడగానే విజయం సాధించినట్లు చెయ్యెత్తి విక్టరీ సింబల్ చూపించాడు కరుణ్. దాంతో అతని మొహంలో ఆత్రుత మాయమై ఆనందం కనిపించింది. అందరూ ఆఫీసులోకి నడిచారు.

"ఇవిగోండి రాయ్‌సాబ్ ఆ పాకెట్లు. నిజంగానే పరశురామ్, చైతన్యల అద్భుత నటన వల్లనే ఇవి మనం సంపాదించుకోగలిగాం. ఐ యామ్ ప్రౌడ్ ఆఫ్ దెమ్" మనస్ఫూర్తిగా అన్నాడతను.

రామ్ ఆ పాకెట్లు ఓపెన్ చేశాడు. అందులో తెల్లని పౌడర్ వుంది." "సరిగ్గా ఇలాంటి పౌడర్ పీటర్ సేఫ్‌లోనూ, ప్రేమ్‌నాథ్ ఇంటిలోనూ చూశాన్నేను" వెంటనే అన్నాడు కరుణ్.

"యువార్ రైట్" అన్నాడు రాయ్.

"అంటే ఇది కూడా..."

"టెస్టింగు కోసం మనం లేబరేటరీకి పంపిద్దాం" అతని మాట పూర్తి అవకుండానే అన్నాడు రాయ్.

"ఎప్పుడు తెలుస్తుంది మనకి?"

"లాబ్ టెక్నీషియన్ మార్నింగు బస్తాడు. మీరు రేపు మార్నింగు పదింటికి రండి" అన్నాడు రాయ్.

"గుడ్‌నైట్" అన్నారు వాళ్ళు కూడా.

కరుణ్ కారులో కూర్చుని ఇంటివేపు సాగిపోయాడు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

బెడ్‌పై వాలాడు కానీ పదకొండవుతున్నా కరుణ్‌కి కంటిమీదకి కునుకు రాలేదు.

"కాస్సేపు ఏదయినా చదివితే నిద్రవస్తుందేమో" అనుకుని ఆ రోజునే పోస్టులో వచ్చిన "ఇండియా టుడే" పత్రికని చదవసాగాడు.

ఆ పత్రికకి ఇయర్లీ సబ్‌స్క్రిప్షన్ కట్టడం వలన పోస్టులో వస్తుందతనికి ఆ పత్రిక.

రాజకీయ కథనాలు, స్పోర్ట్స్, అంతర్జాతీయ వార్తలు చదివేసరికి అతనికి నిద్ర వస్తున్నట్టనిపించి బెడ్‌లైట్ ఆర్పేసి పడుకుందామనుకుంటుడగా ఫ్యాన్ గాలికి పుస్తకంలోని పేజీలు గిర్రున ఎగిరి కనిపించిందో ఫోటో.

అది పీటర్‌ది.

వెంటనే ఆ పేజీలు తీసాడు.

పీటర్ ఫోటోతోపాటు రెండు పేజీల వార్త రాసి వుంది అతని గురించి. గబగబా చదవసాగాడతను.

"మరలిరాలి లోకానికి అద్భుత చిత్రకారుడు".. కళని కాసులకోసం అమ్ముకునే కళాకారులు పీటర్‌ని చూసి ముక్కున వేలేసుకోక తప్పదు.

ఎందుకంటే అతను గీసిన అద్భుతచిత్ర రాజాల్ని మనం ఎంత ధర ఇస్తామన్నా నవ్వుతూ తిరస్కరిస్తాడతను.

తన నైపుణ్యాన్ని నలుగురూ మెచ్చుకోవాలనీ, తమ సత్తా అందరికీ తెలియాలనీ ప్రతి కళాకారుడూ కోరుకుంటాడు. కానీ ఇతనిలో అటువంటి లక్షణాలు కన్పించవు.

తన చిత్రాల ఎగ్జిబిషన్ కానీ, వాటిని పోటీలకు పంపే అలవాటు కానీ లేదాయనకు.

ఇతని చిత్రాల్ని మన దేశంలో ప్రముఖ చిత్రకారులు కొందరు దర్శించి "నిజంగా పీటర్ అద్భుత చిత్రకాడుడు. అతనెందుకని మరుగున వుండిపోతున్నాడో అర్థంకావటం లేదన్నారు."

అటువంటి గొప్ప చిత్రకారుణి-హత్య చేస్తే ఎలా వుంటుందో తెల్సుకోవడానికి ఓ యువకుడు టైంబాంబుతో కడతేర్చాడు.

తరువాత పోలీసులకి లొంగిపోయిన ఆ యువకుడికి కోర్టు ఏడు సంవత్సరాల కారాగార శిక్ష విధించింది.

ఓ ఇంగ్లీషు చిత్రంలో కథానాయకుడు ప్రతినాయకుడిని చంపిన పద్ధతిలోనే తానీ హత్య చేశానని హంతకుడు కోర్టుకు విన్నవించుకున్నాడు. దీన్నిబట్టి చూస్తే మనకు అర్థమయ్యేది ఒక్కటే. సినిమాలు నేరాల్ని ఎలా చేయాలో వివరించే ఎన్‌సైక్లోపీడియాలు!

పీటర్ మరణం వలన చిత్రకళలోని అద్భుతమైన ఓ ప్రక్రియ అయినా ఫుమాటో (sfumato) పద్ధతి తిరిగి మరణించింది. తిరిగి మరణించిందని ఎందుకు చెప్పవలసి వస్తుందంటే... ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు లియొనార్డొ డా విన్సీ (1452-1519) కూడా ఈ ప్రత్యేక చిత్రకళా నైపుణ్యం తెలిసినవాడే. భూగోళంలోని అన్ని దేశాల్లోని ప్రజలకీ చిరపరచితుడైన "మొనాలిసా" చిత్రాన్ని ఆయన ఈ పద్ధతిలోనే చిత్రీకరించాడు.

ఈ "ఫుమాటో" చిత్రకళలో ప్రత్యేకత ఏమిటంటే... చిత్రకారుడు గీసిన చిత్రం వెనుకనున్న బ్యాగ్రౌండ్‌లో సైతం మనకళ్ళముందు సజీవంగా ఉన్నట్లుంటుంది. మనం ఎటువెళితే, అందులోని వ్యక్తి మనకేసే చూస్తున్నట్లుంటుంది. మనం ఎటువెళితే, అందులోని వ్యక్తి మనకేసే చూస్తున్నట్లుంటుంది. చిత్రంలోని వెనుకనున్న దృశ్యం కూడా మనం చూస్తున్న కోణంలోంచి- దిక్కు దిక్కుకీ మారుతూ దర్శనమిస్తుంది.

లియొనార్డొడా విన్సీ తరువాత ఈ పద్ధతిలో చిత్రాలు వేసిన చిత్రకారులు ఉన్నారో లేదో తెలియదు. ఈ పద్ధతి చాలా కష్టమయింది. పీటర్ ఈ విద్యని ఎవరి దగ్గర అభ్యసించారో తెలియదు. ఈ శతాబ్దంలో అదీ మన భారతదేశంలో ఈ విద్య తెలిసిన చిత్రకారుడు ఆయనొక్కరే. అని చెప్పక తప్పదు. ఫుమాటో పద్ధతిలో ఆయన చిత్రించిన "ఎడారి సూర్యుడు" అనే చిత్రం ఇతర చిత్రకారుల్ని సైతం విశేషంగా ఆకర్షించింది.

పీటర్ చిత్రకారుడే కాదు. విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాయలయంలో ఆంగ్ల ఉపన్యాసకుడిగా కూడా కొన్నాళ్ళు పనిచేసి తరువాత ఆశక్తి లేక మానేసారు...

కరుణ్ మళ్ళీ చదివాడా పేరాని...

"అంటే పీటర్ ఆంధ్రా యూనివర్శిటీలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పని చేసేవాడా? అయితే హరిణి ఇచ్చిన పేపర్, కటింగ్‌లోని ప్రొఫెసర్ ఇతనేనా? అతని తన గిర్రున తిరిగినట్టయింది ఆ విషయం తెలిసి. మళ్ళీ పేపరులో మేటర్ చదవసాగాడు.

...స్వతహాగా ధనవంతుడైన పీటర్ ఏకాంతంగా జీవిస్తూ చిత్ర రచనలు చేస్తూ జీవించేవారు.

అటువంటి మనిషి గొప్ప చిత్రకారుడు ఓ ఉన్మాది మానసికానందం కోసం అశువులు కోల్పోటంతో మన దేశానికే కాదు ప్రపంచానికి తీవ్ర నష్టం సంభవించింది."

వార్తా కథనం అనిల్ త్రివేదీ విశాఖపట్టనంలోని బళ్ళారామారావుతో కలసి.

చదవటం అయిపోవడంతో పుస్తకం ప్రక్కన పెట్టేశాడతను.

"అనుమానం లేదు! పేపర్ కటింగ్‌లోని మురళీకృష్ణ, హోటల్ హెడ్ వెయిటర్ మురళీకృష్ణ ఒక్కరే. అలాగే ప్రొఫెసర్‌గా చెప్పబుడుతున్న పీటర్ కూడా ఈ వార్తనుబట్టి చూస్తే ఆ పేపర్ కటింగులోని ప్రొఫెసరే.

డాక్టరుగా చెప్పబడిన వ్యక్తి ప్రేమ్‌నాథ్.

అంటే వీళ్ళు ముగ్గురే అప్పుడు యువతికి మత్తుపదార్థాలు అమ్మి నేరస్థులుగా ముద్రపడినవారు.

వాళ్ళ అదృష్టం బాగుండి అప్పుడు వాళ్ళ నేరాలు రుజువు కాలేదు.

మరిప్పుడు ఈ ముగ్గురిలో ఎవరూ లేరుగదా!

మురళీకృష్ణ అదృశ్యమైపోయాడు.

పీటర్, ప్రేమ్‌నాథ్‌లు హత్యగావింపబడ్డారు.

అలాంటప్పుడు హరిణీ ఇచ్చిన పేపర్ కటింగు ప్రకారం వీళ్ళే నేరస్థులైతే ఇక వాళ్ళనెలా పట్టుకోవడం?

అసలు మురళీకృష్ణ అదృశ్యం వెనుక ఎవరి హస్తముంది??

పీటర్‌ని ఎవరు బాంబుపెట్టి హత్యచేసారు???

ప్రేమ్‌నాథ్‌నెవరు చంపారు????

ప్రశ్నల శరపరంపరలతో అతని మెదడు మొద్దుబారిపోయింది.

ఆ స్థితిలో ఎప్పుడు నిద్రపట్టిందో అతనికే తెలియదు.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"గుడ్‌మార్నింగ్ రాయ్‌సాబ్!" కరుణ్ మాటలకు ఏదో చదువుతున్న రాయ్ తలెత్తాడు.

"గుడ్‌మార్నింగ్ కరుణ్‌జీ! సిట్‌డౌన్" అన్నాడు.

"రిపోర్ట్సు వచ్చాయా?"

"ఎస్ కరుణ్‌జీ! అది బ్రౌన్‌షుగర్" చెప్పాడు రాయ్?

"అంటే ఆ వెయిటర్‌ని పట్టుకుంటే, తీగలాగితే డొంకంతా కదిలినట్టు అందరూ బయటికి వస్తారన్నమాట!"

"ఐసీ!"

"ఇంకో విషయం రాయ్‌సాబ్!"

"ఏమిటి?"

"పేపర్ కటింగులోని ప్రొఫెసర్, బాంబుదాడిలో మరణించిన పీటర్ ఒక్కరే"

"రియల్లీ!"

"ఎస్ రాయ్‌సాబ్!" అంటూ "ఇండియాటుడే" లోని విషయాలన్నీ చెప్పాడు.

"నేరస్తులు చనిపోయిన తరుబాతో, బాళ్ళు కనిపించకుండా పోయిన తరుబాతో బాళ్ళ నేరాల్ని ప్రభుత్వం తెలుసుకుని, చేసేదిలేక మిన్నకుండి పోబటం చాలాసార్లు జరిగింది. ఇప్పుడు అలాగే జరుగుతుందేమో" రాయ్ అన్నాడు కరుణ్‌నే చూస్తూ.

"నో రాయ్‌సాబ్! నేరస్తులుగా మనం ఊహిస్తున్న పీటర్స్, ప్రేమ్‌నాథ్‌లు మన పట్టునుండి జారిపోయినా, వాళ్ళనెవరో హత్యచేసారు. మురళీ కృష్ణని కూడా వాళ్ళే అదృశ్యం చేసుంటారు. అంటే నా క్లయింట్ ఇచ్చిన పేపర్ కటింగులో లేని వ్యక్తెవరో వున్నారింకా. అతనే ఈ ఘాతుకాలు అన్నీ చేసువుంటాడు.

హోటల్లోని వెయిటర్ డేవిడ్‌ని మనం ఫాలో అయితే మొత్తం వివరాలన్నీ బయటికి వస్తాయి. బహుశా ఆ హోటల్ యాజమాన్యానికి తెలీకుండా డేవిడ్ ఈ బ్రోన్‌షుగర్ తతంగం నడుపుతున్నాడు అని నా నమ్మకం."

"మేబీ కరుణ్‌జీ!"

"కాబట్టి మీరు డేవిడ్ మీద నిఘా పెట్టించండి."

"ఎస్!"

"అతని వివరాలన్నీ సేకరించి నాకు ఫోన్ చేయండి. ఎంత రాత్రి అయినా ఫర్వాలేదు. అన్ని వివరాలు ఈరోజే కావాలి నాకు"

"ష్యూర్!"

"డేవిడ్ డ్యూటీ రాత్రి పదకొండు గంటలకి అయిపోతుంది. మీ వాళ్ళని జాగ్రత్తగా ఫాలో అవమనండి అతన్ని"

"అచ్చా!"

"మీ ఫోన్ కోసం ఎదురు చూస్తాను" లేచి నిలబడి అన్నాడు కరుణ్.

"అలాగే! గుడ్‌నైట్!"

"గుడ్‌నైట్" బయటికి నడిచాడు కరుణ్.

✧ ✧ ✧ ✧ ✧ ✧

"ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్" ఫోన్ మోతకి దిగ్గున లేచాడు కరుణ్.

రేడియం డయల్ తెల్లవారి రెండు అయినట్లు సూచిస్తోంది.

"కరుణ్ హియర్" ఫోనెత్తి అన్నాడతను.

"కరుణ్‌జీ నేను రాయ్‌ని"

"చెప్పండ రాయ్‌సాబ్!"

"డేబిడ్ రాత్రి పన్నెండు గంటలకి డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్ళాడు. పరశురాయ్ అతన్ని ఫాలో అయ్యాడు. డేబిడ్ ఇల్లు దసపల్లా హిల్స్ దగర, ఫ్లాట్ నెం. 22, అర్ధరాత్రి అబటంబలన డేబిడ్ గురించి ఎంక్వయిరీ చేయటానికి స్కోప్ లేకపోయిందని పరశురామ్ చెప్పాడు...."

"ఓకే రాయ్‌సాబ్ నాకీ వివరాలు చాలు. ఎర్లీ మార్నింగు నేనటు వాకింగ్ కెళ్ళినట్లు అతనింటికి వెళతాను. మిగతా ఆనుపానులు తెలుసుకుని ఆ తరువాత చెయ్యవలసింది చేస్తాను."

"రైట్ కరుణ్‌జీ!"

"థాంక్యూ రాయ్‌సాబ్! వుంటాను" ఫోన్ పెట్టేశాడు కరుణ్.

✧ ✧ ✧ ✧ ✧ ✧

ఉదయం అయిదయింది సమయం.

కరుణ్ అప్పటికే లేచి బ్రష్ చేసాడు.

కాఫీ కలుపుకుని తాగేసి, స్నానం కూడా చేసి టీషర్టు, ట్రాక్ ధరించాను.

కాళ్ళకి స్పోర్ట్స్ షూస్ వేసుకున్నాడు.

అద్దం ముందుకి నడిచి ఓసారి తనని తాను చూసుకున్నాడు.

వాకింగుకో, రన్నింగుకో వెళ్ళే వ్యక్తిలా ఉన్న తన రూపం అద్దంలో దర్శనమిచ్చింది.

తృప్తిగా తల పంకించి ఇంటికి లాక్ చేసాడు.

కారులో కూర్చుని దనవల్లా హిల్స్‌వేపు పోనిచ్చాడు.

ఎర్లీ మార్నింగు కావటం వలన రోడ్లు అన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.

అప్పుడొకటీ, అప్పుడొకటీ వాహనాలు మాత్రం వెళుతున్నాయి.

పది నిమిషాల్లో అతని కారు దసపల్లా హిల్స్ చేరుకుంది.

వెంటనే కారు వేగం తగ్గించి ఫ్లాట్ ముందు ఆగాడు.

ఇండివిడ్యువల్ ఫ్లాటది. చాలా అందంగా వుంది.

గేరేజ్‌లో మారుతీ వ్యాన్, ఓ స్కూటర్ వున్నాయి.

ఇంటి ముందు చక్కని గార్డెన్, గేట్ మీద అందమైన అక్షరాలతో డేవిడ్ అన్న నేమ్ ప్లేట్.

కరుణ్ ఒక్క క్షణం ఆలోచించాడు.

"ఏం సాకుతో అతనింటిలోకి ప్రవేశించాలి?"

అతనికా శ్రమని తప్పిస్తూ అదే సమయంలో ఆ ఫ్లాట్ తలుపులు తెరుచుకున్నాయి.

నైట్‌గౌనులో వున్న డేవిడ్ బయటకి వచ్చి గార్డెనింగు చేయసాగాడు.

కరుణ్ అటు నడిచాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ! ఇక్కడ రెంట్‌కి ఫ్లాట్సేమైనా ఉన్నాయా?"

అతని మాటలకు వెనుదిరిగి చూశాడు డేవిడ్.

"ఓ మీరా?" అప్పుడే అతన్ని గుర్తించినట్లు అన్నాడు కరుణ్.

"మేరేమిటి ఇక్కడ?" తనూ చిన్నగా నవ్వుతూ అడిగాడతను.

"రెంట్‌కి ఫ్లాట్సేమయినా ఉన్నాయేమో అని వాకింగ్ చేస్తూ ఇలా వచ్చాను."

మొన్ననే ఆ ఎదురుగా వున్న ఫ్లాట్‌లో ఎవరో దిగిపోయారు." అంటూ గేట్ తెరిచాడతను.

"అలాగా?"

"రండి! టీ తీసుకుని వెళుదురు" ఆహ్వానించాడతను తనక్కావలసిందీ అదే అవటంతో మౌనంగా లోపలికి నడిచాడు. డ్రాయింగ్ రూంలో కరుణ్‌ని కూర్చోబెట్టి "ఇప్పుడే వచ్చేస్తాను" అంటూ వెళ్ళిపోయాడు డేవిడ్. వెంటనే అక్కడున్న ఫోన్ నంబర్ నోట్ చేసుకుని చుట్టూ

చూశాడు. డ్రాయింగ్ రూం చాలా అందంగా అలంకరించపబడి వుంది. సుందరమైన కాశ్మీర్ తివాచీ నేలపై ఒద్దికగా అమరి వుంది. లేటెస్ట్ డిజైన్‌తో తయారు చేయబడి టీపాయ్, గోల్డ్ కలర్‌లో మెరుపులు విరజిమ్ముతున్న ఏష్‌ట్రే, ఓ పక్క అరలో దేశ విదేశాలకు చెందిన కేటరింగ్ పుస్తకాలు, కిటికీ మూ లఅందాలు చిందిస్తున్న ఫ్లవర్ వేజ్.

"ప్లీజ్! టీ తీసుకోండి" ట్రేలో తీసుకున్న కప్పు అతని ముందుంచి అన్నాడు డేవిడ్.

"థాంక్యూ!" టీ కప్పు అందుకున్నాడు కరుణ్.

"ఒక్క రెండు రోజులు ముందు మీరొచ్చి వుంటే బావుణ్ణు. ఆ ఫ్లాట్ అప్పటికి ఖాళీగానే వుండేది."

"నో ప్రాబ్లెం" టీ సిప్‌చేస్తూ అన్నాడు.

"నేను వాకబు చేస్తాను. ఫ్లాట్లేమయినా ఖాళీ వుంటే మీరు హోటల్‌కి వచ్చినప్పుడు చెబుతాను."

"అలాగే!"

"మీరు డైలీ వాకింగ్ చేస్తారా?"

"అవును."

"చాలా మంచిది. నేనూ చేద్దామనే అనుకుంటాను. వీలుచిక్కదు." చిన్నగా నవ్వేశాడు అతని మాటలకి కరుణ్.

"టీ బ్రహ్మాండంగా వుంది."

"థాంక్యూ! నేనే చేశాను."

"మీరా?"

"అవును!"

"అదేమిటి మీ ఇంట్లో...!"

"ఆడవాళ్ళెవరూ లేరు. నా మిసెస్ పోయి అయిదేళ్ళవుతోంది. ఉన్న ఒకే అబ్బాయి అమెరికాలో 'ఎమ్.బి.ఏ' చేస్తున్నాడు."

"కానీ మీ ఇల్లు ఇంత నీట్‌గా వుంది?"

"నాకు ఇంటీరియర్ డెకరేషన్ అంటే చాలా ఇష్టం..."

"మార్వలెస్! ఆడవాళ్ళున్న ఇల్లు కూడా ఇంత బ్యూటీఫుల్‌గా వుండదు.

"రండి! మా ఇల్లు చూద్దురు" నవ్వుతూ అన్నాడతను. ఖాళీ కప్పుని టీపాయ్ మీద పెట్టి అతన్ని అనుసరించాడు కరుణ్.

"ఇది హాల్! చెప్పాడు డేవిడ్.

డ్రాయింగ్ రూంని మించి అందంగా అలరారుతోంది. ఓ మూల స్టాండ్‌లో దయనోరా కలర్ టీ.వీ. అడుగున వి సి.ఆర్. మరో మూల బి.పి ఎల్. డబుల్‌డోర్ ఫ్రిజ్, సోనీ మ్యూజిక్ సిస్టమ్, అరుదైన మోడల్స్‌తో వున్న సోఫాలు, నేల నిండుగా పరచుకున్న రెడ్ కార్పెట్, రకరకాల ఇండోర్ ప్లాంట్స్.

"ఇది మా అబ్బాయి బెడ్‌రూమ్" ముందుకు నడిచి చూపించాడతను. అన్ని దేశాల క్రికెట్ స్టార్స్ ఫోటోలూ వున్నాయక్కడ.

"వాడికి క్రికెటంటే చాలా పిచ్చి."

"అలాగా" అన్నట్టు తల పంకించాడు కరుణ్.

'ఇది నా బెడ్ రూం" తన బెడ్‌రూంలోకి తీసుకెళ్ళి చూపించాడతను.

ఆ గదిలోకి నడవగానే కరుణ్‌ని ఆకర్షించిందో చిత్రం. పీటర్, హేమారాణిల ఇంట్లో వున్న చిత్రమే అది... 'ఎడారి సూర్యుడు'.

ఆకాశంలోకి ఎర్రటి సూర్యుడు, కిందంతా ఆవిర్లు చిమ్ముతున్న ఎడారి ఇసుకలో కళ్ళల్లోకి ప్రాణం వచ్చేసినట్లు పడున్న యువడకుడికి ఓ అందమైన స్త్రీ తన కడవతో నీళ్ళు తాగిస్తోంది.

"ఈ పెయింటింగ్ చాలా బావుంది. ఎక్కడ కొన్నారు?" వెంటనే అడిగాడు.

"కొనలేదు. మా స్నేహితుడు ఇచ్చాడు."

"ఓహో! మొత్తం టూ బెడ్‌రూమ్సా?"

"కాదు మూడు. ఆ బెడ్‌రూం ఖాళీగా వుంటుంది. ఎవరయినా గెస్ట్‌లు వస్తే వాడుకోవటానికి అలా వదిలేశాను."

"ఛాలా బావుందండీ. మీ హౌస్ రెంటెంత?"

"రెంట్ కాదు. మా స్వంతమే!"

"ఐ.సీ. బయటకు నడుస్తూ అన్నాడు కరుణ్.

"ఏదో ఒక మంచి ఫ్లాట్ వెదికి మీకు చెబుతాను..." అతన్ని గేటు వరకూ సాగనంపుతూ అన్నాడు డేవిడ్.

"థాంక్యూ! వుంటాను."

"ఓ.కే!" వెనుదిరిగి లోపలికి నడిచాడతను.

"ఈ డేవిడ్‌కీ, పీటర్‌కీ కూడా సంబంధాలున్నాయి. దానికా పెయింటింగే సాక్ష్యం. హోటల్లోని ఓ వెయిటర్ ఇంత సంపన్నుడు కావటం మిరకిల్!" అనుకున్నాడు కరుణ్.

వీధి చివరనున్న తన కారులో కూర్చుని ముందుకు పోనిచ్చాడు. డ్రైవ్ చేస్తూనే టెలీఫక్షన్ బూత్ కోసం వెదకసాగాయి. కొంచెం దూరంలో కనిపించింది ఎస్.టి.డి. బూతొకటి కారుని అక్కడికిపోనిచ్చి ఆపాడు. దిగి బూత్‌లోకి నడిచాడు. నోట్ చేసుకున్న డేవిడ్ నెంబర్‌కి రింగ్ చేశాడు. ఫోన్ రింగవుతున్నట్టు అట్నుంచి శబ్దం వినిపిస్తోంది. కొద్దిసేపటి తరువాత–

"హలో డేవిడ్ హియర్!" అంటూ విన్పించింది.

"మిస్టర్ డేవిడ్! నేను త్రీ టౌన్ సి.ఐ.ని మాట్లాడుతున్నాను. హోటల్ డిలైట్‌లో నువ్వు సాగిస్తున్న రెడ్ పాలిథిన్ పేకెట్ల భాగోతమంతా నాకు తెలుసు. మొన్న రాత్రి మా మనుష్యులు నిన్ను బురిడీ కొట్టించి, సంపాదించిన పాకెట్లు నా దగ్గరే వున్నాయి. మర్యాదగా లొంగిపో... శిక్ష తుగ్గుతుం..."

అతని మాటలు పూర్తి కాకుండానే కట్టయిపోయింది. వెంటనే రిసీవర్ క్రెడిల్ చేశాడు అతను. బూత్‌లో కుర్రాడు భయంగా చూశాడు కరుణ్ వంక.

"అంటే... డేవిడ్ ఎవరికో ఫోన్‌లో తనకి పోలీసుల నుండి వచ్చిన బెదిరింపును గురించి చెబుతున్నాడన్నమాట... ఇక ఆలస్యం చేయకూడదు. అసలు నేరస్తుడు తప్పించుకుపోతాడు" అనుకుని ఛేంజ్ తీసి ఫోన్ కుర్రవాడికి ఇచ్చాడు.

"డబ్బులొద్దుసార్!" భయం భయంగా అన్నాడతను.

"ఫర్వాలేదు తీసుకో" అంటూ తన కారులో కూర్చుని మళ్ళీ డేవిడ్ ఇంటివైపు బయలుదేరాడు కరుణ్. అతని కారు అక్కడికి చేరుకునే సరికి తలుపులు మూసి ఉన్నాయి గేట్ తీసుకుని, నడిచాడు. కాలింగ్ బెల్ మ్రోగించాడు.

"తలుపు గడియపెట్టలేదు. త్వరగా రా! పోలీసులు వచ్చేస్తారు." డేవిడ్ మాటలు విన్పించాయి. వెంటనే లోపలికి జొరబడ్డాడు కరుణ్. డేవిడ్ నాలుగు పెద్ద చెక్కపెట్టెలు, రెండు ఎయిర్ బ్యాగుల్లో ఎర్ర పాలిథిన్ కవర్లని సర్దుకున్నాడు. గాబరాగా కరుణ్ లోపలికి రాగానే వెనుదిరిగి చూసి...

"మీరా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును. ఎవరి కోసం... ఎదురుచూస్తున్నావ్?"

ముందు అతని ఏకవచన సంభోదనకి బిత్తరపోయి, తరువాతే తేరుకున్నట్టు ఒక్కసారిగా కలియబడ్డాడు అతనిపై. అది ముందే ఊహించిన కరుణ్ అమాంతంగా డేవిడ్ రెండు చేతులూ పట్టుకుని ముందుకు లాగేశాడు. బోర్లా పడిపోయిన అతని వీపు మీద కాలుతో బలంగా అదిమి చేతికి దొరికిన డోర్ కర్టెన్‌ని 'ఫట్' మంటూ త్రెంచి అతని రెండుకాళ్ళు కలిపి కట్టేశాడు. అరవకుండా అతని నోటిలో కర్చీఫ్ కుక్కేసి, రెండు చేతుల్ని విరిచి పట్టుకుని చుట్టూ చూసాడు. డ్రాయింగ్‌రూం ద్వారం దగ్గర పూసల అల్లికలు కనిపించాయి. వాటిని కూడా త్రెంచి, చేతుల్ని బంధించాడు. తరువాత పాలిథిన్ పాకెట్లు చేతిలోకి తీసుకుని చూసాడు. రాయ్ ఏజెంట్లకి అతనిచ్చిన పాకెట్లు అవే. గబగబా ఓసారి డేవిడ్ ఇల్లంతా వెదికాడు. ఎక్కడా ఎటువంటి అనుమానాస్పదమైన వస్తువులు కానీ, విషయాలు కానీ లేవు. కాకపోతే అతను ఇందాక చూపించిన బెడ్‌రూం తెరిచే వుందిప్పుడు, లోపలికి వెళ్ళి చూశాడు, రూమంతా ఖాళీగా వుంది. తిరిగి అతను డేవిడ్ దగ్గరకి నడిచాడు. ఇంతలో బయటేదో వాహనం ఆగిన శబ్దం వినిపించింది. వెంటనే తలుపులకి గడియ వేశాడు కరుణ్.

"చూడు మిస్టర్! నువ్వెవరికో ఫోన్ చేసావుకదా! వాడు వచ్చినట్టున్నాడు. ఇప్పుడేమీ జరగనట్టే వెళ్ళి తలుపు తీయ్. పిచ్చి వేషాలు వేసావో నీకీ రోజుతో భూమిమీద నూకలు చెల్లిపోతాయ్" గబగబా అతని కట్లు విప్పి చెప్పాడతను.

"ఎవరు నువ్వు? ఏమిటీ దౌర్జన్యం?"

"నోరు మెదపకు. మర్యాదగా చెప్పింది చెప్పినట్టు చెయ్" అతని వంక ఓమారు చూసి తలుపువైపు నడిచాడు డేవిడ్. చేతికి దొరికి పేపర్ వెయిట్‌తో తలుపు మూల నొక్కాడు కరుణ్. డేవిడ్ తలుపు తీయగానే హడావుడిగా లోపలికి ప్రవేశించాడో వ్యక్తి. తలుపు వెనకున్న కరుణ్‌కి అతని మొహం కనిపించలేదు. ఆలస్యం చేస్తే మంచిది కాదని అమాంతం ఆ వ్యక్తిమీద పడి, పేపర్ వెయిట్‌తో అతని తలమీద బలంగా మోదాడు. క్షణంలో అతను నేలకొరిగాడు.

అదే సమయంలో డేవిడ్ అక్కడున్న ఐరన్ కుర్చీతో కరుణ్‌మీద కలియబడ్డాడు. ఆ హఠాత్పరిణామానికి కింద పడిపోయాడు కరుణ్. కుర్చీని అతని మెడ మీద పెట్టి శక్తికొద్దీ అదమసాగాడు డేవిడ్. పట్టుకోసం కుర్చీని తడమసాగాడు డేవిడ్. లాభం లేకపోయింది. డేవిడ్ బలమంతా ఉపయోగించసాగాడు. కరుణ్ అంత బాధలోనూ ఛాన్స్‌కోసం చూసాడు. డేవిడ్ అతని శరీరానికి అటూ – ఇటూ రెండు కాళ్ళువేసి నిలబడి వున్నాడు. అదను చూసుకుని అతని రెండు కాళ్ళనీ పట్టుకుని బలంగా వెనక్కి లాగేశాడు కరుణ్. అంతే అమాంతం వెనక్కి వాలిపోయాడు డేవిడ్. అతని తల 'ఠంగ్'మని కొట్టుకుంది. అచేతనంగా వుండిపోయాడతను. కరుణ్ అతని ముక్కు దగ్గర వేలుంచి చూసాడు. శ్వాస ఆడుతూనే వుంది.

ఫోన్ చెయ్యటానికి వెళ్ళబోయి, డేవిడ్ ఇంటికి వచ్చిన వ్యక్తెవరో తెలుసుకుందామని అతని దగ్గరకు నడిచాడు కరుణ్. బోర్లాపడిపోయి వున్నాడతను. తలనించి రక్తం ప్రసవిస్తోంది. చేత్తో అతని మొహాన్ని ప్రక్కకు తిప్పి చూసాడు.

అంతే! విద్యుద్ఘాతం తగిలినట్లు అదిరిపడ్డాడు. అతను.... 'థామస్!'

వెంటనే వెళ్ళి ఓ నంబర్ డయల్ చేసాడు.

"రాయ్ సాబ్! మీరు అర్జెంటుగా దసపల్లా హిల్స్, ప్లాట్ నెం. 22 దగ్గరకు రండి."

"..........."

"మీతోపాటు ఇద్దరు ముగ్గురు ఏజెంట్లని కూడా తీసుకురండి. విత్‌పోలీస్ యూనిఫాం అండ్ వీడియో కెమెరా."

".........."

"అవును! వీళ్ళని ఇంటరాగేట్ చేసి అన్ని విషయాలూ తెలుసుకోవాలి."

"..........."

"వివరాలు ఫోన్‌లో ఎందుకు? వస్తే మీకే తెలుస్తాయి."

"........"

"నాకేం ఫర్వాలేదు మీరు త్వరగా వస్తే బావుంటుంది."

".........."

"ఓకే ఉంటాను" ఫోన్ క్రెడిల్‌చేసి తిరిగి పీటర్, డేవిడ్‌ల దగ్గరకి నడిచాడు. పీటర్ తలనుండి రక్తం స్రవిస్తుంది.

"అసలు చచ్చిపోయాడనుకున్న ఇతనెలా బ్రతికాడు? డేవిడ్ ఫోన్ చేసింది ఇతనికేనా? అంటే పీటర్ ఈ డ్రగ్ రాకెట్‌కి మూలపురుషుడా? అయితే మురళీకృష్ణని ఎవరు అదృశ్యం చేసారు? ప్రేమ్‌నాథ్‌ని ఎవరు హత్య చేసారు?"

టైం సత్తనడక నడుస్తున్నట్లుంది. కరుణ్‌కేమీ తోచటంలేదు. 'ఇలా తను వీళ్ళని పెట్టుకుని వుంటే, ఎవరయిన వచ్చి చూస్తే ప్రమాదం' అనుకుని పీటర్‌ని కాలర్ పట్టుకుని ఈడ్చుకుంటూ దగ్గరలో వున్న డేవిడ్ కొడుకు బెడ్‌రూంలోకి తీసుకువెళ్ళాడు. తరువాత డేవిడ్‌నీ అక్కడికే ఈడ్చుకెళ్ళాడు. నాలుగు చెక్కపెట్టెల్ని, ఎయిర్ బ్యాగుల్నీ అక్కడే పెట్టి వెనుదిరిగి, తలుపు తెరచి సందులోంచి బయటకు చూసాడు. అక్కడ అతని కారుకి కొంచెం దూరంలో ఓ మారుతీ వ్యాన్ ఆగి వుంది. దానికి నెంబర్ ప్లేట్ వున్నా దానిమీద నెంబర్‌కు బదులు 'ఫర్ రిజిస్ట్రేషన్' అని రాసుంది.

బయట నీలిరంగు పోలీస్ జీపు ఆగి వుంది.

"ఏమిటీ రాయ్‌ని పోలీస్ వేషంతో రమ్మంటే, ఏకంగా పోలీసుల్నే తీసుకొచ్చాడా?" అనుకున్నాడు.

ఇంతలో ముందుగా సబ్ – ఇన్స్‌పెక్టర్ డ్రస్‌లో వున్న రాయ్‌దిగాడు. అతని వెనకే మహేష్, పరశురామ్, చైతన్యలు కానిస్టేబుల్ డ్రస్‌లతో దిగారు. వాళ్ళ చేతుల్లో నల్లటి సూట్‌కేస్ వుంది.

"బహుశా అందులో వీడియో కెమెరా ఉండుంటుంది" అనుకుని తలుపు తెరచాడు కరుణ్.

"నేరస్తులెక్కడ కరుణ్‌జీ?" వస్తూనే అడిగాడు రాయ్.

"లోపలున్నారు. ఇంతకీ మీకు పోలీస్ జీప్ ఎక్కడిది?"

"మాదే!" నవ్వుతూ అన్నాడతను.

"రండి" తనూ నవ్వుతూ అన్నాడు కరుణ్.

అందరూ పీటర్, డేవిడ్‌లను బంధించిన గదిలోకి నడిచారు. ఇంకా స్పృహ రాలేదు వాళ్ళకి.

కరుణ్ గ్లాసుతో నీళ్ళు తెచ్చి, పీటర్ మొహం మీద చల్లాడు. అతను మూలుగుతూ లేవబోయాడు. అప్పుడు చూసాడతన్ని రాయ్.

"అరె! ఇతను పీటర్ కదా! ఇతనెలా బ్రతికాడు?" ఆశ్చర్యపోతూ అన్నాడు.

"అవన్నీ తెలుసుకోవాలిప్పుడు మనం."

అదే సమయంలో పీటర్ కూడా కరుణ్‌ని చూసి బిత్తరపోయాడు. కరుణ్ అతని ప్రక్కన నేలమీద కూర్చుని–

"మిస్టర్ పీటర్! నిజాన్ని దాచి లాభం లేదిక. మర్యాదగా నీ ఘాతకాలన్నీ చెప్పెయ్. లేదా పోలీసుల చిత్రహింసలకి బలికావల్సివస్తుంది." అన్నాడు.

ఆ మాటలకి మౌనంగా తల తిప్పేసుకున్నాడు.

"బాంబు దాడిలో హత్య చేయబడినట్లు అందర్నీ భ్రమింపజేసి ఎందుకు పరారీలో వున్నావ్ ఇన్నాళ్ళూ?"

"..........."

"మాట్లాడవేం? నీ స్థానంలో మరొక వ్యక్తిని వుంచి నువ్వు తప్పు కున్నావ్. అంటే ఎవర్నో నువ్వు హత్య చేసావ్. అవునా?"

"........"

"నా క్లయింట్ ఇచ్చిన కటింగ్‌లోని ప్రొఫెసర్‌ని నువ్వే. నేనా రోజు మీ ఇంటికి వచ్చినప్పుడు నాకేమీ తెలియదని బుకాయించావ్. ఆ తెల్లవారుజామునే బాంబు ప్రహసనం సృష్టించి తెరవెనక్కి వెళ్ళిపోయావ్. హోటల్ డిలైట్‌లోని హెడ్ వెయిటర్ మురళీకృష్ణ, నువ్వూ, రియల్ రిస్టేట్ బిల్డర్ ప్రేమ్‌నాథ్... అదే డాక్టర్ – మీరు ముగ్గురూ నా క్లయింట్ నాకందజేసిన పేపర్ కటింగ్‌లోని వ్యక్తులే యువతని సన్మార్గంలో పెట్టవలసిన ఓ ప్రొఫెసర్‌వి అయ్యుండీ. నీ ధనకాంక్షకోసం వాళ్ళని మత్తుపదార్థాలకి బానిసలు చేస్తున్నావ్."

".........."

"నీ పాపం పండిపోయింది పీటర్! అందుకే పట్టుబడ్డావ్. మర్యాదగా నేరం ఒప్పుకో...."

".........."

"ఇలా లాభంలేదు. త్రిబుల్ టూ... ఇతనిమీద ప్రయోగించూ మన థర్డ్ డిగ్రీలో మొదటి మెథడ్" రీవిగా అన్నాడు రాయ్.

వెంటనే మహేష్ ముందుకు వచ్చి పీటర్ చెవిలో సన్ననిపుల్ల గుచ్చాడు.

"ఆఁ...."

అతని కేక నోటిలోంచి బయటకు రాకముందే పరశురాయ్ అతని నోరు మూసేసాడు.

"ఇప్పటికైనా చెప్పు!" అన్నాడు కరుణ్.

"......."

త్రిబుల్ ఫోర్ ! మెథడ్ నెంబర్ టూ" సీరియస్‌గా ఆజ్ఞాపించాడు రాయ్.

మరుక్షణం చైతన్య పీటర్ నోరుని తెరిచి పట్టుకుంటే, పరుశురామ్ అతని నాలుకని బలంగా బయటకు లాగసాగాడు.

"ఆఁ.... ఆఁగ్... ఆఁగ్...." మూల్గసాగాడతను.

"చెప్పెయ్ పీటర్! ఈ చిత్రహింసలు నువ్వు భరించలేవు. నేరాన్ని అంగీకరించి, నేరాన్ని అంగీకరించి, పశ్చాత్తాపం తెచ్చుకో. పశ్చాత్తాపానికి న్యాయస్థానం ఎప్పుడూ విలువనిస్తుంది. తద్వారా నీకు శిక్ష తగ్గే అవకాశం వుంటుంది" పీటర్ భుజమ్మీద చెయ్యేసి అన్నాడు కరుణ్.

"............"

"త్రిబుల్ సిక్స్! మెథడ్ నెంబర్ త్రీ" గంభీరంగా అన్నాడు రాయ్.

మరుక్షణం పీటర్‌ని బోర్లాపడుకోబెట్టి, అతని రెండు చేతుల్నీ విరిచి పట్టుకుని వెనక్కి వంచసాగాడు చైతన్య.

అదే సమయంకలో పరశురామ్ అతని నడుము మీద కాలేసి అదుముతూ రెండుకాళ్ళ ముడుకులూ పట్టుకుని బలంగా పైకెత్తసాగాడు.

క్షణక్షణానికి పీటర్ శరీరం వర్తులాకారంలోకి తిరిగిపోసాగింది.

"టక్...టక్...టక్...." మంటూ గూడులోంచి ఎముకల శబ్దం వినిపించింది.

భరించరాని బాధవలన అతని మొహం వికారంగా అయిపోయింది.

అతని చేతులూ, కాళ్ళూ వెనక్కి వంచబడి దాదాపు ఒకదానిని ఒకటి తాకుతున్నంత దగ్గరగా వచ్చేసాయి. మరికొంచెం వంచితే అదే జరుగుతుంది.

దాంతోపాటు అతని శరీరం మధ్యకి విరవబడుతుంది.

కరుణ్ ఒకింట ఆందోళనగా చూసాడు రాయ్‌కేసి.

"ఏమీ ఫర్వాలేదు" అన్నట్టు కళ్ళతోనే సైగచేసాడతను. మరింత దగ్గరయ్యాయి అతని కాళ్ళూ, చేతులూ...

"ఫట్...ఫట్...ఫట్...." ఎముకల శబ్దం వినిపించసాగింది.

"ఆఁ...ఆఁ....ఆఁమ్... ఆపండి... ఆపండి... చెబుతాను... అంతా చెబుతాను. ప్లీజ్... లీవ్‌మీ ఫ్రమ్ దిస్ టార్చరింగ్!" గట్టిగా అరిచాడు పీటర్.

"స్టాప్!" వెంటనే అన్నాడు రాయ్.

పరశూరామ్, చైతన్యలు అతన్ని వదిలేసారు.

పీటర్ వెంటనే పడుకునే ఓ పక్కకి తిరిగి మూడంకె వేసినట్టు దగ్గరగా ముడుచుకుపోయాడు. అప్పటికిగాని అతనికి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లు అవలేదు.

"పీటర్! స్పీకపుట్!" అరిచినట్టుగా అన్నాడు అతను.

"మంచినీళ్ళు...." తలొంచి కారుతున్న చెమటలు కళ్ళల్లో పడిమంటలు పుట్టించటంతో కళ్ళు మూసుకున్నాడతను.

వెంటనే అతనికి మంచినీళ్ళు అందించాడు మహేష్. గబగబా తాగేసి గ్లాసు కింద పెట్టాడతను.

"బోయ్స్! అతన్ని గోడకాన్చి కూర్చోబెట్టండి" చెప్పాడు రాయ్.

పరశురామ్, చైతన్యలు పీటర్‌ని లేపి, గోడ చేర్పులో కూర్చోబెట్టారు.

అతను తల తిప్పి డేవిడ్‌వంక, కరుణ్‌వంకా, రాయ్ బృందంవంకా చూసాడో క్షణం.

రాయ్ పరశురామ్ వంక తిరిగి ఏదో సూచించాడు.

వెంటనే అతను తమతోపాటు తీసుకొచ్చిన సూట్‌కేస్ తెరిచి అందులోంచి వీడియోకెమెరా బయటకి తీసి, లెన్స్ అడ్జస్ట్‌చేసి, పవర్ కోసం వైర్‌ని తీసికెళ్ళి ప్లగ్‌లో పెట్టాడు. వైర్ లెస్ మినీమైక్ పీటర్ షర్ట్‌కి తగిలించాడు చైతన్య.

కెమెరా ఆన్ చేసాడు పరశురామ్.

మరుక్షణం పవర్ ఫుల్ వైట్ ఫోకస్ పీటర్ మీద ప్రసరింపచేయబడింది.

ఒక్కక్షణం కళ్ళు ముసుకుని చెప్పటం మొదలుపెట్టాడతను.

"నేను... నేను క్రిమినల్‌ని, గంజాయి, బ్రౌన్‌షుగర్, కొకెయిన్, హకరాయన్, నల్లమందు, మార్ఫిన్, హషిన్, మాన్‌డ్రెక్స్‌లాంటి మత్తు పదార్థాలు యువకులకి అమ్మి, కోట్లు గడించి ఇండియానుంచి పారిపోదామని నిశ్చయించుకున్నాను. కొన్నాళ్ళు ఒంటరిగా చేసాను. తరువాత నాతో కొందరు వ్యక్తులు చేతులు కలిపారు."

"ఎవరు వాళ్ళు?" వెంటనే అడిగాడు కరుణ్.

"హోటల్ డిలైట్‌లోని హెడ్ వెయిటర్ మురళీకృష్ణ, డాక్టర్ ప్రేమ్‌నాథ్, డేవిడ్, హేమారాణిలు, తొంభై మూడులో మా కార్యకలాపాలు అప్పటి పోలీస్ కమీషనర్ దృష్టికెళ్ళి మేం పట్టుబడవలసింది. ఐతే మాకున్న ధనబలంతో పోలీస్ శాఖలో కొంతమందిని కొనేసి అప్పుడు తప్పించుకో గలిగాం."

ఒక్కక్షణం ఆగాడతను. అక్కడ వున్న వారందరూ అతనివంకే చూడసాగారు.

"....కానీ దేనికయినా మొదలూ, చివరలుంటాయి. అందుకే మేం పట్టుబడ్డాం. నాకిటువంటి పరిస్థితి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. ఈ మార్గంలో నా సంపాదన, నేను పెట్టుకున్న టార్గెట్‌ని రీచవ్వగానే ఇండియా వదిలేద్దామని నిర్ణయించుకున్నాను. దాదాపు రీచవుతున్న సమయంలో ఒక రోజు క్రిమినల్ లాయర్ కరుణ్ వచ్చి, తొంభై మూడులో మా గురించి పడిన పేపర్ కటింగు చూపించి–" ఓ కేసు వాదించబోతున్నాను వివరాలు కావాలని అడిగాడు. మళ్ళీ మా గురించి ఎంక్వయిరీ మొదలయిందని గ్రహించి, నా ఇంట్లో నేనే బాంబు పెట్టుకుని పరారయ్యాను...." చెప్పాడు పీటర్.

"మీ ఇంట్లో దొరికిన శవం... హెడ్ బెయిటర్ మురళీకృష్ణది కదూ! అతనూ, నువ్వూ ఇంచు మించూ ఒకటే ఒడ్డూ, పొడవు, నేను నిన్ను ఎంక్వయిరీ చేసి వెళ్ళిన తరువాత నువ్వు అతన్ని పిలిచి హత్య చేసావ్. నీ బట్టలు అతనికి తొడిగి తెల్లవారు జామున రెండూ ఇరవైకి

బాంబు సెట్‌చేసి అండర్ గ్రౌండ్‌లోకి వెళ్ళిపోయావు. బాంబు పేలుడికి అతని రూపురేఖలు గుర్తుపట్టని విధంగా మారిపోయాయి. కానీ పోలీసులు పోస్ట్‌మార్టమ్‌లో బాంబు పేలుడికి ముందే అతను చంపబడ్డాడని పేర్కొనలేదు. బహుశా నువ్వు నీ ధనబలంతో వాళ్ళని మళ్ళీ కొనేసామనుకుంటాను" అన్నాడు కరుణ్.

పీటర్ అతనివంక ఓమారు చూసి–

"యస్! నువ్వు చెప్పింది నిజమే! అతనితోపాటు ప్రేమ్‌నాథ్‌నీ... నేనే హత్య చేసాను" అన్నాడు.

"ఎందుకు?" కఠినంగా అడిగాడు కరుణ్.

"ఆ రోజు నువ్వు నన్ను కలిసిన సంగతి అతనికి చెప్పాను. అతను వెంటనే– 'బహుశా అతనికా పేపర్ కటింగ్ అందజేసింది నా భార్యే అయ్యుంటుంది. ఎందుకంటే నా సేఫ్‌లో దాచిన ఆ పేపర్ కటింగ్ కనిపించటంలేదు. దాంతోపాటు ఆమె బ్యాంక్‌నుంచి యాభైవేలు విత్ డ్రాచేసింది. రాత్రినుంచీ కనిపించటంలేదు. వాళ్ళమ్మ దగ్గరకి హైదరాబాద్ వెళ్ళిందేమో అని అక్కడికి ఫోన్‌చేస్తే ఆమె కూడా 'కూతురు తన దగ్గరికి రాలేదు అంది' అనిచెప్పాడు. నాకు చాలా కోపం వచ్చింది. 'భార్యని అదుపులో పెట్టుకోలేనివాడివి నువ్వా మగాడివేనా?' అన్నాను. మా ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. తన వాటా తనకిచ్చెయ్యమన్నాడతను. మురళీ కృష్ణని వదిలించుకున్నట్టు ఇతన్ని వదిలించుకుంటే, అతనికి విడాకులు ఇవ్వాలని, నిర్ణయించుకుందని నాకు ముందే తెలుసు. అదే సమయంలో ఆమె పరారీలో వుండటంతో అతణ్ని అతడి భార్యే హత్య చేసిందని లోకానికి చాటాలనుకున్నాను. ఆ ప్లాన్‌లో భాగంగానే నా స్నేహితురాలు హేమారాణిని, ఖాళీగా వున్న ప్రేమ్‌నాథ్ ఎదురింట్లో వెంటనే దిగేలా చేశాను. ఆమె తన చతురతతో పోలీసుల్నీ, ప్రజల్నీ హరిణే హంతకురాలని నమ్మించింది. కరుణ్ నన్ను కలిసినవెంటనే నా వ్యాపారం నిలుపుదల చేయించాను. తరువాత యధావిధిగా వ్యాపారం సాగింది. అయితే ఓరోజు హేమారాణి ఇంటికి వెళితే అక్కడినుండి ఎవరో మమ్మల్ని వెంబడించారు. అతన్ని మా వ్యాన్‌తో ఢీ కొట్టి వెళ్ళిపోయాం. ఎందుకయినా మంచిదని డేవిడ్‌ని కొద్దిరోజులు మత్తు పదార్థాల అమ్మకం ఆపేయమంటే–

"ఏం ఫర్వాలేదు. నా కస్టమర్స్ ఎవరో నాకు బాగా తెలుసు. దానికి తోడు నేను నా వాళ్ళకి ఓ కోడ్ చెప్పాను. అది నాకు చెప్పిన వాళ్ళకే ఇస్తాను" అన్నాడు. నేనేం అనలేకపోయాను. అయితే ఎత్తు చిత్తవుతుందని అనుకోలేదు."

"నీకు మత్తు పదార్థాలు ఎక్కడినుండి వస్తున్నాయ్?" అడిగాడు కరుణ్.

"బొంబాయిలో బాంద్రా నుంచి.... రఘువీర్‌టాండన్ అదే అతను సప్లై చేస్తాడు."

"హేమారాణి కూడా మీ ముఠా సభ్యురాలేనా?" అడిగాడు రాయ్.

"అవును! ఆమె, నేను కలిసి వుండాలని నిశ్చయించుకున్నాం" చెప్పాడు పీటర్. అర్థమైనట్టు తల పంకించాడు రాయ్.

కరుణ్ డ్రాయింగ్ రూమ్‌వైపు నడిచాడు. వెనకే అనుసరించాడు రాయ్.

రిసీవర్ చేతిలోకి తీసుకుని ఓ నంబర్ డయల్ చేసాడు కరుణ్.

"హలో పోలీస్ కంట్రోల్ రూం?" అన్నాడు.

"......."

"నేను క్రిమినల్ లాయర్ కరుణ్‌ని మాట్లాడుతున్నాను."

"........"

"మీరు దనపల్లా హిల్స్‌లోని ప్లాట్ నెంబర్ 22కి అర్జెంటుగా రావాలి."

".........."

"నగరంలో మత్తు పదార్థాలు విక్రయిస్తూ. లాసన్స్ బే కాలనీలోని ఓ బిల్డింగ్‌ని బాంబుపెట్టి బ్లాస్ట్‌చేసి–ఓ వ్యక్తి మరణానికి కారణానికి కాకుడై, తరువాత రియల్ ఎస్టేట్ ఓనర్ ప్రేమ్‌నాథ్‌ని హత్య చేసిన హంతకుణ్ని మీరు అరెస్ట్ చేయాలి."

"..........."

".........."

"బాంబ్ బ్లాస్ట్‌కి మీరనుకుంటున్నట్టు హంతకుడు యువరాజ్ కాదు. అలాగే ప్రేమ్‌నాథ్‌ని అతని భార్య హత్య చేయలేదు. మీరు తక్షణం నేను చెప్పిన ప్రదేశానికి రండి. హంతకుడు ఇక్కడే ఉన్నాడు. అన్ని సాక్ష్యాధారాలతో మీకతణ్ని నేను అప్పగిస్తాను."

".........."

"ఓ.కె! వుంటాను" ఫోన్ క్రెడిల్ చేశాడు కరుణ్.

"అయితే ఇక మేం బెళతాం కరుణ్‌జీ!" అన్నాడు రాయ్.

"అదేం? పోలీసులు వచ్చేదాకా వుండండి రాయ్ సాబ్."

"నో కరుణ్‌జీ! ఇక్కడ మేం వుండటం అంత మంచిది కాదు. పోలీసులు మమ్మల్ని చూస్తే లేనిపోని గొడబలు చేస్తారు."

"ఓ.కే. రాయ్‌సాబ్! థాంక్యూ పర్ యువర్ కోపరేషన్!" మనస్ఫూర్తిగా అన్నాడు కరుణ్.

"వెల్‌కం!" అంటూ తన ఏజెంట్లని సమీపించాడతను.

"మిస్టర్ పీటర్! ధన దాహంతో తప్పుడు మార్గాన పయనించావు. నీ సహచరులని కూడా చూడకుండా మురళీకృష్ణని, ప్రేమ్‌నాథ్‌నీ బలిగొన్నావ్. వెయ్యిగొడ్లని తిన్న రాబందు ఒక్క గాలివాటుకు నేలకొరుగుతుందన్నట్టు నీ పాపం బద్దలయి దొరికిపోయావ్. మరికొద్దిసేపట్లో అసలు పోలీసులు వస్తారు. వాళ్ళముందు చెప్పు నీ ఘనకార్యాలు...." అన్నాడు కరుణ్.

అతను బిత్తరపోయి, రాయ్‌వంకా అతడి శిష్యులవంకా చూశాడు.

"అవును! వీళ్ళు నిజం పోలీసులు కాదు. మరికొన్ని క్షణాల్లో వస్తారు వాళ్ళు...."

"బోయ్స్! మూవ్" తన ఏజెంట్లవంక తిరిగి అన్నాడు రాయ్. పీటర్ కాళ్ళూ, చేతులు కట్టేసి రాయ్‌ని అనుసరించారు వాళ్ళు. వాళ్ళ జీప్ వెళ్ళి పోయిన తర్వాత కొన్ని క్షణాలకి పోలీస్ కంట్రోల్ రూం వ్యాన్ వచ్చింది అక్కడికి. ఓ.ఎ.సి.పి. ఇద్దరు సి.ఐ.లు ఇద్దరు ఇన్స్‌పెక్టర్స్‌తోపాటు ఆరుగరు కానిస్టేబిల్స్ ఆ వ్యాన్‌లోంచి బిలబిలమంటూ దిగారు.

వాళ్ళని తీసుకెళ్ళి పీటర్‌నీ, డేవిడ్‌నీ చూపించి–

"వీళ్ళే హంతకులు... ఇతను పీటర్... డ్రగ్‌రాకెట్‌కి మూలబిందువు" చెప్పాడు కరుణ్.

"బాంబు దాడిలో ఇతను చచ్చిపోలేదా?" ఆశ్చర్యంగా అన్నాడు ఎ.సి.పి.

"లేదు! ఈ సంగతి మీ శాఖలో కొంతమందికి తెలిసినా, అన్నాడు ఎ.సి.పి.

"లేదు! ఈ సంగతి మీ శాఖలో కొంతమందికి తెలిసినా, వాళ్ళ నోర్లు ఇతను యిచ్చిన డబ్బు మూటలతో మూతలు పడిపోయాయి."

అతని మాటలకి ఓ సి.ఐ. ఎస్సై, ముగ్గురు కానిస్టేబుల్స్ మొహాల్లో ఆందోళన కనిపించటం కరుణ్ గమనించకపోలేదు.

"మిస్టర్ కరుణ్... మీరంటున్నది...?"

"అవన్నీ తర్వాత! ముందీ వీడియో క్యాసెట్ చూడండి." అంటూ రాయ్ ఏజెంట్ పరశురామ్ చిత్రీకరించి అక్కడ పెట్టిన క్యాసెట్‌ని వి.సి. ఆర్‌లో పెట్టిన క్యాసెట్‌ని ఆన్ చేశాడు.

"నేను... నేను క్రిమినల్‌ని! గంజాయి, బ్రౌన్‌షుగర్, కోకెయిన్, హెరాయిన్, నల్లమందు. మార్ఫిన్, హషిన్, మాన్‌డ్రెక్స్‌లాంటి మత్తు పదార్థాలు యువకులకి అమ్మి కోట్లు గడించి ఇండియానుండి పారిపోదామనుకున్నాను....."

మాటలతోపాటు టీవీ తెరమీద ప్రత్యక్షమయ్యాడు పీటర్. పోలీసు వర్గమంతా ఆశక్తితో చూడసాగారు.

పదిహేను నిముషాలపాటు నడిచి, అతను చెప్పిందంతా బుల్లితెరపై ప్రత్యక్షమయింది.

"కానిస్టేబుల్స్! ఆరెస్ట్‌దెమ్" వెంటనే అన్నాడు ఎ.సి.పి. సత్యమూర్తి. అతని యాభైఏళ్ళ శరీరం కోపంతో ఊగిసలాడసాగింది.

మరుక్షణం పీటర్‌నీ, డేవిడ్‌నీ సంకెళ్ళు వేసి అరెస్టు చేశారు పోలీసులు.

"మిస్టర్ కరుణ్! గుడ్‌జాబ్. అన్ని కరకాలుగానూ మునిగిపోతున్న మన భారతావనికి నీలాంటి యువకుల అవసరం ఎంతయినా వుంది. ఐయాం ప్రౌడ్ అఫ్ యూ...." అతని భుజంమీద తట్టి అన్నాడు సత్యమూర్తి.

"థాంక్యూ సర్!" చిన్నగా నవ్వి అన్నాడతను.

బ్రౌన్‌షుగర్ దాచిన నాలుగు పెట్టెలూ, రెండు ఎయిర్ బ్యాగుల్నీ, వీడియో క్యాసెట్‌నీ, ఎ.సి.పి చేతికి అందించాడు. అందరూ డేవిడ్ ఇంటిలోంచి బయటపడి, సీజ్ చేసారు ఇంటిని. పీటర్, డేవిడ్‌లను తీసుకుని పోలీస్ వ్యాన్ కంట్రోల్ రూంవేపు పరుగుదీసింది.

కరుణ్ తన కారులో కూర్చుని ముందుకు సాగిపోయాడు.

⁂ ⁂ ⁂ ⁂ ⁂ ⁂

# ఉపసంహారం

కరుణ్ బెడ్‌మీంచి లేచి వాచ్‌వైపు చూశాడు. టైం ఉదయం ఆరున్నరయింది. బ్రష్‌చేసి బాత్రూంలోకి నడిచాడు. స్నానంచేసి, కాఫీ కలుపుకుని పేపర్ తిరగేశాడు. సిటీ ఎడిషన్‌లో కనిపించిన ఓ వార్త అతన్ని ఆకర్షించింది గబగబా చదవసాగాడు.

"ఘరానా హంతకుడికి యావజీవ శిక్ష!"

**సిటిడెస్క్:** మతుపద్ధారాలు విక్రయించి, యువత జీవితాల్లో క్రీనీడలు ప్రసరింపజేస్తూ, తన తెలివితేటలతో ఇద్దరిని హత్య చేసిన ఓ పెద్ద మనిషి నేరాలు ఋజువటంతో కోర్టు అతనికి యావజ్జీవకారాగార శిక్ష విధించింది.

నగరంలోని ప్రముఖ క్రిమినల్ లాయర్ కరుణ్ తన గుట్టు తెలుసుకుని ప్రశ్నించటానికి వెళ్ళిన రోజే పీటర్ అనే వ్యక్తి తన ఇంట్లో టైం బాంబు పెట్టుకుని, తన చీకటి వ్యాపారంలో భాగస్తుడైన మురళీకృష్ణ అనే మరో వ్యక్తిని హత్యచేసి, ఆ ఇంట్లో వదిలేసి పరారయ్యాడు. బాంబు పేలిన తరువాత ప్రజలూ పోలీసులూ దాదాపు పూర్తిగా కాలిపోయిన ఆ శవాన్ని చూసి పీటర్ చనిపోయాడనే అనుకున్నారు. అతను తన వ్యాపారంలో మరో భాగస్తుడైన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని కూడా హత్యచేసి ఆ నేరాన్ని చనిపోయిన ప్రేమ్‌నాథ్ భార్యే చేసినట్లు ప్రచారం చేసి తప్పుకున్నాడు. అయితే కరుణ్ పోలీస్ శాఖ కూడా చేయనివిధంగా దర్యాప్తు చేసి పీటర్ ఆకృత్యాలన్నిటినీ బయటపెట్టించి పోలీసులకు అందజేయటంతో హంతకుడూ, స్మగ్లర్ అయిన పీటర్‌కు కోర్టు యావజ్జీవ ఖైదు వేసింది.

బాంబ్ బ్లాస్ట్‌తో తనకు సంబంధముందని చెప్పి జైలుపాలైన యువరాజ్ అనే యువకుడు నిర్దోషి అని తేలటంతో కోర్టు అతన్ని విడిచి పెట్టేసింది. పీటర్ కార్యకలాపాల్లో భాగస్వాములైన డేవిడ్, హేమారాణిలకు చెరో అయిదేళ్ళు కఠిన కారాగార శిక్ష విధించింది. పీటర్‌కి మత్తు పదార్థాలు సప్లై చేస్తున్న రఘువీర్ టాండన్ కోసం మహారాష్ట్ర పోలీసులు గాలిస్తున్నారు. క్రిమినల్ లాయర్ కరుణ్ సేవలకి కోర్టు అతన్ని అభినందించింది."

న్యూస్ పేపర్ చదివి పక్కన పెట్టేశాడతను. ఆ సంఘటనకి సరిగ్గా రెండు రోజుల తరువాత –

"ట్రింగ్... ట్రింగ్!" కాలింగ్‌బెల్ మోతకి కరుణ్ వెళ్ళి తలుపు తెరిచాడు.

ఎదురుగా అందమైన స్త్రీ! ఆమె ఎత్తు అయిదడుగుల అయిదంగుళాలు వుంటుంది. తెల్లని శరీరచ్ఛాయ. ఎర్రని ఆమె పెదవుల కింద కందిగింజంత నల్లటి బ్యూటీస్పాట్!

"మే ఐ కమీన్...?" తననే పట్టి పట్టి చూస్తున్న అతనితో అందామె.

"యస్...యస్... ప్లీజ్ కమీన్!" తడబాటుగా అన్నాడతను. లోపలికి నడిచి సోఫా చూపించాడామెకి.

కూర్చుందామె.

"చెప్పండి!" తనూ కూర్చుంటూ అన్నాడు.

ఓసారి చుట్టూ కలియజూసి–

"నా పేరు హరిణీ!" అందామె.

బాంబు పేలినట్టు అదిరిపడ్డాడతను.

"మీకు అజ్ఞాతంగా కేసు అప్పగించింది నేనే!"

"అలా ఎందుకు చేశారు? మీరే స్వయంగా వెళ్ళి నేరస్తుల వివరాలన్నీ పోలీసులకి తెలపొచ్చుకదా!" ఒక్కక్షణం ఆమెకేసి చూసి అన్నాడు కరుణ్.

"నిజానికి అలాగే చేయొచ్చు... కానీ సాక్ష్యాధారాలు లేకపోతే ఏ కోర్టు ఎంతటి నేరస్తుడినైనా ఏమీ చేయలేదు. అంతేకాదు. మావారి మాటల ద్వారా నాకు అర్థమయిందేంటంటే... వాళ్ళ మత్తు పదార్థాల వ్యాపారానికి పోలీసులు కూడా అండదండలు అందిస్తున్నారని, అలాంటప్పుడు నేను మళ్ళీ అక్కడికే ఎలా వెళ్ళగలను. దాంతోపాటు క్రిమినల్ లాయర్‌గా మీకున్న పేరు, మీ నిజాయితీ గురించి నా స్నేహితురాలు చాలా సార్లు చెప్పింది. అప్పుడే ఈ కేసుని మీ చేతుల్లో పెడదామని నిర్ణయించుకున్నాను. కానీ హైదరాబాద్ చేరుకున్న తరువాత అనుకున్నాను.. .'తలా తోకా లేని వివరాలిచ్చి, నేను గాబరాపడి, మిమ్మల్ని తికమక పెట్టానేమోనని' వెంటనే బయల్దేరి మిమ్మల్ని కలుద్దామనుకున్నాను. ఇంతలో నా స్నేహితురాలు నుంచి ఫోన్ వచ్చింది. ప్రేమ్‌నాథ్‌ని ఎవరో హత్య చేశారని, అది నేనే చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారనీ. దాంతో నేను ఇక్కడికి రాలేకపోయాను."

"మరి మీరారోజు మధ్యలోనే ఫోన్ పెట్టేశారెందుకు?"

"ఆ రోజు నేను సేఫ్‌లో పేపర్ కటింగ్ కోసం వెతకటం, ఆ రోజే నా అక్కౌంట్‌లో వున్న డబ్బుని డ్రా చెయ్యటంతో మా ఆయనకి అనుమానం వచ్చి, నా వెనకే వెంబడించాడు. ముందు తెలుసుకోలేకపోయాను. ఫోన్ చేస్తుండగా గమనించి అష్టకష్టాలు పడి అతనికి టోకరా ఇచ్చి హైదరాబాద్ చేరుకున్నాను.

"మీ వారి మీదే ఎందుకు ఫిర్యాదు చేయలనుకున్నారు?"

"అతనో పశువు కనుక!"

"..........."

"అతను ఎందరో తల్లిదండ్రుల ఉసురు పోసుకున్నాడు. చేతికంది వచ్చిన కొడుకులు, పెళ్ళి చేసుకుని కాపురం చేసుకోవాల్సిన అమ్మాయిలకి మత్తుమందులమ్మి పాపం మూటగట్టుకున్నాడు. ఆ వ్యాపారం మానేయమని ఎంత మొత్తుకున్నా వినలేదు. నా ఎదురుగానే తన ఆడస్నేహితురాళ్ళతో గడిపేవాడు."

ఆమె గొంతులో జీర!

"...సహించాను! రోజు రోజుకీ నాలో నేనే కుమిలిపోతూ సహించాను. గుండెకిగానీ, పర్వతానికిగాని 'బడబానలం' అనేది పుట్టకూడదు. పుడితే అదెప్పుడో ఒకప్పుడు పేలిపోతుంది. నా ఓర్పు అంతరించిపోయి, అతన్నుంచి విడిపోదామనుకున్నాను. ఆ రాత్రి మా పని పల్లవాడి ద్వారా మీకా పాకెట్ పంపి మా అమ్మ దగ్గరికి హైదరాబాద్ వెళ్ళిపోయాను. మీరు కేసు సాల్వ్‌చేసి, నా మీద పడిన నిందని రూపుమాపాక మీ దగ్గరకు వద్దామనుకున్నాను."

"ఓసారి మీ పనిపిల్లాడు కనపడి అడిగితే ఏ వివరాలు చెప్పలేదు నాకు."

"చెప్పడు. వాడికా పాకెట్ ఇచ్చి పంపినప్పుడే నా పేరు ఎవ్వరికీ తెలియనివ్వొద్దని చెప్పాను. నేనో మాట చెబితే అదే వేదవాక్కు వాడికి."

"తరువాత అతని గురించి ఎంక్వయిరీ చేస్తే ఎక్కడికో వెళ్ళి పోయాడని తెలిసింది."

"నా దగ్గరకే వచ్చేశాడు. మీరోసారి వాడిని కలిసి ప్రశ్నించినట్టు చెప్పాడు. నేను మీకు ఏ వివరాలు ఇవ్వకపోయినా ఈ కేసులో మీరెంత ముందుకు చొచ్చుకుపోయారో అప్పుడర్థమైంది నాకు. దోషుల్ని తప్పకుండా చట్టానికి అప్పగిస్తారన్న నమ్మకం కలిగింది...." అంటూ బయటికి చూసి ఆగిపోయిందామె. కరుణ్ కూడా బయటకు చూశాడు. మంజుల నిల్చుని వుందక్కడ.

"మంజూ! లోపలికి రా!" పిలిచాడతను.

ఆమె వచ్చి కూర్చుంది.

"వీరు హరిణీగారు! నాకు అజ్ఞాతంగా కేసు అప్పగించింది వీరే!"

మంజుల ఆమె వంక ఆశ్చర్యంగా చూడసాగింది.

"ఈమె నా ఉడ్బీ... మంజుల" పరిచయం చేసాడతను.

"మీ జోడీ బాగుంది!" మెచ్చుకోలుగా అందామె.

"థాంక్యూ!" అన్నాడతను.

"ఇక నేను వెళ్ళొస్తాను...." లేచిందామె.

కరుణ్, మంజుల ఆమెని గేటు వరకూ సాగనంపారు.

"నీ ప్రోగ్రాం ఏమిటి? అడిగాడతను లోపలికొచ్చి."

"నీ ప్రోగ్రాం ఏదయితే నాదీ అదే!" కూర్చుని చెప్పిందామె.

"అయితే నా ప్రోగ్రాం ఇది...." అంటూ ఆమె రెండు చేతుల్నీ తన చెంపలపై వేసుకున్నాడతను.

"దానికింకా టైముంది." అంటూ దూరంగా జరిగిందామె.

"లేదు డియర్! నీకు చెప్పానుగా ఈ కేసు విజయవంతంగా పూర్తయిన వెంటనే మనం దైవసాక్షిగా ఒకటవుదామని... ఆ శుభఘడియలు వచ్చేశాయ్. నేనీరోజే మీ వాళ్ళని కలుస్తాను" అన్నాడతను.

ఆమె చిన్నగా నవ్వింది. బుగ్గలు సిగ్గుతో కెంపు వర్ణాలవగా తల దించుకుంది.

*-: అయిపోయింది :-*



For My eBooks : www.kinige.com

Website : www.suryadevararammohanrao.com
Email : suryadevaranovelist@gmail.com